శనివారం 17-6-2023



సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 15
సంచిక: 273

SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | CHENNAI | DELHI | VIJAYAWADA | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



స్వర్ణం నెగ్గిన జ్యోతి

అంతర్రాష్ట్ర అథ్లెటిక్స్ టోర్నీలో ఆంధ్రప్రదేశ్ యువతి ప్రతిభ - 13లో



బుల్.. కొత్త రికార్డ్!

466 పాయింట్లు పెరిగిన సెన్సెక్స్.. 18,800 దాటిన నిఫ్టీ - 13లో



బలహీనపడిన బిపర్‌జోయ్

గుజరాత్ తీర ప్రాంతాన్ని వణికించిన బిపర్‌జోయ్ తుపాను బలహీనపడి రాజస్తాన్ వైపు మళ్లినట్లు అధికారులు తెలిపారు.

వివరాలు 6లో ▸



నెహ్రూ లైబ్రరీ పేరు మార్పు

ఢిల్లీలో ఉన్న 'నెహ్రూ మెమోరియల్ మ్యూజియం, లైబ్రరీ సొసైటీ'ను ప్రైమ్‌మినిస్టర్స్ మ్యూజియం, లైబ్రరీ సొసైటీగా కేంద్రం మార్చింది.

వివరాలు 6లో ▸



తృణధాన్యాల ప్రాధాన్యంపై పాట

తృణధాన్యాల ప్రాధాన్యతను చాటిచెబుతూ రాసిన పాటను భారతీయ అమెరికన్ ఫల్గుణి షాతో కలిసి ప్రధాని మోదీ పాడారు.

వివరాలు 6లో ▸



20 నుంచి ప్రధాని విదేశీ పర్యటన

ప్రధాని మోదీ ఈ నెల 20 నుంచి 25 వరకు అమెరికా, ఈజిప్టు దేశాల్లో పర్యటించనున్నట్లు భారత విదేశాంగ శాఖ వెల్లడించింది.

వివరాలు 6లో ▸

ఏది నిజం?

అసలే డ్రామోజీ.. చేతిలో ఛీనాడు!

- ఓ కొత్త మెడికల్ కాలేజీ రాత్రికి రాత్రే వస్తుందా రామోజీ?
- 330 పడకలు.. టీచింగ్ ఆస్పత్రులుగా అభివృద్ధి చేయడం తప్పనిసరి
- తెలంగాణలో మొదటి ఐదేళ్లు కొత్త మెడికల్ కాలేజీల కోసం విస్తృత కృషి
- ఆ ప్రయత్నాలు ఫలించి అక్కడ 17 వైద్య కాలేజీల సాకారం
- ఆ సమయంలో ఆ దిశగా కనీసం ప్రయత్నించని బాబు
- టీడీపీ హయాంలో వైద్య రంగం అస్తవ్యస్తం.. ఆరోగ్యశ్రీ బకాయిలే రూ.700 కోట్లు
- సీఎం జగన్ అధికారంలోకి వచ్చాక ప్రజారోగ్యానికి పెద్దపీట
- ఏకంగా 49,000 వైద్య పోస్టుల భర్తీ.. రూ.17 వేల కోట్లతో సర్కారీ వైద్యం బలోపేతం
- ఏపీలో ఈ ఏడాది 5 కొత్త మెడికల్ కాలేజీలు అడ్మిషన్లకు సిద్ధం.. మరో మూడేళ్లలో మనకూ 17 కొత్త వైద్య కళాశాలలు అందుబాటులోకి..

4లో



కృష్ణా జిల్లా గుడివాడలో జరిగిన సభకు భారీగా హాజరైన జన సందోహంలో ఓ భాగం

> దేవుడి దయతో, మీ అందరి ఆశీర్వాదంతో మనం అధికారంలోకి రాగానే 300 అడుగుల టిడ్కో ఇళ్లను కేవలం ఒక్క రూపాయికే ఇస్తామని గతంలో ఇదే గుడివాడ బహిరంగ సభలో చెప్పాను. ఈ రోజు ఆ మాటను నిజం చేసి చూపిస్తున్నా. ఇవిగో ఆ ఇళ్లు.. ఇవిగో ఆ ఊళ్లు. టిడ్కో ఇళ్ల ద్వారా అక్కచెల్లెమ్మల కుటుంబాలకు మన ప్రభుత్వం రూ.16,601 కోట్లు లబ్ధి చేకూర్చుతూ ఖర్చు భరిస్తోంది. ఇందులో చంద్రబాబు చేసింది ఏమిటి? గుమస్తాగిరి కూడా సరిగా చేయలేదు. నిస్సిగ్గుగా తాను చేయని పనులు చేసినట్లుగా ప్రచారం చేసుకుంటున్నారు. నోరు విప్పితే అబద్ధాలే.
>
> - ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

ఇళ్ల యజ్ఞం.. ఊళ్లకు ఊళ్లే నిర్మాణం

నాలుగేళ్లుగా పేదల అభ్యున్నతే లక్ష్యంగా అడుగులు ముందుకు

గుడివాడలో టిడ్కో ఇళ్ల అప్పగింత కార్యక్రమంలో సీఎం జగన్

- 8,912 టిడ్కో ఇళ్లకు సంబంధించి హక్కు పత్రాలు అందజేత
- గత ప్రభుత్వం పేదలను అప్పులపాలు చేస్తే మనం అండగా నిలిచాం
- ఒక్క రూపాయికే 300 చదరపు అడుగుల ఇంటిని రిజిస్ట్రేషన్ చేస్తున్నాం
- రాష్ట్ర వ్యాప్తంగా అక్కచెల్లెమ్మలకు 30.60 లక్షల ఇంటి పట్టాల పంపిణీ
- తొలి రెండు దశల్లో కొనసాగుతున్న 21 లక్షలకు పైగా ఇళ్ల నిర్మాణం
- సొంతూరు కుప్పంలో ఇల్లు కట్టుకోలేని స్థితిలో చంద్రబాబు
- ఎన్నికలొస్తున్నాయని ఇప్పుడు దరఖాస్తు చేశానని చెబుతున్నారు
- ఒక్కటంటే ఒక్క మంచి పని లేకపోయినా మళ్లీ మాయమాటలు
- ఈ దుష్టచతుష్టయం, దత్తపుత్రుడి మాటలు నమ్మకండి



లబ్ధిదారురాలికి ఇంటి హక్కు పత్రాలను అందజేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

సాక్షి ప్రతినిధి, విజయవాడ: రాష్ట్రంలో ఇళ్ల నిర్మాణ యజ్ఞం కొనసాగుతోందని, ఏకంగా ఊళ్లకు ఊళ్లే నిర్మిస్తున్నామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పేదల అభ్యున్నతే లక్ష్యంగా అడుగులు ముందుకు వేస్తున్నామని చెప్పారు. ఇది పేదల బాగు కోసం పరితపించే ప్రభుత్వం అన్నారు. కృష్ణా జిల్లా గుడివాడ మున్సిపాలిటీ పరిధిలో శుక్రవారం 77 ఎకరాల ఒకే లేఅవుట్‌లో పూర్తయిన 8,912 టిడ్కో ఇళ్లను ఆయన ప్రారంభించారు. ఈ మేరకు లబ్ధిదారులతో కలిసి గృహ ప్రవేశాల కార్యక్రమంలో పాల్గొని, ఇంటి హక్కు పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో ఏకంగా 30.60 లక్షల ఇంటి పట్టాలు అందజేశామని, ఇళ్లు కూడా నిర్మిస్తున్నామని తెలిపారు. అమరావతిలో సైతం అన్ని అడ్డంకులను అధిగమించి, చంద్రబాబు నాయుడు దుర్మార్గాన్ని అడ్డుకొని, సుప్రీంకోర్టులో మరీ పోరాడి పేదలకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేశామన్నారు. గత ప్రభుత్వం పేదలను అప్పులపాలు చేయాలని చూస్తే, మనందరి ప్రభుత్వం వచ్చాక ఆ పరిస్థితిని

మిగతా 2వ పేజీలో ▸

మరో 3 రోజుల్లో తీపికబురు




- ఈ నెల 18–21 మధ్య రుతుపవనాలు విస్తరించడానికి అనుకూల పరిస్థితులు
- 19 నుంచి రాయలసీమలో తేలిక పాటి నుంచి మోస్తరు వర్షాలు
- కోస్తాంధ్రలోనూ వానలకు ఆస్కారం.. గంటకు 30–40 కి.మీ. వేగంతో ఈదురుగాలులు
- ప్రస్తుతం పుట్టపర్తి, శ్రీహరి కోటలను దాటని 'నైరుతి'
- నేడు, రేపు అధిక ఉష్ణోగ్రతలే

- వివరాలు 10లో

గైడ్ బండ్ సమస్య చిన్నదే

నిపుణుల కమిటీ స్పష్టీకరణ

- మరమ్మతులపై 4 రోజుల్లో ప్రతిపాదన ఇవ్వాలని అధికారులకు సూచన
- మరమ్మతులు జూలైలోగా పూర్తి చేయాలని ఆదేశం
- స్పిల్ వే వద్ద వరద ప్రవాహంపై మరోసారి అధ్యయనం
- గైడ్ బండ్ వద్ద వరద ఉన్నప్పుడు, తగ్గాక మట్టి నాణ్యత పరీక్ష
- వీటి ఫలితాల ఆధారంగా పూర్తిస్థాయిలో పటిష్టం చేయడంపై నిర్ణయం



గైడ్ బండ్ కుంగిన ప్రాంతం

సాక్షి, అమరావతి: పోలవరం ప్రాజెక్టు గైడ్ బండ్‌లో కొద్దిమేర జారడం చిన్న సమస్యేనని సీడబ్ల్యూసీ మాజీ చైర్మన్ ఏబీ పాండ్య నేతృత్వంలోని నిపుణుల కమిటీ తేల్చింది. గైడ్ బండ్ ప్రాజెక్టులో కీలకమైన నిర్మాణం కాదని, స్పిల్ వే మీదుగా వరద సులువుగా వెళ్లేలా చేయడానికి నిర్మించింది మాత్రమేనని స్పష్టంచేసింది. గోదావరికి సాధారణంగా ఆగస్టులో భారీ వరదలు వస్తాయని, ఆలోగా గైడ్‌బండ్‌కు తాత్కాలిక ప్రాతిపదికన దిద్దుబాటు చర్యలు చేపట్టాలని రాష్ట్ర జల వనరుల శాఖ అధికారులకు దిశానిర్దేశం చేసింది. తాత్కాలిక దిద్దుబాటు చర్యల ప్రతిపాదనను నాలుగు రోజుల్లోగా పంపితే.. దానిలో మార్పులుంటే చేసి సీడబ్ల్యూసీకి పంపి తక్షణమే ఆమోదించేలా చర్యలు తీసుకుంటామని పేర్కొంది. సీడబ్ల్యూసీ ఆమోదించిన ప్రతిపాదన మేరకు జూలైలోగా గైడ్ బండ్ తాత్కాలిక మరమ్మతులు పూర్తి చేయాలని తెలిపింది. ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌లలో లీకేజీలు పరిమితికి లోబడే ఉన్నాయని, వాటిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ

మిగతా 10వ పేజీలో ▸

గిరిజనులకు అదనపు 'ఉపాధి'

మరో 1.10 లక్షల కుటుంబాలకు ఏటా రూ.151 కోట్ల పని

- అర్హత ఉన్న వారికి కొత్తగా మరో 50 రోజుల 'ఉపాధి' వర్తింపు.. వివరాల సేకరణకు గ్రామీణాభివృద్ధి శాఖ ప్రత్యేక డ్రైవ్
- నెలరోజుల క్రితం వరకు రాష్ట్రంలో కేవలం 72 వేల కుటుంబాలే ఈ కేటగిరి పరిధిలో..
- మొత్తం 1.82 లక్షల మంది అర్హులుగా గుర్తింపు

3లో





విశాఖ ప్రశాంతం

- రాష్ట్రంలో శాంతిభద్రతల సమస్యే లేదు: డీజీపీ కేవీ రాజేంద్రనాథ్‌రెడ్డి
- ఎంపీ కుటుంబ సభ్యుల కిడ్నాప్‌ను గంటల వ్యవధిలోనే ఛేదించాం
- రౌడీషీటర్లపై ఉక్కుపాదం మోపుతున్నాం
- నాలుగేళ్లలో రాష్ట్రంలో తగ్గిన నేరాలు
- ప్రజల్ని భయభ్రాంతులకు గురిచేసేందుకే కొన్ని పత్రికల అసత్య కథనాలు

3లో

మిమ్మల్ని విస్మరించాను..

ఇకపై అలా జరగదు

- కార్యకర్తలను ప్రసన్నం చేసుకునేందుకు బాబు ప్రయత్నం.. రాష్ట్రంలో వైసీపీ నాయకులు పంచ భూతాలనూ మింగేశారు
- ప్రజలను భయపెట్టి జగన్ ఇంతకాలం పాలన చేశారు
- పులివెందులలో జగన్ భయపెట్టి గెలుస్తున్నారు.. కుప్పంలో నేను ప్రజల అభిమానంతో గెలుస్తున్నా
- కుప్పం నియోజకవర్గం పర్యటనలో బాబు వ్యాఖ్యలు

3లో

అర్హులకు పరిహారం జమచేస్తే నిందలా

ఖరీఫ్-21 సీజన్‌లో మిగిలిన అర్హులకు బీమా పరిహారం

- 9 వేల మందికి రూ.90కోట్లు జమచేసిన ప్రభుత్వం
- బటన్ నొక్కిన ఏడాదికి సొమ్ములు జమంటూ ఈనాడు వంకర రాతలు
- ఆ కథనంలో వాస్తవం లేదంటున్న వ్యవసాయ శాఖ

ఫ్యాక్ట్ చెక్

సాక్షి, అమరావతి: 'సంక్షేమ ఫలాలు అందని అర్హులెవరైనా ఉంటే వెతికి మరీ వారికి నేరుగా అందిస్తుంటే ఎవరైనా అభినందించాలిగానీ ఈనాడు మాత్రం పనిగట్టుకుని బురద జల్లే ప్రయత్నం చేస్తోంది. వాస్తవాలు తెలుసుకోకుండా బటన్ నొక్కిన ఏడాదికి ఖాతాల్లో సొమ్ము అంటూ తప్పుడు కథనాన్ని వండివార్చింది'.. అంటూ వ్యవసాయ శాఖ శుక్రవారం ఓ ప్రకటనలో ఖండించింది. రైతులపై పైసా భారం పడకుండా నోటిఫైడ్ పంటలను సాగుచేసిన ప్రతీ ఎకరాకు డాక్టర్ వైఎస్సార్ ఉచిత పంటల బీమా పథకం కింద రాష్ట్ర ప్రభుత్వం 2019 నుంచి బీమా కల్పిస్తోంది. ఈ-క్రాప్‌లో నమోదు ప్రామాణికంగా ఈ పథకాన్ని అమలుచేస్తున్నారు. అర్హత పొందిన వారికి తరువాత ఏడాది సీజన్ ప్రారంభమయ్యేలోగా పరిహారం చెల్లిస్తున్నారు. ఇలా గడిచిన నాలుగేళ్లుగా 44.66 లక్షల మందికి రూ.6,684.84 కోట్ల బీమా పరిహారం చెల్లించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఖరీఫ్-2021 సీజన్‌లో అర్హత పొందిన 15.61 లక్షల మంది రైతులకు గతేడాది జూన్ 14న రూ.2,977.82 కోట్లు జమచేసింది. ఒక సీజన్‌కు సంబంధించి ఇంత పెద్ద మొత్తంలో పరిహారం అందించడం చరిత్రలో ఇదే తొలిసారి. సీఎం వైఎస్ జగన్ ఆదేశాల మేరకు అర్హులైన ఏ ఒక్కరూ మిగిలిపోకూడదనే ఉద్దేశంతో పరిహారం అందని వారి నుంచి, ఆర్బీకేల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. క్షేత్రస్థాయి పరిశీలన అనంతరం అర్హత సాధించిన మేరకు ప్రభుత్వం నిధులు కూడా విడుదల చేసింది. అయితే, కొన్ని సంశయాత్మక ఖాతాలున్నాయన్న ఆరోపణల నేపథ్యంలో పునఃపరిశీలన చేశారు. అందులో అర్హత పొందిన వారికి సంబంధించిన విస్తీర్ణానికి గతంలో ఏమైనా చెల్లింపులు జరిగాయా లేదా అని కూడా పునఃపరిశీలన చేశారు. ఒకటి రెండుసార్లు క్షేత్రస్థాయిలో పునఃపరిశీలన తర్వాత అన్ని విధాలుగా అర్హత పొందిన వారి జాబితాలను సామాజిక తనిఖీల్లో భాగంగా ఆర్బీకేల్లో ప్రదర్శించారు. ఇలా అర్హత పొందిన 9 వేల మందికి ఈనెల 14న రూ.90 కోట్లు జమచేశారు. తొలుత అర్హత పొందిన వారిలో వీరు కేవలం 0.2 శాతం మాత్రమే. వాస్తవాలిలా ఉంటే.. సాంకేతిక కారణాలతో ప్రత్యేక పరిస్థితుల్లో జరిగిన జాప్యాన్ని మాత్రమే లెక్కలోకి తీసుకుని బీమా పరిహారం ఏడాదికి జమచేసినట్లుగా వాస్తవాలను మరుగున పరిచేలా ప్రచురించిన వార్తను ఖండిస్తున్నట్లు వ్యవసాయ శాఖ స్పెషల్ కమిషనర్ హరికిరణ్ తెలిపారు.



గుడివాడలో సభా ప్రాంగణం వెలుపల భారీగా నిలిచిపోయిన జనసందోహం



మనం మేనిఫెస్టోను ఖురాన్, భగవద్గీత, బైబిల్‌గా భావించి.. 99 శాతం హామీలు నెరవేర్చాం. మూడుసార్లు ముఖ్యమంత్రి అయిన ఆ పెద్ద మనిషి చంద్రబాబు.. ప్రతిసారీ మేనిఫెస్టోను చెత్తబుట్టకే పరిమితం చేశాడు. మన పార్టీ పేదల హృదయం నుంచి పుట్టింది కాబట్టి.. ఇలా మంచి పనులు చేయగలుగుతున్నాం. టీడీపీ పెత్తందార్ల పార్టీ.. వారంతా గజదొంగల ముఠా కాబట్టి వాళ్లు చేయలేదు. మనం దేవుడిని, ప్రజలను నమ్ముకుంటే.. వారు పొత్తులు, ఎత్తులు, చిత్తులంటూ దుష్ట చతుష్టయాన్ని నమ్ముకున్నారు.

– సీఎం వైఎస్ జగన్

ఇళ్ల యజ్ఞం.. ఊళ్లకు ఊళ్లే నిర్మాణం

▶ మొదటి పేజీ తరువాయి

పూర్తిగా మార్చేశామని చెప్పారు. అక్కచెల్లెమ్మలు హక్కుదారులుగా ఆయా కుటుంబాల చరిత్రను మార్చేలా ఇవాళ మనం ఊళ్లకు ఊళ్లు నిర్మిస్తున్నామని చూపించే గొప్ప కార్యక్రమం గుడివాడలో జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సీఎం జగన్ ఇంకా ఏమన్నారంటే..

కొత్త గుడివాడ కనిపిస్తోంది

- ఒకవైపు టిడ్కో ఇళ్లు.. మరోవైపు మనం ఇచ్చిన ఇళ్ల స్థలాల్లో నిర్మాణంలో ఉన్న ఇళ్లు చూస్తుంటే.. ఇక్కడ కొత్త గుడివాడ నగరం కనిపిస్తోంది. మొత్తం 257 ఎకరాల్లో రూ.800 కోట్లతో 8,912 ఇళ్లు కట్టడమే కాకుండా.. వాటిని నా అక్కచెల్లెమ్మలకు ఇచ్చే కార్యక్రమం ఇవాళ చేస్తున్నాం. ఇదే లే అవుట్‌లో 7,728 ఇళ్ల స్థలాలను ఇళ్లు లేని నా నిరుపేద అక్కచెల్లెమ్మలకు ఇచ్చాం. మొత్తంగా 16,640 కుటుంబాలు ఇక్కడ నివాసం ఉండబోతున్నాయి. అంటే ఇంటికి కనీసం ముగ్గురు వేసుకున్నా దాదాపు 50 వేల మంది జగనన్న లే అవుట్‌లో నివాసం ఉండబోతున్నారు.
- ఈ లేఅవుట్‌తో పాటు నియోజకవర్గం మొత్తం 13,145 మందికి ఇళ్ల పట్టాలిచ్చాం. వీటికి 8,912 టిడ్కో ఇళ్లు కూడా కలిపితే 22 వేల మంది అక్కచెల్లెమ్మలకు ఇళ్లు, ఇళ్ల స్థలాలిచ్చామని గర్వంగా చెబుతున్నా.
- ఈ లేఅవుట్‌లో ఇంటి స్థలం విలువ ఎంత ఉంటుందని ఇక్కడకు వచ్చే ముందు ఎమ్మెల్యే నానిని అడిగాను. గజం రూ.14 వేలని, ఒక్కో లబ్ధిదారుకు ఇచ్చిన స్థలం రూ.7 లక్షలు ఉంటుందని చెప్పాడు. అంటే ఇవాళ ప్రతి లబ్ధిదారుకు ఇచ్చిన 1.1 సెంటు స్థలం ద్వారా రూ.7 లక్షలు వాళ్ల చేతుల్లో పెట్టినట్టయింది.
- ఒక్కో ఇంటిని రూ.2.70 లక్షలతో కడుతున్నాం. అక్కడ డ్రెయిన్లు, రోడ్లు, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌కు రూ.6 లక్షలు ఖర్చవుతుంది. ఈ లెక్కన ఇంటి నిర్మాణం పూర్తయితే కనీసం రూ.10–15 లక్షలు వాళ్ల చేతుల్లో పెట్టినట్టవుతుంది. రాష్ట్ర వ్యాప్తంగా 30.60 లక్షల ఇళ్లు కూడా చూసుకుంటే మహాయజ్ఞం ద్వారా రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షల కోట్ల ఆస్తిని అక్కచెల్లెమ్మల చేతిలో పెడుతున్నాం.
- ఇవాళ ఇచ్చిన పట్టాలకు సంబంధించి 4,200 ఇళ్లు మంజూరైతే మొత్తం 13,145 ఇళ్ల పట్టాలలో కూడా ఇళ్లు వస్తాయి. జూలై 8.. నాన్న గారి జయంతి రోజున ఈ ఇళ్లు కూడా మంజూరు చేస్తాం. ఇలాంటి అభివృద్ధి గుడివాడలో మాత్రమే కాదు.. రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గంలో ప్రస్ఫుటంగా కనిపించేలా, ప్రతి పేద కుటుంబం బాగుపడాలనే తలంపుతో, మమకారంతో అడుగులు ముందుకు వేస్తున్నాం.

టిడ్కో ఇళ్ల పేరుతో నాడు పేదలపై భారం

- ఈ రాష్ట్రంలో కొంతమందికి ఈర్ష్య, ద్వేషం ఎక్కువయ్యాయి. ఏ మాత్రం కళ్లార్పకుండా అబద్ధాలు చెబుతున్నారు. అందుకే కొన్ని విషయాలు మీకు తెలియాలి. టిడ్కో ఇళ్ల నిర్మాణానికి సంబంధించి గత చంద్రబాబు ప్రభుత్వం చేసిన నిర్వాకమిది. నిరుపేదలు నివాసం ఉండే 300 చదరపు అడుగుల ఫ్లాట్ కట్టడానికి అయ్యే ఖర్చు అడుగుకు రూ.2 వేలు చొప్పున ఒక్కో ఫ్లాట్‌కు దాదాపు రూ.5.75 లక్షలు, మౌలిక సదుపాయాలకు మరో రూ.లక్ష అవుతుంది.
- రూ.6.75 లక్షలు ఖర్చయ్యే ఒక్కో ఫ్లాట్‌కు కేంద్రం రూ.1.50 లక్షలు ఇస్తే రాష్ట్రం రూ.1.5 లక్షలు ఇస్తోంది. మిగిలిన రూ.3 లక్షలు చంద్రబాబు హయాంలో పేద వాడి పేరు మీద అప్పుగా రాశారు. ప్రతి నెలా రూ.3 వేలు 20 ఏళ్లపాటు పేదవాడు కడుతూపోవాలి. అలా రూ.7.20 లక్షలు పేదవాడు తన జేబు నుంచి కట్టాలి. అది చంద్రబాబు హయాంలో తెచ్చిన టిడ్కో పథకం. అది కూడా నేల మీద ఇళ్లు లేవు, పట్టాలేదు, ఉచితంగా ఇచ్చింది అంతకన్నా లేదు.
- మీ బిడ్డ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం 300 చదరపు అడుగుల్లో నిర్మిస్తున్న 1,43,600 టిడ్కో ఇళ్లను అన్ని హక్కులతో ఒక్క రూపాయికే రిజిస్ట్రేషన్‌చేసి ఇస్తున్నాం. రూ.6.75 లక్షలయ్యే ఒక్కో ఇంటిని అక్కచెల్లెమ్మల పేరుతో ఇస్తున్నాం.
- 365 చదరపు అడుగుల ఇంటికి గతంలో ఇదే మాదిరిగా లెక్కలు కట్టారు. రాష్ట్రం, కేంద్రం ఇస్తున్న రూ.3 లక్షల సబ్సిడీకి అదనంగా రూ.50 వేలు కట్టించుకున్నారు. మీ బిడ్డ వచ్చిన తర్వాత రూ.3 లక్షలు ఇవ్వడంతో పాటు వాటిలో సిమెంటు రోడ్డులు, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కోసం మరో రూ.లక్ష ఖర్చు పెట్టారు. మరో రూ.25 వేలు కలిపి ప్రతి పేద వాడికి రూ.4.25 లక్షలు సబ్సిడీ ఇస్తున్నాం.
- 430 చదరపు అడుగుల ఇంటికి కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలు ఇస్తున్న రూ.3 లక్షలు కాకుండా, మౌలిక సదుపాయాల కోసం రూ.లక్ష వేసుకుని.. గతంలో తీసుకున్న డిపాజిట్‌ను రూ.లక్ష నుంచి రూ.50 వేలకు తగ్గించాం. రూ.50 వేలు రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తూ.. రూ.4.50 లక్షల సబ్సిడీ ఇస్తున్నాం.



అభివృద్ధి పనుల శిలాఫలకాలను ఆవిష్కరిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్

గుడివాడకు వరాల జల్లు

గుడివాడ నియోజకవర్గంలో మరికొన్ని మంచి పనులకు సాయం కావాలని ఎమ్మెల్యే నాని అడిగారు. గుడివాడలో ఎస్సీ శ్మశాన వాటికకు రూ.5 కోట్లవుతుందన్నారు. దాన్ని మంజూరు చేస్తున్నాను. టిడ్కో మాస్టర్ ప్లాన్ కోసం ముదినేపల్లి నుంచి బందరు రోడ్డుకు రూ.17 కోట్లు ఖర్చవుతుందన్నారు. అదీ మంజూరు చేస్తున్నాం. నియోజకవర్గంలో మంచినీటి సరఫరా కోసం ల్యాండ్ అక్విజేషన్ కావాలన్నారు. అందుకు రూ.45 కోట్లు మంజూరు చేస్తున్నాం. మల్లాయపాలెం లే అవుట్‌లో ఇంటర్నల్ రోడ్డు కోసం మరో రూ.9 కోట్లు ఇస్తున్నాం. గుడివాడ మున్సిపాల్టీలో ఇంటర్నల్ సీసీ రోడ్లు, అభివృద్ధి పనులకు రూ.26 కోట్లతో శంకుస్థాపన చేశాం. కృష్ణా జిల్లాలో రూ.750 కోట్లతో జలజీవన్ మిషన్ కింద చేపడుతున్న పైప్‌లైన్ ప్రాజెక్టులో భాగంగా గుడివాడ ప్రాంతాల్లో తాగునీటి అవసరాల కోసం రూ.160 కోట్లు కేటాయిస్తూ ఈ పనులకూ శంకుస్థాపన చేశాం.

పేదల వ్యతిరేకి చంద్రబాబు

- నాలుగేళ్లలో మన ప్రభుత్వం ఇన్ని లక్షల ఇళ్లు ఎలా కట్టగలిగింది? 30 లక్షల ఇళ్ల స్థలాలు ఎలా ఇవ్వగలిగింది? ఇదే పని 30 ఏళ్ల క్రితమే సీఎం అయిన చంద్రబాబు, మూడుసార్లు ముఖ్యమంత్రి కుర్చీలో కూర్చున్న ఈ బాబు, 14 ఏళ్లు సీఎంగా ఉండి కూడా ఎందుకు చేయలేకపోయారు? అందరూ ఆలోచించాలి. కారణం చంద్రబాబు పేదల వ్యతిరేకి కాబట్టి చేయలేదు.
- అమరావతిలో పేదలకు ఇళ్ల పట్టాలిస్తే అక్కడ డెమోగ్రాఫిక్ ఇంబ్యాలన్స్ వస్తుందని చంద్రబాబు తన బినామీ భూముల రేట్ల కోసం అడ్డుపడ్డాడు. ఏకంగా కోర్టుల్లో కేసులు వేయించారు. అయినా సుప్రీంకోర్టు వరకు వెళ్లి పోరాడి అమరావతిలో 50 వేల మంది నా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, నిరుపేద అక్కచెల్లెమ్మలకు ఇళ్ల స్థలాలు ఇచ్చాం.
- మన ప్రభుత్వం నాలుగేళ్లలో రూ.2.16 లక్షల కోట్లు నేరుగా బటన్ నొక్కి లంచాలు, వివక్షకు తావు లేకుండా అక్కచెల్లెమ్మల ఖాతాల్లో జమ చేసింది. నాలుగేళ్లలో అవ్వాతాతలు, వితంతువులు, వికలాంగులకు పింఛన్ రూపంలో రూ. 72 వేల కోట్లు ఇవ్వగలిగాం. రైతన్నలకు రైతు భరోసాగా రూ.31 వేల కోట్లు ఇచ్చాం.
- అమ్మ ఒడిగా అక్కచెల్లెమ్మల పిల్లల బాగోగుల కోసం రూ.19,674 కోట్లు ఇవ్వగలిగాం. ఆసరాగా అక్కచెల్లెమ్మలు వాళ్ల కాళ్లమీద నిలబడాలని రూ.19,178 కోట్లు, చేయూతగా రూ.14,129 కోట్లు ఇచ్చాం.
- నా అక్కచెల్లెమ్మల పిల్లలు బాగా చదవాలి, ఎదగాలని విద్యాదీవెన, వసతి దీవెన కింద రూ.14,913 కోట్లు ఇవ్వగలిగాం. సున్నావడ్డీ, ఈబీసీ నేస్తం, చేదోడు, కాపునేస్తం, తోడు, నేతన్న నేస్తం, మత్స్యకార భరోసా, లా నేస్తం, ఉచిత పంటలబీమా, వాహనమిత్ర, పగటిపూట 9 గంటల ఉచిత విద్యుత్, ఆరోగ్యశ్రీ.. ఆరోగ్యఆసరాతో పాటు చివరికి అగ్రిగోల్డ్ బాధితులకు కూడా మేలు చేశాం.

గుడివాడకు వెన్నుపోటు అల్లుడు

- ఇదే గుడివాడకు చెందిన ఎన్టీఆర్‌ను వెన్నుపోటు పొడిచి పదవి లాక్కున్న అల్లుడు.. ఆయన 14 ఏళ్ల పాలనలో ఇక్కడి పేదలకు ఎన్ని ఇళ్లపట్టాలు ఇచ్చారు? కనీసం ఒక్కరికి కూడా సెంటు స్థలం ఇవ్వలేదు. ఒక్క ఇల్లు కట్టించలేదు.
- ఎన్నికలు దగ్గరకొచ్చేసరికి ఈ పెద్ద మనిషి చంద్రబాబు తన సొంత నియోజకవర్గం కుప్పంలో ఇల్లు కట్టుకుంటాను అనుమతివ్వండి అంటూ అడుగుతున్నాడు. కుప్పంలో ఎమ్మెల్యేగా గెలిచిన 34 ఏళ్ల తర్వాత.. 75 ఏళ్ల వయసులో ఇప్పుడు సొంతిల్లు కట్టుకుంటారట.
- ఇప్పుడు మైకు పట్టుకొని ఇంకో చాన్స్ ఇవ్వండి అన్నీ చేసేస్తా అంటాడు. ప్రతి ఇంటికి కేజీ బంగారం ఇస్తానంటాడు. ప్రతి ఇంటికి బెంజ్ కారూ ఇస్తానని చెబుతారు. ఎన్నికలు దగ్గర పడేసరికి ఇలా మాయ మాటలు చెబుతూ మళ్లీ మోసం చేయడానికి బయలుదేరాడు.
- ఫలానా మంచి పని చేశాను కాబట్టి చాన్స్ ఇవ్వండి అని అడగలేని పరిస్థితి ఆయనది. ఎవరికీ మంచి చేసిన చరిత్ర లేని ఈయనకు ప్రజలను ఓటు అడిగే నైతికత కూడా లేదు.

ఊరూరా విప్లవాత్మక మార్పులు

- అధికారంలోకి వచ్చిన 6 నెలల్లోనే లంచాలు, వివక్షకు తావివ్వని వలంటీర్ వ్యవస్థ, గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థ తీసుకొచ్చాం. ఆర్బీకేలు, విలేజ్ క్లినిక్‌లను గ్రామ స్థాయిలోకి తీసుకొచ్చాం. ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌ను తీసుకొచ్చాం. నాడు–నేడుతో స్కూళ్ల రూపురేఖలు మార్చాం.
- కొత్త జిల్లాలు ఏర్పాటు చేశాం. కొత్తగా మరో 17 మెడికల్ కాలేజీలు కడుతున్నాం. కొత్తగా మరో నాలుగు సీపోర్టులు, ఎయిర్‌పోర్టులు, ఫిషింగ్ హార్బర్లు, ఫిషింగ్ సెంటర్లు కడుతున్నాం. విద్య, వైద్యం, వ్యవసాయం, మహిళా సాధికారత, సామాజిక న్యాయం.. ఇలా అన్ని రంగాలలో విప్లవాత్మక మార్పులు ఊరూరా కళ్లెదుటే కనిపించేలా మనసు పెట్టి పని చేసిన ప్రభుత్వం మనదే.
- 40 ఏళ్ల రాజకీయ జీవితం తర్వాత కూడా ప్రజలకు మంచి చేసిన చరిత్ర లేని చంద్రబాబుకు రెండు పక్కలా రెండు పార్టీలు ఉంటే తప్ప లేచి నిలబడలేని పరిస్థితి. ఇలాంటి ఈ చంద్రబాబు.. 175 నియోజకవర్గాల్లో 175 మంది అభ్యర్థులను కూడా పెట్టలేని ఈ చంద్రబాబు మనకు ప్రత్యర్థి అట! రాజకీయాల్లోకి వచ్చి 15 ఏళ్ల తర్వాత కూడా తాను చంద్రబాబు కోసమే పుట్టానంటున్నట్లు ప్రవర్తిస్తున్న ప్యాకేజీ స్టార్, దత్తపుత్రుడు మరో వంక. తన జీవితమే బాబు కోసమని, తన వ్యాన్‌ను చూసి మురిసిపోతూ, ఇక తాను కూడా ఎమ్మెల్యే అవుతానని, తనను ఎవరు ఆపుతారో చూస్తానంటున్నారు. వీరికితోడు ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ–5.. మొత్తంగా గజ దొంగల ముఠా మళ్లీ రాష్ట్రాన్ని దోచుకోవాలని ప్రజల ముందుకు వస్తోంది. వీళ్ల మాదిరిగా నాకు హంగూ, ఆర్భాటం, ఇతర పార్టీలు, చానళ్ల తోడు లేకపోవచ్చు. ఈ తోడేళ్ల గుంపు అంతా ఒక వైపు ఉంటే, మీ బిడ్డ మాత్రం మిమ్మల్ని, దేవుడిని నమ్ముకుని ఒంటరిగా మరోవైపు ఉన్నారు. మీరంతా ఈ దుష్టచతుష్టయం అబద్ధాలను నమ్మకండి. మీ ఇంట్లో మీకు మంచి జరిగిందా? లేదా? అన్నది మాత్రమే కొలమానంగా తీసుకోండి. మీకు మంచి జరిగి ఉంటే మీ బిడ్డకు సైనికులుగా మారండి.







సభా ప్రాంగణం కిక్కిరిసి పోవడంతో వెలుపల భారీగా నిలిచిపోయిన జనసందోహం



టిడ్కో ఇళ్ల ప్రారంభోత్సవానికి వస్తున్న సీఎం జగన్‌పై పుష్పవర్షం



టిడ్కో ఇళ్ల లబ్ధిదారులతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

ఇంటి స్థలాల విలువే రూ.75 వేల కోట్లు

మనందరి ప్రభుత్వంలో అక్కచెల్లెమ్మల పేరుతో రాష్ట్ర వ్యాప్తంగా 30,60,000 ఇళ్ల పట్టాలు ఇచ్చాం. ఇప్పటికే రెండు దశల్లో 21 లక్షల ఇళ్లు నిర్మాణంలో ఉన్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా మనం నిర్మిస్తున్న కాలనీలు 17,000. ఇప్పటికే పూర్తయిన ఇళ్లు 5,52,000. అక్కచెల్లెమ్మల పేరుతో ఇచ్చిన ఒక్కో ఇంటి స్థలం విలువ ఏరియాను బట్టి కనీసం రూ.2.5 లక్షల నుంచి రూ.10 లక్షల దాకా ఉంటుంది. కేవలం రూ.2.5 లక్షల చొప్పున వేసుకున్నా, 30.60 లక్షల ఇళ్ల పట్టాల విలువ రూ.75,000 కోట్లకు పైగా ఉంటుంది.



గుడివాడలో నిర్మించిన టిడ్కో గృహాలు

గంటల వ్యవధిలో సమస్య పరిష్కారం

- ఇద్దరి చికిత్సకు ఆర్థిక సాయం
- సీఎం స్పందనపై బాధితుల్లో హర్షం

చిలకలపూడి (మచిలీపట్నం): సమస్య తన చెవిన పడాలేకానీ పరిష్కరించడంలో తనకు తానే సాటి అని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మరోమారు నిరూపించుకున్నారు. శుక్రవారం కృష్ణా జిల్లా గుడివాడలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి టిడ్కో గృహాల సముదాయం ప్రారంభానికి విచ్చేసిన సందర్భంగా తన భర్త రాజేష్ కాలేయ వ్యాధి చికిత్సకు ఆర్థిక సాయం అందించాలని కంకిపాడుకు చెందిన ముప్పిరి స్వాతి విన్నవించింది. తన కుమారుడిదీ అదే సమస్య అని పశ్చిమ గోదావరి జిల్లా గణపవరం మండలం వాకపల్లి గ్రామానికి చెందిన ఘంటా భాగ్యలక్ష్మి ముఖ్యమంత్రికి గోడు వెళ్లబోసుకుంది. వీరిద్దరి సమస్యలు వెంటనే పరిష్కరించాలని సీఎం జగన్.. కలెక్టర్ పి.రాజాబాబును ఆదేశించారు. కొద్ది గంటల వ్యవధిలో ఒక్కొక్కరికి రూ.లక్ష చొప్పున కలెక్టర్ చెక్కును అందజేశారు. ఇంత త్వరగా సీఎం స్పందించడం పట్ల బాధితులు కృతజ్ఞతలు తెలిపారు.



సీఎం జగన్‌ను సహాయం అర్థిస్తున్న స్వాతి



స్వాతికి రూ. లక్ష చెక్కును అందజేస్తున్న కలెక్టర్ పి. రాజాబాబు



సీఎం జగన్‌ను సహాయం అర్థిస్తున్న భాగ్యలక్ష్మి



భాగ్యలక్ష్మికి రూ. లక్ష చెక్కును అందజేస్తున్న కలెక్టర్ పి. రాజాబాబు

నా 25 ఏళ్ల కల నెరవేరింది



గుడివాడలో అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలన్న నా 25 ఏళ్ల కల నేడు నిజమైంది. ఈ కలను నిజం చేసినందుకు సీఎం జగన్‌కు పాదాభివందనం. సీఎం మేలును నేను, ఈ నియోజకవర్గం ప్రజలు ఎప్పటికీ మరచిపోం. 2017 చివరిలో అప్పటి సీఎం చంద్రబాబు రెండు ఫేజీలకుగాను ఫస్ట్‌ఫేజ్‌లో 3,400 ఇళ్లకు గాను 25 శాతం కట్టిన ఇళ్లు 1200 ఇళ్లు మాత్రమే. రూ.800 కోట్ల ప్రాజెక్టుకు చంద్రబాబు చెల్లించింది రూ.180 కోట్లు.. ఇందులో లబ్ధిదారుల నుంచి రూ.25 కోట్లు, కేంద్ర ప్రభుత్వం నుంచి రూ.135 కోట్లు. ఇక చంద్రబాబు చేసిందేమిటి? గుడివాడలో రైల్వే ఫ్లైఓవర్ల గురించి అడగ్గానే సీఎం జగన్ వెంటనే స్పందించి మంజూరు చేశారు. ఇప్పుడు ఏకంగా ఊళ్లకు ఊళ్లే నిర్మిస్తున్నారు. గుడివాడ అల్లుడైన చంద్రబాబు ఇక్కడ ఒక్క ఎకరం ప్రజల కోసం కొన్నానని నిరూపిస్తే రాజకీయాల నుంచి తప్పుకుంటా. చంద్రబాబూ.. నీకు దమ్ముంటే గుడివాడలో పోటీ చెయ్యి. లేదంటే సొల్లు కబుర్లు మానుకో. ఈ నియోజకవర్గంలో రూ.1500 కోట్లకు పైగా అభివృద్ధి పనులు చేసిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుంది.

– కొడాలి నాని, గుడివాడ ఎమ్మెల్యే

పచ్చ బ్యాచ్‌కు వెన్నులో వణుకు



రాష్ట్రంలో నాలుగేళ్లుగా జరుగుతున్న సంక్షేమాభివృద్ధితో పచ్చ బ్యాచ్ వెన్నులో వణుకు పుడుతోంది. తోడేళ్ల గుంపు ఏకమై సీఎం జగనన్న సంకల్పాన్ని అడ్డుకోవాలని విశ్వ ప్రయత్నాలు చేస్తోంది. టీడీపీకి ఓటు బ్యాంక్ రాజకీయాలే తప్ప పేదలంటే ఏమాత్రం ప్రేమ లేదు. ఎన్నికల ముందు ప్రకటనలు చేసి, తర్వాత మేనిఫెస్టోను తగలబెట్టడం టీడీపీ నైజం. టిడ్కో ఇళ్లను గతంలో చంద్రబాబు గాలికి వదిలేస్తే, సీఎం జగన్ నిర్మాణాలను పూర్తి చేసి పేదలకు అందిస్తున్నారు. ఎలాంటి షరతులు లేకుండా పేదలకు ఇళ్లు ఇస్తుంటే ఎల్లో మీడియా బరితెగించి పిచ్చి రాతలు రాస్తోంది. – ఆదిమూలపు సురేశ్, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి

జగన్ ద్వారా నెరవేరిన ఇంటి కల



సీఎం వైఎస్ జగన్ కారణంగానే మా సొంతింటి కల నెరవేరింది. గతంలో ఎన్నోసార్లు ప్రయత్నించినా మాకు ఎలాంటి న్యాయం జరగలేదు. జగన్ ప్రభుత్వంలో ఎలాంటి ప్రయత్నం చేయకుండానే మాకు ఇల్లు మంజూరైంది. ఈ రోజు మా చేతికి అందింది. అందరం చాలా చాలా సంతోషంగా ఉన్నాం. సీఎం మేలు ఎప్పటికీ మరచిపోము. – మద్దాల జ్యోతి, గుడివాడ

సీఎం మేలు మరచిపోం



సొంతిల్లు లేక ఎంతో కాలంగా అద్దె ఇంట్లో ఉంటున్నాం. అద్దెలు కట్టడానికి ఇబ్బందులు పడేవాళ్లం. ఎన్నో ప్రభుత్వాలు వచ్చినా ఇళ్ల స్థలాలు ఇస్తామని చెప్పారే గానీ ఇచ్చింది లేదు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పుణ్యమా అని ఈరోజు మాకు సొంతింటి కల నెరవేరింది. సీఎం జగన్‌కు, ఎమ్మెల్యే నానికి కృతజ్ఞతలు. వారి మేలు మరచిపోం. – కొల్లూరు భాను, నీలామహల్ రోడ్డు, గుడివాడ

పొత్తులపై వారిని పచ్చ మీడియా ఎందుకు ప్రశ్నించదు?

- రాష్ట్రాభివృద్ధికి కేంద్రం రూ.8.16 లక్షల కోట్లు ఇచ్చింది
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు

గుంతకల్లు టౌన్: బీజేపీ అగ్రనేతలను కలుస్తూ పొత్తుల కోసం పాకులాడుతున్న వారిని (చంద్రబాబునుద్దేశించి) మీడియా ఎందుకు ప్రశ్నించట్లేదని సోము వీర్రాజు ప్రశ్నించారు. 'ప్రతిఒక్కరూ టీడీపీతో మీరు పొత్తు పెట్టుకుంటున్నారా అని బీజేపీనే అడుగుతారు. పొత్తు కోసం ఎవరు ఎవర్ని కలిశారు? అని ఆయన్నెందుకు అడగరు? మేం చెప్పింది రాసుకోండ'ని పాత్రికేయులపై ఆయన మండిపడ్డారు. అనంతపురం జిల్లా గుంతకల్లులో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. పొత్తు ఎవరు కావాలనుకుంటున్నారు? వెళ్లి కలిసినప్పుడు అక్కడ ఏం జరిగిందని మమ్మల్ని అడగటం కంటే పొత్తుల కోసం వెంపర్లాడుతున్న వారిని అడిగితే మీకు సమాధానం దొరుకుతుందన్నారు. పొత్తుల విషయం పార్టీ అధిష్టానం చూసుకుంటుందని, అధినాయకత్వం ఆదేశానుసారమే తాము పనిచేస్తామని వీర్రాజు స్పష్టంచేశారు. ఈ సందర్భంగా ఎల్లో మీడియాపై ఆయన పరోక్షంగా సెటైర్లు వేశారు.



పాడి రైతుల నోట్లో ప్రతిపక్ష నేతలు మట్టి

గడిచిన తొమ్మిదేళ్ల కాలంలో రాష్ట్రాభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం రూ.8.16 లక్షల కోట్ల నిధులిచ్చిందని సోము వీర్రాజు తెలిపారు. రాష్ట్రంలో అవినీతి, అక్రమాలు ఎక్కువయ్యాయని బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, కేంద్రమంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలకు కట్టుబడి ఉన్నామన్నారు. ప్రభుత్వ డెయిరీలను మూసివేయించడమే కాకుండా ప్రతిపక్ష నేతలే సొంతంగా ప్రైవేట్ డెయిరీలను పెట్టుకుని పాడి రైతుల నోట్లో మట్టికొట్టారని పరోక్షంగా చంద్రబాబుపై ఆయన మండిపడ్డారు.

ఏపీలో జనసేనతోనే పొత్తు : ఎంపీ కె.లక్ష్మణ్

రాష్ట్రంలో జనసేనతోనే బీజేపీకి పొత్తు కొనసాగుతుందని బీజేపీ రాజ్యసభ సభ్యులు డాక్టర్ కె. లక్ష్మణ్ స్పష్టంచేశారు. కర్నూలులో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ప్రధాని మోదీ కంటే ఎక్కువ అభివృద్ధి, సంక్షేమం చేసినట్లు నిరూపిస్తారా అని ప్రతిపక్షాలకు లక్ష్మణ్ ఛాలెంజ్ చేశారు. భారత్ విశ్వగురువుగా ఎదుగుతోందన్నారు. దళారీ వ్యవస్థ లేకుండా బీజేపీ ప్రభుత్వం ప్రజలకు మేలు చేస్తోందన్నారు. ఒక్క మంత్రి కూడా కుంభకోణాలకు పాల్పడలేదన్నారు.

విశాఖ ప్రశాంతం

డీజీపీ కేవీ రాజేంద్రనాథ్‌రెడ్డి

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో శాంతి భద్రతల సమస్యే లేదని, పోలీసు వ్యవస్థ సమర్థంగా పని చేస్తోందని డీజీపీ కేవీ రాజేంద్రనాథ్‌రెడ్డి స్పష్టం చేశారు. అరాచక శక్తులకు విశాఖ అడ్డాగా మారిందంటూ కొన్ని పత్రికలు ప్రజల్లో అపోహలు సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నాయని చెప్పారు. శుక్రవారం మంగళగిరిలోని రాష్ట్ర పోలీసు ప్రధాన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. విశాఖలో ఎంపీ కుటుంబ సభ్యుల కిడ్నాప్ వ్యవహారంలో సమాచారం అందిన స్వల్ప వ్యవధిలోనే నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. కచ్చితమైన ప్రణాళిక, సమన్వయంతో గంటల వ్యవధిలోనే కేసును ఛేదించి బాధితులను రక్షించామన్నారు. ఈ కేసులో ఇప్పటివరకు నలుగురు నిందితులను అరెస్టు చేయడంతోపాటు రూ.86.50 లక్షలను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. న్యాయవాది రాజేష్ వద్ద రూ.21.50 లక్షలు, నిందితుడి తల్లి వద్ద రూ.25 లక్షలు, ప్రధాన నిందితుడు స్నేహితురాలి వద్ద రూ.40 లక్షలు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఈ కేసులో నిందితులు హేమంత్ కుమార్‌పై 2015 నుంచి, ఉలవల రాజేష్‌పై 2011 నుంచి పలు కేసులు పెండింగులో ఉన్నాయన్నారు. హేమంత్ కుమార్‌పై 2014 నుంచి 2019 వరకు 15 కేసులు నమోదయ్యాయని చెప్పారు. ఆ తరువాత కూడా అతను నేరాలకు పాల్పడుతుండటంతో పోలీసులు వివిధ పోలీస్ స్టేషన్లలో మరో 15 కేసులు పెట్టామన్నారు.

విశాఖలో నేరాలు తగ్గాయిలా	నేరం	2014	2015	2016	2017	2018	2019	2020	2021	2022	2023
	ఆర్థిక కారణాలతో హత్యలు	5	6	3	4	3	3	2	1	1	1
	దోపిడీలు	7	0	4	6	4	0	1	4	4	0
	రాబరీ	43	29	44	43	27	19	25	15	30	2
	పగటిపూట ఇళ్లల్లో దొంగతనాలు	53	43	49	84	55	55	15	25	35	5
	రాత్రి వేళల్లో ఇళ్లల్లో దొంగతనాలు	297	249	309	256	172	123	137	139	165	40
	దొంగతనాలు	1,250	1019	1364	1403	1105	704	506	632	678	198
	ఘర్షణలు	10	5	12	2	3	4	5	2	1	0
	కిడ్నాపులు	139	194	176	155	214	178	76	39	43	8

గ్యాంగ్‌లంటూ భయపెట్టే యత్నాలు...

ప్రశాంతమైన విశాఖలో పోలీసులు నిత్యం అప్రమత్తంగా ఉంటున్నారని, అక్కడ శాంతి భద్రతల సమస్యే లేదని డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి చెప్పారు. ప్రధాని మోదీ పర్యటనతో పాటు గ్లోబల్ ఇన్వెస్టర్స్ సదస్సు, జీ 20 సదస్సు తదితర జాతీయ, అంతర్జాతీయస్థాయి కార్యక్రమాలను ఇటీవల విశాఖలో సజావుగా నిర్వహించిన విషయాన్ని గుర్తు చేశారు. కొన్ని పత్రికలు పేర్కొంటున్న దండుపాళ్యం, చిట్టి మామ, ఖాసీమ్ గ్యాంగ్, 3 స్టార్ గ్యాంగ్‌లు 2015 నాటికే విశాఖలో ఉనికిలో లేకుండా పోయాయని తెలిపారు. ఆ గ్యాంగ్‌ల పేర్లను ప్రస్తావిస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేసేందుకు కొన్ని పత్రికలు ప్రయత్నించటాన్ని డీజీపీ ఖండించారు. విశాఖలో పెద్ద ఎత్తున భూకబ్జాలు జరుగుతున్నాయన్న ఆరోపణలు అవాస్తవమన్నారు. రౌడీషీటర్లు విశాఖను విభజించుకుని గంజాయి, మాదకద్రవ్యాలు సరఫరా చేస్తున్నారన్న వార్తల్లో కూడా నిజం లేదన్నారు. రౌడీ షీటర్ల కదలికలపై పోలీసులు పూర్తి నిఘా పెట్టారన్నారు. బయట వ్యక్తులు వచ్చి విశాఖలో గ్యాంగ్‌లు ఏర్పాటు చేసిన ఘటన ఒక్కటి కూడా లేదన్నారు. నగరంలో నాలుగేళ్లగా నేరాల సంఖ్య గణనీయంగా తగ్గిందని చెప్పారు. విశాఖ ఏజెన్సీలో దశాబ్దాలుగా కొనసాగిన గంజాయి సాగును రాష్ట్ర ప్రభుత్వం ఆపరేషన్ పరివర్తన్ ద్వారా పూర్తిగా నిర్మూలించిందన్నారు. ప్రత్యామ్నాయ పంటల సాగుతో గిరిజనులను ప్రభుత్వం ప్రోత్సహిస్తోందన్నారు.

చంద్రబాబు నివాసం అటాచ్‌మెంట్ కేసులో వాదనలు పూర్తి

- తీర్పును రిజర్వ్ చేసిన న్యాయాధికారి
- విచారణ 28కి వాయిదా

సాక్షి, అమరావతి: టీడీపీ ప్రభుత్వ హయాంలో అమరావతి భూ అక్రమాల కేసులో ఏ-1 నిందితుడిగా ఉన్న నారా చంద్రబాబు కరకట్ట నివాసాన్ని అటాచ్ చేయడంపై విజయవాడ ఏసీబీ న్యాయస్థానంలో వాదనలు శుక్రవారం ముగిశాయి. తీర్పును రిజర్వ్ చేసిన న్యాయాధికారి కేసును ఈ నెల 28కి వాయిదా వేశారు. కరకట్ట మీద చంద్రబాబు నివాసాన్ని అటాచ్ చేసేందుకు సీఐడీ ఈ పిటిషన్ వేసిన విషయం తెలిసిందే. ఈ కేసు విచారణ అధికారి తన వాదనను న్యాయస్థానంలో శుక్రవారం వినిపించారు. ఆయన వాంగ్మూలాన్ని న్యాయస్థానం నమోదు చేసింది. అనంతరం తమ వాదనలు కూడా వినాలని లింగమనేని రమేశ్ న్యాయవాది చేసిన విజ్ఞప్తిని న్యాయాధికారి తిరస్కరించారు. ఈ కేసులో వాదనలు పూర్తయ్యాయని, తీర్పును రిజర్వ్ చేస్తున్నామని తెలిపి విచారణను వాయిదా వేశారు.

అధికారంలోకి వస్తే వైఎస్సార్‌సీపీ నేతలను జైల్లో వేయిస్తా : టీడీపీ నేత లోకేశ్

ఆత్మకూరు: వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తుందని, కొందరు వైఎస్సార్‌సీపీ నాయకులను గుర్తుపెట్టుకుని జైల్లో వేయిస్తానని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్ చెప్పారు. యువగళం పాదయాత్రలో భాగంగా శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా ఆత్మకూరు నియోజకవర్గంలోని అనంతసాగరంలో శుక్రవారం రాత్రి నిర్వహించిన బహిరంగసభలో ఆయన మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ నాయకులు అధికారంలోకి వచ్చిన నాలుగేళ్లలో ఇష్టారాజ్యంగా దోచుకుంటున్నారని ఆరోపించారు. దీనికి పర్యవసానం తెలుగుదేశం పార్టీ తీర్చుకుంటుందన్నారు. పోలీసు అధికారులకు రావాల్సిన నిధులు నిలిచిపోయాయని, రానున్న టీడీపీ ప్రభుత్వం వాటిని చెల్లిస్తుందని చెప్పారు. సోమశిల ప్రాజెక్టును ఎన్టీ రామారావు పూర్తిచేశారని, లక్ష ఎకరాలకు సాగునీరు ఇచ్చారని అవగాహన లేకుండా మాట్లాడడంతో ప్రజలు నవ్వుకున్నారు. వాస్తవానికి జలగం వెంగళరావు హయాంలో శంకుస్థాపన చేసిన ఈ ప్రాజెక్టులో కొంతమేర మాత్రమే ఎన్టీ రామారావు హయాంలో పనులు జరిగాయి. ఈ విషయంపై అవగాహన లేకుండా లోకేశ్ మాట్లాడడం పట్ల ప్రజలు నివ్వెరపోయారు. అధికారంలోకి వస్తే ఏం చేస్తామో అంటూ ఆయన మేనిఫెస్టోలోని హామీలను చెబుతున్నా ప్రజల్లో స్పందన కరువైంది. సభలో వెంకటగిరి ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి కూడా మాట్లాడారు. మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, పనబాక లక్ష్మి, బి.సి.జనార్దన్‌రెడ్డి, ఆనం కైవల్యారెడ్డి, శుభకర్‌రెడ్డి, రంగమయూర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మిమ్మల్ని విస్మరించాను.. ఇకపై అలా జరగదు

కుప్పం నియోజకవర్గం పర్యటనలో చంద్రబాబు వ్యాఖ్యలు

సాక్షి, తిరుపతి: పార్టీ కార్యకర్తలను విస్మరించానని, ఇకపై అలా జరగదని తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబునాయుడు చెప్పారు. కుప్పం నియోజకవర్గం పర్యటనలో భాగంగా మూడో రోజు శుక్రవారం రామకుప్పం, శాంతిపురం మండలాల కార్యకర్తలతో ఆయన సమావేశమయ్యారు. అంతకు ముందు మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా కార్యకర్తలను ప్రసన్నం చేసుకొనేందుకు ప్రయత్నించారు. పార్టీకి ప్రాధాన్యం ఇవ్వకపోవడం వాస్తవమేనని.. దీనివల్ల కూడా నష్టం జరిగిందని అన్నారు. పవన్ కళ్యాణ్ పట్ల ప్రభుత్వం అనుసరిస్తున్న తీరు తీవ్ర అభ్యంతరకరమన్నారు. నిత్యం బూతులు తిట్టడం, ఎదురు దాడిచేయడమే వైసీపీ నేతలు, మంత్రులు పనిగా పెట్టుకున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో వైసీపీ నాయకులు పంచభూతాలనూ మింగేశారని విమర్శించారు. ప్రజల ఇళ్లపైనా ఈ రాక్షసులు పడతారని తాను చెబితే ఎవరూ నమ్మలేదని, ఇప్పుడు రాష్ట్రంలో అదే జరుగుతోందని అన్నారు. విశాఖలో వైఎస్సార్‌సీపీ ఎంపీ కుటుంబ సభ్యుల కిడ్నాప్ అక్కడి పరిస్థితులకు ఒక ఉదాహరణగా చెప్పారు. హుద్‌హుద్‌ను సైతం తట్టుకున్న విశాఖ.. నేడు అక్రమార్కుల చేతిలో విలవిల్లాడుతోందని అన్నారు. రాష్ట్రంలో ప్రజలను భయపెట్టి జగన్ ఇంత కాలం పాలన చేశారన్నారు. ఇప్పటివరకు జనం అన్నీ భరించారని, ఇప్పుడు ఎదురు తిరుగుతున్నారని చెప్పారు. వైఎస్సార్‌సీపీని రాష్ట్రం నుంచి తరిమేయడమే మిగిలిందన్నారు. ఉత్తర కొరియా అధ్యక్షుడు, నియంత కిమ్ సోదరుడిలా సీఎం జగన్ వ్యవహరిస్తున్నారని అన్నారు. పులివెందులలో జగన్ భయపెట్టి గెలుస్తున్నారని, కుప్పంలో తాను ప్రజల అభిమానంతో గెలుస్తున్నానని అన్నారు. నేడు కుప్పంలో అన్ని అభివృద్ధి పనులు నిలిపివేశారని ఆరోపించారు.

దెబ్బతిన్న రాష్ట్రాన్ని తిరిగి గాడిన పెట్టాల్సిన బాధ్యత సీనియర్ నేతగా తనపై ఉందన్నారు. అందరిలా భయపడి తాను రాష్ట్రాన్ని వదిలేస్తే.. పూర్తిగా నాశనం అవుతుందని, ఆ పరిస్థితి వస్తే ఎక్కువ బాధపడేది తానే అని చెప్పుకొచ్చారు. అప్పులు చేసుకుంటూ పోవడం గొప్ప విషయం కాదని, సంపద సృష్టించి దాన్ని పేదలకు పంచాలని చెప్పారు. రాష్ట్రంలో ప్రభుత్వ ఆదాయం ఎందుకు పడిపోయిందో చెప్పాలన్నారు. తెలంగాణకు, ఏపీకి మధ్య ఆదాయాల్లో రూ.40 వేల కోట్లు వ్యత్యాసం ఉందని, టీడీపీ ప్రభుత్వం ఉంటే ఈ నష్టం ఉండేది కాదని అన్నారు.

ఏ పంట ఏదో లోకేశ్‌కు తెలియదు

- చంద్రబాబు అధికారంలో ఉంటే కరువు కాటకాలే
- వ్యవసాయశాఖ మంత్రి కాకాణి

నెల్లూరు (దర్గామిట్ట): టీడీపీ నేతలు, కార్యకర్తలు కూడా లోకేశ్ పాదయాత్రలో పాల్గొనేందుకు ఆసక్తి చూపడం లేదని, యువగళానికి స్పందనే లేదని వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి విమర్శించారు. నెల్లూరులోని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఏ పంట ఏదో, ఎక్కడ పండుతుందో కనీస పరిజ్ఞానం లేని లోకేశ్ వ్యవసాయం గురించి మాట్లాడుతుంటే నవ్వొస్తోందన్నారు. టీడీపీ హయాంలో సాగు, తాగునీరు లేదని, చంద్రబాబు అధికారంలో ఉంటే కరువు కాటకాలు విలయతాండవం చేస్తాయని చెప్పారు. బాబు హయాంలో ఏటా కరువు మండలాలు ప్రకటించారని గుర్తుచేశారు. సోమశిల లిఫ్ట్ ఇరిగేషన్ తీసుకొస్తామని చెబుతున్న లోకేశ్ చంద్రబాబు హయాంలో ఎందుకు చేయలేకపోయారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రైతురథం పేరుతో కమీషన్లు కొల్లగొట్టింది నిజం కాదా అని ప్రశ్నించారు. అప్పటి మంత్రి సోమిరెడ్డి మిల్లర్ల నుంచి ముడుపులు దండుకున్నాడన్నారు. ఉద్యాన పంటల్లో ఏపీ అగ్రస్థానంలో ఉందన్న విషయం మర్చిపోయి లోకేశ్ మాట్లాడుతున్నాడన్నారు. టీడీపీ హయాంలో నకిలీ విత్తనాలు, ఎరువులు పంపిణీ చేశారని చెప్పారు. రైతులకు రుణమాఫీ చేస్తామని మోసం చేసింది లోకేశ్‌కు గుర్తురాలేదా అని ప్రశ్నించారు. జిల్లాలో లోకేశ్ యువగళం పాదయాత్ర అట్టర్‌ఫ్లాప్ అయిందని, ప్రజల నుంచి కనీస స్పందన కూడా రావడం లేదని, జనం లేక కేవలం సాయంత్రం వేళల్లో పాదయాత్ర జరుపుకోవాల్సిన దౌర్భాగ్య పరిస్థితి ఏర్పడిందని ఎద్దేవా చేశారు. కోర్టులో చోరీకి సంబంధించి ఎఫ్ఐఆర్‌లో తన పేరు లేకున్నా పదేపదే అదే అంశాన్ని ప్రస్తావిస్తున్నారన్నారు. ప్రస్తుతం ఈ అంశంపై విచారణ జరుగుతుండడంతో తాను వివరంగా మాట్లాడడం లేదని చెప్పారు. ఓటుకు కోట్లు కేసులో చంద్రబాబు అడ్డంగా దొరికారన్నారు. పంచాయతీరాజ్ మంత్రిగా లోకేశ్ వీధిదీపాల నిర్వహణను ఒకేసంస్థకు అప్పగించి అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. ప్రజలను రెచ్చగొట్టేందుకు అబద్ధాలు చెబుతున్న లోకేశ్ ఇకనైనా హుందాగా మాట్లాడడం నేర్చుకోవాలని సూచించారు. వ్యవసాయ రంగానికి తామేంచేశామో చెబుతామని, దమ్ముంటే టీడీపీ హయాంలో ఏంచేశారో చెప్పాలని మంత్రి సవాల్ చేశారు.



ఏపీలో పెట్టుబడులకు అపార అవకాశాలు

- ఏపీ సీఎస్ జవహర్‌రెడ్డి వెల్లడి
- కేంద్ర రసాయన, పెట్రో కెమికల్స్ శాఖ కార్యదర్శి అరుణ్ బరోకతో భేటీ
- రాష్ట్రంలో కెమికల్ పార్కుల ఏర్పాటుపై చర్చ



సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో కెమికల్స్ అండ్ పెట్రో కెమికల్స్ రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు అపారమైన అవకాశాలు ఉన్నాయని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) కేఎస్ జవహర్‌రెడ్డి స్పష్టం చేశారు. కేంద్ర రసాయన, పెట్రో కెమికల్స్ శాఖ కార్యదర్శి అరుణ్ బరోకతో కూడిన అధికారుల బృందం శుక్రవారం జవహర్‌రెడ్డితో భేటీ అయింది. ఈ సందర్భంగా జవహర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్ 640 చ.కి. మీటర్లతో కూడిన పెట్రోలియం, కెమికల్స్ అండ్ పెట్రో కెమికల్స్ ఇన్వెస్ట్మెంట్ రీజియన్ (పీసీపీఐఆర్)ను కలిగి దేశంలో నాల్గవ రాష్ట్రంగా ఉందని పేర్కొన్నారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చే వారికి అవాంతరాలు లేని వ్యాపార వాతావరణాన్ని కల్పించేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటున్నట్టు స్పష్టం చేశారు. అభివృద్ధి చెందుతున్న ఆంధ్రప్రదేశ్‌లో కెమికల్ ఇండస్ట్రీ ప్రధాన భాగస్వామి అయ్యేందుకు గల అవకాశాలపై ఈ సమావేశంలో విస్తృతంగా చర్చించారు.

విశాఖ, నెల్లూరులో ప్లాస్టిక్స్ ఇన్‌స్టిట్యూట్‌ల ఏర్పాటుపై చర్చ

విశాఖపట్నం, నెల్లూరు నగరాల్లో సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ప్లాస్టిక్స్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ (సీపెట్‌) ఇనిస్టిట్యూట్‌ల ఏర్పాటుపై కేంద్ర కార్యదర్శి అరుణ్ బరోక సీఎస్ జవహర్ రెడ్డితో చర్చించారు. వీటి ఏర్పాటుతో ఈ రంగంలో మరింత నైపుణ్యాభివృద్ధి, సాంకేతిక సహాయం అందించేందుకు అన్నివిధాలా అవకాశం కలుగుతుందని చెప్పారు. అంతకుముందు అరుణ్ బరోక మాట్లాడుతూ.. రసాయన ఉత్పత్తుల తయారీలో భారతదేశం ప్రపంచంలోనే 6వ, ఆసియా ఖండంలో 3వ పెద్ద దేశంగా నిలిచిందన్నారు. ప్రస్తుతం ప్రపంచంలో కెమికల్స్ అండ్ పెట్రో కెమికల్స్ ఉత్పత్తిలో భారతదేశం వాటా 178 బిలియన్ డాలర్లు ఉండగా.. 2025 నాటికి 300 బిలియన్ డాలర్ల స్థాయికి చేరేలా అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. ఇండియన్ ట్రేడ్ పోర్టల్ ప్రకారం ప్రస్తుతం దేశంలో ఈ రంగంలో 2 మిలియన్ల మంది పని చేస్తున్నారని చెప్పారు. వచ్చే నెలలో జరిగే 3 ఎడిషన్ ఆఫ్ ఇండియా-గ్లోబల్ కెమికల్స్ అండ్ పెట్రో కెమికల్స్ మాన్యుఫ్యాక్చరింగ్ హబ్స్ సమ్మిట్‌లో పాల్గొనాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని అరుణ్ బరోక కోరారు. ఏపీ ఐఐసీ ఎండీ ప్రవీణ్ కుమార్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా రాష్ట్రంలో పరిశ్రమల స్థాపన, ప్రత్యేకంగా కెమికల్ పార్కులు, ఎస్ఈజెడ్‌ల ఏర్పాటుకు గల అవకాశాలు, ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలపై వివరించారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో అందుబాటులో ఉన్న సౌకర్యాలు, పర్యావరణ సంబంధిత అంశాలపైనా వివరించారు. సమావేశంలో రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కరికల వలవన్, ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్ఎస్ రావత్ పాల్గొన్నారు.

ఏపీఈఆర్‌సీ సభ్యునిగా పీవీఆర్ బాధ్యతల స్వీకరణ

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్‌సీ) సభ్యునిగా పీవీఆర్ రెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. హైదరాబాద్‌లోని ఏపీఈఆర్‌సీ ప్రధాన కార్యాలయంలో ఆయనతో ఈఆర్‌సీ చైర్మన్ జస్టిస్ నాగార్జునరెడ్డి ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో ఏపీఈఆర్‌సీ మరో సభ్యుడు ఠాకూర్ రాంసింగ్, కమిషన్ సెక్రటరీ కె.రాజ బాపయ్య, జాయింట్ సెక్రటరీ బీఏవీపీ కుమార్ రెడ్డి, ఏపీసీపీడీసీఎల్ సీఎండీ జె.పద్మాజనార్దనరెడ్డి పాల్గొన్నారు. విశ్రాంత ఐఆర్ఎస్ అధికారి అయిన పీవీఆర్ రెడ్డి స్వస్థలం పల్నాడు జిల్లా రెంటచింతల. గుజరాత్ కస్టమ్స్ విభాగంలో ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్‌గా పనిచేసి పదవీ విరమణ చేశారు. కాగా కొత్త పదవిలో ఆయన ఐదేళ్లపాటు కొనసాగనున్నారు.

గిరిజనులకు అదనపు 'ఉపాధి'

మరో 1.10 లక్షల కుటుంబాలకు ఏటా రూ.151 కోట్ల పని

సాక్షి, అమరావతి: రాష్ట్రవ్యాప్తంగా 1.10 లక్షల గిరిజన కుటుంబాలకు ప్రతియేటా రూ.151 కోట్ల మేర అదనపు 'ఉపాధి' చేకూర్చేందుకు సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. నిబంధనల ప్రకారం అర్హత ఉన్న ఆయా కుటుంబాలన్నింటినీ ఉపాధి హామీ పథకంలో ఏటా 150 రోజుల చొప్పున పనులు పొందే వారి జాబితాలో చేర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం నెలరోజులపాటు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తోంది. ఉపాధి హామీ చట్టం ప్రకారం.. సాధారణ కుటుంబాలకు ఏటా గరిష్టంగా వంద రోజుల చొప్పున పనులు కల్పిస్తున్నప్పటికీ, అటవీ భూహక్కు పట్టాదారులకు కుటుంబానికి ఏటా 150 రోజులు పనులు కల్పించే వెసులుబాటు ఉంది. దీంతో.. తాజాగా రాష్ట్రవ్యాప్తంగా ఆర్ఓఎఫ్ఆర్ లబ్ధిదారులు మొత్తం 1,82,316 కుటుంబాలు ఉండగా.. నెలరోజుల క్రితం వరకు ఈ సంఖ్య 72,646 కుటుంబాలు మాత్రమే 150 రోజుల పనిదినాలు పొందేందుకు అర్హత ఉన్న జాబితాల్లో పేర్లు నమోదు చేసుకున్నాయి.



నెలరోజులపాటు ప్రత్యేక డ్రైవ్..

ఈ నేపథ్యంలో.. అర్హత ఉన్న మిగిలిన కుటుంబాలను కూడా ఈ పరిధిలోకి తీసుకొచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల ఒకటో తేదీ నుంచి నెలాఖరు వరకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా.. ఆయా గిరిజన గ్రామాల్లో పనిచేసే ఉపాధి హామీ పథకం ఫీల్డు అసిస్టెంట్లే తమ పరిధిలోని ఆయా అర్హులను గుర్తించి, వారి వివరాలను మండల కేంద్రంలో అప్‌డేట్ చేస్తారు. గత 15 రోజులుగా ఫీల్డ్ అసిస్టెంట్లే ఆయా లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి వివరాలు సేకరిస్తున్నారు. ఇలా ఇప్పటివరకు 54,424 కుటుంబాలను కొత్తగా 150 రోజుల పనిదినాలు పొందేందుకు అర్హుల జాబితాలోకి తీసుకొచ్చారు. ఇంకా 55,246 కుటుంబాలను ఈ పరిధిలోకి తీసుకురావాల్సి ఉందని.. ఈ నెలాఖరుకల్లా అర్హులందరినీ ఈ పరిధిలోకి తీసుకొచ్చేందుకు చర్యలు చేపడుతున్నట్లు గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు వివరించారు. ఇక ప్రస్తుతం గరిష్టంగా ఏటా వంద రోజుల చొప్పున ఉపాధి హామీ పథకం పనులు పొందుతున్న ఆయా కుటుంబాలు అదనంగా 50 రోజుల ఉపాధి పొందితే ఒక్కో పనిదినానికి గరిష్టంగా రూ.272 చొప్పున రూ.13,600ల వరకు అదనపు ప్రయోజనం చేకూరుతుంది.

కర్నూలులో ఏపీ ఈఆర్‌సీ ప్రధాన కార్యాలయం

భవన నిర్మాణానికి భూమి పూజ చేసిన చైర్మన్ జస్టిస్ నాగార్జునరెడ్డి

కర్నూలు (రాజ్‌విహార్): ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్‌సీ) ప్రధాన కార్యాలయ భవన నిర్మాణానికి ఈఆర్‌సీ చైర్మన్ జస్టిస్ సీవీ నాగార్జునరెడ్డి శుక్రవారం భూమి పూజ చేశారు. నగర శివారులోని ఏపీ కార్బైడ్ ఫ్యాక్టరీ వద్ద రూ.10 కోట్లతో 2 ఎకరాల్లో ఈ కార్యాలయాన్ని నిర్మిస్తున్నారు. ఏడాదిలోపు నిర్మాణ పనులు పూర్తి చేయనున్నారు. 2014లో రాష్ట్ర విభజన జరిగినా..ఇప్పటి వరకు ఈఆర్‌సీ కార్యాలయం హైదరాబాద్‌లోనే ఉంది. దీన్ని కర్నూలులో ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం గత ఏప్రిల్ 25న జీవో 8 విడుదల చేసింది. దీంతో ట్రాన్స్‌కో సబ్ స్టేషన్‌లోని ఆవరణలో పక్కా భవనాన్ని నిర్మించేందుకు స్థలాన్ని అధికారులు ఎంపిక చేశారు. గత వారంలో కమిషన్ సెక్రటరీ, సభ్యులు స్థల పరిశీలన చేశారు. ఏపీ హైకోర్టును కర్నూలులో ఏర్పాటు చేసి, న్యాయ రాజధాని హోదా కల్పించాలని చర్యలు చేపట్టిన ప్రభుత్వం ఇప్పటికే లోకాయుక్త, హ్యూమన్ రైట్స్ కమిషన్ కార్యాలయాలతో పాటు వక్ఫ్ బోర్డు ట్రిబ్యునల్, సీబీఐ కోర్టును ఇక్కడే నెలకొల్పిన విషయం తెలిసిందే. తాజాగా ఈఆర్‌సీ ప్రధాన కార్యాలయాన్ని ఇక్కడ ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టింది. కార్యక్రమంలో లోకాయుక్త చైర్మన్ జస్టిస్ పి.లక్ష్మణరెడ్డి, ఈఆర్‌సీ మెంబర్ సెక్రటరీ రాజబాపయ్య, టెక్నికల్ మెంబర్ రాంసింగ్, ఏపీఎస్‌పీడీసీఎల్ సీఎండీ సంతోషరావు తదితరులు పాల్గొన్నారు.



భవన నిర్మాణ పనులకు భూమి పూజ చేస్తున్న చైర్మన్ జస్టిస్ నాగార్జునరెడ్డి

ట్రిపుల్ ఐటీలకు భారీగా దరఖాస్తులు

16వ తేదీ సాయంత్రానికి 27,500 దరఖాస్తులు రాక

నూజివీడు: ఆర్జీయూకేటీ పరిధిలోని నూజివీడు, ఇడుపులపాయ, శ్రీకాకుళం, ఒంగోలు ట్రిపుల్ ఐటీల్లో చేరేందుకు గాను ఆన్‌లైన్‌లో భారీగా దరఖాస్తులు అందుతున్నాయి. ట్రిపుల్ ఐటీలలో ఉన్న ఆరు సంవత్సరాల సమీకృత ఇంజినీరింగ్ కోర్సులో చేరేందుకు గాను ఈ నెల మూడో తేదీన ఆర్జీయూకేటీ నోటిఫికేషన్‌ను జారీ చేసింది. ఆ తర్వాత ఈ నెల నాలుగు నుంచి దరఖాస్తులను స్వీకరిస్తోంది. పదో తరగతి ఈ ఏడాది మార్చిలో రెగ్యులర్‌గా ఉత్తీర్ణులైనవారు ఆన్‌లైన్‌లో యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని అధికారులు ప్రకటించారు. ఈ నేపథ్యంలో ట్రిపుల్ ఐటీలకు దరఖాస్తులు పెద్ద ఎత్తున వస్తున్నాయి. శుక్రవారం సాయంత్రం ఆరు గంటల వరకు వచ్చిన దరఖాస్తులను పరిశీలిస్తే మొత్తం 27,500 మంది దరఖాస్తు చేసుకున్నట్టు తేలింది. ఈ నెల 26వ తేదీ వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉన్న నేపథ్యంలో ఈ సంఖ్య 40 వేల వరకు చేరుకోవచ్చని ఆర్జీయూకేటీ వర్గాలు భావిస్తున్నాయి. ఇక సీట్ల విషయానికొస్తే.. నాలుగు ట్రిపుల్ ఐటీల్లో కలిపి మొత్తం 4400 సీట్లు ఉండటం గమనార్హం.

మల్లన్న భక్తులకు అందుబాటులో వడ ప్రసాదం

శ్రీశైలం టెంపుల్: మల్లన్న భక్తుల సౌకర్యార్థం దేవస్థానం వడ ప్రసాదం అందుబాటులోకి తెచ్చింది. ప్రసాదాల విక్రయ కేంద్రాల ద్వారా లడ్డూ, పులిహోరతో పాటు వడ ప్రసాదాన్ని కూడా భక్తులు కొనుగోలు చేయవచ్చు. ముందుగా ప్రసాదాల విక్రయ కౌంటర్ల వద్ద శ్రీభ్రమరాంబ మల్లికార్జున స్వామిఅమ్మ వార్ల చిత్రపటానికి ప్రత్యేక పూజలు జరిపించారు. అనంతరం దేవస్థానం ఈవో ఎస్.లవన్న వడ ప్రసాద విక్రయాలను ప్రారంభించారు. 45 గ్రాముల వడ ప్రసాదం ధర రూ.20లుగా నిర్ణయించారు.



వడ ప్రసాదాన్ని భక్తులకు అందజేస్తున్న ఈవో

'ఎర్ర' స్మగ్లర్లను ఇలాగే వదిలేస్తారా!

దర్యాప్తు పూర్తికాకపోవడంపై హైకోర్టు ప్రశ్న

సాక్షి, అమరావతి: ఎర్ర చందనం, గంధం, ఇతర అటవీ ఉత్పత్తుల స్మగ్లింగ్ విషయంలో కేసులు నమోదై దశాబ్దాలు గడుస్తున్నా.. ఇప్పటివరకు దర్యాప్తు పూర్తి చేయకపోవడం, చార్జిషీట్లు దాఖలు చేయకపోవడంపై హైకోర్టు తీవ్రంగా స్పందించింది. ఈ వ్యవహారంపై సుమోటోగా విచారణ చేపట్టింది. ఎర్ర చందనం, గంధం, ఇతర అటవీ ఉత్పత్తులు జాతి సంపద, జాతి వనరులని, ఇలాంటి వాటిని స్మగ్లింగ్ చేస్తున్న స్మగ్లర్లను దశాబ్దాలుగా ఎవరూ వారి జోలికి వెళ్లకుండా, వారి వెంటబడకుండా వదిలేశారని స్పష్టం చేసింది. ఈ మొత్తం వ్యవహారంపై సమగ్ర దర్యాప్తు చేయించాలని నిర్ణయించినట్టు తెలిపింది. కేంద్ర పర్యావరణ, అటవీ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులిచ్చింది. స్మగ్లర్లపై నమోదు చేసిన కేసుల దర్యాప్తులో నిర్లక్ష్యం, అసమర్థత, ఉదాసీనత చూపుతున్న నేపథ్యంలో వాస్తవాలు వెలుగులోకి రావాలంటే.. ఓ స్వతంత్ర బహిర్గత సంస్థ దర్యాప్తు చేయడం సబబుగా ఉంటుందని హైకోర్టు అభిప్రాయపడింది. తమ ఆదేశాల మేరకు ఏర్పాటయ్యే సిట్‌కు సివిల్ కోర్టుకు ఉండే అన్ని అధికారాలు ఉంటాయని, తమ విచక్షణ మేరకు ఏ వ్యక్తినైనా పిలిచేందుకు, రికార్డులు, డాక్యుమెంట్లు, వాంగ్మూలాలు కోరేందుకు సిట్‌కు అధికారం ఉంటుందని తేల్చిచెప్పింది.

సుమోటో టేకప్ కేసుగా మలచాలని ఆదేశం

అటవీ, పోలీస్ శాఖలకు చెందిన అధికారులందరితోపాటు ఆయా జిల్లాల ప్రిన్సిపల్ జిల్లా జడ్జిలు కూడా సిట్ దర్యాప్తుకు బేషరతుగా సహకరించాలని హైకోర్టు ఆదేశించింది. 12 వారాల్లో నివేదికను కేంద్ర పర్యావరణ, అటవీ మంత్రిత్వ శాఖ కార్యదర్శి ద్వారా తమకు సమర్పించాలని సిట్‌ను ఆదేశించింది. జనవరి 2001 నుంచి ఈ రోజు వరకు ఎర్ర చందనం, గంధం, ఇతర అటవీ ఉత్పత్తుల స్మగ్లింగ్ విషయంలో ఎన్ని కేసులు నమోదయ్యాయి, ఆ కేసుల్లో దర్యాప్తు ఎంతవరకు వచ్చిందనే వివరాలను సమర్పించాలని సిట్‌ను ఆదేశించింది. తాము ఇచ్చిన ఈ ఉత్తర్వుల కాపీని వారం లోపు ఈ మెయిల్ ద్వారా కేంద్ర అటవీ పర్యావరణ మంత్రిత్వ శాఖ కార్యదర్శికి పంపాలని రాష్ట్ర ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ (పీసీసీఎఫ్)ను ఆదేశించింది. అలాగే ఈ వ్యవహారంలో 'సుమోటో టేకప్ కేసు'గా మలిచి.. ఇందులో కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల శాఖ కార్యదర్శి, రాష్ట్ర పర్యావరణ, అటవీ, సైన్స్ అండ్ టెక్నాలజీ ముఖ్య కార్యదర్శి, ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్‌లతో పాటు పలు జిల్లాల డీఎఫ్‌వోలను, ఎస్పీలను ప్రతివాదులుగా చేర్చాలని హైకోర్టు రిజిస్ట్రీని న్యాయస్థానం ఆదేశించింది. ప్రధాన న్యాయమూర్తి ఆదేశాలకు అనుగుణంగా ఈ వ్యాజ్యంలో తదుపరి విచారణను సెప్టెంబర్ 6కి వాయిదా వేస్తున్నట్టు తెలిపింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ గన్నమనేని రామకృష్ణ ప్రసాద్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా జస్టిస్ రామకృష్ణ ప్రసాద్ స్పందిస్తూ.. 'అటవీ అధికారులు ఎర్ర చందనం స్మగ్లర్లను ప్రాణాలకు తెగించి మరీ పట్టుకుంటున్నారు. స్మగ్లర్లపై కేసులు కూడా నమోదవుతున్నాయి. ఆ తరువాత దశాబ్దాల తరబడి ఎలాంటి పురోగతి ఉండటం లేదు. ఈ పరిస్థితి రాష్ట్రానికి రావాల్సిన ఆదాయానికి తీవ్రస్థాయిలో గండికొడుతోంది. మరోవైపు స్మగ్లర్లను చట్టం ముందు నిలబెట్టకపోవడంతో వారు స్వేచ్ఛగా సమాజంలో తిరుగుతున్నారు. ఈ పరిస్థితి ఎలాంటి భయం, ఆటంకాలు లేకుండా యథేచ్ఛగా స్మగ్లింగ్ వంటి తీవ్రమైన కార్యకలాపాలకు పాల్పడే వారికి ఓ వరంలా, ధైర్యాన్ని ఇచ్చేదిగా మారింది. దీనివల్ల తదుపరి ఎదురయ్యే పరిణామాల పట్ల ఈ కోర్టు తీవ్ర ఆందోళన చెందుతోంది' అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు.

కేసు నేపథ్యం ఇదీ..

ఎర్ర చందనం స్మగ్లింగ్‌కు సంబంధించి తన వాహనాన్ని జప్తు చేస్తూ నంద్యాల డివిజనల్ ఫారెస్ట్ ఆఫీసర్ (డీఎఫ్‌వో) జారీ చేసిన ప్రొసీడింగ్స్‌ను సవాల్ చేస్తూ ఇన్నోవా యజమాని ఎర్రగుంట్ల బాలచంద్రుడు నంద్యాల మూడో అదనపు జిల్లా కోర్టులో అప్పీల్ దాఖలు చేయగా.. దాన్ని ఆ కోర్టు కొట్టేసింది. దీనిపై బాలచంద్రుడు 2014లో హైకోర్టును ఆశ్రయించారు. అప్పటి నుంచి ఈ కేసు పెండింగ్‌లో ఉంది. దీనిపై విచారణ జరిపిన హైకోర్టు చార్జిషీట్ దాఖలు చేయడంలో తీవ్ర జాప్యంపై న్యాయమూర్తి విస్మయం వ్యక్తం చేస్తూ.. పైన పేర్కొన్న ఉత్తర్వులు జారీ చేశారు.

> ఇంద్రియాలకు గోచరం కాని, నాశనం లేని ఆ పరమాత్మ భావమే చేరవలసిన ఉత్తమ మార్గమని రుషులు చెబుతారు. దేనిని పొందితే ప్రాణులు తిరిగి జన్మించరో అదే, ఆ సర్వోత్తమ స్థానమే నేను.
> – భగవద్గీత

సాక్షి

శనివారం, 17 జూన్ 2023

బోరిస్ పతనావస్థ!

'అదృష్టం అందలం ఎక్కిస్తే బుద్ధి బురదలోకి లాగింద'ని నానుడి. బ్రిటన్ మాజీ ప్రధాని బోరిస్ జాన్సన్‌కు ఇది అక్షరాలా సరిపోతుంది. ఒక సాధారణ స్థాయి నుంచి రాజకీయాల్లోకొచ్చి ప్రధాని పీఠం వరకూ వెళ్లిన జాన్సన్ నిరుడు జూలైలో ఆ పదవి పోగొట్టుకోవటమే కాదు... గతవారం ఎంపీ పదవికి కూడా రాజీనామా చేయక తప్పలేదు. తాజాగా సభాహక్కుల సంఘంతో అబద్ధాల కోరుగా ముద్రేయించుకున్నారు. ఎంపీగా తప్పుకున్నారు గనుక సరిపోయిందిగానీ, లేకుంటే ఆయన మూణ్ణెల్లపాటు దిగువ సభ నుంచి సస్పెండయ్యేవారు. ప్రజాస్వామ్యంలో బాధ్యతాయుత స్థానాల్లో ఉండేవారు నిజాయితీతో మెలగకపోతే, విశ్వసనీయతను ప్రాణప్రదంగా భావించకపోతే ఏ గతి పడుతుందో చెప్పడానికి జాన్సన్ ప్రస్థానం ఒక ఉదాహరణ. మనకు జాన్సన్ చేసింది పెద్ద తప్పు అనిపించకపోవచ్చు. కానీ బ్రిటన్‌లో అది చెల్లుబాటు కాదు. కరోనా మహమ్మారి తీవ్రంగా విజృంభిస్తున్న కాలంలో జాన్సన్ తన మిత్ర బృందాలతో విందుల్లో మునిగారన్నది ప్రధాన ఆరోపణ. ఆ కాలంలో దేశమంతా లాక్ డౌన్ అమల్లో వుంది. ప్రధానిగా 2020 మార్చి 23న లాక్‌డౌన్ విధించింది ఆయనే. మరో నాలుగు రోజులకు కరోనా వాతపడ్డారు కూడా. లాక్‌డౌన్ వల్ల దిగజారిన ఆర్థిక పరిస్థితులతో, కరోనా తీవ్రతతో జనం అల్లాడుతుంటే ఆ సమయంలో ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నదన్న ఆరోపణలు చెలరేగాయి. కనీసం అప్పుడైనా ఆయన మేల్కొనివుంటే వేరేగా ఉండేది. కానీ విందులు జరగడం అబద్ధమని ఒకసారి, జరిగినా నిబంధనలు ఉల్లంఘించలేదని మరోసారి బొంకారు. పైగా పార్టీలోని తన వ్యతిరేకులనూ, దర్యాప్తు చేస్తున్న సభా హక్కుల సంఘాన్నీ భ్రష్టుపట్టించే ప్రయత్నం చేశారు.

లండన్ మేయర్‌గా ఉన్నకాలంలో జాన్సన్ ఓసారి అమెరికా వెళ్లారు. ఆయన్ను చూసిన ఒక పౌరుడు జాన్సన్‌ను దేశాధ్యక్ష పదవికి రిపబ్లికన్ అభ్యర్థిత్వాన్ని ఆశిస్తూ దూకుడుగా ప్రచారం చేసుకుంటున్న ట్రంప్‌గా పొరబడ్డారట. ఇలా పొరబడిన పౌరుడెవరోగానీ ఇద్దరిలోనూ పోలికలున్నాయన్నది వాస్తవం. భౌతికమైన పోలికల మాట అటుంచి తమకొచ్చిన అవకాశాన్ని దుర్వినియోగపర్చటంలో ఇద్దరూ ఇద్దరే. తోచినట్టు మాట్లాడటం, ఇష్టానుసారం వ్యవహరించటం ఇద్దరిలోనూ ఉంది. అమెరికాలో ట్రంప్‌ను దించటానికి ఎన్నికల వరకూ జనం వేచిచూడాల్సి వచ్చింది. కానీ పార్టీ గేటు వ్యవహారం గుప్పుమన్నాక జాన్సన్‌ను సొంత పార్టీయే దించేసింది. నిజానికి పార్టీ గేటు వ్యవహారం ప్రధానిగా జాన్సన్ వరసబెట్టి చేసిన నిర్వాకాలకు పరాకాష్ఠ. ఒక చట్ట ఉల్లంఘనలో పోలీసులు తనకు జరిమానా విధించారని నిరుడు ఏప్రిల్‌లో ఆయనే స్వయంగా ప్రకటించారు. ప్రధాని స్థాయి నేత జరిమానా చెల్లించవలసి రావటం దేశ చరిత్రలో అదే తొలిసారి. అయినా అందుకుగల కారణమేమిటో ఆయన చెప్పలేదు. ఈలోగా తన అధికారిక నివాసాన్ని విలాసవంతంగా మార్చడానికి చట్టవిరుద్ధంగా భారీ మొత్తం ఖర్చు చేశారన్న ఆరోపణలొచ్చాయి. ఇది చాలదన్నట్టు అత్యాచార ఆరోపణల్లో జాన్సన్‌కు సన్నిహితుడిగా ఉండే ఎంపీ అరెస్టయ్యాడు. ఆయన మిత్రబృందంలోని మరో మాజీ ఎంపీకి బాలుడిపై లైంగిక దాడి చేశారన్న ఆరోపణ రుజువై శిక్షపడింది. ఆ తర్వాత 'పార్టీ గేట్' గుప్పుమంది. పర్యవసానంగా వరస సర్వేల్లో జాన్సన్ రేటు పడిపోయింది. ఆయనపై జనం ఆగ్రహావేశాలతో ఉన్నట్టు వెల్లడైంది. దాంతో 40 శాతం మంది పార్టీ ఎంపీలు జాన్సన్‌ను పదవి నుంచి తప్పించాలని నిశ్చయించుకున్నారు. అయినా పార్టీలో అవిశ్వాసం నుంచి గట్టెక్కారు. కానీ మాజీ ఎంపీపై ఉన్న కేసు గురించి తెలిసినా ఆయన్ను నెత్తినబెట్టుకున్నారన్న నిజాన్ని పార్టీ సభ్యులు సహించలేకపోయారు. అది తప్పేనని జాన్సన్ అంగీకరించినా లాభం లేకపోయింది. అంతవరకూ మద్దతుదార్లుగా ఉన్న అప్పటి ఆర్థికమంత్రి, ప్రస్తుత ప్రధాని రిషి సునాక్, ఆరోగ్యమంత్రి సాజిద్ జావేద్ వంటివారు నిరుడు జూలైలో తమ పదవులకు రాజీనామా చేశారు. పలువురు మంత్రులు సైతం వారి బాట పట్టడంతో జాన్సన్ రాజీనామా చేయాల్సి వచ్చింది.

తాజాగా సభాసంఘం అభిశంసన కన్సర్వేటివ్ పార్టీలో ఎలాంటి పరిణామాలకు దారితీస్తుందన్నది వేచిచూడాలి. వచ్చే సోమవారం ఆ నివేదికపై జరిగే చర్చ సందర్భంగా పార్టీలో లుకలుకలు బయటపడక తప్పదు. నివేదికకు వ్యతిరేకంగా ఓటేయొద్దని పార్టీ ఎంపీలను బోరిస్ జాన్సన్ కోరుతున్నా, తన తప్పులకు మాత్రం పశ్చాత్తాపం ప్రకటించడం లేదు. సరిగదా ఇదంతా ప్రతీకార రాజకీయాల పర్యవసానమని చెప్పుకొస్తున్నారు. కనీసం ఈ క్షణంలోనైనా పశ్చాత్తాప పడని నేతను ఎవరైనా క్షమించగలరా? కన్సర్వేటివ్ పార్టీలో జాన్సన్ ఎదిగిన క్రమం అసాధారణమైనది. పాత్రికేయుడిగా ఉంటూ పార్టీలోకొచ్చిన జాన్సన్ 2008 నుంచి 2016 వరకూ రెండుసార్లు లండన్ మేయర్‌గా ఉన్నారు. పరిస్థితులు కలిసొచ్చి థెరిస్సా మే ప్రధాని పదవి నుంచి తప్పుకున్నాక 2019లో ఆ పదవి చేజిక్కించుకున్నారు. అదే సంవత్సరం జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో పార్టీకి అఖండ విజయాన్నందించారు. 1987 తర్వాత అంత పెద్ద మెజారిటీతో కన్సర్వేటివ్‌లు నెగ్గటం అదే తొలిసారి. ఒంటరి తల్లుల సమస్య మొదలుకొని స్వలింగ సంపర్కం, బ్రిటన్ వలసవాదం, బ్రెగ్జిట్ వరకూ సమయానుకూలంగా అభిప్రాయాలు మార్చుకుంటూ వచ్చిన జాన్సన్ వంటివారిని కన్సర్వేటివ్ పార్టీ నెత్తినపెట్టుకోవటం మొదటినుంచీ విశ్లేషకుల్ని ఆశ్చర్యపరుస్తూనే ఉంది. పోతూ పోతూ జాన్సన్ అంటించిన బురద నుంచి ఆ పార్టీ ఏనాటికైనా బయటపడగలదా అన్నది సందేహమే.

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు, జ్యేష్ఠ మాసం, **తిథి:** బ.చతుర్దశి ఉ.8.31 వరకు, తదుపరి అమావాస్య, **నక్షత్రం:** రోహిణి సా.4.12 వరకు, తదుపరి మృగశిర, **వర్జ్యం:** ఉ.7.55 నుండి 9.11 వరకు, తదుపరి రా.10.43 నుండి 11.44 వరకు, **అమృతఘడియలు:** ప.12.43 నుండి 2.31 వరకు

సూర్యోదయం: 5.29
సూర్యాస్తమయం: 6.31
రాహుకాలం: ఉ.9.00 నుండి 10.30 వరకు
యమగండం: ప.1.30 నుండి 3.00 వరకు

రామనామ మహిమ

జ్యోతిర్మయం

ఒక భజన బృందం వీధిలో రామనామ సంకీర్తనం చేసుకుంటూ పోతోంది. అయితే కొందరు ఆ రామనామ స్మరణను ఆగి వింటున్నారు, పోతున్నారు. ఒకతను మాత్రం దానిని అపహాస్యం చేశాడు. అది గుర్తించిన ఒక జ్ఞాని అతనికి రామనామాన్ని ఉపదేశించి, 'దీన్నెప్పుడూ ప్రతిఫలం కోసం ఇచ్చుకోకు, నీకు వీలున్నప్పుడల్లా చెప్పుకో' అన్నాడు. సరేనన్నాడతను.

కాలక్రమంలో అతను చనిపోయాడు. యమదూతలు అతని ఆత్మను తీసుకుపోయి యమధర్మరాజు వద్ద నిలబెట్టారు. యమధర్మరాజు అతని పాపపుణ్యాల లెక్కలను పరిశీలించి, 'ఓమారు రామ నామాన్ని ఉచ్చరించావు. అందుకు నీకు ఏం కావాలో అడుగు?' అన్నాడు. అయితే అతనికి జ్ఞాని చెప్పిన 'ప్రతిఫలం కోసం ఇచ్చుకోకు' అన్నమాట గుర్తుకు వచ్చింది. కనుక అతను యమధర్మరాజుతో 'మీరు ఏమి ఇవ్వదలచుకున్నారో అది మీరే ఇవ్వండి. నేనుగా ఏదీ అడగను' అన్నాడు.

అతని మాటలకు యమధర్మరాజు విస్తుపోయాడు. రామనామానికి తాను ఎలా వెల కట్టగలనని అనుకున్నాడు. ఎందుకైనా మంచిది ఈ విషయమై ఇంద్రుడిని కలిసి ఆయననే ఓ నిర్ణయం తీసుకోమంటే సరి పోతుందనుకున్నాడు. అతనితోపాటు యమధర్మరాజు ఇంద్రుడి వద్దకు బయలుదేరబోయాడు. అయితే అతను ఓ షరతు విధించాడు. 'నేను మీతో రావాలంటే నన్ను పల్లకీలో తీసుకుపోవాలి. పైగా ఆ పల్లకీని మోసేవారిలో మీరొకరై ఉండాలి' అన్నాడు. ఇందుకు సమ్మతమైతే వస్తానన్నాడు. ఇతను నన్నో ఓ బోయిగా చూడాలనుకుంటున్నాడంటే రామనామ మహిమ ఘనంగానే ఉందన్న మాట అని అనుకున్నాడు యమధర్మరాజు. అందుకే అతను ఇలా షరతు విధిస్తున్నాడని భావించాడు. అందుకు సమ్మతించాడు. పల్లకీ మోసే బోయీలలో యమధర్మరాజు ఒకడయ్యాడు. ఇంద్రుడి వద్దకు చేరుకున్నారు.

యమధర్మరాజు తన రాక కారణం చెప్పాడు. అయితే ఇంద్రుడు రామనామ మహిమకు నేను వెలకట్ట లేనన్నాడు. మనమందరం కలిసి బ్రహ్మ దగ్గరకు పోదామన్నాడు. యమధర్మరాజుతోపాటు ఇంద్రుడు కూడా పల్లకీ మోస్తేనే తాను బ్రహ్మ వద్దకు వస్తానన్నాడతను. చేసేది లేక ఇంద్రుడు కూడా అందుకు సమ్మతించాడు. అందరూ కలిసి బ్రహ్మ వద్దకు వెళ్ళారు. అయితే బ్రహ్మ కూడా తాను రామనామ మహిమకు వెలకట్టలేననీ, వైకుంఠం వెళ్ళి విష్ణుమూర్తిని అడుగుదామనీ అన్నాడు. యమధర్మరాజు, ఇంద్రుడితోపాటు బ్రహ్మ కూడా పల్లకీ మోసే బోయీ లలో ఒకడయ్యాడు. అందరూ కలిసి వైకుంఠం వెళ్ళారు. విష్ణువుతో తామెందుకు వచ్చామో చెప్పారు. 'ఇతను ఒక్కసారి రామనామాన్ని ఉచ్చరించాడు, అందువల్ల అతనికి ఏ పుణ్యం దక్కుతుందో మీరే చెప్పా'లన్నారు యమ ధర్మరాజాదులు. 'ఈ జీవిని మీరందరూ కలిసి పల్లకీలో కూర్చోపెట్టి మోసుకువచ్చారు కదా, దీని నుంచే మీకు రామనామ మహిమ అర్థం కాలేదా?' అని ప్రశ్నిస్తూ ఆ ఆత్మను తనలో కలుపుకొన్నాడు విష్ణుమూర్తి.

రామనామమే అన్ని మంత్రాలకూ మూల మంత్రమన్నది తమిళ కవి కంబన్ మాట!

– యామిజాల జగదీశ్



రాజమహేంద్రవరం బోధనాస్పత్రి

అసలే డ్రామోజీ.. చేతిలో ఛీనాడు

ఓ కొత్త మెడికల్ కాలేజీ రాత్రికి రాత్రే వస్తుందా రామోజీ? **330 పడకలు.. టీచింగ్ ఆస్పత్రులుగా అభివృద్ధి తప్పనిసరి**

సాక్షి, అమరావతి: సూర్యుడిపై ఉమ్మేస్తే తన ముఖంపైనే పడుతుందన్న ఇంగితాన్ని కూడా 'ఛీనాడు' పట్టించుకోవడం మానేసింది! ఆ ముఖం తడుస్తున్నా సరే.. తుడుచుకునేందుకు కూడా అది సిద్ధపడటం లేదు!! నవ్విపోదురు గాక నాకేటి సిగ్గు.. నా ఇచ్చయేగాక నాకేటి వెరపు అన్నట్లుగా వలువలు వదిలేసి కోలాటమాడుతోంది! డ్రామోజీ సమర్పిస్తున్న దగుల్బాజీ కథనాల్లో తాజాగా రాష్ట్ర ఆరోగ్య రంగం కూడా చేరింది!! వైద్య ఆరోగ్యశాఖలో దాదాపు 49,000 పోస్టులను భర్తీ చేయకుండా ఖాళీగా వదిలేసిందంటే ప్రజారోగ్యంపై చంద్రబాబు సర్కారు ఎంత బరి తెగించి వ్యవహరించిందో ఈనాడుకు కనపడలేదా? ఆరోగ్యశ్రీని నీరుగార్చి దాదాపు రూ.700 కోట్ల మేర బకాయిలు పెట్టిన చంద్రబాబు నిర్వాకాలపై రామోజీ కలం కదలలేదు ఎందుకు? ఒకే ఏడాది ఐదు కొత్త మెడికల్ కాలేజీలు.. మూడేళ్లలో మొత్తం 17 వైద్య కళాశాలలు

ఏది నిజం?

ఆవిష్కృతమవుతుండటం.. వైద్య ఆరోగ్యశాఖలో 49,000 పోస్టుల భర్తీ.. రూ.17,000 కోట్ల వ్యయంతో ఆరోగ్య రంగానికి జవసత్వాలు కల్పిస్తున్న పరిస్థితి ఉమ్మడి రాష్ట్ర చరిత్రలో సైతం గతంలో ఎప్పుడూ లేదు. రాష్ట్రంలో 95 శాతం కుటుంబాలను ఆరోగ్యశ్రీ పరిధిలోకి తెచ్చి భరోసా ఇచ్చిన రాష్ట్ర ప్రభుత్వమూ ఆంధ్రప్రదేశ్ మినహా మరొకటి లేదు! కోవిడ్ మహమ్మారినీ ఆరోగ్యశ్రీ పరిధిలోకి తెచ్చి ఉచితంగా లక్షల మందికి చికిత్స అందించి ప్రాణాలు కాపాడిన మొదటి రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ మాత్రమే. తాజాగా ఫ్యామిలీ డాక్టర్ విధానం ద్వారా పల్లె ముంగిటకే డాక్టర్లను పంపుతున్న రాష్ట్రం కూడా మనదే. ఉన్నఫళంగా రాత్రికి రాత్రే రావటానికి మెడికల్ కాలేజీలేమీ రోడ్డు పక్కన కిళ్లీ షాపులు కాదు! ఓ కొత్త వైద్య కళాశాల ఏర్పాటు కావాలంటే కచ్చితంగా కొన్ని నిబంధనలు అనుసరించాలి. కనీసం 330 పడకల సదుపాయంతో ఆసుపత్రులు రెండేళ్ల పాటు సేవలందించాలి. పక్క రాష్ట్రానికి కొత్త మెడికల్ కాలేజీలు వచ్చాయంటూ రామోజీ గుండెలు బాదుకుంటున్నారు. మరి అక్కడ పదేళ్లుగా ఒకే ప్రభుత్వం అధికారంలో ఉందన్న విషయం గుర్తులేదా? అది కూడా అక్కడి ప్రభుత్వం మొదటి ఐదేళ్లు ఎంతో కృషి చేయడంతో రెండో విడతలో ఇప్పుడు 17 కొత్త మెడికల్ కాలేజీలు అందుబాటులోకి వచ్చాయి. మన రాష్ట్రంలో ఆరోగ్య రంగం నిస్తేజంగా మారటానికి గత సర్కారు నిర్వాకాలే కారణమన్న సంగతి తెలిసీ రామోజీ బురద చల్లే యత్నం చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి రాగానే ప్రజారోగ్యానికి అత్యంత ప్రాధాన్యమిచ్చారు. ఒకేసారి వేల సంఖ్యలో పోస్టులను భర్తీ చేసి ప్రభుత్వాస్పత్రుల్లో నాడు-నేడు ద్వారా అన్ని మౌలిక సదుపాయాలు కల్పించారు. మూడేళ్లలో 17 కొత్త మెడికల్ కాలేజీల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. వీటిలో ఐదు కొత్త మెడికల్ కాలేజీల్లో ఈ ఏడాదే ప్రవేశాలు కల్పించనున్నారు. ఇవన్నీ సహించలేక ఈనాడు అయోమయం కథనాలను తన పాఠకులకు వడ్డించింది!

తెలంగాణలో ఎలా అంటే?

తెలంగాణ ప్రభుత్వం 2014–19 మధ్య నాలుగు కొత్త వైద్య కళాశాలలను ఏర్పాటు చేయడంతోపాటు భవిష్యత్తులో మరిన్ని కళాశాలల ఏర్పాటుకు వీలుగా 25 సీహెచ్‌సీ, ఏరియా ఆస్పత్రులను జిల్లా ఆస్పత్రులుగా అప్‌గ్రేడ్ చేస్తూ పడకల సంఖ్యను పెంచింది. 2018లోగా ఈ మొత్తం ప్రక్రియను పూర్తి చేసింది. అప్పట్లో తీసుకున్న చర్యలు 17 కొత్త వైద్య కళాశాలలకు అనుమతులు వచ్చేందుకు దోహదపడ్డాయి. ఆ సమయంలో ఆంధ్రప్రదేశ్‌లో అధికారంలో ఉన్న నారా చంద్రబాబు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించారు. ప్రభుత్వ ఆరోగ్య వ్యవస్థను నిర్వీర్యం చేయడంతోపాటు కొత్త మెడికల్ కాలేజీల ఏర్పాటు దిశగా కనీసం ప్రయత్నించలేదు. కనీసం తెలంగాణను చూసైనా ఆస్పత్రుల్లో పడకలు పెంచిన పాపాన పోలేదు. కేంద్ర ప్రభుత్వంలో భాగస్వామిగా కొనసాగి కూడా రాష్ట్ర ప్రయోజనాలను నీరుగార్చారు. నాడు బీజేపీకి చెందిన కామినేని శ్రీనివాసరావు రాష్ట్ర వైద్య శాఖ మంత్రిగా ఉన్నారు. చంద్రబాబు ఉమ్మడి రాష్ట్రంలో తొమ్మిదేళ్లు సీఎంగా ఉన్నప్పుడు కూడా ప్రభుత్వ వైద్య రంగాన్ని పట్టించుకోకుండా ప్రైవేట్ వైద్య కళాశాలలను ప్రోత్సహిస్తూ వైద్య విద్యను వ్యాపారంగా మార్చేశారు.

సమర్థతతో సాధించిన సీఎం జగన్

అధికారంలోకి వచ్చాక ప్రతి పార్లమెంట్ నియోజకవర్గానికి ఒక వైద్య కళాశాలను ఏర్పాటు చేస్తామని 2019 ఎన్నికలకు ముందు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఆ మేరకు మాట నెరవేరుస్తూ 17 కొత్త వైద్య కళాశాలల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. జాతీయ మెడికల్ కౌన్సిల్ (ఎన్ఎంసీ) నిబంధనలకు అనుగుణంగా ప్రణాళికాబద్ధంగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. తొలుత ఐదు జిల్లా ఆస్పత్రులను బోధనాస్పత్రులుగా అభివృద్ధి చేయడం ద్వారా రాజమహేంద్రవరం, ఏలూరు, విజయనగరం, నంద్యాల, మచిలీపట్నం వైద్య కళాశాలలకు అనుమతులను రాబట్టారు. దీంతో ఈ ఏడాది 750 ఎంబీబీఎస్ సీట్లు అదనంగా అందుబాటులోకి వస్తున్నాయి. వచ్చే ఏడాది పాడేరు, పులివెందుల, ఆదోనిలో కొత్త మెడికల్ కాలేజీల ఏర్పాటుకు వీలుగా అక్కడి ఆస్పత్రుల్లో పడకలు పెంచేలా ఇప్పటికే ప్రభుత్వం చర్యలు తీసుకుంది. దీంతో 2024–25లో మరో మూడు కొత్త వైద్య కళాశాలలు, ఆ తర్వాత ఏడాది మిగిలిన 9 వైద్య కళాశాలలను అందుబాటులోకి తెచ్చేలా సన్నద్ధమయ్యారు. తద్వారా మూడేళ్లలో 17 కొత్త మెడికల్ కాలేజీలు మన రాష్ట్రంలోనూ ఏర్పాటు కానున్నాయి.



విజయనగరం బోధనాస్పత్రి



మచిలీపట్నం బోధనాస్పత్రి

వైద్య రంగం అభివృద్ధికి సాక్ష్యాలివిగో

- వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకాన్ని బలోపేతం చేయడం ద్వారా ప్రజారోగ్యానికి సీఎం జగన్ రక్షణగా నిలిచారు. గత నాలుగేళ్లలో ఆరోగ్యశ్రీ, ఆరోగ్య ఆసరా పథకాల కోసం ప్రభుత్వం రూ.8,302.47 కోట్లు వెచ్చించింది. ఆరోగ్యశ్రీ ద్వారా 36,19,741 మంది, ఆసరా ద్వారా 16,20,584 మంది లబ్ధి పొందారు. రూ.5 లక్షల లోపు వార్షికాదాయం ఉన్న కుటుంబాలన్నింటినీ పథకం పరిధిలోకి తేవడంతో 1.4 కోట్లకు పైగా కుటుంబాలకు ఆరోగ్యశ్రీ వర్తిస్తోంది. 2014–19 మధ్య ఆరోగ్యశ్రీలో కేవలం 1,059 ప్రొసీజర్లు మాత్రమే అందుబాటులో ఉండగా ఇప్పుడు ఏకంగా 3,255కి పెరిగాయి. ఆరోగ్య ఆసరా ద్వారా శస్త్ర చికిత్స అనంతరం రోగి కోలుకునే సమయంలో గరిష్ఠంగా రూ.ఐదు వేల వరకు ప్రభుత్వం సాయం అందిస్తోంది.
- సీఎం జగన్ అధికారంలోకి రాగానే మండలానికి ఒకటి చొప్పున 104, 108 వాహనాలను సమకూర్చారు. 768 అంబులెన్స్‌లతో 2020లో సేవలను విస్తరించారు. తాజాగా మరో 146 అంబులెన్స్‌లను కొనుగోలు చేశారు. ప్రస్తుతం రోజుకు సగటున 3,300 మంది అంబులెన్స్ సేవలను వినియోగించుకుంటున్నారు. 104 ఎంఎంయూలను తొలుత మండలానికి ఒకటి చొప్పున 676 వాహనాలను సమకూర్చారు. ఫ్యామిలీ డాక్టర్ విధానం అమలులోకి రావడంతో 104 ఎంఎంయూలు మరో 256 వాహనాలను అందుబాటులోకి తెచ్చారు.
- గతేడాది ఏప్రిల్ నుంచి 500 కొత్త వాహనాలతో 'డాక్టర్ వైఎస్సార్ తల్లిబిడ్డ ఎక్స్‌ప్రెస్' సేవలను విస్తరించారు. రోజుకు సగటున 631 మంది బాలింతలను క్షేమంగా ఇళ్లకు చేరుస్తున్నారు.
- గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్య సంరక్షణ లక్ష్యంగా దేశంలో ఎక్కడా లేని విధంగా ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని ప్రవేశపెట్టారు. పీహెచ్‌సీ వైద్యులు నెలకు రెండుసార్లు 104 మొబైల్ మెడికల్ యూనిట్(ఎంఎంయూ)తో పాటు గ్రామాలను సందర్శించి అక్కడే వైద్య సేవలు అందిస్తున్నారు.

పీజీ సీట్లు పెరిగాయ్..

కొత్త మెడికల్ కాలేజీలకు అనుమతులు సాధించడంతోపాటు ప్రస్తుతం ఉన్న 11 వైద్య కళాశాలల్లో పీజీ సీట్లు పెరిగేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఎన్ఎంసీ నిబంధనలకు అనుగుణంగా వైద్య కళాశాలల్లో ప్రొఫెసర్లు, అసిస్టెంట్, అసోసియేట్ ప్రొఫెసర్లను సమకూర్చేందుకు ఖాళీల భర్తీతో పాటు కొత్తగా పోస్టులను సృష్టించి నియామకాలు చేపట్టింది. ఇతర మౌలిక సదుపాయాలను కూడా కల్పిస్తున్నారు. దీంతో 2019 వరకూ 937 మాత్రమే పీజీ సీట్లు ఉండగా గత నాలుగేళ్లలో ఏకంగా 768 సీట్లను రాబట్టగలిగారు. దీంతో ప్రస్తుతం రాష్ట్రంలోని ప్రభుత్వ వైద్య కళాశాలల్లో పీజీ సీట్లు 1705కి పెరిగాయి. పీజీ సీట్లను మరింత పెంచడం ద్వారా రాష్ట్రంలో స్పెషలిస్ట్ వైద్యులను అందుబాటులోకి తెచ్చేలా ప్రభుత్వం ప్రణాళికబద్ధంగా ముందుకు వెళుతోంది.

వైద్యరంగంలో ఆదర్శంగా ఏపీ



చంద్రబాబు అసమర్థతతో వైద్య రంగంలో రాష్ట్రం వెనుకబాటుకు గురైంది. ఆయన అధికారంలో ఉండగా ఆరోగ్య రంగాన్ని నీరుగార్చారు. ప్రజారోగ్యం పట్ల చిత్తశుద్ధితో ముఖ్యమంత్రి జగన్ తీసుకుంటున్న చర్యలతో వైద్య రంగంలో ఏపీ రోల్ మోడల్‌గా ఆవిష్కృతం అవుతోంది. తెలంగాణలో తొమ్మిదేళ్లలో 17 ప్రభుత్వ మెడికల్ కళాశాలలు ఏర్పాటయ్యాయి. తెలంగాణ ప్రభుత్వం తొలి ఐదేళ్లలో కనీసం ఒక్కటంటే ఒక్క వైద్య కళాశాల తీసుకురాలేకపోయిన విషయాన్ని ఈనాడు ఎందుకు విస్మరించింది? ఏపీలో ఒకేసారి 5 కొత్త మెడికల్ కాలేజీలు ఈ ఏడాదే అందుబాటులోకి వస్తున్నాయి. మిగిలినవి రెండేళ్లలో ఏర్పాటు చేస్తాం. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఒక్క పోస్టు కూడా ఖాళీగా ఉండకుండా సీఎం జగన్ చర్యలు చేపట్టారు. ఇప్పుడు విమర్శలు చేస్తున్న రామోజీరావుకు చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు వైద్య రంగానికి ఏం చేశారో రాసే ధైర్యముందా?

– విడదల రజని, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి

నాలుగేళ్లలో 48,639 పోస్టుల భర్తీ

వైద్య సిబ్బంది	ఎన్ని పోస్టులు?
స్పెషలిస్ట్ వైద్యులు	3,899
మెడికల్ ఆఫీసర్‌లు	2,088
స్టాఫ్ నర్సులు	5,777
ఏఎన్ఎంలు	13,540
ఎంఎల్‌హెచ్‌పీలు	10,032
పారా మెడికల్ సిబ్బంది	9,751
డీఈఓలు	249
ఇతరులు	3,303

నేడు వైద్య రంగం బలోపేతం ఇలా

అంశం	నిధులు రూ.కోట్లలో
పలాస కిడ్నీ రీసెర్చ్ సెంటర్ నిర్మాణం	50
సీహెచ్‌సీలు, ఏరియా ఆస్పత్రుల అభివృద్ధి	1,223.28
ప్రస్తుతం ఉన్న వైద్య కళాశాలల అభివృద్ధి	3,820
ఎ. కడప క్యాన్సర్ ఆస్పత్రి ఏర్పాటు	
బి. కడప మెంటల్ ఇన్‌స్టిట్యూట్ ఏర్పాటు	
సి. కడప సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణం	272
17 కొత్త వైద్య కళాశాలల నిర్మాణం	8,480
గిరిజన మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల నిర్మాణం	246
వైఎస్సార్ హెల్త్ క్లినిక్స్ నిర్మాణం	1,692
వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రాల నిర్మాణం	374.61
పీహెచ్‌సీల నిర్మాణం	664.96
మొత్తం	16,822.85





తుది మెరుగులు దిద్దుకుంటున్న మచిలీపట్నం వైద్య కళాశాల భవనాలు



పులివెందులలో కొత్త వైద్య కళాశాల ఏర్పాటులో భాగంగా నిర్మిస్తున్న బోధనాస్పత్రి ఓపీడీ భవనం





కొత్తగా ఏర్పాటైన రాజమండ్రి వైద్య కళాశాలలోని లోపలి దృశ్యాలు

పాడెకు విద్యుత్ తీగలు తగిలి ముగ్గురి దుర్మరణం

- బంధువు అంత్యక్రియలు నిర్వహించబోతే ముంచుకొచ్చిన మృత్యువు
- స్వల్పగాయాలతో బయటపడ్డ ఏడుగురు


మునెప్ప


రవీంద్రన్


తిరుపతి

కుప్పంరూరల్: సమీపబంధువు అంత్యక్రియలకు వచ్చి మృతదేహాన్ని తీసుకెళ్తున్న పాడె విద్యుత్ తీగలకు తగిలి ముగ్గురు దుర్మరణం పాలైన సంఘటన శుక్రవారం చిత్తూరు జిల్లా కుప్పం మండలం తంబిగానిపల్లి వద్ద విషాదం నింపింది. ఈ ప్రమాదంలో ఏడుగురు స్వల్పగాయాలతో బయటపడ్డారు. తంబిగానిపల్లి ఎస్సీ కాలనీకి చెందిన రాణెమ్మ (70) అనారోగ్యంతో మృతి చెందింది. ఆమె అంత్యక్రియలు శుక్రవారం సాయంత్రం బంధువులతో కలిసి నిర్వహించారు. రాణెమ్మ మృతదేహాన్ని తేరు పాడెపై ఉంచి శ్మశాన వాటికకు తరలించారు. శ్మశాన వాటికలోకి అడుగుపెట్టగానే తేరు పాడెకు ఉన్న ఇనుపపైపులు తక్కువ ఎత్తులోని విద్యుత్ తీగలకు తగిలి పాడె మోస్తున్న పది మంది విద్యుదాఘాతంతో కుప్పకూలిపోయారు. వీరిలో గుంటూరుకు చెందిన తిరుపతి (36), తంబిగానిపల్లి ఎస్సీ కాలనీకి చెందిన మునెప్ప (41) అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. తంబిగానిపల్లి ఎస్సీ కాలనీకి చెందిన రవీంద్రన్ (37) ఏరియా ఆస్పత్రిలో మృతిచెందాడు. మిగిలిన ఏడుగురు స్వల్పగాయాలతో తేరుకుని ఇళ్లకు వెళ్లిపోయారు. కుప్పం సీఐ శ్రీధర్, ఎస్ఐ శివకుమార్ అక్కడికి చేరుకుని మృతదేహాలను ఆస్పత్రికి తరలించారు. మృతదేహాలను కుప్పం ఇన్‌చార్జి డీఎస్పీ సుధాకర్‌రెడ్డి పరిశీలించారు. ఆస్పత్రి వద్ద బాధిత కుటుంబసభ్యుల ఆర్తనాదాలు అందరికంట తడిపెట్టించాయి.

వెలగచర్లలో రెండు శాసనాలు లభ్యం


వెలగచర్లలో లభించిన శాసనం


వెలగచర్లలో లభించిన శిల్పం, శాసనం

కడప కల్చరల్: అన్నమయ్య జిల్లా రాజంపేట సమీపంలోని పెనగలూరు మండలం వెలగచర్ల గ్రామం అగ్రహారం ప్రాంతంలో రెండు చిన్న శాసనాలు లభించినట్లు కేంద్ర పురావస్తుశాఖ అధికారి ఆచార్య మునిరత్నం రెడ్డి తెలిపారు. ఈ శాసనాలను కడప నగరానికి చెందిన ఇంటాక్ సభ్యుడు, ఏపీజీబీ రీజినల్ మేనేజర్ శైలేంద్రనాథ్ గుర్తించి ఫొటోలు పంపారని చెప్పారు. వాటిని పరిశీలించామని, అవి 8, 9 శతాబ్దాలకు చెందిన తెలుగుభాషలో ఉన్నాయన్నారు. ఒక శాసనం స్థానిక నాయకుడు వేలుపేయరాజు మరణానికి సంబంధించినదని, ఈ శాసనం రాతిపై ఆయన శిల్పం కూడా ఉందని తెలిపారు. రెండవ శాసనం ఎక్కువ శాతం ధ్వంసమై అక్షరాలు కనిపించకుండా అలికేసినట్లుగా ఉన్నాయని, స్థానిక నాయకుడైన సికిందరాజుకు సంబంధించిన వివరాలు ఉన్నాయని వివరించారు.

ఓర్వలేకే బాబు మతి చలించిన మాటలు

- 992వ రోజు రిలే దీక్షలో బహుజన నాయకులు

తాడికొండ: బహుజనులు ఇళ్ల పట్టాలు, పక్కా ఇళ్లు నిర్మించుకోవడంతోపాటు నేరుగా సంక్షేమాన్ని తమ ఖాతాల ద్వారా అందుకుంటూ ఆర్థికంగా బలోపేతం అవడాన్ని చూసి ఓర్వలేక బాబు మతి చలించిన మాటలు మాట్లాడుతున్నాడని బహుజన పరిరక్షణ సమితి నాయకులు మండిపడ్డారు. తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శుక్రవారం నాటికి 992వ రోజుకు చేరాయి. పలువురు మాట్లాడుతూ.. 14 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు పేదలను నిరుపేదలుగా మార్చి ఏమార్చి ఓట్లు వేయించుకుని నిలువునా మోసం చేసి ఆర్థికంగా పతనం చేశాడన్నారు. అయితే సీఎం జగన్ పాలనలో నేడు బహుజనులు అన్ని రకాలుగా ఆర్థికంగా బలోపేతం అవుతుంటే ఆయనకు అక్కసు పట్టుకుందని విమర్శించారు. వికేంద్రీకరణ ద్వారా అభివృద్ధి ఫలాలను రాష్ట్రంలో అందరికీ సమానంగా అందించేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న నిర్ణయానికి 5 కోట్ల మంది ప్రజలు సంపూర్ణ మద్దతిస్తున్నారన్నారు.

భక్తులు భగవంతుణ్ణి దర్శించుకునే ముందు ఆయా క్షేత్రాల్లో కొబ్బరి కాయలు కొట్టడం ఆనవాయితీ. కానీ.. మరాఠీల ఇలవేల్పుగా పూజలందుకుంటున్న పిఠాపురంలోని శ్రీపాద శ్రీవల్లభ మహాసంస్థానం దత్త క్షేత్రంలో మాత్రం కొబ్బరి కాయలను ఎట్టి పరిస్థితుల్లోనూ కొట్టరు. భక్తులు తమ కోర్కెలు నెరవేరాలని కోరుకుంటూ టెంకాయను దత్త క్షేత్రంలోని మేడిచెట్టుకు తాడుతో వేలాడదీయడం ప్రాచీన ఆచారంగా వస్తోంది.

అక్కడ టెంకాయ కొట్టరు.. కడతారు!


ఆలయంలో ఔదంబరీ వృక్షానికి కొబ్బరికాయ కడుతున్న భక్తురాలు

మరాఠీల ఇలవేల్పుగా శ్రీపాద శ్రీవల్లభ

ఏటా 20 లక్షలకు పైగా మహారాష్ట్ర భక్తుల రాక

ఆలయానికి ఏటా రూ.15 కోట్ల ఆదాయం


శ్రీపాద శ్రీవల్లభ మహా సంస్థానంలో స్వామివారు

పిఠాపురం: సాధారణంగా మన రాష్ట్రంలోని భక్తులు తీర్థయాత్రల పేరిట మహారాష్ట్రలోని హిందూ క్షేత్రాలను దర్శించుకోవడం పరిపాటి. కానీ.. మహారాష్ట్ర భక్తులు మాత్రం తమ ఇలవేల్పుగా భావించే శ్రీపాద శ్రీవల్లభ స్వామి దర్శనం నిమిత్తం ఏపీలోని కాకినాడ జిల్లా పిఠాపురం క్షేత్రానికి పోటెత్తుతుంటారు. ఇక్కడ కొలువైన శ్రీపాద శ్రీవల్లభ మహా సంస్థానానికి వచ్చే మరాఠా భక్తుల సంఖ్య ఏటా పెరుగుతోంది. 2018వ సంవత్సరం వరకు కేవలం పర్వ దినాలలో మాత్రమే వచ్చే మరాఠీ భక్తులు ఆ తరువాత నుంచి అన్ని రోజుల్లో ఇక్కడకు విచ్చేస్తున్నారు. అప్పట్లో ఏటా సుమారు 5 లక్షల వరకు భక్తులు రాగా.. రెండేళ్లుగా ఈ సంఖ్య 20 లక్షల వరకు పెరిగింది. ఆలయంలో దర్శనంతో పాటు భోజన, వసతి సముదాయాలు అన్నీ ఉచితంగా కల్పిస్తుండగా.. కేవలం కానుకల ద్వారానే ఏటా రూ.15 కోట్ల ఆదాయం లభిస్తున్నట్టు ఆలయ అధికారులు తెలిపారు. మరాఠీ భక్తుల రాక పెరగడంతో పిఠాపురంలో ఒక్కసారిగా రవాణా, హోటల్స్, వసతి రంగాల వ్యాపారం భారీగా పెరిగింది. కేవలం మరాఠీ భక్తుల విజ్ఞప్తి మేరకు పిఠాపురం రైల్వే స్టేషన్‌లో కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌కు హాల్ట్ ఇచ్చింది రైల్వే శాఖ. దీంతోపాటు అనేక ప్రధాన రైళ్లకు ఇక్కడ హాల్ట్ కల్పించారు.

శ్రీపాద వల్లభస్వామి జన్మించిన క్షేత్రమిది



అత్రి మహాముని, అనసూయ దంపతులకు వర ప్రభావం వల్ల బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు ఒకే అవతారంలో దత్తాత్రేయుడుగా జన్మించినట్టు ప్రతీతి. ఆ స్వామిని 'దిగంబరా.. దిగంబరా.. శ్రీపాద వల్లభ దిగంబరా' అంటూ భక్తులు సేవిస్తుంటారు. దత్తాత్రేయుడి అవతారంలో మొదటిదైన శ్రీపాద శ్రీవల్లభ స్వామి పిఠాపురంలో పుట్టి పెరగడం వల్ల ఈ ప్రదేశానికి శ్రీపాద శ్రీవల్లభ మహా సంస్థానం అనే పేరొచ్చింది. భక్తులు తమ కోర్కెలు నెరవేరాలని కోరుకుంటూ టెంకాయ కొట్టడానికి బదులు దత్త క్షేత్రంలోని ఔదంబరి వృక్షానికి (మేడిచెట్టు) వేలాడదీస్తారు.

ఏటా పది సార్లు అయిన వస్తాం



ఆయన మా ఇలవేల్పు. దేశంలో ఎక్కడికక్కడ దత్తాత్రేయుడి ఆలయాలు ఉన్నా ఆయన జన్మస్థలమైన పిఠాపురం మాకు మహా పుణ్యక్షేత్రం. మా రాష్ట్రం నుంచి దత్తాత్రేయుడి భక్తులు ఏడాదికి ఒక్క రోజైనా వస్తారు. కనీసం మూడు రోజులైనా ఇక్కడ ఉండి ఆయనకు సేవ చేసుకుని వెళుతుంటాం. కోరిన కోర్కెలు తీర్చే స్వామిగా మరాఠీలకు పెద్ద నమ్మకం.

– ఎం.సునిల్, ఔరంగాబాద్, మహారాష్ట్ర

మరాఠీ హిందువులకు మహా క్షేత్రమిది



మాకు అత్యంత పవిత్రమైన పుణ్యక్షేత్రం ఇదే. కుటుంబ సభ్యులంతా కలిసి దర్శించుకునే క్షేత్రం కూడా ఇదే. మా రాష్ట్రంలో దత్తాత్రేయుడి ఆలయాలు ఉన్నా ఆయన సంచరించిన పవిత్ర ప్రదేశంగా పిఠాపురం శ్రీపాద శ్రీవల్లభ మహా సంస్థానమే ముఖ్యం. ఏటా వీలైనన్ని సార్లు వచ్చి స్వామిని దర్శించుకుంటాం.

– భారతి విద్యా చౌదరి, నాగ్‌పూర్, మహారాష్ట్ర

భక్తుల సంఖ్య పెరిగింది



గతంలో కేవలం పర్వ దినాలలోనే మరాఠీ భక్తులు వచ్చేవారు. ఇటీవల కాలంలో భక్తుల సంఖ్య గణనీయంగా పెరిగింది. భక్తుల కోసం అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నాం. మూడేళ్ల క్రితం వరకు ఏటా రూ.5 కోట్ల నుంచి రూ.8 కోట్ల ఆదాయం వచ్చేది. ఇప్పుడు రూ.15 కోట్ల వరకు వస్తోంది. ఇతర దేశాల భక్తులు కూడా ఇక్కడకు వస్తున్నారు. ఇక్కడ గో సేవకు అధిక ప్రాధాన్యత ఉంది.

– రెడ్డెం జనార్ధనరావు, చైర్మన్, శ్రీపాద శ్రీవల్లభ మహా సంస్థానం

మరాఠీలే ఎక్కువ వస్తారు



ఈ క్షేత్రానికి వచ్చే భక్తుల్లో 90 శాతం మరాఠీలే. అన్ని సేవల్లోనూ స్వయంగా పాల్గొంటారు. దత్తాత్రేయుని అవతారాల్లో ప్రథమ అవతారమైన శ్రీపాదుడు 1320లో ఇక్కడ జన్మించినట్టు గురు చరిత్రలో చెప్పబడింది. మరాఠీలకు ఇలవేల్పు కావడంతో కనీసం సంవత్సరంలో ఒక్కసారైనా ఇక్కడకు వచ్చి వెళుతుంటారు.

– ద్విభాష్యం సుబ్రహ్మణ్యశర్మ, ఆలయ అర్చకుడు

శ్రీవారి సేవలో సుప్రీంకోర్టు జడ్జి మిశ్రా, హైకోర్టు తాత్కాలిక సీజే


తిరుమల ఆలయం వెలుపల సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, చిత్రంలో వైవీ సుబ్బారెడ్డి


ఆలయం వెలుపల ఏపీ హైకోర్టు తాత్కాలిక సీజే జస్టిస్ ఏవీ శేష సాయి, హైకోర్టు జడ్జి జస్టిస్ రవినాథ్ తిలహరి

తిరుమల / ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామిని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, ఏపీ హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఏవీ శేషసాయి శుక్రవారం దర్శించుకున్నారు. అనంతరం వీరికి ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించారు. అధికారులు లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు. శ్రీవారిని దర్శించుకున్న వారిలో ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రవినాథ్ తిలహరి, సినీ నటుడు శర్వానంద్ ఉన్నారు.

దుర్గమ్మ సన్నిధిలో..

విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా, రాష్ట్ర హైకోర్టు తాత్కాలిక సీజే జస్టిస్ ఆకుల వెంకట శేషసాయి దంపతులు దర్శించుకున్నారు. ఆలయ డీఈవో పట్టెం గురుప్రసాద్, ఈఈ కె.వి.ఎస్. కోటేశ్వరరావు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, పట్టు వస్త్రాలను అందజేశారు.

19న శ్రీవారి ఆర్జిత సేవా టికెట్ల సెప్టెంబర్ నెల కోటా విడుదల



తిరుమల: టీటీడీ షెడ్యూల్ ప్రకారం తిరుమల శ్రీవారి ఆర్జిత సేవలు, దర్శన టికెట్ల సెప్టెంబర్ నెల కోటాను ఈ నెల 19న విడుదల చేయనుంది. భక్తులు https://tirupatibalaji.ap.gov.in వెబ్‌సైట్‌లో వీటిని బుక్ చేసుకోవచ్చు. అలాగే సుప్రభాతం, తోమాల, అర్చన, అష్టదళపాదపద్మారాధన ఆర్జిత సేవల ఆన్‌లైన్ లక్కీడిప్ కోసం ఈ నెల 19వ తేదీ ఉదయం 10 గంటల నుంచి 21వ తేదీ ఉదయం 10 గంటల వరకు నమోదుకు అవకాశం ఉంది. లక్కీడిప్‌లో టికెట్లు పొందిన వాళ్లు సొమ్ము చెల్లించి వాటిని ఖరారు చేసుకోవాల్సి ఉంటుంది. కల్యాణోత్సవం, ఆర్జిత బ్రహ్మోత్సవం, ఊంజల్ సేవ, సహస్రదీపాలంకార సేవా టికెట్లను 22వ తేదీ ఉదయం 10 గంటలకు విడుదల చేస్తారు. కల్యాణోత్సవం, ఆర్జిత బ్రహ్మోత్సవం, ఊంజల్ సేవ, సహస్రదీపాలంకార సేవ వర్చువల్ సేవల కోటాను, వాటికి సంబంధించిన దర్శన టికెట్ల కోటాను 22వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు విడుదల చేస్తారు. అంగప్రదక్షిణం టోకెన్ల కోటాను ఈ నెల 23వ తేదీ ఉదయం 10 గంటలకు విడుదల చేస్తారు.

22న శ్రీవారి పవిత్రోత్సవాల సేవా టికెట్లు విడుదల:

తిరుమల శ్రీవారి ఆలయంలో ఆగస్టు 27 నుంచి 29వ తేదీ వరకు జరుగనున్న పవిత్రోత్సవాల సేవా టికెట్ల కోటాను ఈ నెల 22వ తేదీ ఉదయం 10 గంటలకు టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది.

తిరుపతిలో భారీ అగ్నిప్రమాదం

లావణ్య ఫొటో ఫ్రేమ్స్ దుకాణం దగ్ధం

- 5 గంటలు శ్రమించి మంటల్ని అదుపులోకి తెచ్చిన ఫైర్ సిబ్బంది
- రూ.25 కోట్ల నష్టం వాటిల్లిందన్న బాధితుడు


మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

తిరుపతి క్రైం: తిరుపతిలోని గోవిందరాజస్వామి ఆలయం సమీపానగల లావణ్య ఫొటో ఫ్రేమ్స్ దుకాణంలో శుక్రవారం భారీ అగ్నిప్రమాదం జరిగింది. ఉదయం 10:30 గంటల సమయంలో దుకాణం గ్రౌండ్ ఫ్లోర్‌లో స్విచ్ బోర్డు వద్ద షార్ట్‌సర్క్యూట్ కారణంగా స్వల్పస్థాయిలో ప్రారంభమైన మంటలు ఒక్కసారిగా భవనం మొత్తం వ్యాపించాయి. భవనం ఉన్న నాలుగు అంతస్తుల్లోను చెక్కతో చేసే ఫొటో ఫ్రేములు అధికంగా ఉండడంతో మంటలు వేగంగా వ్యాపించాయి. సిబ్బంది బయటకు పరుగులు తీశారు. బయటకు భారీ అగ్నికీలలు ఎగశాయి. దట్టమైన పొగ అలుముకోవడంతో ఆలయం సమీపంలోని ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. ఆలయ పరిసర ప్రాంతాల్లోని ప్రజలను ఖాళీ చేయించారు. అగ్నిమాపకశాఖ అధికారులు పది ఫైరింజన్లు, స్కై లిఫ్ట్ సహాయంతో సుమారు ఐదుగంటలు కష్టపడి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ఫైరింజన్ల కోసం టీటీడీ, మున్సిపల్ ట్యాంకర్లతో నీరు సరఫరా చేశారు. ఈ ప్రమాదంతో దాదాపు రూ.25 కోట్ల మేర నష్టం వాటిల్లిందని దుకాణం యజమాని శంకర్‌నాయుడు తెలిపారు. విలువైన ఫ్రేములు, బంగారంతో చేసిన ఫొటోలు, విలువైన పత్రాలు కాలిపోయాయని చెప్పారు.

గోవిందరాజస్వామి రథం కాలిపోయిందంటూ విషప్రచారం

అగ్నిప్రమాదం సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, టీటీడీ ఈవో ధర్మారెడ్డి వెంటనే అక్కడికి చేరుకుని సహాయక చర్యలను వేగవంతం చేయించారు. ఈ సమయంలో గోవిందరాజస్వామి ఆలయ రథం కాలిపోయిందంటూ టీడీపీ నేతలు విషప్రచారం చేస్తున్నారని ఎమ్మెల్యే మండిపడ్డారు. ఇది టీడీపీ సానుభూతిపరుడి దుకాణమే అయినా తాము రాజకీయం చేయడం లేదని, మంటలు ఆర్పేందుకు సహాయం చేస్తున్నామని చెప్పారు. టీడీపీ నేతలు ఈ మంటల్లో చలికాచుకునే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. టీటీడీ ఈవో ధర్మారెడ్డి మాట్లాడుతూ గోవిందరాజస్వామి రథానికి ఎలాంటి ప్రమాదం జరగలేదని చెప్పారు. సోషల్ మీడియాలో వస్తున్న వదంతుల్ని నమ్మవద్దని కోరారు.

కువైట్‌లో అనారోగ్యంతో సఖినేటిపల్లి అవ్వ అవస్థలు

నకిలీ వీసాతో పంపి మోసం చేసిన ఏజెంట్

- అఖామా లేకుండానే 20 ఏళ్లుగా అక్కడే జీవనం
- హౌస్ మెయిడ్స్‌కు దుస్తులు అమ్ముతూ జీవనోపాధి
- అస్వస్థతకు గురైన అవ్వకు ఆప్తుడై వ్యవహరించిన ముంబై యువకుడు
- ఏపీఎన్ఆర్టీఎస్ సాయంతో స్వస్థలానికి చేరిన అవ్వ పద్మావతి


మూరి పద్మావతి

కడప కార్పొరేషన్: కువైట్‌లో అనారోగ్యానికి గురైన సఖినేటిపల్లి అవ్వకు ముంబైకి చెందిన యువకుడు ఆప్తుడై వ్యవహరించాడు. ఆమె ఆరోగ్యం కుదుటపడే వరకు సపర్యలు చేసి స్వస్థలం చేరేవరకు తోడుగా నిలిచాడు. మానవత్వానికి కులం, మతం అడ్డురావని నిరూపించాడు. వివరాల్లోకి వెళితే... తూర్పు గోదావరి జిల్లా, రాజోలు మండలం, సఖినేటిపల్లికి చెందిన మూరి పద్మావతి 20 ఏళ్ల కిందట జీవనోపాధి కోసం కువైట్ వెళ్లేందుకు ఓ ఏజెంట్‌ను ఆశ్రయించింది. అతను అన్నమయ్య జిల్లా రాజంపేట అడ్రస్‌తో పాస్‌పోర్టు తయారు చేయించి, నకిలీ వీసాతో ఆమెను కువైట్ పంపించాడు. పద్మావతికి అఖామా(కువైట్ వర్క్ అండ్ రెసిడెన్స్ పర్మిట్) లేకున్నా కువైట్‌లో ఇళ్లలో పనిచేసే హౌస్ మెయిడ్స్‌కు దుస్తులు అమ్ముతూ ఇన్నాళ్లుగా జీవనం సాగించింది. కరోనా సమయంలో అనారోగ్యానికి గురైంది. అఖామా లేని కారణంగా ఆస్పత్రికి కూడా పోలేని పరిస్థితి ఏర్పడింది. దీంతో పక్క గదిలో ఉంటున్న ముంబైకి చెందిన డ్రైవర్ మహమ్మద్ యూనుస్ అనే యువకుడు తనకు తెలిసిన డాక్టర్లకు చెప్పి మందులు ఇప్పిస్తూ పద్మావతి ఆరోగ్యాన్ని కాపాడుతూ వచ్చాడు. అనారోగ్యానికి గురైన పద్మావతి తనను స్వదేశానికి పంపించాలని వేడుకోవడంతో ఆమెను ఎలాగైనా సఖినేటిపల్లి చేర్చాలని మహమ్మద్ యూనుస్ పలువురిని విచారిస్తూ ఏపీఎన్ఆర్టీఎస్ సభ్యుల దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లాడు. వైఎస్సార్‌సీపీ నాయకులు ఆకుమూర్తి లాజరస్, ఏపీఎన్ఆర్టీఎస్ డైరెక్టర్ బీహెచ్ ఇలియాస్, కువైట్ కన్వీనర్ ఎం.బాలిరెడ్డి, రీజినల్ కోఆర్డినేటర్ ఎన్.మహేష్‌రెడ్డి తదితరులు పద్మావతి ఉన్న చోటుకు వెళ్లి ఆమెను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈ విషయాన్ని భారత రాయబార కార్యాలయ అధికారుల దృష్టికి తీసుకెళ్లి ఆమెను ఇండియాకు పంపే ఏర్పాట్లు చేశారు. పద్మావతికి టికెట్ ఖర్చులు స్వయంగా భరించిన యూనుస్ హైదరాబాద్ వరకూ ఆమెకు తోడుగా వచ్చాడు. ఈ నెల 15వ తేదీ అర్ధరాత్రి 12.00 గంటలకు వారు కువైట్‌లో బయలుదేరి 16వ తేదీ మధ్యాహ్నం 1.30 గంటలకు హైదరాబాద్ చేరుకున్నారు. హైదరాబాద్ నుంచి ఆమె స్వస్థలం వరకూ ఏపీఎన్ఆర్టీఎస్ వారు ఉచిత అంబులెన్స్ ఏర్పాటు చేశారు. కన్నబిడ్డలే తల్లిదండ్రులను పట్టించుకోని ఈ రోజుల్లో దేశం కాని దేశంలో పద్మావతికి తన తల్లిలా సపర్యలు చేసి, హైదరాబాద్ వరకు తీసుకువచ్చిన యూనుస్‌ను పలువురు అభినందించారు. ఈ సందర్భంగా యూనుస్ మాట్లాడుతూ పద్మావతిని ఇండియాకు పంపించాలని చాలామందిని అభ్యర్థించానని, ఆమెపై కేసులు ఉండటం, అరెస్ట్ వారెంట్ జారీ అవ్వడం వల్ల ఎవరూ ఏమీ చేయలేకపోయారన్నారు. ఏపీఎన్ఆర్టీఎస్ సభ్యుల చొరవతో ఆమెను ఇండియాకు తీసుకురావడం సంతోషంగా ఉందన్నారు. ఇందుకు సహకరించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, ఏపీఎన్ఆర్టీఎస్ చైర్మన్, సీఈవో, డైరెక్టర్లకు కృతజ్ఞతలు తెలియజేశాడు.

వందే భారత్‌లో మొరాయించిన ఏసీలు

- ఉక్కపోతతో ప్రయాణికుల ఇబ్బందులు
- విజయవాడలో మూడున్నర గంటలు నిలిచిన రైలు


విజయవాడ స్టేషన్‌లో నిలిచి పోయిన వందే భారత్ ఎక్స్‌ప్రెస్

రైల్వేస్టేషన్ (విజయవాడపశ్చిమ): విశాఖపట్నం–సికింద్రాబాద్ (20833) వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలులో సాంకేతిక సమస్య తలెత్తడంతో విజయవాడ స్టేషన్‌లో మూడున్నర గంటల పాటు నిలిచి పోయింది. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది లు ఎదుర్కొన్నారు. శుక్రవారం ఉదయం 5.45 గంటలకు విశాఖపట్నంలో బయలుదేరాల్సిన ఈ రైలు దాని జత రైలు అలస్యం కారణంగా ఇప్పటికే 5 గంటలు అలస్యంగా బయలుదేరేలా అధికారులు రీషెడ్యూల్ చేశారు. దీంతో విశాఖలో ఈ రైలు 10.43 గంటలకు బయలు దేరింది. బయలుదేరిన కొంత సమయానికే రైలులోని నాలుగు బోగీలలో ఏసీలు పనిచేయడం ఆగిపోయాయి. అసలే వేసవి ఉక్క పోత దీనికి తోడు రైలులో తలుపులు, కిటికీలు పూర్తిగా మూసివేసి ఉండడంతో ప్రయాణికులు ఉక్కిరిబిక్కిరయ్యి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దీనిపై కొంత మంది ప్రయాణికులు అధికారులకు ఫిర్యాదు చేయడంతో రాజమండ్రి స్టేషన్‌లో కొంతమంది టెక్నిషియన్‌లను రైలులో పంపారు. అయినా సమస్య పరిష్కారం కాకపోవడంతో మధ్యాహ్నం 2 గంటలకు విజయవాడ చేరుకోవడంతో ఏడీఆర్ఎం శ్రీకాంత్ పర్యవేక్షణలో సిబ్బంది సుమారు మూడున్నర గంటలు శ్రమించి మరమ్మతులు పూర్తిచేశారు. అనంతరం 5.30 గంటలకు రైలు విజయవాడ నుంచి బయలుదేరి వెళ్లింది. అసలే 5 గంటల ఆలస్యం అందులో మరోమూడున్నర గంటలు మరమ్మతుల కోసం నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు.

విశాఖ మార్గంలో పలు రైళ్లు రద్దు

విజయవాడ డివిజన్ అనకాపల్లి–తాడి సెక్షన్ మధ్యలో ట్రాక్ మెయింటెనెన్స్ పనుల కారణంగా ఆ మార్గంలో నడిచే పలు రైళ్లను రద్దు చేస్తున్నట్లు అధికారులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు.

రద్దు చేసిన రైళ్లు..

ఈ నెల 17న గుంటూరు–విశాఖపట్నం (17239), విశాఖపట్నం–విజయవాడ (22701/22702), మచిలీపట్నం–విశాఖపట్నం (17219) రైళ్ల రద్దు, 18న విశాఖపట్నం–గుంటూరు(17240), విశాఖప ట్నం–మచిలీపట్నం (17220) రైళ్లను రద్దు చేశారు.

తమిళనాడు మాజీ డీజీపీకి జైలు శిక్ష

సాక్షి, చెన్నై: జూనియర్ ఐపీఎస్ అధికారిణిపై లైంగిక వేధింపులకు పాల్పడిన కేసులో తమిళనాడుకు చెందిన మాజీ డీజీపీ రాజేష్‌దాస్‌కు మూడేళ్ల జైలు శిక్ష విధిస్తూ విల్లుపురం కోర్టు శుక్రవారం తీర్పు వెలువరించింది. 2021 ఫిబ్రవరిలో ప్రత్యేక డీజీపీగా ఉన్న రాజేష్‌దాస్ విధుల్లో ఉన్న జూనియర్ మహిళా ఐపీఎస్ అధికారిని తన కారులో బలవంతంగా ఎక్కమని ఆదేశించడమే కాకుండా.. ఆమెపై లైంగిక వేధింపులకు పాల్పడినట్టు వెలువడిన సమాచారం అప్పట్లో కలకలం రేపింది. ఈ వ్యవహారంపై విశాఖ కమిటీ విచారణ జరపడంతో రాజేష్‌దాస్‌ను సస్పెండ్ చేశారు. అలాగే, ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయకుండా మహిళా అధికారిని అడ్డుకున్న చెంగల్పట్టు జిల్లా ఎస్పీగా అప్పట్లో ఉన్న కన్నన్‌ను కూడా సస్పెండ్ చేశారు. ఈ కేసును తమిళనాడు సీబీసీఐడీ విచారిస్తూ వచ్చింది. విచారణ ముగియడంతో విల్లుపురం కోర్టు న్యాయమూర్తి పుష్పరాణి తీర్పు వెలువరించారు. రాజేష్‌దాస్‌కు మూడేళ్ల జైలు శిక్ష, రూ.20,500 జరిమానా విధించారు. ఫిర్యాదు చేయడానికి వెళ్లిన మహిళా అధికారిని అడ్డుకున్న కన్నన్‌కు రూ.500 జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు. అయితే, రాజేష్‌దాస్‌కు కోర్టు బెయిల్ మంజూరు చేస్తూ.. అప్పీల్‌కు 30 రోజుల అవకాశం కల్పించింది. ఈ తీర్పును అనేకమంది మాజీ మహిళా పోలీస్ అధికారులు వ్యతిరేకించారు. ప్రభుత్వం అప్పీలుకు వెళ్లాలని, కనీసం పదేళ్ల జైలు శిక్షపడే విధంగా చర్యలు తీసుకోవాలని మాజీ ఐపీఎస్ తిలకవతి కోరారు.

సుమలత కుమారుడి వివాహ విందులో తోపులాట


అభిమానులను చెదరగొడుతున్న పోలీసులు

మండ్య: కర్ణాటకలోని మండ్య ఎంపీ సుమలత కుమారుడు అభిషేక్ అంబరీశ్, అవివా వివాహ రిసెప్షన్ శుక్రవారం మండ్య జిల్లా మద్దూరు తాలూకా గెజ్జలగెరె కాలనీ వద్ద ఘనంగా జరిగింది. వేలాది మంది అభిమానులు పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా సుమారు 15 ఎకరాల స్థలంలో టెంట్ వేసి భోజనాలను ఏర్పాటు చేశారు. భోజనాల కోసం ఒకేసారి అందరూ వెళ్లడంతో తోపులాట జరిగింది. జనాన్ని నియంత్రించేందుకు పోలీసులు చేసిన లాఠీచార్జిలో 30 మందికిపైగా గాయపడ్డారు.

అగ్నివీర్‌లకు కంపెనీ సెక్రటరీలుగా అవకాశం

- దేశసేవ పూర్తి చేసుకున్న తర్వాత ఉచితంగా కోర్సుల్లో శిక్షణ
- ఏపీ నుంచి 500 మంది కంపెనీ సెక్రటరీలున్నారు
- ఐసీఎస్ఐ చైర్మన్ మనీష్‌గుప్తా వెల్లడి



సాక్షి, విశాఖపట్నం : అగ్నివీర్‌లుగా దేశానికి సేవ చేసిన యువతకు కంపెనీ సెక్రటరీలుగా ఉచితంగా కోర్సుల్లో శిక్షణ అందించేందుకు సన్నద్ధమవుతున్నట్లు ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ కంపెనీ సెక్రటరీస్ ఆఫ్ ఇండియా (ఐసీఎస్ఐ) చైర్మన్ మనీష్‌గుప్తా చెప్పారు. రెండు రోజుల జాతీయ సదస్సులో పాల్గొనేందుకు విశాఖ వచ్చిన ఆయన శుక్రవారం మీడియాతో మాట్లాడారు. అగ్నివీర్‌ల ప్రవేశాలకు ఇటీవలే రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో చర్చలు జరిపామని తెలిపారు. నాలుగేళ్ల పాటు దేశ భద్రతలో రాజీలేని పోరాటం చేసి వచ్చిన తర్వాత..అగ్నివీర్‌ల ఉపాధి కోసం ఐసీఎస్ఐ ఈ నిర్ణయం తీసుకుందని తెలిపారు. రక్షణ మంత్రికి తమ విద్య, శిక్షణ ఆఫర్లని వివరించామని, ఈ నెల 19న మరోసారి రక్షణ మంత్రిత్వ శాఖ అధికారులతో సమావేశం కానున్నామని వివరించారు. ఐసీఎస్ఐ దేశవ్యాప్తంగా అందిస్తోన్న 40 ప్రత్యేక కోర్సుల్లో అగ్నివీర్‌లతో పాటు రక్షణ సిబ్బందికి అడ్మిషన్లు ఉచితంగా ఇవ్వాలని ప్రణాళికలు రూపొందించామన్నారు. దీనికి సంబంధించి త్వరలోనే అవగాహన ఒప్పందం కుదుర్చుకునే అవకాశం ఉందన్నారు. దీని ద్వారా విధులు ముగించుకొని వచ్చిన అగ్నివీర్ సైనికులకు ఉపాధి అవకాశాలు మెరుగుపడటమే కాకుండా కార్పొరేట్ ఉద్యోగాలు లభించే అవకాశాలుంటాయని చెప్పారు. ఐసీఎస్ఐలో ప్రస్తుతం 2 లక్షల మంది విద్యార్థులుండగా వీరిలో ఏపీకి చెందిన వారు 3,500 మంది ఉన్నారన్నారు. దేశవ్యాప్తంగా 71 వేల మంది కంపెనీ సెక్రటరీలుండగా, ఏపీ పరిధిలో 500 మంది సభ్యులున్నారని..అయితే ఈ సంఖ్య సరిపోదన్నారు. ఈ రంగంలో అపారమైన అవకాశాలున్నాయని చెప్పారు. విద్యార్థులు కేవలం ఇంజినీరింగ్, మెడిసిన్ వైపు మాత్రమే కాకుండా సీఎస్ కోర్సుల వైపు అడుగులు వేస్తే తక్కువ కాలంలోనే ఉజ్వల భవిత సాధ్యమవుతుందన్నారు. ఇందుకోసమే అవగాహన సదస్సులు నిర్వహించేందుకు సన్నద్ధమవుతున్నట్లు తెలిపారు. కంపెనీ సెక్రటరీస్ ప్రతినిధులు ఆశీష్ మోహన్, సందీప్ కేజ్రీవాల్, గిరిధరన్, ద్వారకానాథ్, నరసింహన్ పాల్గొన్నారు.

క్లుప్తంగా...

ఆసుపత్రి నుంచి ఇంటికి చేరుకున్న పోప్ ఫ్రాన్సిస్

రోమ్: పోప్ ఫ్రాన్సిస్(86) శుక్రవారం రోమ్ ఆసుపత్రి నుంచి డిశ్చార్జి అయ్యారు. అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన తొమ్మిది రోజుల క్రితం రోమ్‌లోని గెమెల్లీ పాలిక్లినిక్‌లో చేరారు. శస్త్రచికిత్స అనంతరం వీల్‌చైర్‌లో ఆసుపత్రి బయటకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన ఆసుపత్రి ఎదుట ప్రజలకు చిరునవ్వుతో అభివాదం చేశారు. ఆ తర్వాత కారులో వాటికన్ సిటీకి చేరుకున్నారు. ఆయనకు ఈ నెల 7న హెర్నియా ఆపరేషన్ జరిగింది.

కెనడాలో ఘోర రోడ్డు ప్రమాదం..15 మంది మృతి

టొరంటో: కెనడాలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో 15 మంది వయోధికులు చనిపోగా, మరో 10 మంది గాయాలపాలయ్యారు. మనిటొబా ప్రావిన్స్‌లోని కెర్బ్రెరీ వద్ద గురువారం ఈ ఘటన చోటుచేసుకుంది. డౌఫిన్‌లోని వయోధికుల కేంద్రంలో ఉండే 25 మంది గురువారం ఉదయం కర్బ్రెరీలోని శాండ్ హిల్స్ కేసినోకు బస్సులో బయలుదేరారు. ఈ బస్సు కెర్బ్రెరీ వద్ద కూడలిలో రవాణా ట్రక్కును ఢీకొట్టింది. ఘటనలో బస్సులోని 15 మంది వయోధికులు చనిపోగా, మరో 10 మంది గాయాలపాలయ్యారు.

సరిహద్దుల్లో అయిదుగురు ఉగ్రవాదులు హతం

కుప్వారా: జమ్మూకశ్మీర్‌లోని కుప్వారాలో భద్రతా బలగాలు నియంత్రణ రేఖ వెంబడి భారీ చొరబాటు యత్నాన్ని తిప్పికొట్టాయి. ఈ సందర్భంగా అయిదుగురు విదేశీ సాయుధ ఉగ్రవాదులను మట్టుబెట్టాయి. నిఘా వర్గాల సమాచారం మేరకు కెరాన్ సెక్టార్‌లోని జుమాగుండ్ ప్రాంతంలో గురువారం అర్ధరాత్రి ఈ ఆపరేషన్ చేపట్టినట్లు 28వ డివిజన్ మేజర్ జనరల్ గిరీష్ కాలియా తెలిపారు. భారత, పాకిస్తాన్‌ల మధ్య కాల్పుల విరమణ కొనసాగుతున్న సమయంలో 2021 తర్వాత తిప్పికొట్టిన అతిపెద్ద చొరబాటు యత్నమని పేర్కొన్నారు.

ఉమ్మడి కార్యక్రమం ప్రాతిపదికగా విపక్షాలు ఏకం కావాలి

జల్గావ్: కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా కనీస ఉమ్మడి కార్యక్రమం(సీఎంపీ) ప్రాతిపదికన ప్రతిపక్ష పార్టీలను ఏకతాటిపైకి తెచ్చేందుకు ప్రయత్నిస్తానని ఎన్‌సీపీ చీఫ్ శరద్ పవార్ చెప్పారు. 23న పట్నాలో జరిగే ప్రతిపక్ష పార్టీల భేటీలో ఇదే చెబుతానన్నారు. మహారాష్ట్రలోని జల్గావ్‌లో శుక్రవారం ఆయన మాట్లాడారు. భారీ హామీలతో, ప్రజల్లో ఎన్నో ఆశలు కల్పించి అధికారంలోకి వచ్చిన బీజేపీ చేసిందేమీ లేదన్నారు.

తుపాన్లు తలొంచుతున్నాయ్..!

మాండాస్, సిత్రాంగ్, అసానీ, గులాబ్, బిపర్‌జోయ్. పేరు ఏదైనా కానివ్వండి ఆ తుపాను ఎంత తీవ్రమైనదైనా కానివ్వండి మనం తట్టుకొని నిలబడుతున్నాం. 1990,-2000నాటి పరిస్థితి ఇప్పుడు లేదు. ఒకప్పుడు తుపాన్లు, వరదలంటే భారీగా ప్రాణ నష్టాలే జరిగేవి. ఇప్పుడు ప్రాణాలు కోల్పోతున్న వారి సంఖ్య వేళ్ల మీద లెక్క పెట్టొచ్చు. సాంకేతిక పరిజ్ఞానం పెరగడంతో ముందస్తుగా తుపాన్లను గుర్తించి పకడ్బందీగా చర్యలు తీసుకోవడంతో సత్ఫలితాల్ని ఇస్తోంది. గుజరాత్‌లో ఏకంగా లక్ష మందిని సురక్షిత ప్రాంతాలకు యుద్ధ ప్రాతిపదికన తరలించడంతో ఒక్కరంటే ఒక్కరు కూడా ప్రాణాలు కోల్పోలేదు. తుపాన్ల సన్నద్ధతలో ఒడిశా ఇతర రాష్ట్రాలకు ఆదర్శప్రాయంగా నిలుస్తోంది. ఆ రాష్ట్ర చర్యలకు ఐక్యరాజ్య సమితి కూడా శభాష్ అనడం విశేషం.

ఫలితాలు ఇలా..!

ప్రకృతి వైపరీత్యాలతో జరిగే ఆర్థిక నష్టాన్ని నివారించలేకపోయినా ప్రాణలైతే కాపాడగలుగుతున్నాం. గత కొద్ది ఏళ్లలో ఒడిశాను అల్లకల్లోలం చేసిన తుపాన్లలో ప్రాణనష్టం తగ్గుతూ వస్తోంది.

పారాదీప్ సైక్లోన్ (1999)	10 వేలు
ఫాలిని (2013)	44
టిట్లీ (2018)	77
ఫాని (2019)	64
అంఫాన్ (2020)	3
యాస్ (2021)	10



బిపర్‌జోయ్ తుపానుకు ముందు తీర ప్రాంత ప్రజలను హెచ్చరిస్తున్న ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది

వారం రోజుల ముందే హెచ్చరికలతో పెరిగిన సన్నద్ధత

- ప్రాణనష్టాన్ని అధిగమించేలా ఆధునిక వ్యవస్థ
- ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా మారిన ఒడిశా విధానాలు

అది 1999 సంవత్సరం అక్టోబర్ 29. ఒడిశా ప్రజలకు అదో కాళరాత్రి. పారాదీప్ సూపర్ సైక్లోన్ రాష్ట్రంపై విరుచుకుపడింది. సముద్రం అలల ధాటికి 14 జిల్లాల్లో భారీ విధ్వంసం జరిగింది. జగత్‌సింగ్‌పూర్ జిల్లాకి జిల్లాయే తుడిచిపెట్టుకుపోయింది. తుపాను దెబ్బకి 10 వేల మంది జలసమాధి అయ్యారని అధికారిక లెక్కలే చెబుతున్నాయి. 30 వేల మంది వరకు ప్రాణాలు పోగొట్టుకుని ఉంటారని ఒక అంచనా. అప్పట్లో భారత వాతావరణ కేంద్రం దగ్గర ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో లేదు. దీంతో తుపాను ముంచుకొస్తోందని కేవలం 48 గంటల ముందు మాత్రమే తెలిసింది. వాతావరణ శాఖ అధికారులు ఒడిశా ప్రభుత్వాన్ని అప్రమత్తం చేసినప్పటికీ సన్నద్ధత లేని కారణంగా జరగాల్సిన నష్టం జరిగిపోయింది. 10 వేలు నుంచి 30 వేల మంది మరణిస్తే, 3.5 లక్షల ఇళ్లు ధ్వంసమయ్యాయి. గ్రామాలకు గ్రామాలే నీళ్లలో కొట్టుకుపోయాయి. 25 లక్షల మంది నిరాశ్రయులయ్యారు. రెండు లక్షల జంతువులు మరణించాయి. గంటకి 250 కి.మీ. వేగంతో ప్రచండ గాలులు వీయడంతో కమ్యూనికేషన్ వ్యవస్థ నాశనమైంది.



ఒడిశాతో ఇతర ప్రాంతాలకు సంబంధాలు తెగిపోయాయి. ఈ పెను విధ్వంసంతో అప్పటి ఒడిశా ముఖ్యమంత్రి గిరిధర్ గొమాంగో తన పదవికి రాజీనామా చేయాల్సి వచ్చింది.

ఐక్యరాజ్యసమితి ప్రశంసలు

2013 సంవత్సరంలో ఫాలిని అత్యంత తీవ్రమైన తుపానుగా ఒడిశాను ముంచెత్తింది. అప్పుడు భారీగా ప్రాణ నష్టం జరుగుతుందని ఆందోళనలు వ్యక్తమయ్యాయి. ఆ తుపాను సమయంలో లక్షలాది మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించడంతో 44 మంది ప్రాణాలు కోల్పోయారు. ఆ సమయంలో ఒడిశా ప్రభుత్వ సహాయక చర్యలకు ఐక్యరాజ్య సమితి ఫిదా అయింది. ఒడిశా ప్రభుత్వం చారిత్రక విజయాన్ని సాధించిందని అభినందించింది.

కేంద్రం మూడంచెల వ్యవస్థ

బిపర్‌జోయ్ మహా తుపాను గుజరాత్‌లో విధ్వంసం సృష్టించినా ప్రాణ నష్టం జరగలేదు. దీనికి తుపాన్లపై ముందస్తు సన్నద్ధతే కారణం. తుపాను ముప్పుని ఎదుర్కోవడానికి కేంద్ర ప్రభుత్వం మూడంచెల వ్యవస్థని ఏర్పాటు చేసింది. ఈ వ్యవస్థ పనితీరుతో ఏకంగా లక్ష మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించి ప్రాణాలు కాపాడగలిగారు. తుపాన్లు ఎప్పుడు ఏర్పడతాయి? ఏ దిశగా ప్రయాణిస్తాయి, ఎక్కడ తీరం దాటుతాయన్న అంశాలను వారం రోజులు ముందుగానే గుర్తించే ఎర్లీ వార్నింగ్ సిస్టమ్ ఉంది. దీంతో లోతట్టు ప్రాంత ప్రజల్లో తుపాన్లపై అవగాహన పెరుగుతుంది. ఇక రెండో అంచెగా శిబిరాల నిర్మాణం, ప్రజల్ని తరలించడం ఒక యుద్ధంలా చేస్తారు. ఇక మూడో దశలో తుపాను ప్రభావిత ప్రాంతాల్లో అండర్ గ్రౌండ్‌లో విద్యుత్ లైన్లు, మంచినీటి పైపుల నిర్మాణం, రైల్వే, విమానాశ్రయాల్లో రాకపోకలు సాగేలా ఏర్పాట్లు వంటి వాటిపై దృష్టి పెట్టింది.



కచ్‌లోని సహాయక కేంద్రం

తుపాన్లు ఎదుర్కోవడంలో నవీన పంథా



తుపాను హెచ్చరికలను తెలియజేసే వ్యవస్థ

సూపర్ సైక్లోన్ ముంచెత్తిన తర్వాత సంవత్సరం 2000లో ముఖ్యమంత్రి పదవి చేపట్టిన నవీన్ పట్నాయక్ తుపాన్లు ఎదుర్కోవడంపైనే ప్రధానంగా దృష్టి సారించారు. సూపర్ సైక్లోన్ తుపాను బీభత్సం నుంచి అప్పటికి ఇంకా రాష్ట్రం కోలుకోలేదు. భౌగోళికంగా ఒడిశా తుపాన్ల తాకిడిని తప్పించుకోవడం అసాధ్యం. 1891 నుంచి 100కి పైగా తుపాన్లు ఒడిశాను వణికించాయి. ఈ విషయాన్ని గుర్తించిన సీఎం నవీన్ పట్నాయక్ ప్రాణ నష్టం జరగకుండా పకడ్బందీ చర్యలు చేపట్టారు

- → రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో విపత్తు నిర్వహణ సంస్థను ఏర్పాటు చేశారు. ఇలా ఒక రాష్ట్రం విపత్తు నిర్వహణ కోసం ఒక అథారిటీని ఏర్పాటు చేయడం అదే మొదటి సారి. జిల్లాలు, బ్లాక్ స్థాయిలో కూడా విపత్తు కమిటీలు ఏర్పాటు చేశారు. 22 వేల గ్రామాల్లో కమిటీలు ఏర్పాటు చేసి స్థానిక యువకుల్ని సభ్యులుగా నియమించారు. తుపాను హెచ్చరికలు అందిన వెంటనే లోతట్టు ప్రాంతాలను సురక్షిత ప్రాంతాలకు తరలించడమే వీరు చేయాల్సిన పని
- → రాష్ట్రంలోని 480 కి.మీ. పొడవైన తీర ప్రాంతంలో ప్రకృతి వైపరీత్యాలు, తుపాన్లపై ప్రజల్ని అప్రమత్తం చేయడానికి 2018లో ప్రభుత్వం ఎర్లీ వార్నింగ్ డిస్సెమినేషన్ సిస్టమ్ (ఈడబ్ల్యూడీఎస్) ఏర్పాటు చేసింది. తుపాన్లు ముంచుకొస్తే లోతట్టు ప్రాంత ప్రజలకి కనీసం అయిదారు రోజుల ముందే హెచ్చరికలు అందుతాయి.
- → తీర ప్రాంతాల్లో నివసించే వారందరికీ పక్కా ఇళ్లు నిర్మించి ఇచ్చింది
- → ఒడిశా డిజాస్టర్ ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్‌లో బాగా విస్తరించి సుశిక్షితులైన సిబ్బందిని 20 రెట్లు పెంచింది. వారి దగ్గర 66 రకాల ఆధునిక పరికరాలు అంటే జనరేటర్లు, చెట్లను కట్ చేసే, రోడ్లను శుభ్రం చేసే యంత్రాలు, పడవలు, ఫస్ట్ ఎయిడ్ మెడికల్ వంటివి ఎప్పుడూ ఉండేలా చర్యలు తీసుకుంది.
- → 1999 సూపర్ సైక్లోన్ సమయం నాటికి ఒడిశాలో కేవలం ఆరు జిల్లాల్లో కేవలం 23 శాశ్వత తుపాను శిబిరాలు ఉండేవి. తీర ప్రాంతాల్లో అడుగడుక్కీ బహువిధాలుగా ఉపయోగపడే శిబిరాలు నిర్మించారు. ఇప్పుడు వాటి సంఖ్య 870కి చేరుకుంది. ఒక్కో శిబిరంలో వెయ్యి మంది వరకు తలదాచుకునేలా ఏర్పాట్లు ఉన్నాయి.

- సాక్షి, నేషనల్ డెస్క్

ఐరాసలో యోగా వైట్‌హౌస్‌లో విందు

మోదీ షెడ్యూల్ ఖరారు

న్యూఢిల్లీ: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అమెరికా, ఈజిప్టు దేశాల పర్యటన షెడ్యూల్‌ను శుక్రవారం విదేశాంగ శాఖ విడుదల చేసింది. జూన్ 20 నుంచి 25 వరకు ప్రధాని అమెరికా, ఈజిప్టులలో పర్యటిస్తారు. జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రధాని మోదీ న్యూయార్క్‌లో ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యాలయంలో జరిగే యోగా కార్యక్రమానికి నేతృత్వం వహిస్తారు. అమెరికా అధ్యక్షుడు జో బైడెన్, ఫస్ట్ లేడీ జిల్ బైడెన్ ఆహ్వానం మేరకు ప్రధాని మోదీ అమెరికా పర్యటనకు వెళుతున్నారు. ఈ సారి పర్యటనలో యూఎన్‌లో జరిగే యోగా డేలో ప్రధాని పాల్గొనడం విశేషం. ప్రతీ రోజూ యోగా చేయడం వల్ల కలిగే ఆరోగ్యం, ఫిట్‌నెస్‌పై ప్రపంచంలో అవగాహన పెరగాలని మోదీ ప్రధాని పదవి చేపట్టాక చేసిన ప్రయత్నాలతో యూఎన్ 2014లో జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవంగా ప్రకటించింది. ఇప్పుడు తొమ్మిదేళ్లయ్యాక యూఎన్‌లో జరిగే కార్యక్రమానికి నేతృత్వం వహిస్తూ ఉండడంపై ప్రధాని మోదీ ఉద్విగ్నంగా స్పందించారు. యోగా మరింతగా ప్రజాదరణ పొందాలని ఒక ట్వీట్‌లో ఆశాభావం వ్యక్తం చేశారు.

పర్యాటన ఇలా..!

- ప్రధాని మోదీ అమెరికా పర్యటన న్యూయార్క్ నుంచి మొదలవుతుంది. జూన్ 21న యూఎన్ ప్రధాన కార్యాలయంలో ఉదయం 8 నుంచి 9 గంటలవరకు జరిగే యోగా సెషన్‌లో ప్రధాని పాల్గొంటారు. భారత్ యూఎన్‌కు బహుమతిగా ఇచ్చిన మహాత్మా గాంధీ విగ్రహం ఎదుటే ఈ యోగా కార్యక్రమం జరగనుంది. ఈ కార్యక్రమంలో యూఎన్ ప్రతినిధులు, వివిధ దేశాల రాయబారులు యోగా గొప్పదనాన్ని ప్రపంచానికి చాటుతారు.
- న్యూయార్క్ నుంచి వాషింగ్టన్‌కు వెళతారు. జూన్ 22న అధ్యక్షుడు బైడెన్‌తో అత్యున్నత స్థాయి చర్చలు జరుపుతారు.
- అమెరికా ప్రతినిధుల సభ, సెనేట్ స్పీకర్ల ఆహ్వానం మేరకు కాంగ్రెస్ ఉభయ సభలనుద్దేశించి మోదీ ప్రసంగిస్తారు
- అదే రోజు రాత్రి ప్రధాని గౌరవార్థం బైడెన్ దంపతులు శ్వేత సౌధంలో అధికారిక విందు ఇస్తారు.
- జూన్ 23న ఉపాధ్యక్షురాలు కమలా హ్యారిస్, విదేశాంగ మంత్రి ఆంటోని బ్లింకెన్ ప్రధానికి ఆతిథ్యమిస్తారు. అదే రోజు ప్రధాని పారిశ్రామికవేత్తలతో, కార్పొరేట్ సంస్థల సీఈవోలతో సమావేశమవుతారు. ప్రవాస భారతీయులతో ముచ్చటిస్తారు.
- జూన్ 24న ఈజిప్టుకి బయల్దేరి వెళతారు. అక్కడ రెండు రోజులు పర్యటిస్తారు. మన గణతంత్ర ఉత్సవాలకు హాజరైన ఈజిప్టు అధ్యక్షుడు అబ్దుల్ ఫతా ఎల్ సిసి ఆహ్వానం మేరకు అక్కడ పర్యటించనున్నారు.

బలహీనపడిన బిపర్‌జోయ్

- గుజరాత్ నుంచి రాజస్తాన్ వైపు పయనం
- జలోర్, బార్మర్ జిల్లాల్లో రెడ్ అలర్ట్
- గురువారం సాయంత్రం నుంచి కురుస్తున్న భారీ వర్షాలు

707 మంది శిశువుల జననం

గుజరాత్‌లో మంగళవారం సాయంత్రం నుంచి తుపాను కల్లోలం మొదలైంది. తుపాను ప్రభావిత ప్రాంతాల నుంచి లక్షల మందికిపైగా ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. తీర ప్రాంతంలోని 8 జిల్లాల్లో 1,171 మంది గర్భిణులు ఉండగా, వీరిలో 1,152 మందిని ఇతర ప్రాంతాలకు తరలించారు. గత నాలుగు రోజుల్లో వీరిలో 707 మంది గర్భిణులకు వివిధ ఆసుపత్రులు, ఆరోగ్య కేంద్రాల్లో సురక్షితంగా ప్రసవం జరిగిందని రాష్ట్ర ప్రభుత్వం ఒక ప్రకటనలో తెలియజేసింది. 707 మంది శిశువులు జన్మించారని పేర్కొంది.

జైపూర్/అహ్మదాబాద్/న్యూఢిల్లీ: గుజరాత్ తీర ప్రాంతాన్ని వణికించిన బిపర్‌జోయ్ తుపాను బలహీనపడింది. ఈశాన్య దిశగా ప్రయాణిస్తూ పొరుగు రాష్ట్రమైన రాజస్తాన్ వైపు మళ్లిందని అధికారులు వెల్లడించారు. తుపాను ప్రభావం వల్ల రాజస్తాన్‌లోని జలోర్, బార్మర్ జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో గురువారం సాయంత్రం నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఈ రెండు జిల్లాల్లో అధికారులు రెడ్ అలర్ట్ ప్రకటించారు. గురువారం సాయంత్రం దాదాపు 70 మిల్లీ మీటర్ల వర్షం కురిసిందని వాతావరణ శాఖ ప్రకటించింది. జలోర్‌లో శుక్రవారం ఉదయం నిల్లా 69 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు తెలియజేసింది. రెండు జిల్లాల్లో 200 మిల్లీమీటర్లకుపైగా వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది. జోధ్‌పూర్, జైసల్మేర్, పాలీ, సిరోహీ వైపు తుపాను పయనిస్తోందని, అక్కడ సైతం భారీ వర్షాలు కురుస్తాయని వివరించింది. శుక్రవారం, శనివారం రాజ్‌సమంద్, దుంగార్పూర్‌తోపాటు పరిసర ప్రాంతాల్లో విస్తారంగా వర్షాలు కురుస్తాయని తెలిపింది. గంటకు 60 నుంచి 70 కిలోమీటర్ల వేగంతో బలమైన గాలులు వీచే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేసింది. ముందుజాగ్రత్త చర్యగా రాజస్తాన్ ప్రభుత్వం జైపూర్, కోట, భరత్‌పూర్, ఉదయ్‌పూర్, అజ్మీర్, జోధ్‌పూర్, బికనేర్ తదితర ప్రాంతాలకు ఎస్‌డీఆర్ఎఫ్ బృందాలను పంపించింది. అజ్మీర్ జిల్లాలోని కిషన్‌గఢ్‌కు ఎన్‌డీఆర్ఎఫ్ బృందం చేరుకుంది.

గుజరాత్‌లో ప్రాణ నష్టం సున్నా

గుజరాత్‌లో బిపర్‌జోయ్ తుపాను వల్ల ఇప్పటిదాకా ఎలాంటి ప్రాణనష్టం సంభవించలేదని ఎన్డీఆర్ఎఫ్ డైరెక్టర్ జనరల్ అతుల్ కార్వాల్ శుక్రవారం చెప్పారు. వివిధ ప్రాంతాల్లో 23 మంది గాయపడ్డారని, దాదాపు 1,000 గ్రామాల్లో విద్యుత్ సరఫరాను ఇంకా పునరుద్ధరించలేదని ప్రకటించారు. గుజరాత్‌లో తుపాను కంటే ముందే ఇద్దరు చనిపోయారని వెల్లడించారు. తుపాను హెచ్చరికలపై ప్రభుత్వ యంత్రాంగం వేగంగా స్పందించి, చేపట్టిన చర్యల వల్లే ప్రాణనష్టం సంభవించలేదని అన్నారు. కచ్ ప్రాంతంలో 40 శాతం గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయిందని చెప్పారు. 500 ఇళ్లు దెబ్బతిన్నాయని తెలిపారు. పక్కా ఇళ్లకు పెద్దగా నష్టం వాటిల్లలేదన్నారు. 800 చెట్లు కూలిపోయాయని పేర్కొన్నారు. రాష్ట్రంలో త్వరలోనే సాధారణ పరిస్థితులు నెలకొంటాయని, ఇందుకోసం గుజరాత్ ఎస్‌డీఆర్ఎఫ్‌తో కలిసి పని చేస్తున్నామని వివరించారు. రహదారుల వ్యవస్థకు నష్టం జరగలేదన్నారు. సెల్‌ఫోన్ నెట్‌వర్క్ యథాతథంగా పని చేస్తోందన్నారు.

విద్యుత్ పునరుద్ధరణకు చర్యలు

గుజరాత్‌లో 8 జిల్లాల్లో విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు 1,000కి పైగా బృందాలను రంగంలోకి దించినట్లు రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ఒక ప్రకటనలో వెల్లడించింది. కచ్, దేవభూమి ద్వారక, జామ్‌నగర్, మోర్బీ, జునాగఢ్, గిర్ సోమనాథ్, రాజ్‌కోట్, పోర్‌బందర్ తదితర జిల్లాల్లో తుపాను వల్ల విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ముందస్తు చర్యలు చేపట్టడం, లక్ష మందికిపైగా ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడం వల్ల తుపాను ప్రభావిత ప్రాంతాల్లో ఎలాంటి ప్రాణనష్టం సంభవించలేదని గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్ చెప్పారు. తుపాను సహాయక చర్యల్లో సహకారం అందించిన ప్రధాని నరేంద్ర మోదీకి, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

- బిపర్‌జోయ్ అత్యంత తీవ్ర నుంచి తీవ్ర తుపానుగా బలహీనపడింది. రాజస్తాన్‌లోకి ప్రవేశించింది.
- తుపాను ధాటికి గుజరాత్‌లోని కచ్–సౌరాష్ట్ర ప్రాంతంలో గురువారం సాయంత్రం నాటికి 5,120 విద్యుత్ స్తంభాలు కూలిపోయాయి. 4,600 గ్రామాలకు కరెంటు సరఫరా నిలిచిపోయింది. ఇప్పటిదాకా 3,580 గ్రామాలకు సరఫరా పునరుద్ధరించారు. మరో 1,000కిపైగా గ్రామాలకు పునరుద్ధరించాల్సి ఉంది.
- దాదాపు 800 చెట్లు నేలమట్టమయ్యాయి. ఫలితంగా పలు రహదారులపై వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి.
- గంటకు 140 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి. భారీ వర్షాలతో లోతట్టు ప్రాంతాలు నీట మునిగాయి.
- ప్రజలను సకాలంలో సురక్షిత ప్రాంతాలకు తరలించడంతోపాటు ప్రాణనష్టం జరగకుండా పటిష్ట చర్యలు తీసుకున్న అధికార యంత్రాంగాన్ని గుజరాత్ ప్రభుత్వం అభినందించింది.
- ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గుజరాత్ సీఎం భూపేంద్ర పటేల్‌కు ఫోన్ చేసి పరిస్థితి ఎప్పటికప్పుడు తెలుసుకున్నారు. సహాయక చర్యలు వేగవంతం చేయాలని, అటవీ జంతువుల రక్షణకు చర్యలు తీసుకోవాలని సూచించారు.
- ప్రభుత్వం చేపట్టిన సహాయక చర్యలకు స్వచ్ఛంద సంస్థలు, మీడియా సంస్థలు కూడా సహకారం అందించాయి.
- మరో 3 రోజులపాటు 23 రైళ్లను రద్దు చేస్తున్నట్లు రైల్వేశాఖ ప్రకటించింది.
- సీఎం భూపేంద్ర పటేల్ తరచుగా సమీక్షా సమావేశాలు నిర్వహిస్తూ అధికారులకు దిశానిర్దేశం చేశారు.
- పాకిస్తాన్‌లోనూ తీర ప్రాంతాల్లో అక్కడి ప్రభుత్వం హైఅలర్ట్ ప్రకటించింది. దక్షిణ సింధూ ప్రావిన్స్ నుంచి 82,000 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు.



గుజరాత్‌లో కచ్ జిల్లాలోని మాండ్వీ పట్టణంలో శుక్రవారం జలమయమైన ఓ రహదారి



మాండ్వీలో వరద నీటిలో మునిగిన ఇళ్లు



కచ్ జిల్లాలో బలమైన ఈదురు గాలుల ధాటికి దెబ్బతిన్న స్వామినారాయణ ఆలయం

తృణధాన్యాల ప్రాధాన్యంపై పాట.. గ్రామీ విజేత ఫాలుతో కలిసి పాడిన ప్రధాని మోదీ



న్యూయార్క్: తృణధాన్యాల ప్రాధాన్యతను చాటిచెప్పేందుకు ప్రత్యేకంగా రాసిన పాటను గ్రామీ అవార్డు విజేత, భారతీయ అమెరికన్ ఫల్గుణి షాతో కలిసి ప్రధాని మోదీ పాడారు. ఈ పాటను 'అబండెన్స్ ఇన్ మిల్లెట్స్'అనే పేరుతో ఈ నెల 16న ఫల్గుణి, ఆమె భర్త గాయకుడు గౌరవ్ షా కలిసి ప్రపంచవ్యాప్తంగా అన్ని స్ట్రీమింగ్ వేదికలపైనా ఇంగ్లిష్, హిందీ భాషల్లో విడుదల చేశారు. ముంబైలో జన్మించిన గాయని, పాటల రచయిత ఫల్గుణి షాను ఫాలు అనే పేరుతో ప్రసిద్ధురాలయ్యారు. పిల్లల కోసం ఈమె రూపొందించిన 'ఎ కలర్‌ఫుల్ వరల్డ్ ఆల్బమ్‌'కు 2022లో ప్రసిద్ధ గ్రామీ అవార్డు దక్కింది. గ్రామీ అవార్డు గెలుచుకున్న అనంతరం గత ఏడాది ప్రధాని మోదీని ఆమె ఢిల్లీలో కలిశారు. ఆ సమయంలో ప్రపంచ ఆకలిని తీర్చే సామర్థ్యమున్న, మంచి పోషక విలువలు కలిగిన తృణధాన్యాల గొప్పదనంపై ప్రజలకు అవగాహన కల్పించేలా ఒక పాట రాయాలని ప్రధాని మోదీ సూచించారని చెప్పారు. ఇందుకు సహకారం అందించేందుకు కూడా ప్రధాని మోదీ అంగీకరించారని వివరించారు. ఒక వైపు పాట కొనసాగుతుండగానే తృణధాన్యాల గొప్పదనంపై స్వయంగా రాసిన మాటలను ప్రధాని మోదీ వినిపిస్తారని ఫాలు పీటీఐకి తెలిపారు. భారత్ ప్రతిపాదన మేరకు ఐక్యరాజ్యసమితి 2023ను అంతర్జాతీయ తృణధాన్యాల సంవత్సరంగా ప్రకటించిన విషయం తెలిసిందే.

నెహ్రూ లైబ్రరీ ఇక ప్రధానమంత్రి లైబ్రరీ

కేంద్ర సాంస్కృతిక శాఖ నిర్ణయం.. పేరు మార్పుపై కాంగ్రెస్ ఆగ్రహం




న్యూఢిల్లీ: ఢిల్లీలో తీన్‌మూర్తి భవన ప్రాంగణంలో ఉన్న 'నెహ్రూ మెమోరియల్ మ్యూజియం, లైబ్రరీ సొసైటీ' పేరును కేంద్ర ప్రభుత్వం 'ప్రైమ్‌మినిస్టర్స్ మ్యూజియం, లైబ్రరీ సొసైటీ'గా మార్చింది. తొలి ప్రధాని నెహ్రూ అధికారిక నివాసం తీన్‌మూర్తి భవన్‌ను ప్రభుత్వం గత ఏడాది 'ప్రధానమంత్రి సంగ్రహాలయ'గా మార్చిన సంగతి తెలిసిందే. నెహ్రూ మెమోరియల్ మ్యూజియం, లైబ్రరీ సొసైటీ పేరును ప్రైమ్‌మినిస్టర్స్ మ్యూజియం, లైబ్రరీ సొసైటీగా మారుస్తూ తీర్మానించినట్లు కేంద్ర సాంస్కృతిక శాఖ శుక్రవారం ప్రకటించింది. నెహ్రూ నుంచి మోదీ దాకా ప్రధానుల వివరాలు, వారి ఘనత, దేశ అభివృద్ధిలో వారి పాత్రకు సంబంధించిన సమాచారాన్ని ఈ లైబ్రరీలో ప్రదర్శించనున్నట్లు తెలిపింది. సొసైటీ ఉపాధ్యక్షుడైన రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ నేతృత్వంలో జరిగిన ప్రత్యేక సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. నెహ్రూ తీన్‌మూర్తి భవన్‌లో 16 ఏళ్లకుపైగా 1964 మే 27న చనిపోయే దాకా ఉన్నారు. 1966లో ఇక్కడ 'నెహ్రూ మెమోరియల్ మ్యూజియం, లైబ్రరీ సొసైటీ' ఏర్పాటయ్యింది.

అల్పబుద్ధిని చాటుకున్న ప్రభుత్వం: కాంగ్రెస్

నెహ్రూ లైబ్రరీ పేరు మార్పుపై కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం అల్పబుద్ధిని చాటుకుందని అన్నారు. భవనాల పేరు మార్పినంత మాత్రాన మహోన్నత వ్యక్తుల పేరు ప్రఖ్యాతులను చెరిపివేయలేరని పేర్కొన్నారు. చరిత్ర లేనివారే ఇతరుల చరిత్రను చెరిపివేసేందుకు ప్రయత్నిస్తారని ఎద్దేవా చేశారు.

ముందస్తును కొట్టిపారేయలేం: నితీశ్



పట్నా: దేశంలో ముందస్తు ఎన్నికలు జరిగే అవకాశాలను కొట్టిపారేయలేమని బిహార్ ముఖ్యమంత్రి, జేడీ(యూ) నేత నితీశ్ కుమార్ మరోసారి స్పష్టం చేశారు. ఆయన శుక్రవారం మీడియాతో మాట్లాడారు. ప్రతిపక్షాలు ఏకమవుతుండడం అధికార బీజేపీకి కలవరం కలిగిస్తోందని చెప్పారు. విపక్ష కూటమి పూర్తిగా బలం పుంజుకోకముందే ఎన్నికలు నిర్వహించాలన్న యోచనలో అధికార పక్షం ఉండొచ్చని తెలిపారు. ముందస్తు ఎన్నికలకు వెళ్లే అవకాశం కేంద్ర ప్రభుత్వానికి ఉంటుందని గుర్తుచేశారు.

ఈడీ కస్టడీకి సెంథిల్ బాలాజీ

చెన్నై జిల్లా కోర్టు ఉత్తర్వులు



సాక్షి, చెన్నై: మనీ లాండరింగ్ కేసులో అరెస్టయిన తమిళనాడు మంత్రి సెంథిల్ బాలాజీని 8 రోజుల ఈడీ కస్టడీకి అప్పగిస్తూ చెన్నై జిల్లా మొదటి మేజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి లిల్లీ శుక్రవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. క్యాష్ ఫర్ జాబ్స్ కేసులో మంత్రి సెంథిల్ బాలాజీని ఈడీ అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. గుండెపోటు రావడంతో ఆయన్ను కావేరీ ఆస్పత్రిలో చేర్చారు. శుక్రవారం డాక్టర్ ఏఆర్ రఘురాం నేతృత్వంలోని బృందం రెండు మూడు రోజులలో ఆయనకు బైపాస్ సర్జరీ చేయడానికి చర్యలు తీసుకుంది. ఈ నేపథ్యంలో సెంథిల్ బాలాజీని 15 రోజులు తమ కస్టడీకి అప్పగించాలని ఈడీ వేసిన పిటిషన్‌పై చెన్నై జిల్లా మొదటి మేజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి లిల్లీ విచారణ చేపట్టి..ఎనిమిది రోజుల పాటు సెంథిల్ బాలాజీని కస్టడీకి అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఆస్పత్రిలో ఉన్న దృష్ట్యా, విచారణ అక్కడే జరగాలని ఆదేశించారు. సెంథిల్ బాలాజీ బెయిల్ పిటిషన్‌ను నిరాకరించారు. సెంథిల్ బాలాజీ సోదరుడు అశోక్‌కు విచారణకు హాజరు కావాలని ఈడీ సమన్లు జారీ చేసింది.

కేంద్ర మంత్రి ఇంటిపై పెట్రోల్‌బాంబులతో దాడి

మణిపూర్‌లో ఆగని హింసాత్మక ఘటనలు

ఇంఫాల్/కోచి: మణిపూర్‌లో తెగల మధ్య ఘర్షణలు చల్లారే సూచనలు కనిపించడం లేదు. గురువారం రాత్రి రాష్ట్ర రాజధాని ఇంఫాల్‌లోని కేంద్ర విదేశాంగ శాఖ సహాయ మంత్రి ఆర్‌కే రంజన్ సింగ్ ఇంటిని ఆందోళనకారుల గుంపు ధ్వంసం చేసింది. ఆ ఇంటిని తగులబెట్టేందుకు యత్నించగా ఫైర్ సిబ్బంది భద్రతా బలగాలు మంటలను ఆర్పారు. 'పట్టణంలో కర్ఫ్యూ కొనసాగుతున్న సమయంలోనే నిరసనకారులు మంత్రి ఇంటిని చుట్టుముట్టి, నలువైపుల నుంచి పెట్రోల్ బాంబులు విసిరారు. మంత్రి నివాసం రక్షణ కోసం మొత్తంగా 22 మందిమి ఉన్నాం. వాస్తవానికి 1,200 వరకు ఉన్నారు. దాంతో, మేం నిస్సహాయ స్థితిలో ఉండిపోయాం'అని భద్రతా సిబ్బంది ఒకరు తెలిపారు. ఆసమయంలో మంత్రి రంజన్ సింగ్ ఇంట్లో లేరు. బుధవారం కుకీల గ్రామంపై కొందరు దాడి చేసి, 9 మందిని కాల్చి చంపడంతోపాటు 10 మందిని గాయపరిచిన ఘటనకు నిరసనగా అంతకుముందు ఆందోళనకారులు ఇంఫాల్‌లో రెండు నివాసాలకు నిప్పుపెట్టారు. అడ్డుకోబోయిన ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్(ఆర్ఏఎఫ్)తో తలపడ్డారు. పట్టణంలో యథేచ్ఛగా సంచరించారు. టియర్ గ్యాస్, మాక్ బాంబులను ప్రయోగిస్తూ వారిని చెదరగొట్టేందుకు బలగాలు ప్రయత్నించాయి. ఈ సందర్భంగా ఇద్దరు నిరసనకారులు, ఆర్ఏఎఫ్ కానిస్టేబుల్ ఒకరు గాయపడ్డారు. నోంగ్‌మెయిబుంగ్, వాంగ్‌ఖై ప్రాంతాల్లో నిరసనకారులు రోడ్లపై రాళ్లు, ఇతర అడ్డంకులతో బలగాలతో తలపడ్డారు. ఇలా ఉండగా, కేరళలోని కోచిలో పార్టీ సమావేశానికి హాజరైన కేంద్ర మంత్రి రంజన్ సింగ్ తన నివాసంపై దాడి విషయం తెలుసుకున్నారు. తన కార్యక్రమాలను రద్దు చేసుకుని, తిరుగుపయనమయ్యారు. 'అది నా కష్టార్జితంతో కట్టుకున్న ఇల్లు. రాష్ట్రంలో మే 3 నుంచి కొనసాగుతున్న హింసాత్మక ఘటనలను నివారించి, శాంతి నెలకొల్పేందుకు కృషి చేస్తున్నా. నా ఇంటిపై దాడితో మతానికి సంబంధం లేదు. ఇది మూక విధ్వంసం'అని పేర్కొన్నారు. కాగా, బుధవారం కాల్పుల ఘటనపై దర్యాప్తు జరిపి, కారకులపై కఠిన చర్యలు తీసుకుంటామని సీఎం బిరేన్ సింగ్ తెలిపారు. దుండగుల కోసం కురంగ్‌పట్, యయింగంగ్‌పోక్పిల్లో ఇల్లిల్లూ గాలింపు జరుగుతోందని చెప్పారు. రాష్ట్రంలోని 11 జిల్లాల్లో కర్ఫ్యూ కొనసాగుతోంది. వదంతుల వ్యాప్తిని నివారించేందుకు ఇంటర్నెట్‌పై అధికారులు నిషేధం విధించారు. ఎస్‌టీ హోదా విషయమై మణిపూర్‌లోని కుకీ, మెయితీ తెగల మధ్య కొనసాగుతున్న ఘర్షణల్లో ఇప్పటి వరకు 100 మందికిపైగా ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే.

సాక్షి 24|7
కర్ణాటక
KARNATAKA
శనివారం । 17 । జూన్ । 2023

ఈ-స్కూటర్ బాగుందే



బనశంకరి: తుమకూరు రోడ్డులో ఉన్న అంతర్జాతీయ వస్తుప్రదర్శన కేంద్రంలో మూడురోజుల పాటు నిర్వహించే అంతర్జాతీయ గ్రీన్ ఎనర్జీ ఎక్స్‌పో శుక్రవారం ప్రారంభమైంది. దేశవిదేశాలకు చెందిన 138 కంపెనీలు పాల్గొని ఎలక్ట్రిక్‌బస్సులు, చిన్నపాటికార్లు, ఎలక్ట్రిక్‌సైకిల్స్, స్కూటర్లు ప్రదర్శించాయి. ఈ సందర్భంగా పిల్లలతో కలిసి ఈ-స్కూటర్‌పైకెక్కి మహిళ సందడి చేసింది.

న్యూస్‌రీల్

ఆర్‌బీఐ ఉద్యోగి దుర్మరణం



ప్రమాదానికి గురైన కారు

దొడ్డబళ్లాపురం: రామనగర సమీపంలోని బెంగళూరు-మైసూరు ఎక్స్‌ప్రెస్‌వే పై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆర్‌బీఐ ఉద్యోగి మృతి చెందాడు. మైసూరుకు చెందిన ఆర్‌బీఐ ఉద్యోగి జగదీష్ (48) భార్య, పిల్లలతో కలిసి మైసూరు నుంచి బెంగళూరుకు కారులో బయల్దేరాడు. రామనగర శివారులోని డీబీఎల్ కార్యాలయం వద్దకు రాగానే కారు అదుపు తప్పి రోడ్డు మధ్యలో వేసిన ఇనుప ఫెన్సింగ్‌ను ఢీకొని ఎగిరిపడి వచ్చి సర్వీస్ రోడ్డులో పడింది. తీవ్రంగా గాయపడ్డ జగదీశ్‌ను ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందాడు. భార్య నందిత, ఇద్దరు పిల్లలను కెంగేరి బీజీఎస్ ఆస్పత్రికి తరలించారు.

8 మంది పాలికె ఇంజినీర్లు సస్పెండ్

బనశంకరి: నకిలీ బిల్లులు సృష్టించిన ఆరోపణలతో బీబీఎంపీకి చెందిన 8 మంది ఇంజినీర్లను నగరాభివృద్ధి శాఖ సస్పెండ్ చేసింది. కుంభకోణం దర్యాప్తు చేపట్టిన రాష్ట్ర ప్రభుత్వం బెంగళూరు రెవెన్యూ విభాగ ప్రాదేశిక కమిషనర్ అమ్లన్ ఆదిత్య బిస్వాస్‌ను విచారణ అధికారిగా నియమించింది. 2022 జనవరిలో జరిగిన కుంభకోణం విచారణ అనంతరం కర్ణాటక లోకాయుక్త అందించిన నివేదిక ఆధారంగా చర్యలు తీసుకున్నారు. బెంగళూరు గ్రామాంతర ఎంపీ డీకే.సురేశ్ అవినీతి నిరోధకశాఖ అధికారికి ఫిర్యాదు చేసిన నేపథ్యంలో లోకాయుక్త దర్యాప్తు ముమ్మరం చేసింది. బీబీఎంపీ కర్ణాటక గ్రామీణ మూలసౌకర్యాల అభివృద్ధి మండలి ద్వారా కాంట్రాక్టర్లకు పనులు అప్పగించారు. సుమారు రూ.118 కోట్లు అక్రమాలకు అధికారులు పాల్పడ్డారని నివేదికలో ప్రస్తావించారు.

జనారణ్యంలోకి జింక



కృష్ణరాజపురం: వన్యజీవులు ఆహారం కోసం అన్వేషిస్తూ అడవుల నుంచి జనావాసాల్లోకి రావడం సహజంగా మారింది. తాజాగా ఓ జింక హోసకోటెలోని కేఈబీ సర్కిల్ వద్ద ప్రత్యక్షమైంది. ఆ జింకను చూసేందుకు ప్రజలు గుమిగూడారు. ఫొటోలు, వీడియోలు తీసేందుకు పోటీలు పడ్డారు. అటవీ శాఖాధికారులు అక్కడికి వచ్చి జింకను పట్టుకుని అడవిలో విడిచిపెట్టారు.

మేకెదాటు యాత్ర కేసు రద్దు

- సీఎం, డీసీఎంకు ఊరట

శివాజీనగర: కరోనా సమయంలో మేకెదాటు ప్రాజెక్ట్ కోసం పాదయాత్ర చేపట్టిన నాటి ప్రతిపక్ష నేత సిద్దరామయ్య, కేపీసీసీ చీఫ్ డీకే శివకుమార్‌లపై నమోదైన కేసును హైకోర్టు కొట్టివేసింది. దీంతో పాటు డీకే శివకుమార్‌కు వ్యతిరేకంగా కరోనా నియమాలు ఉల్లంఘించి పాదయాత్ర చేపట్టారని నమోదైన నాలుగు కేసులు కూడా రద్దు అయినట్లయింది. సిద్దరామయ్య, డీకేశి పాటు ఇతరులు సమర్పించిన పిటిషన్‌ను విచారణ చేపట్టిన న్యాయమూర్తి ఎం.నాగప్రసన్న కేసును రద్దు చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. అంటురోగాల నియంత్రణ చట్టం సెక్షన్ 1, 5ను ఉల్లంఘించినవారు శిక్షకు అర్హులవుతారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం ఈ విషయంపై షరతులు విధించి ఎలాంటి నోటిఫికేషన్ విడుదల చేయలేదు. అందుకు బదులుగా విపత్తు నిర్వహణ చట్టం కింద నోటిఫికేషన్ విడుదల చేసింది. అందువల్ల అంటురోగాల నియంత్రణ చట్టం కింద నమోదైన కేసు, దాని విచారణకు అర్హతలేదు. అంతేకాకుండా అంటురోగాల చట్టం కింద కేసు నమోదు చేసి ఆరోపణ జాబితా సమర్పణకు అవకాశం లేదని తెలియజేసిన ధర్మాసనం కేసును రద్దు చేస్తూ ఆదేశాలు ఇచ్చింది.

ఆ చట్టాల రద్దును వ్యతిరేకిస్తూ పోరాటం చేస్తాం

శివాజీనగర: మతమార్పిడి చట్టంతో పాటు బీజేపీ అధికార అవధిలో జారీ చేసిన చట్టాలను రద్దు చేసే తీర్మానాన్ని చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటం చేస్తామని మాజీ మంత్రి ఆర్ అశోక్ అన్నారు. శుక్రవారం ఆయన బీజేపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ...కాంగ్రెస్ పార్టీ మత మార్పిడి చట్టాన్ని రద్దు చేసింది, ఈ చట్టంలో తప్పేముందని ప్రశ్నించారు. కర్ణాటకను కాంగ్రెస్ మినీ పాకిస్తాన్ చేయటానికి సిద్ధమైందని ఆరోపించిన ఆయన, ఆ పార్టీ ఓటు బ్యాంకు కోసం ఒక సామాజిక వర్గాన్ని మెప్పించేందుకు ఈ చట్టాన్ని రద్దు చేస్తున్నారని, కాంగ్రెస్ ఓటు కోసం ఈ స్థాయికి దిగజారుతున్నారని ధ్వజమెత్తారు. చట్టాల రద్దుకు వ్యతిరేకంగా బీజేపీ పోరాటం చేస్తుందన్నారు. పాఠ్య పుస్తకాల సవరణ తొందరపాటు నిర్ణయమని, ఇది పిల్లలకు ఇబ్బంది కలిగించే అంశమని విరుచుకు పడ్డారు.

సైబర్ కేటుగాళ్ల సరికొత్త పంథా

- సిలికాన్ సిటీలో పెరుగుతున్న డిజిటల్ నేరాలు
- సెల్‌ఫోన్, కంప్యూటర్లను హ్యాక్ చేసి బ్లాక్‌మెయిలింగ్
- సురక్షితమైన అప్లికేషన్ల వినియోగంతోనే దాడుల నుంచి రక్షణ
- అప్రమత్తంగా ఉండాలంటున్న నిపుణులు



బనశంకరి: సాంకేతిక పరిజ్ఞానం సైబర్‌కేటుగాళ్లకు బ్రహ్మాస్త్రంలా మారింది. కేవలం సెల్‌ఫోన్, లాప్‌టాప్ ముందేసుకొని దేశవ్యాప్తంగా నేరాలకు పాల్పడుతున్నారు. అమాయకులు, ఐటీబీటీ ఉద్యోగులు, యువతను టార్గెట్ చేస్తున్నారు. ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్ ఈ నేరగాళ్లకు మరింత ఊతమిస్తోంది. మనం ఉపయోగించే సెల్‌ఫోన్, కంప్యూటర్లలోకి మాల్‌వేర్ పంపి భద్రతాలోపాలు గుర్తించి డిస్ట్రిబ్యూటెడ్ డినైయల్ ఆఫ్ సర్వీస్(డీడీఓఎస్) లాంటి దాడులకు పాల్పడుతున్నారు. ఈ డిజిటల్ దోపిడీలనుంచి అప్రమత్తంగా ఉండటం చాలా అవసరం. ఏమరపాటుగా వ్యవహరిస్తే జీవితమే అంధకారమవుతుంది. సాంకేతిక పరికరాల సురక్షతను పెంచడం, సైబర్‌క్రైం నేరాల మాయలో పడకుండా తప్పించుకోవడానికి ఇంటర్‌పోల్ కొన్ని ప్రముఖ సలహాలు ఇచ్చింది. వాటిని అనుసరిస్తే సైబర్ కేటుగాళ్లనుంచి రక్షించుకోవచ్చు. రాన్సమ్‌వేర్.. ఇది మీ సిస్టమ్ లేదా డేటాపై తీవ్ర ప్రభావం చూపుతుంది. పూర్తిగా డీవైస్‌ను తన అధీనంలో పెట్టుకుంటుంది. ఈ మాల్‌వేర్ దాడికి చిక్కకుండా ప్రముఖ డేటాను నియమిత బ్యాకప్‌గా చేసుకోవాలి. అధికారిక అప్లికేషన్ స్టోర్స్ నుంచి మాత్రమే యాప్ డౌన్‌లోడ్ చేసువాలి. యాంటి వైరస్‌ను అప్‌డేట్ చేయాలి. కొన్ని అటాచ్‌మెంట్స్ ద్వారా మీరు మోసపోవచ్చు. దీంతో విశ్వాసపాత్రమైన అటాచ్‌మెంట్స్ మాత్రమే తెరవాలి.

డీడీఓఎస్ దాడి నుంచి రక్షణ ఇలా

డిస్ట్రిబ్యూటెడ్ డినైయల్ ఆఫ్ సర్వీస్(డీడీఓఎస్) దాడి అంటే సేవా నిరాకరణ అనే సైబర్ ఆక్రమణ ఇది. అంటే కంపెనీ నెట్‌వర్క్‌ను ఓవర్‌లోడ్ చేయడం, సర్వర్లు పూర్తిగా డౌన్‌చేయడవెబ్‌సైట్ క్రాస్ చేయడం. లేదా వెబ్‌సైట్ సేవ అందకుండా చేయడం.

- డీడీఓఎస్ దాడి నియంత్రణకు కొన్ని టిప్స్ మీ వెబ్‌సైట్ ట్రాఫిక్, నెట్‌వర్క్స్ పనితీరుపై నిఘాపెట్టడం
- నెట్‌వర్క్ భద్రత అప్‌డేట్ వ్యవస్థను పెంచడం
- ఉత్తమ సైబర్‌భద్రత వ్యవస్థ ఏర్పాటు చేసుకోవడం
- ఆక్రమణ సంకేతాలను గుర్తించడం, దాడిసమయంలో తక్షణం స్పందించి ఐటీ బృందాలను అప్రమత్తం చేయడం.

డిజిటల్ దోపిడీ

అమ్మాయిను ఎరగా చూపి దోపిడీగా పాల్పడటం ప్రస్తుత సైబర్‌కేటుగాళ్ల ట్రెండ్. అమాయకులకు ఫోన్ చేసి నగ్నచిత్రాలు లేదా వీడియోలు తీసుకుని వాటితో బ్లాక్‌మెయిల్ చేయడానికి వినియోగిస్తున్నారు. ఇలాంటి వాటికి బలిపశువులై పరువు, మర్యాదపోతుందని భయంతో సైబర్‌కేటుగాళ్లు అడిగినంత డబ్బు అందించి కన్నీరుపెడుతున్నారు. ఇలాంటి వాటికి మోసపోకుండా వంచకులనుంచి అప్రమత్తంగా ఉండటం చాలా అవసరం. అన్‌లైన్‌లో ఎవరూ ఇలాంటి ఫొటోలు, వీడియోలు షేర్‌చేయరాదు. ఇలాంటి ఘటనలు మీజీవితంలో సంభవించకుండా అడ్డుకోవడానికి పలు జాగ్రత్తలు పాటించాలి. బ్లాక్‌మెయిలర్స్ బెదిరింపులకు భయపడకుండా వారి డిమాండ్లుకు ఒప్పుకోరాదు. బెదిరింపులకు సంబంధించి ఆధారాలు సేకరించి స్క్రీన్‌క్యాప్చర్ చేసువాలి. తేదీ సమయం రాసుకుని యుఆర్‌ఎల్ గమనించాలి. భయపడకుండా అన్ని ఆధారాలతో పోలీసులకు సమాచారం అందించాలి.

ఐఏఎస్‌ల బదిలీ

శివాజీనగర: పాలనను గాడిలో పెట్టేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. అందులో భాగంగా 10 మంది ఐఏఎస్ అధికారులను శుక్రవారం బదిలీ చేసింది. ఆర్థిక విధానాల సంస్థ అదనపు డైరెక్టర్‌గా ఉన్న పల్లవి అకురథిని సకాల మిషన్ అదనపు మిషన్ డైరెక్టర్‌గా బదిలీ చేశారు. సకాల మిషన్ అదనపు మిషన్ డైరెక్టర్‌గా ఉన్న జానకి కే.ఎం.ను బాగలకోటె డిప్యూటీ కమిషనర్‌గా బదిలీ చేశారు. బెంగళూరు జలాశయాల అభివృద్ధి శాఖ కమిషనర్ డాక్టర్ వెంకటేశ్ ఎం.వి.ను బెంగళూరు పశు సంవర్ధక, పశు వైద్య సేవల కమిషనర్‌గా బదిలీ చేశారు. బీబీఎంపీ ప్రత్యేక కమిషనర్ (ప్రణాళిక) పీ.ఎస్.రవీంద్రను చిక్కబళ్లాపుర జిల్లా డిప్యూటీ కమిషనర్‌గా నియమించారు. బెంగళూరు స్మార్ట్ సిటీ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ కే.శ్రీనివాస్‌ను తుమకురు జిల్లా డిప్యూటీ కమిషనర్‌గా, స్మార్ట్ అడ్మినిస్ట్రేట్ కేంద్ర కార్యనిర్వాహక డైరెక్టర్ ముల్లై ముహిలాన్ ఎం.పీ.ను దక్షిణ కన్నడ జిల్లా డిప్యూటీ కమిషన్‌గా నియమించారు. దక్షిణ కన్నడ జిల్లా పంచాయతీ సీఈఓ డాక్టర్ కుమార్‌ను మండ్య జిల్లా డిప్యూటీ కమిషనర్‌గా బదిలీ చేశారు. బెంగళూరులో వ్యవసాయ మార్కెట్ శాఖ డైరెక్టర్ యోగేశ్ ఏ.ఎం.ను బెంగళూరు రోడ్డు, రవాణా సురక్షితా కమిషనర్‌గా నియమించారు. అదేవిధంగా చిక్కమగళూరు జెడ్పీఏ సీఈఓ ప్రభు జీ.ను కర్ణాటక విపత్తు నిర్వహణ ప్రాధికార కమిషనర్‌గా నియమించారు. కర్ణాటక సమాచార కమిషన్ కార్యదర్శి నవీన్‌కుమార్ రాజు ఎస్.ను కర్ణాటక వసతి సంస్థల సొసైటీ కార్యనిర్వాహక డైరెక్టర్‌గా బదిలీ చేస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

పెళ్లికి వెళ్లి వస్తుండగా మృత్యుపంజా





మృతులు శాంతలక్ష్మి, కుమార్తె చిన్మయి (ఫైల్)

- ఆటోను ఢీకొన్న క్యాంటర్
- తల్లీ కుమార్తె మృతి



నుజ్జయిన ఆటో

తుమకూరు: ఆటోను క్యాంటర్ ఢీకొని తల్లీకూతురు మరణించారు. మరో ఇద్దరు గాయపడ్డారు. ఈ ఘటన బండిమనే కల్యాణ మంటపం వద్ద జరిగింది. మృతులను తుమకూరు నగరం కుంటమ్మ తోటకు చెందిన శాంతలక్ష్మి (30), చిన్మయి (5)లుగా పోలీసులు గుర్తించారు. శాంతలక్ష్మి తన కుమార్తె చిన్మయి, కుమారుడు తన్మయ్‌తో కలిసి భీమసంద్రలో బంధువుల వివాహానికి వెళ్లారు. తిరిగి ఆటోలో తుమకూరు నగరానికి వచ్చారు. ఈ సమయంలో తుమకూరు వైపు నుంచి వెళుతున్న క్యాంటర్ లారీ బ్రేక్ ఫెయిల్ ఆటోను ఢీ కొట్టింది. ప్రమాదంలో తల్లీ కుమార్తె మృతి చెందగా తన్మయ్, ఆటో డ్రైవర్ గిరీశ్ తీవ్రంగా గాయపడ్డారు. తన్మయ్‌ను బెంగళూరు విక్టోరియా ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఆటో డ్రైవర్ గిరీశ్ జిల్లాస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.

ప్రేమ వ్యవహారంలో హత్య



హతుడు స్వామి (ఫైల్)

మైసూరు: తన చెల్లిని ప్రేమించాడని ఒక వ్యక్తిని స్నేహితులతో కలసి దారుణంగా చంపాడో అన్న.. ఈ ఘటన మైసూరు బెళవాడి గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన హేమంత్ అలియాస్ స్వామి (23)ని ఇదే గ్రామానికి చెందిన ఓ యువతి ప్రేమిస్తోంది. దీంతో ఆ యువతి సోదరుడు సాగర్, స్వామికి మధ్య పలుమార్లు గొడవ జరిగింది. ఇదే క్రమంలో స్వామి బైక్‌లో వెళుతుండగా వెనుక నుంచి మరో బైక్‌లో వచ్చిన సాగర్, అతని స్నేహితులు ప్రతాప్, మంజు ఢీ కొట్టారు. కింద పడిన స్వామిపై ముగ్గురూ విరుచుకుపడి కత్తులతో పొడిచారు. తలపై ఐదు సిమెంట్ ఇటుకలతో బాది హత్య చేశారు. అనంతరం బైక్‌లో పరారీ అయ్యారు. విజయనగర పోలీసులు మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించి నిందితుల అరెస్టు కోసం గాలిస్తున్నారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

మైసూరు: అప్పుల బాధతో రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన జిల్లాలోని హుణసూరు తాలూకా మూకనహళ్లి గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన హోన్నేగౌడ కుమారుడు నాగరాజ తనకున్న కొద్దిపాటి పొలంలో పంటలు సాగు చేయడంతోపాటు గొర్రెలను కూడా పెంచుతున్నాడు. ఇందుకోసం వీఎస్‌ఎస్‌ఎన్ బ్యాంకు నుంచి సుమారు రూ. 5 లక్షల రుణం, హెచ్‌డీఎఫ్‌సీ నుంచి రూ. 9 లక్షలు, వివిధ సంస్థలు, ప్రైవేటు వ్యక్తుల నుంచి కొంత మొత్తం ఇలా రూ. 50 లక్షల వరకు అప్పులు చేశాడు. ఈ క్రమంలో సాగు చేసిన పంటలు సరిగ్గా పండకపోవడంతో నష్టాలు వచ్చాయి. వ్యాపారంలో కూడా నష్టాన్ని చవిచూశాడు. ఈ క్రమంలో మనస్తాపానికి గురై తన పాత ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. హుణసూరు పట్టణ పోలీసులు మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేపట్టారు.

కలబుర్గి జిల్లాలో పేట్రేగిన ఇసుక మాఫియా

- అక్రమ రవాణాను అడ్డుకునేందుకు వెళ్లిన హెడ్‌కానిస్టేబుల్
- ఘటన స్థలంలో తీవ్ర గాయాలతో మృతి
- ట్రాక్టర్‌తో ఢీకొట్టి హత్య చేశారనే అనుమానాలు



హెడ్‌కానిస్టేబుల్ మయూరచౌహాన్ (ఫైల్)



ఇసుక ట్రాక్టర్

సాక్షి,బళ్లారి/రాయచూరు రూరల్: కలబుర్గి జిల్లా భీమానదిలో అక్రమంగా ఇసుక తవ్వకాలు చేపడుతున్న మాఫియా పేట్రేగిపోతోంది. అక్రమ ఇసుక రవాణాను అరికట్టేందుకు వెళ్లిన ఓ హెడ్‌కానిస్టేబుల్‌పై ఇసుక ట్రాక్టర్‌తో ఢీకొట్టి దారుణంగా హత్య చేసిన ఘటన గురువారం రాత్రి చోటు చేసుకుంది. జిల్లాలోని జేవర్గి తాలూకా నెలోగి పోలీసు స్టేషన్‌లో పని చేస్తున్న హెడ్‌కానిస్టేబుల్ మయూర చౌహాన్(51) సంబంధిత అధికారుల ఆదేశాల మేరకు భీమా నదిలో అక్రమ ఇసుక తవ్వకాలు, రవాణాను అరికట్టేందుకు వెళ్లాడు. హుల్లూర్ చెక్‌పోస్టు వద్ద అతను తీవ్ర గాయాలతో విగతజీవిగా పడి ఉండగా ఎస్పీ ఇశాపంత్ ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ఇసుక ట్రాక్టర్‌తో ఢీకొట్టి హత్య చేసినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఇది ఉద్దేశ పూర్వకంగా జరిగిందా? లేక ప్రమాదమా? అన్న కోణంలో దర్యాప్తు చేస్తామని ఎస్పీ తెలిపారు.

సమగ్ర విచారణకు మంత్రి ఆదేశం

కాగా హెడ్‌కానిస్టేబుల్ మృతిపై సమగ్ర విచారణకు జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి ప్రియాంక ఖర్గే ఆదేశాలు జారీ చేశారు. అక్రమ ఇసుక తవ్వకాలకు అడ్డుకట్ట వేసేందుకు గట్టి చర్యలు తీసుకుంటామని మంత్రి స్పష్టం చేశారు. కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామన్నారు.

సమాఖ్య వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్న కేంద్రం

- 20న రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ ధర్నా
- డిప్యూటీ సీఎం డీకే శివకుమార్

శివాజీనగర: అన్నభాగ్య పథకం అమలుకు రాష్ట్రానికి అవసరమున్న బియ్యం ఇవ్వలేదని కేంద్ర సర్కార్‌పై రాష్ట్ర సర్కార్ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఉప ముఖ్యమంత్రి, కేపీసీసీ అధ్యక్షుడు డీ.కే.శివకుమార్ శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ ఎఫ్‌సీఐలో బియ్యం నిల్వల ఉన్నా రాష్ట్రానికి ఇవ్వటం లేదన్నారు. ఇది సమాఖ్య వ్యవస్థను నిర్వీర్యం చేయడమేనన్నారు. దీనిని ఖండిస్తూ ఈ నెల 20న రాష్ట్రంలో అన్ని జిల్లా కేంద్రాల్లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించనున్నారని తెలిపారు. ఉచితంగా బియ్యం ఇవ్వాలని తాము కోరలేదని, అందుకు ఎంత ఖర్చు అవుతుందో చెల్లిస్తామన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రాష్ట్రంలో కేంద్ర పథకాలు స్తంభిస్తాయని గతంలో బీజేపీ జాతీయ అధ్యక్షుడు నడ్డా చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు నిజమవుతున్నాయన్నారు. కేంద్రం బియ్యం ఇవ్వకపోయినా అన్న భాగ్యం పథకం కింద జులై 1 నుంచి బియ్యం పంపిణీ చేస్తామన్నారు. రాష్ట్రానికి అవసరమైన బియ్యం ఇప్పించేందుకు కేంద్రంపై ఒత్తిడి చేయాలని ఎంపీలకు లేఖ రాసి విన్నవిస్తానని డీ.కే.శివకుమార్ తెలిపారు.

మైషుగర్ కార్యకలాపాలకు శ్రీకారం



పూజలు చేస్తున్న మంత్రి శివానంద పాటిల్

మండ్య: మైషుగర్ కర్మాగారంలో ప్రతి రోజూ 3 నుంచి 4 వేల టన్నుల చక్కెరను తయారు చేయకపోతే దాన్ని పునరుద్ధరించినా ఫలితం ఉండదని మంత్రి శివానంద పాటిల్ తెలిపారు. మైషుగర్ కర్మాగారంలో శుక్రవారం గణపతి హోమం పూజ తర్వాత బాయిలర్‌కు అగ్నిస్పర్శను సాంకేతికంగా ఆయన ప్రారంభించి మాట్లాడారు. మైషుగర్‌కు 5 వేల టన్నుల చక్కెర తయారు చేసే సామర్థ్యం ఉందని, కనీసం 3,500 టన్నుల కంటే తక్కువగా చక్కెర తయారైతే సంస్థ నష్టాలను చవిచూస్తుందని తెలిపారు. దీన్ని తప్పించాలనేదే తమ ప్రభుత్వ ఉద్దేశమని తెలిపారు. మైషుగర్ పరిధిలోని రైతులు చెరుకును ఫ్యాక్టరీకి తరలించి ఈ కర్మాగారం చక్కగా పనిచేసేందుకు సహకరించాలని పిలుపునిచ్చారు. ఏటా ఆగస్టు-సెప్టెంబర్ నెలల్లో కర్మాగారాన్ని ప్రారంభిస్తారని, అయితే ఈసారి రైతులకు అనుకూలంగా ఉండేందుకు జూన్ నెలలోనే చక్కెర తయారీని ప్రారంభించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వం నుంచి రూ. 50 కోట్లను ఒకే విడతలో విడుదల చేయనున్నట్లు చెప్పారు.

బీజేపీ హయాంలోనే మైషుగర్ ప్రారంభం

మండ్య: బీజేపీ హయాంలోనే మైషుగర్ కర్మాగారం ప్రారంభమైందని, అయితే తాజాగా మళ్లీ పునరుద్ధరించి దాన్ని పునఃప్రారంభించారని ఎంపీ సుమలతా అంబరీశ్ తెలిపారు. మైషుగర్ బాయిలర్‌కు అగ్నిస్పర్శ చేసి మంత్రులు, ఎమ్మెల్యేలు వెళ్లిన తర్వాత ప్రత్యేకంగా వచ్చిన ఎంపీ సుమలతా కేవలం పూజ చేసి అనంతరం మీడియాతో మాట్లాడారు. గతేడాది మైషుగర్ కర్మాగారాన్ని మళ్లీ బీజేపీ తెరిచిందని, దాన్ని తాజాగా మంత్రులు పూజ చేసి పునఃప్రారంభించారని ఎద్దేవా చేశారు.

జీపీ కార్యాలయంలో మేకలు కట్టేసి నిరసన



కార్యాలయంలోకి మేకలు,గొర్రెలు తోలిన దృశ్యం

దొడ్డబళ్లాపురం: బిల్లు పాస్ చేయలేదనే కోపంతో ఓ రైతు గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని పశువుల పాకగా మార్చాడు. చెన్నపట్టణ తాలూకా మైలనాయకనహళ్లి గ్రామానికి చెందిన రైతు రవి సంవత్సరం క్రితం నరేగా పథకం కింద కొట్టం నిర్మించుకున్నాడు. రూ.40 వేల బిల్ కోసం ఏడాదిగా పంచాయతీ కార్యాలయం చుట్టూ తిరిగాడు. ఫలితం లేకపోవడంతో శుక్రవారం మేకలు, గొర్రెలను తోలుకుని వచ్చి గ్రామ పంచాయతీ కార్యాలయంలో కట్టేశాడు. తగు న్యాయం చేస్తానని ఈఓ హామీ ఇవ్వడంతో రైతు శాంతించాడు.



కేంద్రం ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ శుక్రవారం కాంగ్రెస్ కార్యకర్తలు బెంగళూరు కాంగ్రెస్ భవన్ వద్ద ధర్నాకు దిగారు. రాష్ట్రానికి రావాల్సిన బియ్యం కేంద్రం నిలిపివేసిందని నిరసన వ్యక్తం చేస్తూ అక్కడే బైఠాయించారు.



కరెంట్ చార్జీల పెంపును నిరసిస్తూ కలబుర్గిలో శుక్రవారం ఎస్‌యూసీఐ కార్యకర్తల ధర్నా

లైంగిక దాడి కేసులో ఇద్దరికి 20 ఏళ్ల జైలుశిక్ష

తుమకూరు: రెండు వేర్వేరు కేసుల్లో మైనర్ బాలికలపై లైంగిక దాడికి పాల్పడిన ఇద్దరికి 20 ఏళ్ల జైలుశిక్ష, జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. వివరాలు... మధుగిరి తాలూకా బడవనహళ్లి పోలీస్ స్టేషన్ పరిధిలో పాఠశాలకు వెళ్తున్న మైనర్ బాలికపై చిక్కనాయకనహళ్లి తాలూకా హుళియారుకు చెందిన బసవరాజు అత్యాచారం చేసి బలవంతంగా వివాహం చేసుకున్నాడు. నిందితుడిపై పోలీసులు పోక్సో కేసు నమోదు చేసి కోర్టుకు చార్జ్‌షీట్ దాఖలు చేశారు. ఆధారాలను పరిశీలించిన న్యాయమూర్తి జస్టిస్ సంధ్యారావ్ నిందితుడు బసవరాజుకు 20 ఏళ్ల జైలుశిక్షతో పాటు రూ. 75 వేల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. మరో కేసులో కొరటగెరె తాలూకాలో 15 ఏళ్ల బాలికపై అత్యాచారం చేసిన నిందితుడు హనుమంతరాయ అనే వ్యక్తికి జిల్లా సెషన్స్ న్యాయస్థానం 20 ఏళ్ల జైలు శిక్షతో పాటు రూ. లక్ష జరిమానా విధించింది. ఆ బాలిక పీయూసీ చదువుతోంది. నిందితుడు బాలికకు బంధువు.. ఇంట్లో ఎవరూ లేని సమయంలో బలవంతంగా ఆమెపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. దీంతో సదరు బాలిక గర్భిణి అయింది. ఈ ఘటనపై కొరటగెరె పోలీసులు కేసు నమోదు చేసుకుని నిందితుడిని అరెస్టు చేశారు. జిల్లా సెషన్స్ న్యాయమూర్తి నిందితుడు హనుమంతరాయకు 20 జైలు, జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

మాదక ద్రవ్యాలపై ఉక్కుపాదం

- హోం మంత్రి పరమేశ్వర్



పోలీస్ కమిషనరేట్‌లో సీసీటీవీ నిఘా వ్యవస్థను పరిశీలిస్తున్న హోం మంత్రి పరమేశ్వర్, అలోక్ మోహన్, దయానంద్ తదితరులు

బనశంకరి: బెంగళూరు నగరంలో మాదకద్రవ్యాల రవాణా చాపకింద నీరులా విస్తరిస్తోందని, వాటిపై ఉక్కుపాదం మోపాలని, అదే విధంగా రౌడీల ఆగడాలకు అడ్డుకట్ట వేయాలని హోం మంత్రి పరమేశ్వర్ పోలీసులకు సూచించారు. శుక్రవారం బెంగళూరు నగర పోలీస్ కమిషనరేట్ కార్యాలయాన్ని హోం మంత్రి పరమేశ్వర్ సందర్శించి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం కమాండ్, కంట్రోల్ కేంద్రాన్ని పరిశీలించి అక్కడి సీసీ నిఘా వ్యవస్థను అడిగి తెలుసుకున్నారు. 112 అత్యవసర సేవలు, హోయ్సళ సిబ్బందికి వేలిముద్రల స్కాన్నర్, బాడీ కెమెరాలను వితరణ చేశారు. ఈ సందర్భంగా సీనియర్ అధికారులతో పరమేశ్వర్ ట్రాఫిక్ నిర్వహణ, ప్రమాదాల కేసుల నివేదికను విడుదల చేసి మాట్లాడారు. గతంలో తాను హోంమంత్రిగా పనిచేశానని, ఆ అనుభవం ఉందని ప్రభుత్వానికి మంచిపేరు తీసుకురావాలంటే పోలీసుల పాత్ర చాలా కీలకమన్నారు. పోలీస్‌స్టేషన్లలో జనస్నేహివ్యవస్థ రూపొందించాలని అన్నారు. చట్టాన్ని అతిక్రమించి ప్రవర్తించే అధికారులపై ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని దీనికి అవకాశం ఇవ్వరాదని హెచ్చరించారు. డ్రగ్స్ విక్రయాలు, వినియోగం, సరఫరాపై ప్రత్యేక నిఘా పెట్టాలన్నారు. డ్రగ్స్ ముఠాను కూకటివేళ్లతో పెకలించాలని అన్నారు. బెంగళూరులో ట్రాఫిక్ సమస్యలకు పరిష్కారం కనుగొనాలని, నగరంలో వాహనాల వేగం కనీసం 30 కిలోమీటర్లు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో డీజీపీ అలోక్‌మోహన్, నగర పోలీస్ కమిషనర్ దయానంద్, సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పాఠశాల గోడ కూలి విద్యార్థి మృతి

• మరొక విద్యార్థికి తీవ్ర గాయాలు

హుబ్లీ: పాఠశాలలో గోడ కూలి ఓ విద్యార్థి మృతి చెందగా, మరొక విద్యార్థికి తీవ్ర గాయాలైన ఘటన హుబ్లీ తాలూకా కిరేసూరు గ్రామ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం చోటు చేసుకుంది. పాఠశాలలో తరగతి గదులను నిర్మిస్తుండగా, విద్యార్థులు అక్కడికి వెళ్లడంతో గోడ కూలి విశ్వత్(9) అనే విద్యార్థి మృతి చెందగా, ప్రభు అనే విద్యార్థికి తీవ్ర గాయాలయ్యాయి. పాఠశాలలో గదులు నిర్మిస్తున్న వారు పనులు నాణ్యతగా చేపట్టకపోవడంతో గోడ కూలి విద్యార్థి మృతి చెందాడని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనపై హుబ్లీ గ్రామీణ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తా



ఎమ్మెల్యే గణేష్‌ను సన్మానిస్తున్న దృశ్యం

కంప్లి: మఠాలు, ఆలయాల అభివృద్ధికి తాను శక్తివంచన లేకుండా కృషి చేస్తానని ఎమ్మెల్యే గణేష్ పేర్కొన్నారు. ఆయనను శుక్రవారం పట్టణంలోని వీరశైవ సమాజ సంఘం, అక్క మహాదేవి మహిళా సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించిన అనంతరం మాట్లాడారు. రెండోసారి కూడా తనపై నమ్మకంతో జనం అత్యధిక మెజార్టీతో గెలిపించడం సంతోషంగా ఉందన్నారు. సన్మానం తనకు కాకుండా మీ అందరికీ చేయాల్సిన అవసరం ఉందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో వీరశైవ సమాజ ప్రముఖులు పాల్గొన్నారు.

గ్యారంటీలతోనే హస్తానికి అధికారం

కంప్లి: కాంగ్రెస్ పార్టీ ప్రజలకు అమలు సాధ్యం కాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత షరతులు విధిస్తూ ప్రజలను మోసం చేస్తే పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని మాజీ ఎమ్మెల్యే సురేష్‌బాబు పేర్కొన్నారు. ఆయన శుక్రవారం కురుగోడు పట్టణంలో ఏర్పాటు చేసిన బీజేపీ కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఐదు గ్యారంటీల ద్వారా కాంగ్రెస్ అధికారంలోకి రాగానే అన్ని పథకాలకు షరతులను పెట్టేందుకు ఆరాటపడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను ఓటమి చెందినా ఎలాంటి బాధ లేదన్నారు. ప్రజల సమస్యలు తీర్చకపోతే పోరాటం చేస్తామన్నారు. అందుకు మీ సహకారం ఎంతో అవసరం ఉందన్నారు.ఈసందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కరోనా వారియర్‌కు పరిహారమేదీ?



జిల్లాధికారితో మాట్లాడుతున్న మంజుల

రాయచూరు రూరల్: కరోనా సమయంలో విధులు నిర్వహించి మరణించిన తన భర్త మృతికి పరిహారం అందించాలని మంజుల డిమాండ్ చేశారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఎస్‌డీపీఐ అధ్యక్షుడితో కలిసి ఆమె జిల్లాధికారితో మాట్లాడారు. తన భర్త రోహిత్ రిమ్స్ పరిశోధన కేంద్రంలో కరోనా వారియర్‌గా పని చేసి కరోనా సమయంలో వ్యాధి సోకి మరణించారని తెలిపారు. మూడేళ్లు గడుస్తున్నా నేటికీ పరిహారం అందించడంలో అధికారులు నిర్లక్ష్యం వహించారని ఆరోపించారు. పరిహారం కోసం మైసూరు నుంచి వచ్చానని, తనకు న్యాయం జరిగేలా చూడాలని జిల్లాధికారి చంద్రశేఖర్ నాయక్‌ను కోరారు.

సీఈటీ ర్యాంకర్‌కు సన్మానం

• రూ.లక్ష చెక్కు పంపిణీ



విద్యార్థిని సన్మానించి చెక్కు అందిస్తున్న దృశ్యం

హుబ్లీ: ద్వితీయ పీయూసీ ఫలితాల్లో వరుసగా 14వ సారి ధార్వాడ జిల్లా నెంబర్ 1 స్థానాన్ని సాధించగా, హుబ్లీ తాలూకా భైరదేవరప్పకొప్పలోని చౌగలె విద్యాసంస్థ విద్యానికేతన్ పీయూ సైన్స్ కళాశాల విద్యార్థి సమృద్ధ శెట్టి సీఈటీ-2023లో తన ప్రతిభను చాటాడు. సీఈటీ ఇంజినీరింగ్‌లో సమృద్ధ శెట్టి రాష్ట్రంలోనే మూడో ర్యాంకు సాధించాడు. ఐఐటీ మెయిన్స్‌లో కూడా జాతీయ స్థాయిలో 31వ ర్యాంకు సాధించాడు. కాగా చౌగలె విద్యా సంస్థ చైర్మన్ శ్రీదేవి, కార్యదర్శి అనిల్‌కుమార్, ప్రిన్సిపాల్ డాక్టర్ ముళగుంద ఆధ్వర్యంలో సమృద్ధ శెట్టిని ఘనంగా సన్మానించి రూ.లక్ష చెక్కును అందించారు. అంతేగాక ఇంజినీరింగ్ విద్యాభ్యాస ఫీజులను కూడా భరిస్తామని హామీ ఇచ్చారు. విద్యార్థి సమృద్ధ శెట్టి స్పందిస్తూ మొదటి ర్యాంకు వస్తుందని ఆశించానన్నాడు. ఇంజినీరింగ్ చదువుతానన్నాడు. కాగా తమ కుమారుని సాధనపై విద్యార్థి తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

అడుగంటిన నిల్వలు..తాగునీటికి తిప్పలు

• సమస్యను పట్టించుకోని నగరసభ పాలక మండలి
• నాలుగు రోజులకు ఒకసారి నీటి సరఫరాకు చర్యలు



నీటి నిల్వ తగ్గి అడుగు భాగం పైకి కనిపిస్తున్న రాంపూర్ రిజర్వాయర్



నీటి కోసం మినీట్యాంకు వద్ద గుమికూడిన ప్రజలు

రాయచూరు రూరల్: నగరంలో తాగునీటి కోసం ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. వేసవి ముగిసిన తాగునీటి సమస్య నివారణకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఒకవైపు చెబుతుండగా మరోవైపు నగరంలో నీటి ఎద్దడి అధికమైంది. ఇటీవల జిల్లా మంత్రి బోసురాజు జిల్లాకు జలనిర్మల పథకం కింద రూ.100 కోట్లు కేటాయించామన్నారు. తాగునీటి సమస్య మాత్రం పరిష్కారం కాలేదు. నగరంలో 3 లక్షల జనాభాకు తాగునీటి ఎద్దడి సమస్య నివారణ విషయంలో నగరసభ పాలక మండలి తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తోంది. ప్రజలు మాత్రం నీటి కోసం అర కిలోమీటరు దూరంలోని మినీ ట్యాంకు వద్దకు వెళ్లి నీటిని తెచ్చుకోవాల్సి వస్తోంది. ఇప్పటికైనా నగరసభ అధికారులు చర్యలు చేపట్టి తాగునీటి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

రాంపూర్ రిజర్వాయర్‌లో తగ్గిన నీటినిల్వ

నగరానికి తాగునీటిని అందించే రాంపూర్ రిజర్వాయర్‌లో నీటి నిల్వ అడుగంటింది. నగరానికి రోజు విడిచి రోజు నీటిని సరఫరా చేసేవారు. 20 రోజుల క్రితం నుంచి నాలుగు రోజులకు ఒకసారి నీటిని విడుదల చేస్తున్నారు. తుంగభద్ర జలాశయం నుంచి నీటిని విడుదల చేయాలని మంత్రి బోసురాజు వారం రోజుల క్రితం టీబీ డ్యాం అధికారులకు లేఖ రాశారు. అధికారులు డ్యాంలో నీరు తక్కువగా ఉందని, నీటిని విడుదల చేయడం కష్టసాధ్యమని తెలిపారు. జిల్లాలోని లింగసూగూరు తాలూకా యరగుంట, సింధనూరు తాలూకా మల్లనగుడ్డలకు ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేస్తున్నారు. నగరంలోని 35 వార్డులకు ట్యాంకర్ల ద్వార నీటి సరఫరాకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. గురువారం 0.65 టీఎంసీల నీటిని తాగునీటి అవసరాల కోసం వదిలారు. ఇటీవల కలుషిత నీటిని తాగి 8 మంది మరణించిన నేపథ్యంలో నగరసభ అధికారులు ట్యాంకులను శుభ్రం చేయించారు.

గణేకల్ రిజర్వాయర్‌కు తాగునీరు విడుదల

హొసపేటె: తుంగభద్ర జలాశయం నుంచి ఎడమ గట్టు ప్రధాన కాలువ గుండా 104వ మైలు వద్ద రాయచూరు జిల్లాలోని గణేకల్ రిజర్వాయర్‌కు తాగునీటిని తుంగభద్ర బోర్డు అధికారులు విడుదల చేశారు. ఈనెల 16 నుంచి జూన్ 22 వరకు ప్రధాన కాలువకు ఉన్న అన్ని ఉప కాలువల షట్టర్ల మూసివేతకు చర్యలు తీసుకోవాలని, నిర్దేశిత పరిమాణంలో నీటిని రిజర్వాయర్‌కు చేర్చాలని తుంగభద్ర బోర్డు ప్లానింగ్ సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజినీర్ ఎల్.బసవరాజు సంబంధిత అధికారులకు సూచించారు.

విమ్స్ వైద్యకళాశాలకు దేహదానం

• అనాటమి విభాగానికి భౌతికకాయం అప్పగింత
• తండ్రి కోరికను నెరవేర్చిన తనయుడు డాక్టర్ దుర్గేష్



తండ్రి మృతదేహాన్ని అనాటమి విభాగానికి అప్పగిస్తున్న డాక్టర్ దుర్గేష్

బళ్లారి రూరల్: ఎక్కడో పుట్టి, ఎక్కడో పెరిగి, కణేకల్లు క్రాస్‌లో తనువు చాలించి, మరణానంతరం తన శరీరం వైద్యవిద్యార్థులకు ఉపయోగపడాలనుకొన్నారు హేతువాది తాడేపల్లి మణి(93). తన కోరికను ఆయన తనయుడు కణేకల్లు ఆర్‌డీటీ డైరెక్టర్ డాక్టర్ దుర్గేష్ నెరవేర్చారు. శుక్రవారం తెల్లవారుజామున కణేకల్లు క్రాస్‌లో తాడేపల్లి మణి మృతి చెందారు. 30 ఏళ్ల క్రితమే తాడేపల్లి మణి మరణ అంగీకారపత్రాన్ని రాసిపెట్టారు. ఆయన తనయుడు డాక్టర్ దుర్గేష్ విమ్స్ అనాటమి విభాగాధిపతి డాక్టర్ మల్లికార్జునకు తన తండ్రి అంగీకారపత్రాన్ని అందజేసి నిబంధనలు పూర్తి చేసి భౌతిక కాయాన్ని అప్పగించారు. తాడేపల్లి మణి కేరళలో పుట్టి నెల్లూరులో స్థిరపడ్డారు. అక్కడ మణి బుక్‌స్టాల్‌ను స్థాపించారు. సండే మార్కెట్ సీనియర్ సభ్యుడుగా కొనసాగారు. హేతువాద భావాలు కలిగిన తాడేపల్లి మణికి పౌర హక్కుల ఉద్యమకారుడు కన్నాబిరాన్, రావిపూడి వెంకటాద్రి తదితర ప్రముఖులతో పరిచయాలు ఉండేవి. శేష జీవితాన్ని కొడుకు వద్దే గడుపుతూ కణేకల్లు క్రాస్‌లో తుదిశ్వాస విడిచారు. దీంతో ఉదయం 11 గంటలకు బళ్లారి విమ్స్ అనాటమి విభాగానికి తాడేపల్లి మణి మృతదేహాన్ని డాక్టర్ దుర్గేష్ అప్పగించారు.

ఎయిమ్స్‌పై సీఎంతో చర్చిస్తా



మంత్రి బోసురాజును సన్మానించిన దృశ్యం

రాయచూరు రూరల్: రాయచూరులో ఎయిమ్స్ ఏర్పాటుకు చర్యలు చేపట్టేలా చూస్తామని రాష్ట్ర చిన్న నీటిపారుదల, సైన్స్ టెక్నాలజీ శాఖా మంత్రి బోసురాజు పేర్కొన్నారు. ఆయన శుక్రవారం మహాత్మగాంధీ మైదానంలో 400వ రోజుకు చేరిన ఆందోళనకు మద్దతు పలికి మాట్లాడారు. ఈ విషయంపై ముఖ్యమంత్రి సిద్దరామయ్యతో చర్చించి రాయచూరుకు ఎయిమ్స్‌ను కేటాయించేలా ప్రయత్నిస్తామన్నారు. ప్రజా ప్రతినిధులంతా కలిసి ఈ విషయంలో కేంద్రానికి కూడా లేఖ రాస్తామన్నారు. అంతకు ముందు పోరాట సమితి అధ్యక్షుడు బసవరాజ కళస సమస్య తీవ్రత గురించి మంత్రికి వివరించారు.

మంత్రికి సన్మానం

జిల్లాలో పచ్చదనం పెంపొందించి పర్యావరణాన్ని కాపాడాలని మంత్రి బోసురాజు అన్నారు. ఆయన శుక్రవారం జిడగామఠంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు శ్యామనూరు శివశంకరప్ప జన్మదినం సందర్భంగా మొక్కలు నాటి మాట్లాడారు. అనంతరం కిల్లే బృహన్మఠ మఠంలో మఠాధిపతి శాంతమల్ల శివాచార్య, సోమవారపేట మఠం మఠాధిపతి అభినవ రాచోటి శివాచార్య శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందించి మంత్రిని అభినందించి ఆశీర్వదించారు.

యువతి దారుణ హత్య

• ఆస్తి తగాదాలే కారణమా?

సాక్షి,బళ్లారి: ఆస్తి తగాదాలతో విజయపుర జిల్లాలో ఓ యువతిని నడిరోడ్డులో దారుణంగా హత్య చేసిన ఘటన గురువారం రాత్రి విజయపుర జిల్లా సింధగి పట్టణంలో చోటు చేసుకుంది. విజయపుర రోడ్డులోని కుబోటో ఏజెన్సీ ఎదురుగా గంగూబాయి(28) అనే యువతి తన సమీప బంధువుతో కలిసి ద్విచక్ర వాహనంలో వెళుతుండగా కారులో వెనుక నుంచి వెంబడించి వచ్చిన ముగ్గురు వ్యక్తులు మారణాయుధాలతో యువతిపై దాడి చేయడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. అనంతరం నిందితులు అక్కడి నుంచి పరారయ్యారు. ఆమెతో కలిసి వచ్చిన బంధువు దాడిని చూసి ప్రాణభయంతో పరుగులు తీశాడు. మృతురాలికి ఇంకా పెళ్లి కాలేదు. నలుగురు అక్కచెల్లెళ్లు, ఒక సోదరుడు ఉన్నారు. సింధగి బైపాస్‌లో ఏడు ఎకరాల విలువైన భూమి ఉంది. ఆమె వడ్డీ వ్యాపారం కూడా చేసేది. ఈమె ఆస్తిపై దాయాదులు కన్నేసి హత్య చేసి ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ ఘటనతో సింధగి చుట్టుపక్కల ప్రాంత ప్రజలు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. సింధగి పోలీసులు హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకుని ఆమె మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్ ధరల పెంపుపై నిరసన



అధికారికి వినతిపత్రం సమర్పిస్తున్న నేతలు

బళ్లారిటౌన్: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యుత్ ధరలను పెంచడంపై జనం ఆక్రోశం వెలిబుచ్చుతున్నారు. శుక్రవారం విద్యుత్ వినియోగదారుల సంఘం జిల్లా శాఖ ఆధ్వర్యంలో స్థానిక నగర విద్యుత్ శాఖ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సంఘం కన్వీనర్ సోమశేఖర్‌గౌడ తదితరులు మాట్లాడుతూ ఉన్నఫళంగా విద్యుత్ ధరలు పెంచి సామాన్య, పేద వర్గాల జీవితాలతో ప్రభుత్వం చెలగాటం ఆడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం పాఠశాల, కళాశాలలు తెరవడంతో తమ పిల్లలకు ఫీజులు చెల్లించడమే ప్రజలకు భారంగా మారిన తరుణంలో విద్యుత్ ధరలు పెంచడం గోరు చుట్టుపై రోకటి పోటులా మారిందన్నారు. వెంటనే పెంచిన ధరలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ జెస్కాం నగర అధికారి అశోక్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. పెంచిన విద్యుత్ ధరలను తగ్గించకపోతే దశల వారీగా పోరాటం చేస్తామన్నారు. ఆందోళన కారులు దేవదాసు, రుద్రప్ప, శాంత, మహేష్‌గౌడ పాల్గొన్నారు.

డయాలసిస్ యంత్రం అందజేత



యంత్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే రఘుమూర్తి తదితరులు

చెళ్లకెరె రూరల్: లయన్స్ క్లబ్ వారు కిడ్నీ రోగుల సహాయార్థం చెళ్లకెరె ప్రభుత్వ ఆస్పత్రికి రూ.8 లక్షల విలువైన డయాలసిస్ యంత్రాన్ని ఉచితంగా అందించడం హర్షణీయమని ఎమ్మెల్యే టీ.రఘుమూర్తి తెలిపారు. ఆయన శుక్రవారం డయాలసిస్ యంత్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వంతో పాటు సంఘ సంస్థలు చేతులు కలిపినప్పుడే రోగులకు మరింత మేలు చేకూరుతుందన్నారు. ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ వెంకటేష్, క్లబ్ జిల్లాధ్యక్షుడు ఎంకే.భట్, తాలూకా అధ్యక్షులు ఎస్‌కే.మరళి, సభ్యులు మహమ్మద్ మజార్ అలీ, సి.సిద్దార్థ, ఎస్ఎం.రవి తదితరులు పాల్గొన్నారు.

షామియానా కూలి పడి మహిళ మృతి

గంగావతి రూరల్: కారటగి తాలూకా ముష్టూరు క్యాంపులో గురువారం ఈదురుగాలులకు షామియానా కూలి మీద పడడంతో ఓ మహిళ మృతి చెందగా, మరో నలుగురు గాయపడ్డారు. వివరాలు..గ్రామంలో అంజమ్మ(45) అనే మహిళ దైవ కార్యక్రమంలో వంటలను సిద్ధం చేస్తుండగా షామియానా కుప్పకూలింది. తీవ్రంగా గాయపడిన ఆమెను గంగావతి ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ ప్రమాదంలో గాయపడిన శామీదాబీ(48), శృతి(23), దుర్గమ్మ(40), శారద(30) అనే మరో నలుగురిని కొప్పళ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. వారికి మెరుగైన వైద్యం అందించాలని కొప్పళ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి శివరాజ్ ఎస్ తంగడిగి వైద్యులకు సూచించారు. కాగా ఈ సంఘటనలో బాధితులకు ప్రభుత్వ నుంచి పరిహారం అందించేందుకు మంత్రి సోదరుడు సంబంధిత జిల్లాధికారితో పాటు తహసీల్దార్‌తో మాట్లాడి ప్రభుత్వానికి మనవి చేస్తామన్నారు. ఈ ఘటనపై గంగావతి గ్రామీణ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

రేకలమరడిలో అధికారుల పర్యటన

రాయచూరు రూరల్: ఇటీవల కలుషిత నీరు తాగి ఓ బాలుడి మరణంతో పాటు 30 మంది అస్వస్థతకు గురైన జిల్లాలోని దేవదుర్గ తాలూకా రేకలమరడిలో శుక్రవారం వైద్య శాఖ ప్రత్యేక అధికారుల బృందం పర్యటించి పరిశీలించింది. గ్రామంలో నీటి ట్యాంక్‌ను ఏళ్ల తరబడి శుభ్రం చేయక పోవడం, నీటి పైపు లైన్ల లీకేజీతో మురుగు కాలువల నీరు చేరి సరఫరా కావడంపై పంచాయతీ అధికారుల నుంచి వివరాలు సేకరించారు. కొందరు గ్రామస్తులు ఆరోగ్య శాఖ కమిషనర్ ప్రియాంక మేరి, అధికారుల బృందాన్ని చుట్టుముట్టి ఆందోళనకు దిగి మంచినీరు సరఫరాను మెరుగుపరచాలని ఒత్తిడి చేశారు.

ఉచిత బస్సు ప్రయాణం మాకొద్దు.!

• ఉత్తర కర్ణాటకలో నిరాకరిస్తున్న కొందరు నారీమణులు



తల్లీ బిడ్డలకు టికెట్ తీసుకున్న మహిళ విద్యా

రాయచూరు రూరల్: రాష్ట్రంలోని కాంగ్రెస్ సర్కార్ ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం మహిళలకు కల్పించిన ఉచిత బస్ ప్రయాణాన్ని ఉత్తర కర్ణాటకలో కొందరు నారీమణులు తిరస్కరించిన వైనం వెలుగు చూసింది. ఆధార్ కార్డులు చూపి మహిళలు ఉచితంగా బస్సుల్లో ప్రయాణిస్తే ఆర్టీసీ సంస్థకు, ప్రభుత్వానికి ఆర్థికంగా నష్టం సంభవిస్తుందన్న విషయాన్ని గుర్తెరిగిన కొందరు మహిళలు అక్కడక్కడ స్వచ్ఛందంగా కండక్టర్‌కు డబ్బులిచ్చి టికెట్‌ను కొని ప్రయాణిస్తున్నారు. బాగల్‌కోటె జిల్లా ఇలకల్ తాలూకా అమీన్ గడ గ్రామ పంచాయతీ ఉపాధ్యక్షురాలు శంక్రమ్మ అమీన్‌గడ నుంచి కమతగికి డబ్బు చెల్లించి టికెట్ కొని ప్రయాణించింది. ప్రభుత్వం ఉచిత పథకాల పేరుతో పేద, మధ్య తరగతి ప్రజలకు వరాలిచ్చి వివిధ రకాలుగా పన్నులు పెంచే బదులు ఆరోగ్య, విద్యా రంగాలకు ఉచితాలను కేటాయించాలన్నారు. కల్యాణ కర్ణాటకలోని యాదగిరి జిల్లాలో కూడా ఓ మహిళ కూడా ఉచిత బస్ ప్రయాణాన్ని నిరాకరించింది. యాదగిరి డిపో నుంచి గురుమటకల్‌కు వెళుతున్న ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న విద్యా అనే మహిళ తన ఇద్దరు కుమార్తెలకు టికెట్ తీసుకొని ప్రయాణించారు. ప్రభుత్వాలు ప్రజలను ఉచిత పథకాల పేరుతో సోమరులుగా తయారు చేసే బదులు పిల్లలకు ఉచిత విద్య, పేదలకు ఇళ్లు ఉచితంగా కట్టించి ఇవ్వాలన్నారు.

శక్తి యోజనకు స్పందన భేష్

• నానాటికీ పెరుగుతున్న మహిళా ప్రయాణికులు

హుబ్లీ: రాష్ట్ర వ్యాప్తంగా ఈనెల 11 నుంచి ప్రారంభమైన ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించే శక్తి యోజనకు రోజురోజుకు ఉత్తమ స్పందన వ్యక్తమవుతోంది. ఈక్రమంలో ప్రజలు ప్రయాణ సమయంలో తగిన జాగ్రత్తలతో భద్రతపై దృష్టి సారించాలని వాయువ్య ఆర్టీసీ సంస్థ ఎండీ ఎస్.భరత్ ఓ ప్రకటనలో తెలిపారు. సంస్థ ఆధ్వర్యంలో ధార్వాడ, బెళగావి, బాగల్‌కోటె, గదగ్, హావేరి, ఉత్తర కన్నడ జిల్లాల్లోని బస్సుల్లో శక్తి యోజన ప్రారంభ రోజున 1.22 లక్షల మంది మహిళలు ప్రయాణించినట్లు తెలిపారు. రోజురోజుకు ప్రయాణిస్తున్న మహిళల సంఖ్య పెరుగుతోందని, ఈనెల 14వ తేదీన 12.72 లక్షల మంది మహిళలు ప్రయాణించారని తెలిపారు. ప్రయాణికుల భద్రతకు పలు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. సీనియర్ అధికారులతో పాటు అన్ని డివిజన్ల డీసీలు నిరంతరం పరిస్థితిని సమీక్షిస్తున్నట్లు తెలిపారు. ప్రయాణికులతో స్నేహంగా మెలగాలని డ్రైవర్, కండక్టర్లకు సూచించినట్లు తెలిపారు.

సకాలంలో రుణాలు చెల్లించండి



మాట్లాడుతున్న బ్యాలహళ్లి గోవిందగౌడ

కోలారు: మహిళా స్త్రీశక్తి స్వసహాయ సంఘాలు తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించి బ్యాంకు విశ్వాసాన్ని నిలుపుకోవాలని డీసీసీ బ్యాంకు అధ్యక్షుడు బ్యాలహళ్లి గోవిందగౌడ తెలిపారు. శుక్రవారం నగరంలోని బ్యాంకు సభాంగణంలో ఏర్పాటు చేసిన అధికారుల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వ తీర్మానాలకు, బ్యాంకుకు ఎలాంటి సంబంధం లేదన్నారు. కొంతమంది కొత్త ప్రభుత్వంలో మహిళా సంఘాల రుణాలు మాఫీ చేస్తారని చేస్తున్న ప్రచారాలను నమ్మవద్దన్నారు. సకాలంలో తీసుకున్న రుణాలు తిరిగి చెల్లించకుంటే వడ్డీ మీద పడుతుందన్నారు. పైగా బ్యాంకు ఇతర మహిళా సంఘాలకు రుణాలు ఇవ్వడానికి సాధ్యం కాదన్నారు. సమావేశంలో డీసీసీ బ్యాంకు సభ్యుడు యలవార సొణ్ణేగౌడ, అధికారులు భాను ప్రకాష్, మంగళగౌడ తదితరులు పాల్గొన్నారు.

కోలారు వార్తలు...

నీరు నింపి గొర్రెల విక్రయ దందా

• అధిక బరువు తూగాలని విక్రేతల పథకం



గొర్రెల కడుపులోకి పైపులతో నీటిని నింపుతున్న దృశ్యం

శ్రీనివాసపురం: గొర్రెలు అధిక బరువు తూగడం ద్వారా అధిక లాభాలను ఆర్జించవచ్చనే ఉద్దేశంతో గొర్రెల పెంపకందారులు వాటికి నీటిని నింపి సంతలో విక్రయిస్తున్నారు. తాలూకాలోని రోజర్‌పల్లి సంతకు మండ్య జిల్లా మద్దూరు, మళవల్లి, కిరుగావలు వైపు నుంచి కోలారు, చిక్కబళ్లాపుర జిల్లాల పలు సంతలకు బండూరు రకం గొర్రెలను తీసుకు వస్తారు. ఇలా టెంపోల్లో తీసుకొచ్చిన గొర్రెలను సంతకు తీసుకెళ్లడానికి కొద్ది సమయం ముందు కొంత దూరంలో టెంపోను ఆపి గొర్రెల కడుపులోకి పైపుల ద్వారా నీటిని నింపుతారు. తద్వారా గొర్రెల కడుపు మరింతగా ఉబ్బుతుంది. ఇలా ఉబ్బిన కడుపును కలిగిన గొర్రెలు అధిక బరువు కలిగి అధిక ధర పలుకుతాయి. అధిక ఆదాయం కోసం సంతల్లో పన్నులు వసూలు చేసేవారు గొర్రె పిల్లలకు ఉచితంగా నీటిని సరఫరా చేస్తున్నారు.

కొద్ది రోజులకే గొర్రెల మృత్యువాత

రోజర్‌పల్లి సంతకు మండ్య జిల్లా నుంచి ప్రతి వారం రెండు వేల గొర్రెలను తీసుకు వస్తారు. రైతులు వీటిని అధిక ధరలు పెట్టి కొనుగోలు చేస్తున్నారు. అయితే ఇలా కొనుగోలు చేసిన గొర్రెలు కొద్ది రోజులకు జలుబు, జ్వరం తదితరాలతో మరణిస్తున్నాయి. గొంతులో నీటి పైపును తురిమి నీటిని నింపడం వల్ల గొంతు పుండు అయ్యి మేత మేయకుండా కొద్ది రోజులకు రోగపీడితమై చనిపోతున్నాయి. ఇలాంటి గొర్రెలను ఖరీదు చేసిన రైతులు గొర్రెలు మరణించిన అనంతరం ఈ దందాను పోలీసులు, అధికారుల దృష్టికి తీసుకు వచ్చినా ఎలాంటి ఫలితం కనిపించడం లేదని స్థానిక రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు కళ్లు తెరిచి ఈ దందాను అరికట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

రైతులకు నష్టపరిహారం ఇవ్వాలి



దెబ్బ తిన్న పంటను చూపుతున్న సంఘం సభ్యులు

కోలారు: నకిలీ పట్టు పురుగులతో నష్టపోయిన పట్టు రైతులకు ప్రతి 100 గుడ్లకు రూ.లక్ష చొప్పున పరిహారం అందించాలని, దుబారి చాకీ పురుగుల ధరల నియంత్రణకు బృందాన్ని రచించి మద్దతు ధర ప్రకటించాలని రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.నారాయణగౌడ డిమాండ్ చేశారు. నాణ్యత లేని పట్టు చాకీ పురుగులను పంపిణీ చేయడం వల్ల పలువురు రైతులు దిగుబడి సరిగా లేక తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. దీనికితోడు పట్టు చాకీ కేంద్రాల వారు అధిక ధరలకు చాకీ పురుగులను విక్రయిస్తున్నారన్నారు. అవి కూడా నాణ్యతగా లేకపోవడం వల్ల పంటలు సరిగా చేతికి అందడం లేదన్నారు. ఇలాంటి వారిపై చర్యలు తీసుకుని నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలని ఒత్తిడి చేశారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మంజునాథ్ పాల్గొన్నారు.

అర్బన్ బ్యాంకు కార్యవర్గం ఏకగ్రీవ ఎంపిక

కోలారు: కోలారు అర్బన్ బ్యాంకు నూతన అధ్యక్ష, ఉపాధ్యక్ష స్థానానికి జరిగిన ఎన్నికల్లో అధ్యక్షుడిగా డీపీఎస్ మునిరాజు, ఉపాధ్యక్షుడిగా వెంకటేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శుక్రవారం బ్యాంకు ప్రాంగణంలో నిర్వహించిన ఎన్నికల్లో అధ్యక్ష స్థానానికి మునిరాజు, ఉపాధ్యక్ష స్థానానికి వెంకటేష్ మాత్రమే నామినేషన్ వేయడంతో వీరి ఎన్నిక ఏకగ్రీవమైంది. ఎన్నికల అధికారిగా వ్యవహరించిన ఐఎం హబీబ్ వీరు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించారు. అనంతరం నూతన అధ్యక్ష, ఉపాధ్యక్షులకు బ్యాంకు పదాధికారులు, సిబ్బంది అభినందనలు తెలిపారు. ఆ తర్వాత నూతన అధ్యక్షుడు మునిరాజు మాట్లాడుతూ అందరి సహకారంతో బ్యాంకును అభివృద్ధిలోకి తీసుకెళతానన్నారు. జిల్లాలో సహకార బ్యాంకులకు ఉత్తమ భవిష్యత్తు ఉందని, ఉత్తమ పాలన అందించడం ద్వారా అర్బన్ బ్యాంకును అభివృద్ధిలోకి తెస్తానన్నారు. ఈ సందర్భంగా అర్బన్ బ్యాంకు మాజీ అధ్యక్షుడు రాజణ్ణ, జిల్లా జాగృతి సమితి సభ్యుడు బెళమారనహళ్లి ఆనంద్, డీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రాజకుమార్ తదితరులు పాల్గొన్నారు.

హంప్‌లతో ప్రమాదాలకు చెక్



రోడ్డుపై హంప్‌లను దాటుతున్న కార్లు

కేజీఎఫ్: కేజీఎఫ్-బంగారుపేట రోడ్డులో పైలెట్స్, కోరమాండల్, హెనర్సిల వద్ద ద్విచక్రవాహనాల్లో వెళ్లేవారు అతివేగంగా వెళుతూ తరచుగా ప్రమాదాల బారిన పడుతున్న సందర్భాలు ఉన్నాయి. దీంతో ఇక్కడ రోడ్డుపై హంప్‌లు నిర్మించాలని స్థానికులు కోరడంతో ఎమ్మెల్యే రూపా శశిధర్ ఆదేశాల మేరకు పీడబ్ల్యూడీ శాఖ అధికారులు శుక్రవారం రోడ్డుపై హంప్‌లను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పీడబ్ల్యూడి శాఖ అధికారి రాజశేఖర్ తదితర అధికారులు ఉన్నారు. తమ వినతి మేరకు రోడ్డుపై హంప్‌లను ఏర్పాటు చేయడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

రుణాలు చెల్లించేది లేదు

• తెగేసి చెప్పిన స్త్రీశక్తి సంఘాల సభ్యులు



రుణాలు చెల్లించబోమని బ్యాంకు అధికారికి చెబుతున్న మహిళలు

శ్రీనివాసపురం: మహిళా స్త్రీశక్తి సంఘాలు తీసుకున్న రుణాలు మాఫీ చేస్తామని ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని, రుణాలు చెల్లించేది లేదని రుణాల వసూలు కోసం వచ్చిన బ్యాంకు అధికారికి ముళబాగిలు తాలూకా భైరకూరు ఫిర్కా హీరేగౌడనహళ్లి గ్రామానికి చెందిన మహిళలు తెగేసి చెప్పారు. శుక్రవారం రుణాల వసూళ్ల కోసం వచ్చిన బ్యాంకు అధికారిని ప్రభుత్వ హామీపై మహిళలు నిలదీశారు. రుణాల వసూళ్లకు వస్తే గ్రామంలోనే తాడుతో కట్టివేస్తామని, తమకు రుణాలు మాఫీ చేస్తామని మాట ఇచ్చి తప్పిన ముఖ్యమంత్రి వద్దనే రుణాలు వసూలు చేసుకోండని తెలిపారు. ఈ సందర్భంగా మహిళలు మునిలక్ష్మమ్మ, గీతా, మునిలక్ష్మి, నాగరత్న, నారాయణమ్మ, శోభా, శైలా తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

సజ్జల రామకృష్ణారెడ్డి జన్మదిన వేడుకలు



సాక్షి బెంగళూరు: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణా రెడ్డి జన్మదిన వేడుకలు శుక్రవారం బెంగళూరులో ఘనంగా జరిగాయి. పుట్టినరోజును పురస్కరించుకుని వైఎస్సార్‌సీపీ ప్రతినిధులు, అభిమానులు, కార్యకర్తలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. బెంగళూరు కాడగోడిలోని బెలతూరు ఉన్న శబరి ఆశ్రయధామ ఆశ్రమంలో అల్పాహారం, పండ్లు అందించారు. అనంతరం కేక్ కట్ చేసి పంచిపెట్టారు.

చిక్కబళ్లాపురం జిల్లా కలెక్టర్‌గా రవీంద్ర



చిక్కబళ్లాపురం: బీబీఎంపీ విశేష ప్రాధికార కమిషనర్‌గా ఉన్న రవీంద్రను చిక్కబళ్లాపురం జిల్లా కలెక్టర్‌గానియమిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఇక్కడ కలెక్టర్‌గా ఉన్న ఎన్‌ఎం నాగరాజుకు ఇంకా పోస్టింగ్ ఇవ్వలేదు.

మూడు కార్లు అపహరణ

మైసూరు: నెల రోజుల వ్యవధిలో ఒకే ప్రాంతంలో మూడు విలువైన కార్లు దొంగతనానికి గురైన ఘటన మైసూరులో జరిగింది. రెండు ఇన్నోవా, ఒక ఫార్చునర్ కారును దొంగలు అపహరించారు. విజయనగర, నివేదితా నగరలో ఇంటి ముందు పార్కింగ్ చేసి ఉన్న కార్లను దొంగతనం చేశారు. నిర్మితి కేంద్రం విశ్రాంత డైరెక్టర్ మంజునాథ్ ఇంటి ముందు నిలిపి ఉన్న ఇన్నోవా క్రిస్టా కారు, వ్యాపారవేత్త సంతోష్‌కు చెందిన ఫార్చునర్, మాజీ మంత్రి కోటె శివణ్ణకు చెందిన ఇన్నోవా కారును అపహరించారు. దొంగతనానికి సంబంధించిన దృశ్యాలు సీసీ టీవీలో రికార్డయ్యాయి. అయితే ఇప్పటివరకు దొంగల ఆచూకీ లభ్యం కాలేదు.

అనుభవజ్ఞుడు చేయాల్సిన పనికాదు

తుమకూరు: పాఠ్యాంశాలను చూడకుండానే కేవలం ఒక సామాజిక వర్గం ఓటు బ్యాంక్ కోసం ఆర్‌ఎస్‌ఎస్ పాఠాలను ఏకపక్షంగా తొలగించడం సరికాదని, ఒక అనుభవజ్ఞుడైన ముఖ్యమంత్రి చేయాల్సిన పని ఇది కాదని మాజీ విద్యాశాఖ మంత్రి బీసీ నాగేశ్ విమర్శించారు. తాము అధికారంలో ఉన్నప్పుడు ఎలాంటి పాఠ్యాంశాలను తొలగించామో వాటినే తిరిగి చేర్చి వివాదం సృష్టిస్తున్నారని తిపటూరులో మీడియాతో నాగేశ్ తెలిపారు. పాఠ్యాంశాల్లో తాము చేర్చిన హెడ్గేవార్, సావర్కర్ భాగాలను తొలగించి తిరిగి టిప్పుసుల్తాన్ పాఠాలను చేర్చడం సరికాదన్నారు.

ఒక చేత్తో ఇచ్చి ఇంకో చేత్తో లాక్కుంటోంది

- సర్కార్‌పై ఎంపీ రాఘవేంద్ర రుసరుస

శివమొగ్గ: గ్యారంటీ పథకాలను కాంగ్రెస్ సర్కార్ ఒక చేతితో ఇచ్చినట్లు ఇచ్చి ధరల పెంపు ద్వారా ఇంకో చేతితో ప్రజల నుంచి డబ్బు లాక్కుంటోందని ఎంపీ రాఘవేంద్ర ఆరోపించారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం 9 ఏళ్ల పాలన పూర్తయిన సందర్భంగా శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ గ్యారంటీ పథకాలపై తమకు ఎలాంటి అభ్యంతరం లేదని, అయితే ధరలు పెంచి ప్రజలపై భారం మోపడం దారుణమన్నారు.

డ్రైవర్ హత్య

యశవంతపుర: లారీ డ్రైవర్‌ను దారుణంగా హత్య చేసి వాహనంలో తరలిస్తున్న తామ్రం వస్తువులను దోపిడీ చేసిన ఘటన హావేరి సమీపంలో జరిగింది. శుక్రవారం తెల్లవారుజామున జామున జాతీయ రహదారి మీరజ్ నుంచి చెన్నైకి వెళ్తున్న లారీని అడ్డగించి డ్రైవర్ గోవింద నారాయణ ఖండేకర (40)ను హత్య చేసి హావేరి మార్గంలో రోడ్డు పక్కలో శవాన్ని పడేశారు. అనంతరం లారీలో ఉన్న కోట్ల విలువగల 13 టన్నుల తామ్రంను మరో లారీలోకి లిఫ్ట్ చేసి పరారయ్యారు. నిందితుల కోసం గాలిస్తున్నారు.

బస్సు డ్రైవర్ నిర్లక్ష్యంతో ప్రయాణికుడి మృతి

మైసూరు: మలుపు వద్ద బస్సును డ్రైవర్ వేగంగా నడపడటంతో అందులో ప్రయాణిస్తున్న వ్యక్తి బయటపడి మృతి చెందాడు. ఈ ఘటన మైసూరు జిల్లా టీ నరసీపుర తాలూకా సాసలే గ్రామం వద్ద జరిగింది. మళవళ్లికి చెందిన సిద్ధప్ప (50) టి.నరసీపుర తాలూకా సిద్ధనహుండి గ్రామంలో నివాసం ఉంటున్నాడు. కుమారుడిని చూసేందుకు శుక్రవారం బస్సు ఎక్కాడు. సాసలే గ్రామం వద్ద మలుపులో బస్సును డ్రైవర్ వేగంగా తిప్పడంతో వెనుక కూర్చొన్న సిద్ధప్ప ఒక్కసారిగా బయటపడిపోయి కిందపడి మరణించాడు. పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

ఎమ్మెల్యే కార్యాలయం ప్రారంభం

మండ్య: తాలూకా కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఎమ్మెల్యే కార్యాలయాన్ని మేలుకోటె నియోజకవర్గ ఎమ్మెల్యే దర్శన్ పుట్టణ్ణయ్య శుక్రవారం ప్రారంభించారు. వారానికి ఒకసారి తాను ఈ కార్యాలయంలో అందుబాటులో ఉంటానన్నారు.

కేజీఎఫ్ కార్మికుల బతుకు పోరాటం



అరకొర సౌకర్యాలతో అవస్థలు



కనీస సౌకర్యాలు లేని షెడ్లు



మూతపడిన బంగారు గనులు

- పాడుబడిన ఇళ్లల్లోనే నివాసం
- కరువైన మౌలిక సదుపాయాలు
- ఏళ్లు గడచినా అందని గ్రాట్యుటీ

కేజీఎఫ్: వేల ఏళ్ల చరిత్ర కలిగిన కేజీఎఫ్ గనులు 2001లో మూతబడ్డాయి. అప్పటి వరకు అక్కడ కార్మికులుగా పనిచేస్తున్న వేలాది మంది రోడ్డున పడ్డారు. మరో ఉపాధి లేక అర్ధాకలితో జీవిస్తున్నారు. 22 ఏళ్లు గడచినా 3500 కుటుంబాలకు రూ. 52 కోట్ల గ్రాట్యుటీ మొత్తాన్ని ఇంత వరకు ఇవ్వలేదు. బంగారు గనులు నడుస్తున్న సమయంలో కార్మికుల కుటుంబాలకు తాగునీరు, శౌచాలయాల నిర్వహణ, విద్యుత్ తదితర సౌలభ్యాలను కేంద్ర ప్రభుత్వం అందించేది. ప్రస్తుతం కేంద్రం వాటిని నిలిపి వేసింది. దీంతో కార్మికుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.

కష్టాలు ఎవరూ పట్టించుకోరు :

40 సంవత్సరాలకు పైగా నివాసం ఉంటున్న కార్మిక కుటుంబాలకు అదే స్థలానికి హక్కు పత్రాలు ఇవ్వాలనే ఆదేశాలు ఉన్నా పట్టించుకోవడం లేదు. కనీసం వారు నివాసం ఉంటున్న ఇళ్లను కూడా మరమ్మతు చేసుకోవడానికి బీజీఎంఎల్ అధికారులు అనుమతి ఇవ్వలేదని కార్మికులు ఆరోపిస్తున్నారు. వంద సంవత్సరాలకు పైగా గనుల్లో కార్మికులుగా పనిచేసి లక్షల కొద్ది టన్నుల బంగారాన్ని వెలికి తీసిన కార్మికుల కష్టాలకు ప్రభుత్వం స్పందించడం లేదని, కనీసం ఇంటి ముందు మరుగుదొడ్డిని కూడా నిర్మించుకోవడానికి అధికారులు అనుమతి ఇవ్వడం లేదని వారు ఆరోపిస్తున్నారు. మహిళలు, వృద్ధులు బయలు ప్రదేశానికి వెళ్లాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మౌలిక సౌలభ్యాలను అందించాలని కార్మిక కుటుంబాలు డిమాండ్ చేస్తున్నాయి.

మౌలిక సదుపాయాలు కల్పించాలి

ప్రభుత్వం శౌచాలయాలు నిర్మించుకోవాలని చెబుతోంది. అయితే బీజీఎంఎల్ అధికారులు మాత్రం అందుకు అనుమతి ఇవ్వడం లేదు. 125 సంవత్సరాలుగా గనులలో పనిచేసినందుకు కేంద్ర ప్రభుత్వం తమకు అందించిన బహుమానం ఇదే. కేజీఎఫ్ ప్రాంతంలో నేటికి కార్మిక కుటుంబాలు బయలు శౌచాలయంపైనే ఆధారపడి ఉండడం శోచనీయం. ప్రభుత్వం వెంటనే కార్మిక కుటుంబాలకు మౌలిక సౌలభ్యాలు కల్పించాలి.

-- మనోహర్, కార్మికుడు :

మహిళలు ఇబ్బందులు పడుతున్నారు

శౌచాలయాలు లేకపోవడం వల్ల మహిళలు తీవ్ర ఇబ్బంది పడాల్సి వస్తోంది. శౌచాలయానికి వెళ్లడానికి రాత్రి వరకు వేచి ఉండాల్సిన పరిస్థితి. రాత్రి సమయాలలో తేళ్లు, విష పురుగుల భయం ఉందని, ప్రభుత్వం ఇప్పటికైనా కళ్లు తెరచి కార్మికుల కాలనీలలో మౌలిక సౌలభ్యాలను అందించి సమస్యలను పరిష్కరించాలి.

–రమణమ్మ, బిజిఎంఎల్ కార్మిక కాలనీ నివాసి

బాలికను చితకబాదిన టీచర్



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాలిక

చింతామణి: మంచి మార్కులు రాలేదని ఆగ్రహించిన ఓ టీచర్ చిన్నారిని బెత్తంతో విచక్షణారహితంగా కొట్టింది. వివరాలు.. పట్టణంలోని ట్యాంక్‌బండ్ ప్రాంతానికి చెందిన దయానంద్ కుమార్తె పట్టణంలోని ప్రీతి పబ్లిక్ పాఠశాలలో 4వ తరగతి చదువుతోంది. పరీక్షల్లో మంచి మార్కులు రాలేదని టీచర్ సింధుశ్రీ ఆ చిన్నారిని బెత్తంతో చితకబాదింది. కాళ్లు, చేతులు వాచిపోయి చిన్నారి ఏడుస్తుండటంతో తల్లిదండ్రులు ఆరా తీయగా టీచర్ దాష్టీకం వెలుగు చూసింది. బాలికను ఆస్పత్రికి తరలించిన తండ్రి.. పాఠశాలకు వెళ్లి ఆరా తీయగా సరైన సమాధానం ఇవ్వలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. బీఈఓ వెంకటేశ్ నివేదిక ఆధారంగా కాగా సదరు టీచర్‌ను ఆ పాఠశాల యాజమాన్యం సస్పెండ్ చేసింది.

ఐదేళ్లు సీఎంగా ఉండాలని సిద్ధు కోరిక

మైసూరు: సిద్ధరామయ్యకు ఐదేళ్లు ముఖ్యమంత్రిగా ఉండాలని ఆశ అని, అందుకే కాంగ్రెస్ పార్టీ నాయకులను ప్రసన్నం చేసుకుంటున్నారని బీజేపీ ఎంపీ ప్రతాప్ సింహా విమర్శించారు. శుక్రవారం మైసూరు చామరాజపురంలోని బీజేపీ కార్యాలయంలో మీడియాతో ఆయన మాట్లాడుతూ... సిద్ధరామయ్య తనను రాజకీయ అజ్ఞాని, మూర్ఖుడు అని సంబోధించాడని, అయితే తనకు అందుకు పెద్ద బాధ ఏమి లేదు కానీ, తాను అడిగే కొన్ని ప్రశ్నలకు ఆయన సమాధానం ఇవ్వాలని చెప్పారు. సిద్ధరామయ్య పెద్ద బుద్ధిమంతుడు అనుకుంటున్నాడు కదా.. అయితే రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగా తెలిసి కూడా రూ. 59 వేల కోట్లు ఖర్చు అయ్యే గ్యారెంటీ పథకాలను ఎలా ప్రకటించారని ప్రశ్నించారు. మీకు రాజకీయంగా జన్మనిచ్చిన దేవెగౌడ గురించి అగౌరవంగా మాట్లాడే మీ బుద్ధి తనకు వద్దని ఎద్దేవా చేశారు. గతంలో సిద్ధరామయ్య హయాంలో హత్యలు, ఆత్మహత్యలు జరిగాయని, తాజాగా మరోసారి శాంతిభద్రతలకు విఘాతం కలిగే పరిస్థితులు వస్తాయన్నారు.

ఇద్దరు యువకులపై దాడి

- ఒకరి మృతి

బనశంకరి: ఇద్దరు యువకులపై కొందరు వ్యక్తులు దాడికి పాల్పడిన ఘటనలో ఒకరు మృతి చెందగా మరొకరు గాయపడ్డారు. ఈ ఘటన రామమూర్తినగర పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఇరద్రాజ్(22), విజయ్ అనే ఇద్దరు రామమూర్తినగరలో నివాసం ఉంటున్నారు. చిన్నపాటి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈనెల 14 తేదీ రాత్రి బైక్‌లో వెళ్తుండగా విజనాపుర వద్ద రాజేశ్ అనే వ్యక్తి తన అనుచరులతో కలిసి అడ్డుకున్నారు. మా ఏరియాకు ఎందుకు వచ్చారంటూ ప్రశ్నించాడు. మీరెవరు అడగటానికి అని ఎదురు ప్రశ్నించిన ఇరద్రాజ్ తలపై కొడవలితో దాడి చేశాడు. విజయ్‌పై కూడా దాడిచేసి పంపించారు. ఇద్దరూ ఇంటికి వెళ్లి గాయాలకు మందు రాసుకొని పడుకున్నారు. మరుసటిరోజు ఉదయం నిద్రలేచి చూడగా ఇరద్రాజ్ విగతజీవిగా కనిపించాడు. విజయ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు రామమూర్తినగర పోలీసులు రాజేశ్‌పై కేసు నమోదు చేసి గాలిస్తున్నారు.

చిన్నారి అపహరణ

యశవంతపుర: భార్య భర్తల మధ్య గొడవ జరిగి భర్త ఆరేళ్ల కొడుకును అపహరించిన ఘటన బెంగళూరులో శుక్రవారం ఉదయం కొడిగేహళ్లి పోలీసుస్టేషన్ పరిధిలోని జీకేవీకే సమీపంలో జరిగింది. యువతి కొడుకును తీసుకొని ఉదయం 8 గంటల సమయంలో స్కూల్‌లో వదలటానికి వెళ్తుండగా ఆటోలో వచ్చిన భర్త భార్య చేతిలో ఉన్న కొడుకును లాక్కొని పారిపోయాడు. మరో ఆటోలో వెంబడించిన ఇద్దరు మహిళలు కొడుకుతో వచ్చిన యువతితో గొడవకు దిగారు. గొడవ జోరుగా జరగటాన్ని గమనించిన హొయ్సళ పోలీసులు ముగ్గురు మహిళలు, ఆటో డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని కొడిగేహళ్లి స్టేషన్‌కు తరలించారు. విచారణ చేయగా ఇది లివింగ్ టు గెదర్ జోడి గొడవగా బయట పడింది. చిన్నారిని అపహరించిన తండ్రికోసం పోలీసులు తీవ్రంగా గాలిస్తున్నారు. యువతి ఫిర్యాదు ఆధారంగా పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రక్తదానం చేయండి



గౌరిబిదనూరు: యువత రక్తదానం చేయడానికి ముందుకు రావాలని అవినీతి నిరోధక సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం హరీశ్ అన్నారు. శుక్రవారం బిహెచ్ రస్తాలోని అయ్యప్పస్వామి దేవాలయంలో అవినీతి నిరోధక సంస్థ, శబరిమలె అయ్యప్ప సేవా సమాజం సంయుక్తంగా ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. రక్తదానం ప్రాణదానంతో సమానమని, ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలన్నారు. కార్యక్రమంలో సభ్యులు డా.కెవి ప్రకాశ్, రమేశ్, ఉపాధ్యక్షుడు సిద్దప్ప తదితరులు పాల్గొన్నారు.

భార్య, మామపై దాడి

యశవంతపుర: కుటుంబ కలహాలతో భార్య, మామపై అల్లుడు కత్తితో దాడి చేసిన ఘటన దక్షిణ కన్నడ జిల్లా బంట్వాళ తాలూకా తుంబె జంక్షన్‌లో జరిగింది. గురువారం రాత్రి 10:30 గంటల సమయంలో తుంబె నివాసి రాజీవ్, ఆయన కూతురు దివ్య ఆటోలో ఇంటి నుంచి బంట్వాళ వైపు వెళ్తుండగా దివ్య భర్త కుమార్ ఆటోను వెంబడించి తుంబె జంక్షన్ వద్ద అడ్డగించి రాజీవ్, దివ్యలపై కత్తితో దాడి చేసి పరారయ్యాడు. ముగ్గురి మధ్య తోపులాట జరిగి దివ్య, రాజీవ్‌లకు బలమైన గాయాలయ్యాయి. ఆటో డ్రైవర్ యశోధర బంట్వాళ గ్రామాంతర పోలీసులకు ఫిర్యాదు చేశారు.

బీజేపీలో హిడెన్ అజెండా

శివాజీనగర: న్యాయ, పార్లమెంట్ వ్యవహారాల శాఖ మంత్రి హెచ్‌కే పాటిల్ శుక్రవారం జీఎస్టీ చట్టం విషయమై సమావేశం జరపగా, బీజేపీ నాయకులు చేసిన ఆరోపణలపై ఎదురుదాడికి దిగారు. జీఎస్టీ విషయమై తమ శాఖ ఆందోళన వ్యక్తం చేసింది. తప్పు చేసిన వారికి చట్టం సడలింపు సరికాదు. ఇప్పటికే తాము మూడు సలహాలను ఇచ్చాము, జీఎస్టీ చట్టం పునర్ పరిశీలనకు సూచించామని తెలిపారు. మత మార్పిడి నిషేధ చట్టం రద్దుతో పాటుగా బీజేపీ చేసిన వరుస ఆరోపణలను హెచ్.కే పాటిల్ తోసిపుచ్చారు. తమ గ్యారెంటీ పథకాల అమలు సాధ్యం కాదని దుష్ప్రచారం చేస్తూ బీజేపీ ప్రజలను తప్పుదారి పట్టిస్తోందని, అజెండా, హిడన్ అజెండా రెండూ బీజేపీలో ఉందన్నారు. తాము ప్రజలకు ఇచ్చిన హామీలను తప్పకుండా అమలు చేస్తామని చెప్పి బీజేపీ నాయకులపై మంత్రి ఎదురు దాడి చేశారు.

కేఎస్ ఆర్టీసీ డ్రైవర్ దాష్టీకం

- బస్సు ఆపకుండా మహిళలపైకి దూసుకెళ్లేందుకు యత్నం



బస్సును ఆపేందుకుయత్నిస్తున్న మహిళలు

తుమకూరు: టికెట్ కలెక్షన్ రాలేదనే కోపంతో మహిళా ప్రయాణికులను ఎక్కించుకోకుండా బస్సును ముందుకు తీసుకెళ్తున్న డ్రైవర్ చర్యను మహిళలు అడ్డుకోగా వారిపైకి బస్సును దూకించేందుకు యత్నించాడు. ఈ ఘటన తుమకూరు జిల్లా కొరటెగెరె నాగేనహళ్లి గేట్ వద్ద జరిగింది. చామరాజనగర జిల్లా కొళ్లేగాల నుంచి కొందరు మహిళలు జిల్లాలోని గోరవనహళ్లి మహాలక్ష్మి అమ్మవారి ఆలయానికి వచ్చారు. అమ్మవారిని దర్శించుకున్న అనంతరం స్వగ్రామానికి వెళ్లేందుకు నాగేనహళ్లి గేట్ వద్ద వేచి ఉన్నారు. ఆ మార్గంలో వచ్చిన కేఎస్ ఆర్టీసీ బస్సును ఆపేందుకు ప్రయత్నించారు. అయితే అప్పటికే కలెక్షన్ లేదని బాధతో ఉన్న డ్రైవర్ బస్సును ఆపలేదు. దీంతో మహిళలు బస్సు ముందుకు వెళ్లి ఆపే ప్రయత్నం చేయగా డ్రైవర్ వారిపైకి వాహనాన్ని ఎక్కించే ప్రయత్నం చేశాడు. డ్రైవర్ ప్రవర్తనపై మహిళలంతా తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. అనంతరం తహసీల్దార్ మునిశామి రెడ్డి మహిళలకు వేరే బస్సును ఏర్పాటు చేశారు. బస్సు డ్రైవర్‌పై చర్యలు తీసుకుంటామని హామీనిచ్చారు.

ఎంటీబీ క్షమాపణలు చెప్పాలి

కృష్ణరాజపురం: మాజీ మంత్రి ఎంటీబీ నాగరాజుపై హోసకోటెలో ముస్లింలు మండిపడుతూ ఆందోళన చేశారు. ముస్లిం సామాజికవర్గంపై పలు నిందలు వేస్తూ నాగరాజు చేసిన వ్యాఖ్యలపై బేషరతుగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. హోసకోటె జామియా మసీదు ఆధ్వర్యంలో ఈ ఆందోళన జరిగింది. వేలాది మంది ముస్లిం సముదాయానికి చెందిన వ్యక్తులు పాల్గొన్నారు. కాగా, ఈనెల 10న బీజేపీ ఆత్మావలోకన సమావేశం హోసకోటెలోని కనకభవన్‌లో జరిగింది. ఈ సమావేశంలో బీజేపీ డబ్బులు తీసుకుని కాంగ్రెస్‌కు ముస్లింలు ఓటు వేశారని నాగరాజు ఆరోపించారు. ఇకపై ముస్లింలను తాను పట్టించుకోనని, నమ్మించి మోసం చేశారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. నాగరాజు వాఖ్యలపై ముస్లింలు మండిపడుతూ అయన ఎవరికి డబ్బులు ఇచ్చారో చెప్పాలని డిమాండ్ చేశారు.

హత్యాచారం కేసు కొట్టివేత

యశవంతపుర: దక్షిణ కన్నడ జిల్లా ఉజిరె ఎస్‌డిఎం కాలేజీ విద్యార్థిని సౌజన్యపై అత్యాచారం, హత్య కేసుకు సంబంధించి సీబీఐ కోర్టు తీర్పును వెలువరించింది. నిందితుడు సంతోష్‌రావ్‌ను కేసు నుంచి విముక్తి కలిగించింది. సరైన సాక్ష్యధారాలు లేని కారణంగా కేసును కొట్టివేసింది. 2012 అక్టోబర్ 10న ధర్మస్థలం వద్ద సౌజన్య మృతదేహాన్ని కొనుగొన్నారు. విద్యార్థిని సౌజన్యపై అత్యాచారం జరిగి హత్య చేసిన ఆరోపణలకు సంబంధించి బెళ్తంగడి పోలీసులు సంతోష్ రావ్‌ను అరెస్ట్ చేశారు. హత్య వివాదం పెద్దది కావటంతో కేసును సీబీఐకి అప్పగించారు. కేసు 11 ఏళ్లుగా విచారణ సాగింది. సీబీఐ కోర్టు సరైన సాక్ష్యాధారాలు లేని కారణంగా కేసును కొట్టివేసి, నిందితుడికి విముక్తి కలిగించింది.

చెట్టెక్కిన ఉడుపి స్వామీజీ

యశవంతపుర: ఉడుపి పేజావర మఠం విశ్వప్రసన్న స్వామి పనస చెట్టు ఎక్కారు. ఈ అపురూపమైన ఫొటోలు సామాజిక మాధ్యమాలలో వైరల్‌గా మారాయి. మఠానికి సమీపంలో గోశాల ఉంది. అక్కడ పరిశీలిస్తుండగా పనస చెట్టులో విపరీతమైన కాయలను చూసిన స్వామి చెట్టు ఎక్కి కాయలను కోశాడు. పండ్లకు కిందకు వేసి పశువులకు తినిపించారు.

కారు చెట్టును ఢీకొని ఒకరి మృతి

- మరో ఇద్దరికి గాయాలు
- తమిళనాడులో ప్రమాదం
- మృతుడు మైసూరు జిల్లావాసి



కారులో రక్తగాయాలతో క్షతగాత్రులు



మృతుడు నాసీర్(ఫైల్)

మైసూరు: తమిళనాడులో జరిగిన రోడ్డు ప్రమాదంలో మైసూరు జిల్లాలోని హుణసూరు తాలూకా రత్నపురికి చెందిన వ్యక్తి మరణించాడు. మరో ఇద్దరు గాయపడ్డారు. హుణసూరు రత్నపురి గ్రామానికి చెందిన నాసీర్ (46)తన స్నేహితులు సికందర్, ముజీబ్‌తో కలిసి పని నిమిత్తం తమిళనాడులోని కోయంబత్తూరు వెళ్లారు. తిరిగి వస్తుండగా బన్నారి రహదారిలో వాహనం నియంత్రణ కోల్పోయి చెట్టును ఢీకొట్టింది. కారు ముందు భాగం నుజ్జునుజ్జయింది. ప్రమాదంలో నాసీర్ అక్కడికక్కడే మరణించగా మిగతా ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేపట్టారు. మృతుడు నాసీర్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

బైక్‌లు ఢీకొని యువతి మృతి



భావన(ఫైల్)

యశవంతపుర: బైకులు ఢీకొని యువతి మృతి చెందినఘటన కొడగు జిల్లా కుశాలనగర పట్టణంలో జరిగింది. భావన(21) అనే యువతి శుక్రవారం ఉదయం స్కూటర్‌పై వెళ్తుండగా ఎదురుగా వచ్చిన బుల్లెట్ బైక్ ఢీకొంది. ఆమె తలకు బలమైన గాయాలు కావటంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.

లారీ ఢీకొని కార్మికుడు మృతి

హోసూరు: లారీ ఢీకొని కార్మికుడు మృతి చెందిన ఘటన సిఫ్‌కాట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకొంది. హోసూరు సమీపంలోని ఆవులపల్లి గ్రామానికి చెందిన కార్మికుడు గోపి (40) గురువారం సాయంత్రం హోసూరు- బెంగళూరు జాతీయ రహదారి ఈఎస్‌ఐ ఆస్పత్రి వద్ద నడుచుకుంటూ వెళ్తుండగా ఆ మార్గంలో వచ్చిన లారీ ఢీకొంది. తీవ్రంగా గాయపడని అతన్ని హోసూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఫలితంలేక మృతి చెందాడు. సిఫ్‌కాట్ పోలీసులు కేసు నమోదు చేసుకొని విచారణ చేస్తున్నారు.

వివాహిత ఆత్మహత్య

క్రిష్ణగిరి: అప్పుల బాధ తాళలేక వివాహిత పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన క్రిష్ణగిరి పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకొంది. వివరాలు... క్రిష్ణగిరి సమీపంలోని మంత్రి గౌడన్‌కొటాయ్ గ్రామానికి చెందిన గోవిందన్ భార్య బేబి(43), కొంతమంది వద్ద నగదు అప్పుగా తీసుకుంది. అప్పు ఇచ్చినవారు ఒత్తిడి చేయడంతో జీవితంపై విరక్తి చెందిన బేబి రెండు రోజుల క్రితం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. స్థానికులు స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం సేలం ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఫలితంలేక మృతి చెందింది. క్రిష్ణగిరి పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకొని విచారణ చేస్తున్నారు.

రైతుపై అడవి ఏనుగు దాడి

- గాయపడ్డ రైతు



దాడి చేసిన అడవి ఏనుగు



గాయపడిన రాజు

దొడ్డబళ్లాపురం: రామనగర తాలూకాలో అడవి ఏనుగు ఒకటి రైతుపై దాడి చేసిన సంఘటన శుక్రవారం ఉదయం చోటుచేసుకుంది. దేవరదొడ్డి గ్రామం నివాసి రాజునాయక్(60) ఏనుగు దాడిలో గాయపడ్డ రైతు. శుక్రవారం ఉదయం రైతు రాజునాయక్ తన పొలం వద్దకు వెళ్లిన సమయంలో హఠాత్తుగా వచ్చిన అడవి ఏనుగు దాడి చేసింది. గాయపడ్డ రైతును రామనగర జిల్లా ఆస్పత్రికి తరలించారు. గ్రామం శివార్లలోనే అడవి ఏనుగు సంచరిస్తూ గ్రామస్తులను భయభ్రాంతులకు గురిచేస్తోంది. ఘటనా స్థలాన్ని అటవీశాఖ అధికారులు పరిశీలించారు.

హోసూరు వార్తలు..

మహిళలకు రక్షణ కల్పిస్తాం



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

హోసూరు: మహిళలకు రక్షణ కల్పిస్తాం, స్త్రీ విద్యను ప్రోత్సహిస్తామని క్రిష్ణగిరి కలెక్టరేట్‌లో సామాజిక సంక్షేమ శాఖ ద్వారా ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో జిల్లా కలెక్టర్ శరయు అన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బేటీ బచావో, బేటీ పడావో (బిబిబిపి) పథకం ద్వారా రాష్ట్రంలోని 11 జిల్లాలో కొనసాగుతుందని, మరో 27 జిల్లాల్లో ఈ పథకాన్ని అమలు పరిచేందుకు చర్యలు చేపట్టిందని, ప్రస్తుతం క్రిష్ణగిరి జిల్లాలో వంద శాతం పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలని, అందుకోసం ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసిందని, సమాజంలో మహిళలకు సహాయ పడే వన్‌స్టాప్ సెంటర్ ద్వారా మహిళలు ఎదుర్కొనే సమస్యలను పరిష్కరించుకోవచ్చునని, దీంతో పాటు సలహాలు, వైద్య సాయం, హక్కులపై మహిళలకు చైతన్యం కల్పిస్తున్నారని సూచించారు. కార్యక్రమంలో అదనపు డీఎస్పీ శంఘు, సామాజిక సంక్షేమ శాఖాధికారిణి విజయలక్ష్మి, పిల్లల సంక్షేమ శాఖాధికారిని జయంతి వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రైతుల ఆందోళనకు మద్దతు



బాధితులకు మద్దతు తెలుపుతున్న రైతు రక్షణ సంఘ సభ్యులు

కెలమంగలం: గెయిల్ సంస్థ ఏర్పాటు చేస్తున్న బయోగ్యాస్ పైప్‌లైన్ ఏర్పాటును వ్యతిరేకిస్తూ గత కొద్ది రోజులుగా బాధిత రైతులు, స్థానికులు ఆందోళనలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా శుక్రవారం బాధితులకు మద్దతుగా తమిళనాడు వ్యవసాయ రక్షణ సంఘం మద్దతు తెలిపింది. రైతుల ఆందోళనలతో ప్రస్తుతం ఏర్పాటు చేస్తున్న శాటిలైట్ రింగ్‌రోడ్డు పక్కనే పైప్‌లైన్ తీసుకెళ్తామని హామీ ఇచ్చింది. ఈ నేపథ్యంలో నాగొండపల్లి సమీపంలోని వెంకటేశ్వరలేఔట్ నివాస ప్రాంతంలో ఆ సంస్థ మార్గాన్ని మార్చి తీసుకెళ్లడంతో గత కొద్ది రోజుల క్రితం రైతులు, స్థానికులు ఆందోళన చేపట్టారు. ఈ నేపథ్యంలో బాధితులకు మద్దతుగా రైతు రక్షణ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఈసన్మురుగేషన్, క్రిష్ణగిరి పశ్చిమ జిల్లా కార్యదర్శి గణేష్‌రెడ్డి, ముత్తులక్ష్మి, నాగరాజ్, శివకుమార్ తదితరులు శుక్రవారం ఆందోళన చేపట్టారు. ప్రభుత్వం వెంటనే ప్రజలకు ఇబ్బందులు కలిగించకుండా పైప్‌లైన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

ఉపకరణాల అందజేత



కార్యక్రమంలో విద్యార్థులు, అధికారులు, ప్రజాప్రతినిధులు

హోసూరు: హోసూరు కార్పొరేషన్ పారిశ్రామికవాడ జూజువాడి ప్రభుత్వ ఉన్నతోన్నత పాఠశాలకు రూ. 40 లక్షల విలువ చేసే ఉపకరణాలను ప్రైవేట్ కంపెనీ యంత్రాంగం అందజేసింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి విద్యా కమిటీ అధ్యక్షులు శ్రీధర్ నేతృత్వం వహించారు. ముఖ్య అతిథులుగా మేయర్ ఎస్.ఏ.సత్య, డెప్యూటీ మేయర్ ఆనందయ్య, వాప్కెక్ కార్పొరేషన్ సంస్థ దురైరాజ్‌గోని పాల్గొన్నారు. జూజువాడి ప్రాంతంలో నిర్వహిస్తున్న ప్రభుత్వ మాధ్యమిక పాఠశాలలో వెయ్యి మందికి పైగా విద్యార్థినీ విద్యార్థులు చదువుతున్నారు. ఈ పాఠశాలలో విద్యార్థులకు బెంచ్‌లు, డస్కులు, ఉపాధ్యాయులకు కుర్చీల కొరత ఉందని, దాతలు అందజేయాలని ప్రైవేట్ సంస్థను కోరగా వెంటనే స్పందించిన సంస్థ డైరెక్టర్ రూ. 40 లక్షల ఖర్చుతో 400 డస్కులు, బెంచ్‌లు, 40 కుర్చీలు అందజేశారు. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ ఆనందయ్య, మండల అధ్యక్షులు రవి, కిరణ్, అశోక్‌రెడ్డి, శివరామ్, మాదేశ్, ప్రధానోపాధ్యాయిని దేవి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ



భూమిపూజ చేస్తున్న దృశ్యం

హోసూరు: హోసూరు తాలూకా నాగొండపల్లి గ్రామ పంచాయతీలో శుక్రవారం ఎమ్మెల్యే వై. ప్రకాష్ భూమిపూజ చేసి అభివృద్ధి పనులు ప్రారంభించారు. నాగొండపల్లి పంచాయతీలోని యడేనల్లూరు, నాగొండపల్లి గ్రామపంచాయతీల్లో అభివృద్ధి పనులు చేపట్టాలని స్థానికులు కోరుతూ వచ్చారు. ఈ విషయంపై స్పందించి ఎమ్మెల్యే సంబంధిత శాఖాధికారులతో చర్చించి రూ. 11.50 లక్షల వ్యయంతో సీసీరోడ్డు, వంతెన, మురికి కాల్వ ఏర్పాటు, రూ. 26 లక్షల ఖర్చుతో ఓవర్ ట్యాంక్ నిర్మాణానికి భూమిపూజ చేశారు. యూనియన్ కార్యదర్శి గజేంద్రమూర్తి, వెంకటేష్ మాదేష్, రమేష్, ప్రకాష్, అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

'జన్ భాగీదారీ'లో ఏపీకి ప్రథమ స్థానం

పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఎస్.సురేష్ కుమార్



పుణేలో ఏర్పాటు చేయనున్న స్టాల్ నమూనా

సాక్షి, అమరావతి: కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న జీ–20 'జన్ భాగీదారీ' కార్యక్రమంలో ఏపీకి ప్రథమ స్థానం దక్కినట్టు పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఎస్.సురేష్ కుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. దేశవ్యాప్తంగా ప్రజల భాగస్వామ్యంతో చేపట్టే అవగాహన కార్యక్రమాలు, ర్యాలీల నిర్వహణలో ఏపీ ముందంజలో ఉందన్నారు. శనివారం నుంచి 22వ తేదీ వరకు పుణేలోని సావిత్రిబాయిపూలే వర్సిటీలో నిర్వహించనున్న 'జన్ భాగీదారీ' కార్యక్రమంలో ఏపీ విద్యాశాఖ ప్రత్యేక స్టాల్‌ను ఏర్పాటు చేయనున్నట్టు చెప్పారు. అక్కడకు విచ్చేసే వివిధ దేశాల ప్రతినిధులకు రాష్ట్రంలోని విద్యాభివృద్ధి కోసం అమలు చేస్తున్న అనేక పథకాలు, కార్యక్రమాల గురించి వివరించనున్నట్లు తెలిపారు.

ఎన్‌హెచ్‌ఎం జేఏసీ సమ్మెతో మాకు సంబంధం లేదు

వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రం ఉద్యోగుల సంఘం

సాక్షి, అమరావతి: ఏపీ నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) జేఏసీ సమ్మెతో వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో పనిచేసే ఉద్యోగులకు ఎటువంటి సంబంధం లేదని ఏపీ యూపీహెచ్‌సీ కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర ప్రెసిడెంట్ ఆర్.మురళీ మోహన్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.సతీష్‌కుమార్, జనరల్ సెక్రటరీ–1 ప్రేమ్‌కుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. 104 వాహనంలో మిగిలిన పారామెడికల్ సిబ్బంది అయిన తమను రాష్ట్రంలోని 560 వైఎస్సార్ యూపీహెచ్‌సీల్లో నియమించి, జీవో 686లో సూచించిన విధంగా జీతాలు అమలు చేయాలని ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డిని కోరగా సానుకూలంగా స్పందించినట్లు పేర్కొన్నారు. జీవో 686 ప్రకారం యూపీహెచ్‌సీల్లో పనిచేస్తున్న 2,240 మంది సిబ్బందికి జీతాలు అమలు చేస్తారనే నమ్మకం తమకు ఉందని తెలిపారు.

బీసీలు దేశవ్యాప్త ఉద్యమానికి సిద్ధం కావాలి

- జూలైలో లక్షలాది మందితో పార్లమెంట్ ముట్టడి
- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ ఆర్.కృష్ణయ్య



సాక్షి, న్యూఢిల్లీ : కేంద్ర ప్రభుత్వం మెడలు వంచైనా పార్లమెంటులో బీసీ బిల్లు ప్రవేశపెట్టేలా పెద్ద ఎత్తున ఉద్యమానికి దేశవ్యాప్తంగా బీసీలు సిద్ధం కావాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య పిలుపునిచ్చారు. బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. బీసీ సంఘం ఏపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.మారేష్ అధ్యక్షతన ఢిల్లీలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆర్.కృష్ణయ్య ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సమావేశంలో జాతీయ స్థాయిలో బీసీ ఉద్యమానికి సంబంధించి పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ జూలైలో లక్షలాది మందితో పార్లమెంట్‌ను ముట్టడించాలని, ఆంధ్రప్రదేశ్‌లోని కదిరి నియోజకవర్గంలో బీసీల బహిరంగ సభ ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు ఆర్.కృష్ణయ్య తెలిపారు. త్వరలో వివిధ రాష్ట్రాల్లో పర్యటించి బీసీ ఉద్యమాన్ని బలోపేతం చేయాలని నిర్ణయించినట్లు చెప్పారు. బీసీలు కోరుతున్న రిజర్వేషన్లు రాజ్యాంగ బద్ధమైన ప్రజాస్వామ్య హక్కు అని, స్వాతంత్ర్యం వచ్చినప్పుడు బీసీలకు అసెంబ్లీ, పార్లమెంటులో రిజర్వేషన్లు కల్పించకుండా అన్యాయం చేశారని ఆయన ఆవేదన వ్యక్తంచేశారు. ఉద్దేశపూర్వకంగానే బీసీ కులాలను అణచివేస్తున్నారని విమర్శించారు. ఈ సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శిగా బత్తుల వెంకటరమణను, ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బత్తుల హరిప్రసాద్‌ను ఎంపిక చేశారు.

నా వాదనలు వినేలా ఆదేశించండి

హైకోర్టులో లింగమనేని రమేశ్ పిటిషన్

సాక్షి, అమరావతి: తన ఇంటిని జప్తు చేసేందుకు చట్ట ప్రకారం కోర్టు నుంచి అనుమతి పొందేందుకు సీఐడీ దాఖలు చేసిన పిటిషన్‌లో తన వాదన కూడా వినాలన్న అభ్యర్థనను తిరస్కరిస్తూ విజయవాడ ఏసీబీ ప్రత్యేక కోర్టు ఇటీవల జారీ చేసిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ వ్యాపారవేత్త లింగమనేని రమేశ్ హైకోర్టును ఆశ్రయించారు. సీఐడీ దాఖలు చేసిన పిటిషన్‌లో తన వాదనలు కూడా వినాలని.. ఆ మేరకు ఏసీబీ కోర్టును ఆదేశించాలని ఆయన హైకోర్టును అభ్యర్థించారు. సీఐడీ పిటిషన్‌పై అభ్యంతరాలు లేవనెత్తే అవకాశం తనకు ఇవ్వాలన్నారు. జప్తు నిర్ణయం వల్ల తాను తీవ్రంగా ప్రభావితమవుతానని, అందువల్ల తన వాదనలు వినాల్సిన అవసరం ఉందన్నారు. తన పిటిషన్‌ను కొట్టేస్తూ ఏసీబీ ప్రత్యేక కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేయాలని అభ్యర్థించారు. ఈ పిటిషన్‌పై హైకోర్టు వచ్చే వారం విచారణ జరిపే అవకాశం ఉంది.

మరో మూడు రోజుల్లో తీపికబురు

18 నుంచి 21వ తేదీల మధ్య రుతుపవనాలు విస్తరించడానికి అనుకూల పరిస్థితులు

సాక్షి, విశాఖపట్నం/సాక్షి అమరావతి: నిప్పుల కుంపటిని తలపిస్తున్న ఉష్ణోగ్రతలతో అల్లాడుతున్న ప్రజలకు తీపికబురు. మరో మూడు రోజుల్లో అంటే ఈ నెల 18–21 మధ్య రాష్ట్రంలో రుతుపవనాలు విస్తరించడానికి అనుకూల పరిస్థితులు ఉన్నాయని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. దీంతో 19 నుంచి చిత్తూరు, అన్నమయ్య, వైఎస్సార్, తిరుపతి, శ్రీ సత్యసాయి జిల్లాల్లో అనేక చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు, అక్కడక్కడ భారీ వర్షాలు కురవవచ్చని వెల్లడించారు. కోస్తాంధ్రలో కొన్నిచోట్ల ఉరుములు, మెరుపులు, పిడుగులతో కూడిన వర్షాలకు ఆస్కారం ఉందని పేర్కొన్నారు. గంటకు 30–40 కి.మీల వేగంతో ఈదురు గాలులు వీస్తాయని వివరించారు. కాగా రాష్ట్రంలో కొన్నాళ్లుగా ఉష్ణోగ్రతలు నిప్పుల కుంపటిని తలపిస్తున్నాయి. నైరుతి రుతుపవనాలు ప్రవేశించినా ఇంకా భగ్గుమంటూనే ఉన్నాయి. ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పట్టి వర్షాలు కురవాల్సిన తరుణంలో మరింతగా సెగలు కక్కుతున్నాయి. సాధారణం కంటే 6 నుంచి 10 డిగ్రీలు అధికంగా నమోదవుతూ దడ పుట్టిస్తున్నాయి. ఇలా మూడు వారాలుగా తీవ్ర వడగాడ్పులు వీయని రోజు లేదు. ఏరోజుకారోజే ఉష్ణతాపం తగ్గుతుంది.. ఇక వాతావరణం చల్లబడుతుంది అని ఆశించిన వారికి ఆశాభంగమే అవుతోంది. ఇప్పటికే రాష్ట్రంలో పలుచోట్ల 45 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. శుక్రవారం అవి మరింత తీవ్రరూపం దాల్చి ఏకంగా 47 డిగ్రీలకు చేరువగా రికార్డయ్యాయి. ఈ వేసవి సీజనులో తొలిసారిగా కాకినాడ జిల్లా సామర్లకోటలో 46.8, తునిలో 46.4 (ఇది సాధారణంకంటే 10.5 డిగ్రీలు అధికం) డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. ఇంకా తూర్పు గోదావరి, ప్రకాశం, విజయనగరం, తిరుపతి, ఎన్టీఆర్, పార్వతీపురం మన్యం, అనకాపల్లి, ఏలూరు, బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, పల్నాడు, విశాఖపట్నం తదితర జిల్లాల్లో 45–46 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలతో తీవ్ర వడగాడ్పులు ప్రభావం చూపాయి. శుక్రవారం రాష్ట్రంలో 370 మండలాల్లో తీవ్ర వడగాడ్పులు, 132 మండలాల్లో వడగాడ్పులు వీచాయి.



విశాఖ నగరంలో ఎండ తీవ్రతకు గొడుగులతో సేద తీరుతున్న విద్యార్థులు

నేడు 264 మండలాల్లో తీవ్ర వడగాడ్పులు

రాష్ట్రంలో మరో మూడు, నాలుగు రోజులు సెగలు కొనసాగనున్నాయి. శనివారం బాపట్ల, కృష్ణా, పశ్చిమ గోదావరి, కోనసీమ, విశాఖపట్నం జిల్లాల్లోని 264 మండలాల్లో తీవ్ర వడగాడ్పులు, 214 మండలాల్లో వడగాడ్పులు, ఆదివారం 42 మండలాల్లో తీవ్ర వడగాడ్పులు, 203 మండలాల్లో వడగాడ్పులు వీచే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. ఈ పరిస్థితుల దృష్ట్యా వృద్ధులు, చిన్నారులు, తీవ్ర అనారోగ్యంతో ఉన్నవారు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరించారు. భవన నిర్మాణ కార్మికులు, ట్రక్ డ్రైవర్లు, రైతులు, వ్యవసాయ కూలీలు వడగాడ్పుల బారిన పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మరోవైపు అక్కడక్కడా ఈదురుగాలులతో వర్షాలు, పిడుగులు పడే అవకాశం ఉందని వెల్లడించారు.

వాయవ్య గాలుల వల్లే..

కాగా రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు ఇంతలా అట్టుడికిపోవడానికి వాయవ్య గాలులే కారణమని భారత వాతావరణ శాఖ తెలిపింది. ప్రస్తుతం రాష్ట్రంపైకి రాజస్థాన్ నుంచి వేడితో కూడిన పొడిగాలులు వీస్తున్నాయని, అవి దిశ మార్చుకుని నైరుతి లేదా దక్షిణ గాలులు వీచే వరకు ఇదే పరిస్థితి ఉంటుందని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. ఆరు రోజుల క్రితం రాష్ట్రంలోకి ప్రవేశించిన నైరుతి రుతుపవనాలు రాయలసీమలోని పుట్టపర్తి, శ్రీహరికోటలకు చేరుకుని అక్కడే తటస్థంగా ఉండిపోయాయి. దీంతో రుతుపవనాల విస్తరణ జరగక రాష్ట్రంలో వర్షాలు కురవలేదు.. ఉష్ణోగ్రతలూ తగ్గుముఖం పట్టలేదు.

శుక్రవారం రాష్ట్రంలో నమోదైన గరిష్ట ఉష్ణోగ్రతలు ఇలా.. (డిగ్రీల్లో)

జిల్లా	గ్రామం	ఉష్ణోగ్రత
కాకినాడ	సామర్లకోట	46.80
కాకినాడ	తుని	46.40
తూర్పు గోదావరి	ధవళేశ్వరం	46.05
తూర్పు గోదావరి	గోకవరం	46.04
విజయనగరం	కంటకాపల్లి	46.03
అనకాపల్లి	అనకాపల్లి	46.01
ప్రకాశం	ఎర్రబాలెం	45.95
పార్వతీపురం మన్యం	కురుపాం	45.60
విజయనగరం	బొద్దాం	45.53
కాకినాడ	కోటనందూరు	45.51
తిరుపతి	రాయలచెరువు	45.40
ఎన్టీఆర్	చిల్లకల్లు	45.20
పల్నాడు	రావిపాడు	45.09
అంబేడ్కర్ కోనసీమ	ఈతకోట	45.00
విశాఖపట్నం	విశాఖ ఎయిర్‌పోర్టు	44.40

హైదరాబాద్‌కు రాష్ట్రపతి ముర్ము

తెలంగాణ

నేడు దుండిగల్‌లో నిర్వహించే సీజీపికి హాజరు



రాష్ట్రపతికి స్వాగతం పలుకుతున్న కేసీఆర్, తమిళిసై

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రపతి ద్రౌపది ముర్ము శుక్రవారం హైదరాబాద్ వచ్చారు. దుండిగల్ ఎయిర్‌ఫోర్స్ అకాడమీలోని కార్యక్రమంలో పాల్గొనేందుకు ఢిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో సాయంత్రం 6 గంటలకు హైదరాబాద్ బేగంపేట్ ఎయిర్‌పోర్ట్‌కు చేరుకున్న రాష్ట్రపతికి ఘన స్వాగతం లభించింది. తెలంగాణ రాష్ట్ర గవర్నర్ తమిళి సై సౌందర్‌రాజన్, ముఖ్యమంత్రి కేసీఆర్, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి పుష్పగుచ్ఛాలు ఇచ్చి స్వాగతం పలికారు. రాష్ట్ర మంత్రులు ఎంపీలు, ఇతర ప్రజాప్రతినిధులు, డీజీపీ అంజనీకుమార్, త్రివిధ దళాల అధికారులు కూడా స్వాగతం పలికినవారిలో ఉన్నారు. శుక్రవారం రాత్రి రాష్ట్రపతి రాజ్‌భవన్‌లో బస చేస్తారు. శనివారం దుండిగల్ ఎయిర్‌ఫోర్స్ అకాడమీలో నిర్వహించనున్న ఫ్లైట్ కేడెట్ల కంబైన్డ్ గ్రాడ్యుయేషన్ పరేడ్ (సీజీపీ) కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్రపతి హాజరవుతారు. పరేడ్ రివ్యూయింగ్ ఆఫీసర్‌గా హాజరవుతున్న రాష్ట్రపతి.. యువ కేడెట్ల నుంచి గౌరవ వందనాన్ని స్వీకరిస్తారు. శిక్షణ పూర్తి చేసిన యువ కేడెట్లతో ప్రతిజ్ఞ చేయించడంతోపాటు శిక్షణ కాలంలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన ఫ్లైట్ కేడెట్‌కు రాష్ట్రపతి గౌరవ ఖడ్గాన్ని ముర్ము బహూకరిస్తారు.

గైడ్ బండ్ సమస్య చిన్నదే

▶ మొదటి పేజీ తరువాయి

భద్రతా చర్యలు తీసుకోవాలని సూచించింది. ఈ కమిటీ గురువారం పోలవరం ప్రాజెక్టును క్షేత్ర స్థాయిలో పరిశీలించి, రాష్ట్ర అధికారులతో సమీక్ష నిర్వహించింది. శుక్రవారం రాజమహేంద్రవరంలో నిపుణుల కమిటీతో జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు భేటీ అయ్యారు. ఆ తర్వాత రాష్ట్ర జలవనరుల శాఖ అధికారులతో కమిటీ మరోసారి సమావేశమై.. గైడ్ బండ్‌ను పటిష్టం చేయడానికి తాత్కాలిక, శాశ్వత చర్యలపై చర్చించింది.

సీడబ్ల్యూసీకి వారంలో నివేదిక

గైడ్ బండ్‌లో కొంత భాగం కాస్త జారడానికి కారణాలపై రాష్ట్ర అధికారులతో నిపుణుల కమిటీ చర్చించింది. నిపుణుల కమిటీలోని నలుగురు సభ్యులూ.. నాలుగు రకాల అభిప్రాయాలు వెల్లడించటంతో ఏకాభిప్రాయం కుదరలేదు. దాంతో ఢిల్లీలో మరోసారి సమావేశమై గైడ్ బండ్ జారడానికి కారణాలపై వారంలోగా సీడబ్ల్యూసీకి నివేదిక ఇస్తామని పాండ్య తెలిపారు.

తాత్కాలిక మరమ్మతుల ప్రతిపాదన ఇదీ

గైడ్ బండ్ ఎత్తు 51.32 మీటర్లు. పొడవు సుమారు 134 మీటర్లు. ఇందులో కొన్ని చోట్ల 3 మీటర్లు, కొన్ని చోట్ల ఆరు మీటర్ల మేర కాస్త జారింది. జారిన ప్రదేశాల్లో ఇప్పటికే పెద్ద రాళ్లు వేసి తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. వాటిపైన మళ్లీ పెద్ద పెద్ద రాళ్లు వేసి వాటి మధ్య సిమెంటు మిశ్రమం (స్లర్రీ) పోయాలని నిపుణుల కమిటీ సూచించింది. ఆ తర్వాత ఆ ప్రాంతంలో గాబియన్లు వేయాలని పేర్కొంది. దీనివల్ల వరద ఉధృతిని గైడ్ బండ్ సమర్థవంతంగా అడ్డుకుంటుందని తెలిపింది.

సీడబ్ల్యూపీఆర్ఎస్‌తో మరోసారి అధ్యయనం

సెంట్రల్ వాటర్ అండ్ పవర్ రీసెర్చ్ స్టేషన్ (సీడబ్ల్యూపీఆర్ఎస్) అధ్యయనంలో వెల్లడైన అంశాల ఆధారంగా స్పిల్ వేకు ఎగువన ఏర్పడే సుడిగుండాలను నియంత్రించి, వరదను సులువుగా దిగువకు వెళ్లేలా చేయడానికి 2:1 నిష్పత్తిలో గైడ్ బండ్ నిర్మించేలా సీడబ్ల్యూసీ డిజైన్‌ను ఆమోదించింది. ఆ డిజైన్ ప్రకారమే గైడ్ బండ్ నిర్మాణం జరిగింది. ఇప్పుడు కొంతమేర జారడంతో సీడబ్ల్యూపీఆర్ఎస్‌తో మరోసారి అధ్యయనం చేయించాలని నిపుణుల కమిటీ సూచించింది. గైడ్ బండ్‌ను 3:1 నిష్పత్తిలో నిర్మిస్తే స్పిల్ వే వద్ద వరద ప్రవాహం ఎలా ఉంటుందో అధ్యయనం చేయించాలని పేర్కొంది. గైడ్ బండ్ నిర్మాణ ప్రాంతంలో వరద సమయంలో, వరద తగ్గాక మట్టిని సేకరించి, నాణ్యతపై సెంట్రల్ సాయిల్ అండ్ మెటీరియల్ రీసెర్చ్ స్టేషన్‌లో అధ్యయనం చేయించాలని పేర్కొంది. వాటి ఆధారంగా గైడ్ బండ్‌ను పూర్తి స్థాయిలో పటిష్టం చేసే డిజైన్‌ను రూపొందిస్తామని వెల్లడించింది.

గైడ్‌బండ్‌పై అనవసర రాద్ధాంతం: మంత్రి అంబటి

పోలవరం రూరల్: పోలవరం ప్రాజెక్టు గైడ్‌బండ్ జారింది కొద్దిగానేనని, ఇది చిన్న సమస్యేనని, అయినా ప్రతిపక్షాలు, ఎల్లో మీడియా అనవసర రాద్ధాంతం చేస్తున్నాయని జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. గైడ్‌బండ్‌ను సీడబ్ల్యూసీ నిపుణుల కమిటీ పరిశీలించిందని, సమస్యకు కారణాలు అన్వేషిస్తున్నారని చెప్పారు. మంత్రి శుక్రవారం ప్రాజెక్టు పనులను పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ గైడ్‌బండ్ ప్రాజెక్టు స్ట్రక్చర్‌లో లేని అంశమన్నారు. దీని నిర్మాణంలో కాంట్రాక్టర్ల అలసత్వమా, డిజైన్ లోపమా, ప్రకృతి వైపరీత్యమా అన్నది తెలియాల్సి ఉందన్నారు. నిపుణుల కమిటీ చైర్మన్ పాండ్యా సూచనల మేరకు గైడ్‌బండ్‌కు తాత్కాలిక మరమ్మతులు చేస్తున్నామన్నారు. వరదల అనంతరం పూర్తి స్థాయి రక్షణ చర్యలు చేపడతామని చెప్పారు. ప్రాజెక్టులో కీలకమైన డయాఫ్రమ్ వాల్ పునరుద్ధరణ ఒక్క బావర్ కంపెనీ మాత్రమే చేయగలదని, ఆ సంస్థతో పనులు పూర్తిచేసి ఎర్త్ కమ్ రాక్ ఫిల్ (ఈసీఆర్ఎఫ్) డ్యామ్ పనులు ప్రారంభిస్తామని చెప్పారు. ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌లు పూర్తిచేసిన తర్వాత మొదటి సారిగా స్పిల్‌వే మీదుగా నీరు కిందకు చేరుతుందని తెలిపారు. సీఎం వైఎస్ జగన్ పోలవరం ప్రాజెక్టు నిర్మాణంపై చిత్తశుద్ధితో ముందుకు వెళుతున్నారన్నారు. ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహిస్తున్నారని, నిధుల విడుదలపై ప్రధాని మోదీతో చర్చించారని చెప్పారు. టీడీపీ హయాంలో ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌ల నిర్మాణం పూర్తికాకుండా డయాఫ్రమ్ వాల్ నిర్మించడం వల్ల అది వరదలకు దెబ్బతిన్నదని, దానివల్ల రూ.2020 కోట్లు అదనపు ఖర్చవుతోందని చెప్పారు. ఇంత భారీ నష్టం, తప్పిదం ఆ పత్రికలకు కనిపించలేదా అని ప్రశ్నించారు.

సీఎం కావడానికి నేను సిద్ధమే

వారాహి యాత్రలో జనసేన అధ్యక్షుడు పవన్



పిఠాపురంలో పవన్ ప్రసంగిస్తుండగానే సభ నుంచి వెళ్లిపోతున్న జనం

సాక్షి ప్రతినిధి, కాకినాడ: సీఎం కావడానికి తాను సిద్ధంగా ఉన్నానని జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ చెప్పారు. తన 14 సంవత్సరాల వనవాసం పూర్తయిందని, ఈ సారి అంతా జనసేన వైపు చూడండని అన్నారు. వారాహి యాత్రలో భాగంగా శుక్రవారం రాత్రి కాకినాడ జిల్లా పిఠాపురంలోని ఉప్పాడ సెంటర్‌లో జరిగిన వారాహి సభలో పవన్ మాట్లాడారు. తనకు సంపూర్ణ అధికారం ఇచ్చి సీఎం స్థానం ఇస్తే దేశంలో ఉన్నతమైన రాష్ట్రంగా తీర్చిదిద్దుతానని చెప్పారు. ఏ పదవీ లేకున్నా ప్రజల కోసం పోరాడుతూనే ఉన్నానని చెప్పుకొచ్చారు. నాడు తనను ఎమ్మెల్యేగా గెలిపించి ఉంటే ఈ రోజు ఇలా ఉండేది కాదన్నారు. శక్తిపీఠం సాక్షిగా చెబుతున్నానని, ఆంధ్రా వీడివెళ్లనని, సుర్వక్ష ఆంధ్రాగా తీర్చిదిద్దుతానని చెప్పారు. వైఎస్సార్‌సీపీ దుష్ట ప్రభుత్వాన్ని సాగనంపాలన్నారు. జనసేన అధికారంలోకి వస్తే మొదటగా రాష్ట్రంలో శాంతిభద్రతలను గాడిలో పెడుతుందన్నారు. నిర్వీర్యమైన పోలీసు వ్యవస్థను గాడిలో పెట్టి నిజాయితీపరులైన పోలీసులను ప్రజల ముందు నిలబెడతానని అన్నారు. రాష్ట్రంలో 219 హిందూ ఆలయాలను కూల్చివేస్తే ఈ ముఖ్యమంత్రి, ఈ ప్రభుత్వం ఒక్కరిపై కూడా చర్యలు తీసుకోలేకపోయిందన్నారు. హిందువులు ప్రపంచంలో మైనార్టీలన్నారు. తవ్వేకొద్ది వైఎస్సార్‌సీపీ అవినీతి బయటపడుతుందని అన్నారు. తిరుపతి శ్రీవాణి ట్రస్ట్ నిధులను అడ్డగోలుగా దోచేస్తున్నారని విమర్శించారు. శ్రీపాద శ్రీవల్లభ సంస్థానానికి రూ.1000 కోట్ల ఆస్తి ఉందని, దానిని దేవదాయ శాఖ చేతిలో పెట్టి నిర్వీర్యం చేశారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వీరమహిళలు, జన సైనికులను చూసి భయపడుతోందని అన్నారు. తన తదనంతరం వీరమహిళలే పార్టీని ముందుకు తీసుకువెళ్ళాలన్నారు. క్రిమినల్స్‌ను ఎన్నుకోవద్దని చెప్పారు. మన కులపోడు అని చూడకూడదని, ఆంధ్రా బాగుపడాలంటే సరైనోడు కావాలి అనుకోండి అని అన్నారు. ఆడబిడ్డల క్షేమం తనకు చాలా ముఖ్యమన్నారు. ఆడబిడ్డలను బయటకు పంపాలంటే తల్లిదండ్రులు భయపడే పరిస్థితి రాష్ట్రంలో ఉందన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకుల అవినీతి చిట్టా అమిత్‌షా దగ్గర ఉందని, అందుకే ఆయన విశాఖలో అలా మాట్లాడారని అన్నారు. అంతకుముందు ఆయన గొల్లప్రోలులో రైతులు, కార్మికులతో ముఖాముఖి నిర్వహించారు.

ఎన్నికల్లో పోటీపై స్పష్టత ఉందా పవన్?

- మంత్రి అంబటి సూటి ప్రశ్న
- జనసైనికులు, వీరమహిళలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిక
- పవన్, బాబు, బీజేపీ కలిసి వచ్చినా వచ్చే ఎన్నికల్లో విజయం జగన్‌దేనని స్పష్టీకరణ

సాక్షి, రాజమహేంద్రవరం: ఎన్నికల్లో పోటీపై జనసేన నేత పవన్ కళ్యాణ్‌కు స్పష్టత ఉందా అని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు ప్రశ్నించారు. '175 స్థానాల్లో జనసేన పోటీ చేస్తుందా? సగం స్థానాల్లోనైనా బరిలోకి దిగుతారా? సింగిల్‌గా పోటీ చేస్తావా' అన్న క్లారిటీ పవన్ ఇవ్వాలని అన్నారు. మంత్రి రాంబాబు శుక్రవారం రాజమహేంద్రవరంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. సినిమా రంగం నుంచి రాజకీయాల్లోకి వచ్చి హీరో అనిపించుకున్న వ్యక్తి ఎన్టీఆర్ అయితే.. పవన్ కామెడీ యాక్టర్ అయ్యాడని విమర్శించారు. ప్రశ్నించేందుకే పార్టీ పెట్టిన పవన్ ఐదేళ్ల టీడీపీ పాలనలో ఎవరిని ప్రశ్నించారని దుయ్యబట్టారు. మంచి పనులు చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌ను, వైఎస్సార్‌సీపీని ప్రశ్నించేందుకే పార్టీ నడుపుతున్నారని అన్నారు. పవన్ గతంలో పొత్తులన్నారని, ఇప్పుడేమో లేదంటున్నారని, పర్యటనకో మాట మారుస్తున్నారని చెప్పారు. సీఎం అభ్యర్థి ఆయన కాదని చెప్పిన పవన్.. 2024, 2029 ఎన్నికల్లో గెలిపించాలని చెప్పడం ఆయన చంచల మనస్తత్వానికి నిదర్శనమన్నారు. కేవలం అసెంబ్లీలో అడుగు పెట్టేందుకే రాజకీయం చేస్తున్నారా? ఆయనకు సీఎం అవ్వాలని ఉందా? లేదా? చంద్రబాబును సీఎం చేసేందుకు యాత్రలు చేస్తున్నారా సూటిగా చెప్పాలని అన్నారు. ఎక్కడ నిలబడతాడో కూడా తెలియని వ్యక్తితో జన సైనికులు, వీరమహిళలు జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. ఏ విషయంలోనూ స్పష్టత లేని పవన్‌తో సావాసం కుక్కతోకను పట్టుకుని గోదావరి ఈదినట్లేనన్నారు. పవన్ రాజకీయాలకు పనికిరాడని స్పష్టంగా చెప్పారు. చిరంజీవి పార్టీ పెట్టి 18 సీట్లు గెలిచారని, రాజకీయాల్లో నిలబడలేనని నిష్క్రమించి గొప్ప నిర్ణయం తీసుకున్నారని అన్నారు. రాష్ట్రాన్ని పాలించాలనుకున్న పార్టీ అధినేత ఎక్కడైనా చెప్పులు చూపిస్తారా అని ప్రశ్నించారు. పవన్, చంద్రబాబు, బీజేపీ కలిసి పోటీ చేసినా వచ్చే ఎన్నికల్లో విజయం వైఎస్ జగన్‌దేనని చెప్పారు. పవన్, చంద్రబాబువి ఉడత ఊపులేనన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాల్లో 98 శాతం అమలు చేసిన జగన్ పక్షానే పేదలు ఉన్నారని తెలిపారు. సెక్షన్ 30, 144 అక్కడున్న పరిస్థితులను బట్టి పోలీసులు ప్రయోగిస్తారు తప్ప ఎవరి మీద కక్ష సాధింపు కాదని తెలిపారు. ఈ సమావేశంలో ఎంపీ మార్గాని భరత్‌రామ్, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రీజనల్ కోఆర్డినేటర్ జక్కంపూడి గణేష్ పాల్గొన్నారు.

బుర్ర ఉపయోగించకుండా అడ్మిషన్ రద్దు చేస్తారా?

సాక్షి, అమరావతి : ఓ విద్యార్థి ప్రవేశాన్ని అకారణంగా రద్దుచేసినందుకు ఏఎన్‌యూ గ్రామీణాభివృద్ధి శాఖాధిపతి డాక్టర్ దివ్య తేజోమూర్తిపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తంచేసింది. బుర్ర ఉపయోగించకుండా ఓ విద్యార్థి ప్రవేశాన్ని రద్దుచేయడం దురదృష్టకరమని వ్యాఖ్యానించింది. గుంటూరు జిల్లా మంగళగిరికి చెందిన పిటిషనర్ గుర్రం భాగ్యరాజు కేవలం నిరుద్యోగి అయిన విద్యార్థి మాత్రమేనని, అందువల్ల అతనికి తగిన పరిహారం చెల్లించేలా ఆదేశాలు ఇవ్వాల్సిన అవసరం ఉందని హైకోర్టు స్పష్టంచేసింది. ఖర్చుల కింద పిటిషనర్‌కు రూ.15వేలు చెల్లించాలని యూనివర్సిటీ రిజిస్ట్రార్‌ను హైకోర్టు ఆదేశించింది. ఆ మొత్తాన్ని శాఖాధిపతి తదుపరి నెల జీతం నుంచి వసూలు చేసుకోవాలని రిజిస్ట్రార్‌కు స్పష్టంచేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ గన్నమనేని రామకృష్ణప్రసాద్ గురువారం తీర్పు వెలువరించారు. తమ ఆదేశాల అమలుకు సంబంధించిన నివేదికను ఐదు వారాల్లో సమర్పించాలని న్యాయమూర్తి ఆదేశించారు.

హజ్ యాత్రికులను పంపే ప్రక్రియ విజయవంతం

హజ్ కమిటీ చైర్మన్ గౌస్ లాజమ్ వెల్లడి

సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో హజ్ యాత్రికులను పంపే ప్రక్రియ విజయవంతంగా పూర్తి చేసినట్లు ఏపీ స్టేట్ హజ్ కమిటీ చైర్మన్ బద్వేల్ షేక్ గౌస్ లాజమ్ చెప్పారు. హజ్ యాత్రికుల ప్రత్యేక విమానం వెళ్లే చివరి రోజైన శుక్రవారం నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. మునుపెన్నడూ లేని విధంగా హజ్ యాత్రికులను ఏపీ (విజయవాడ ఎంబార్కేషన్ పాయింట్) నుంచే పంపడంపై హర్షం వ్యక్తం చేశారు. ఈ నెల 7 నుంచి 16 వరకు 10 విమానాల్లో 1,750 మంది హజ్ యాత్రకు పయనమైనట్లు చెప్పారు. ఇస్లాం మత గురువు ముఫ్తి అబ్దుల్ వాహబ్, ప్రఖ్యాత తెలుగు ప్రసంగీకులు అబ్దుల్ రెహ్మాన్ ఆధ్వర్యంలో నంబూరులోని తాత్కాలిక హజ్ హౌస్‌లో ప్రత్యేక దువా (ప్రార్థన) చేశారు. హజ్ యాత్ర విజయవంతం కోసం ప్రత్యేక శ్రద్ధతో కృషి చేసిన ఉప ముఖ్యమంత్రి అంజాద్ బాషాను, అధికారులు, సిబ్బందిని సత్కరించారు.

నాలుగేళ్లలో సంపద సృష్టి

- పెరిగిన జీఎస్టీ గణాంకాలే నిదర్శనం: ఆర్థిక మంత్రి బుగ్గన
- సెంట్రల్ జీఎస్టీ కంటే రాష్ట్ర జీఎస్టీ ఆదాయం 4 శాతం అధికం
- విజయవాడలో జీఎస్టీ ప్రాంతీయ కార్యాలయాన్ని ప్రారంభించిన బుగ్గన



కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న మంత్రి బుగ్గన

సాక్షి, అమరావతి: ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలతో రాష్ట్రంలో గత నాలుగేళ్లలో కొత్త వనరులతోపాటు సంపద సృష్టి జరిగిందని, జీఎస్టీ గణాంకాలే ఇందుకు నిదర్శనమని ఆర్థిక, వాణిజ్య పన్నుల శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ తెలిపారు. 2021–22లో రూ.23,386 కోట్లుగా ఉన్న జీఎస్టీ వసూళ్లు (పరిహారం లేకుండా) 2022–23లో 25 శాతం వృద్ధితో రూ.28,103 కోట్లకు చేరాయన్నారు. కేంద్ర జీఎస్టీ కంటే రాష్ట్ర జీఎస్టీ ఆదాయం నాలుగు శాతం అధికంగా నమోదైనట్లు వెల్లడించారు. జీఎస్టీ వసూళ్లు అత్యధికంగా ఉండే కర్ణాటక, మహారాష్ట్రల్లో సైతం ఇది కేవలం ఒక్క శాతానికి మాత్రమై పరిమితమైందన్నారు. వాస్తవాలు ఇలా ఉంటే ప్రతిపక్ష పార్టీలు రాష్ట్ర ఆదాయం, సంక్షేమ పథకాలపై తప్పుడు ప్రచారం చేస్తున్నాయని దుయ్యబట్టారు. శుక్రవారం విజయవాడలో జీఎస్టీ ప్రాంతీయ కార్యాలయాన్ని (ఆడిట్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్) ప్రారంభించిన అనంతరం మంత్రి బుగ్గన విలేకరులతో మాట్లాడారు. 2014–19 మధ్య టీడీపీ హయాంతో పోలిస్తే ఇప్పుడు రెండేళ్ల కరోనా ఇబ్బందులు ఎదురైనా అధిక సంపద, వనరులను సృష్టించామని చెప్పారు. దీనిపై టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు, మాజీ మంత్రి యనమలతో బహిరంగ చర్చకు సిద్ధమని బుగ్గన ప్రకటించారు. ఆదాయం తగ్గిందని యనమల విమర్శిస్తుంటే.. చంద్రబాబు మాత్రం పెరిగిందంటూ పరస్పర విరుద్ధంగా మాట్లాడుతున్నారని చెప్పారు. నిజంగా రాష్ట్రాన్ని అభివృద్ధి చేయకుంటే గత నాలుగేళ్లలో పన్ను వసూళ్లు ఎలా పెరిగాయని ప్రశ్నించారు.

డీలర్ ఫ్రెండ్లీ విధానం

వాణిజ్య పన్నుల శాఖలో పారదర్శకంగా నిర్ణయాలు అమలు కావాలనే ఉద్దేశంతో ఎన్నడూ లేని విధంగా సంస్కరణలు తెచ్చినట్లు బుగ్గన పేర్కొన్నారు. పన్ను చెల్లింపుదారులకు ప్రయోజనం చేకూరేలా నిర్ణయాలు తీసుకున్నామన్నారు. తమది డీలర్ల ఫ్రెండ్లీ విధానమని వివరించారు. స్టేట్ ట్యాక్స్ చీఫ్ కమిషనర్ ఎం.గిరిజాశంకర్, కమిషనర్ రవిశంకర్, అడిషనల్ కమిషనర్ ఎస్ఈ కృష్ణమోహన్‌రెడ్డి, కార్యాలయ అధికారులు పాల్గొన్నారు.


పాల ఏకరి కార్పొరేషన్ చైర్మన్‌గా కుమార్ రాజా



సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ పాల ఏకరి సంక్షేమ అభివృద్ధి సంస్థ (కార్పొరేషన్) చైర్మన్‌గా ఎంబీ కుమార్ రాజాను ప్రభుత్వం నియమించింది. ఈ కార్పొరేషన్‌కు మరో 12 మంది డైరెక్టర్లను నియమిస్తూ ఉత్తర్వులిచ్చింది. వీరంతా రెండేళ్లపాటు పదవిలో కొనసాగుతారు. రాష్ట్రంలోని 139 వెనుకబడిన కులాలకు ప్రభుత్వం 56 సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్‌లను ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. ఇటీవల వారి రెండేళ్ల పదవీకాలం పూర్తి కావడంతో ఈ ఏడాది జనవరిలో 55 బీసీ కార్పొరేషన్‌ల చైర్మన్‌లు, డైరెక్టర్లను కొనసాగిస్తూ (రెన్యూవల్) ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. కాగా, పాల ఏకరి కార్పొరేషన్ చైర్మన్ టి.మురళీధర్ ఆ తర్వాత జెడ్పీటీసీగా ఎంపిక కావడంతో అప్పట్లో ఆ కార్పొరేషన్ బోర్డు రెన్యూవల్‌ను ప్రభుత్వం తాత్కాలికంగా నిలిపివేసి తాజాగా చైర్మన్, డైరెక్టర్లను నియమించింది. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వెంట శుక్రవారం సీఎం క్యాంపు కార్యాలయానికి వెళ్లిన కుమార్ రాజా తనకు చైర్మన్ పదవి ఇచ్చినందుకు సీఎం వైఎస్ జగన్‌కి కృతజ్ఞతలు తెలిపారు. పాల ఏకరి కులస్తుల సమస్యల పరిష్కారానికి, వారి అభివృద్ధికి కృషి చేయాలని సీఎం సూచించారు.

ఆ కాంట్రాక్టర్లను బ్లాక్ లిస్ట్‌లో పెట్టండి

- సబ్‌స్టేషన్ల నిర్మాణం ప్రారంభించకపోతే కాంట్రాక్టు రద్దు
- విద్యుత్ బిల్లుల బకాయిల వసూలుపై ప్రత్యేక డ్రైవ్
- కోస్తా ప్రాంతంలో పీక్‌లోడ్‌పై పరిశ్రమల నిర్వాహకులతో సమావేశాలు
- ఉచిత వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లకు ప్రాధాన్యత ఇవ్వాలి
- ఏపీఈపీడీసీఎల్ అధికారులతో సమీక్షలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో విద్యుత్ సబ్‌స్టేషన్ల నిర్మాణం ప్రారంభించని కాంట్రాక్టర్లను బ్లాక్ లిస్ట్‌లో పెట్టాలని, వారి కాంట్రాక్టు రద్దు చేయాలని రాష్ట్ర ఇంధన శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అధికారులను ఆదేశించారు. ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీఈపీడీసీఎల్) అధికారులతో మంత్రి శుక్రవారం సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈపీడీసీఎల్ పరిధిలో 33 కేవీ సబ్ స్టేషన్ల నిర్మాణం వేగవంతం చేయాలన్నారు. లో ఓల్టేజీ ఉన్న చోట మాత్రమే కొత్త సబ్ స్టేషన్లు నిర్మించాలని సూచించారు. కోస్తా ప్రాంతంలో పీక్ లోడ్ పరిస్థితిని చక్కదిద్దేందుకు పరిశ్రమల నిర్వాహకులతో సమావేశాలు నిర్వహించాలన్నారు. పరిశ్రమల నుంచి బిల్లుల బకాయిల వసూలుకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని సూచించారు. ఈదురు గాలుల వల్ల పడిపోయిన విద్యుత్ స్తంభాలను యుద్ధ ప్రాతిపదికన సరిచేయాలని మంత్రి ఆదేశించారు. గోదావరి జిల్లాల్లో విద్యుత్ డిమాండ్ అధికంగా ఉందని, కొత్త సబ్ స్టేషన్ల నిర్మాణంతో లో ఓల్టేజీ సమస్యను పరిష్కరించాలని సూచించారు. ఉచిత వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లకు ప్రాధాన్యతనివ్వాలని చెప్పారు. వినియోగదారులకు ఆన్‌లైన్‌లో సేవలందించాలని సూచించారు.

జగనన్న కాలనీల్లో వేగంగా విద్యుదీకరణ

జగనన్న హౌసింగ్ కాలనీల్లో విద్యుదీకరణ వేగవంతం చేయాలని మంత్రి ఆదేశించారు. విశాఖ సర్కిల్ పరిధిలోని జగనన్న కాలనీల్లో లక్ష ఇళ్ల నిర్మాణం పూర్తవుతోందని, వాటికి విద్యుత్‌ను అందించేందుకు కొత్తగా 68 సబ్ స్టేషన్ల మంజూరుకు ప్రతిపాదనలు పంపించామని ఈపీడీసీఎల్ సీఎండీ ఐ.పృథ్వీతేజ్ మంత్రికి తెలిపారు. అనుమతులు రాగానే టెండర్లు పిలుస్తామని చెప్పారు. ప్రస్తుతం రాష్ట్రంలో రోజుకు 250 మిలియన్ యూనిట్ల విద్యుత్ డిమాండ్ ఉందని, దానికి అనుగుణంగా విద్యుత్ సరఫరా చేస్తూ, కోతల్లేకుండా చర్యలు తీసుకుంటున్నామని ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ మంత్రికి వివరించారు. ఈ సమావేశంలో ఏపీ జెన్‌కో ఎండీ కేవీఎస్ చక్రధర్‌బాబు, ఈపీడీసీఎల్ డైరెక్టర్లు బి.రమేష్ ప్రసాద్, డి.చంద్రం, ఏవీవీ సూర్యప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి ఫ్యామిలీ
బెంగళూరు
శనివారం ॥ 17-6-2023



ఈ స్నేహాలే ఇప్పుడు కావలసింది

పేపర్ తెరిస్తే ఘోరమైన వార్తలు. రక్త సంబంధాల మధ్య కూడా కక్షలు, కార్పణ్యాలు. మానవ సంబంధాలపై విశ్వాసం పోయేలా సంఘటనలు. ఇటువంటి సమయంలో ఒక ట్విటర్ పోస్ట్ చాలామందికి హాయినిచ్చింది. 'గాయత్రీ... ఇడ్లీలు చేశా. ఇంటికి రా' అని తన పొరుగింటివారు వాట్సప్ మెసేజ్ పెట్టిన సంగతిని మైసూర్‌కు చెందిన ఒక మహిళ షేర్ చేస్తూ తమ కాలనీలో అందరూ ఎంత స్నేహంగా ఉంటారో చెప్పింది. 'ముప్పై ఏళ్ల క్రితం ఇండియా ఇలాగే ఉండేది' అని అందరూ రెస్పాండ్ అవుతున్నారు. ఏం... ఇప్పుడు ఎందుకు అలా ఉండకూడదు?



నిజమే. పక్కింటి పాప తలుపు తట్టి 'బీరకాయ కూర చేసింది అమ్మ. ఇచ్చి రమ్మంది' అని చెప్తే చాలా బాగుంటుంది. 'గడి ముందుకేసి కూరగాయలకు వెళుతున్నా. కాస్త చూస్తుండక్కా' అని ఎదురింటి వాళ్లతో అంటే 'అదేం భాగ్యం. వెళ్లిరా' అని సొంతింటి కన్నా ఈ ఇంటి పైనే దృష్టి పెట్టే వాళ్లు దొరికితే మరెంతో బాగుంటుంది. ఇలా ఉండటానికే మనుషులు ఇష్టపడేవాళ్లు. కాని ఇప్పుడు ఇలా ఉండటం 'భాగ్యం' అని చెప్పుకునే స్థాయికి చేరుకున్నాం.

మైసూర్‌లో ఒక కాలనీ

'గాయత్రి. ఇడ్లీలు చేశా. ఇంటికి రా' అని తనకు వచ్చిన మెసేజ్‌ను ట్విటర్‌లో పోస్ట్ చేస్తూ 'మా కాలనీలో అంతా ఇలాంటి స్నేహమే' అని గాయత్రి జయరామన్ అనే మైసూర్ జర్నలిస్ట్ ట్వీట్ చేసింది. 20 ఏళ్లుగా పాత్రికేయరంగంలో ఉన్న గాయత్రి 'హూ మి, పూర్' అనే పుస్తకం రాసింది. సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండే గాయత్రి పక్కింటావిడ ఇడ్లీలకు పిలవడంతో సంతోషపడి తన కాలనీ స్నేహాలన్నీ ట్వీట్లుగా రాసింది.

'యోగా సెంటర్‌కు రాపిడో బుక్ చేద్దామని ఇంటి బయట నిలబడతానా... ఎవరో ఒకరు దింపడానికి వస్తారు. నా కుక్కపిల్ల నేను బయటికెళ్తే గోల చేస్తుంది. నేను ఇంట్లోనే ఉన్నాననే భావన కలిగించడానికి తలుపు తెరిచి పెట్టి పనుల కోసం బయటకు వెళితే మా కాలనీలో అందరూ కాపలా కాసేవాళ్లే. ఒక రోజు ఒకావిడ బిసిబేలా బాత్ పంపుతారు. నిన్న ఒకామె సాంబార్ పంపింది. మా కాలనీలో ఒకరి గిన్నెలు మరొకరి వంట గదిలో ఉండటం మామూలే. ఇలాంటి స్నేహాలతో మేమంతా ఉండటం సంతోషంగా ఉంది' అని రాసింది. దాంతో చాలామంది కనెక్ట్ అయ్యారు. 'మేము గవర్నమెంట్ క్వార్టర్స్‌లో ఉన్నప్పుడు అందరం ఇలాగే ఉండేవాళ్లం' అని ఒకరు రాస్తే 'మైసూర్లో అందరూ ఇలా ఉండొచ్చు. బెంగళూరులో ఈ వాతావరణం మిస్ అవుతున్నాను' అని మరొకరు రాశారు. 'ముప్పై ఏళ్ల క్రితం అందరూ ఇలా ఉన్నవాళ్లే. ఇప్పుడెక్కడ' అని మరొకరు బాధ పడ్డారు. 'లాక్‌డౌన్ సమయంలో కొంత కాలం మాత్రం ఇలా ఉన్నారు. ఇప్పుడు మళ్లీ ఎవరి గుహల్లోకి వాళ్లు వెళ్లిపోయారు' అని మరొకరు రాశారు.

ఇరుగు పొరుగుతో స్నేహంగా ఉండటం, 'ఏం బాబాయ్' అంటే 'ఏం అల్లుడూ' అని పలకరించుకోవడం.. 'ఆంటీ ఇంటి నుంచి టీ పొడర్ తీసుకురాపో' అని పంపించడం కూడా అసాధ్యమైన విషయాలుగా మారిపోతే ఏ ఊతంతో ఏ స్పందనలతో జీవించాలి మనం?

ప్రేమ, అభిమానాలే ఇంధనాలు

ఒక దూరప్రయాణం పరిచయస్తులు ఎవరూ లేని రైలులో చేస్తుంటే ఎలా ఉంటుందో, జీవన ప్రయాణం ప్రేమ, అభిమానాలు పంచేవాళ్లు లేకుంటే అలా ఉంటుంది. నలుగురు స్నేహితులతో సాగే పిక్నిక్ యాత్రలా జీవితం ఎందుకు ఉండకూడదు? కనీసం అప్పుడప్పుడన్నా వీధి అరుగుపై ఇరుగు పొరుగుతో కబుర్లు చెప్పుకునే కమ్మదనంతో జీవితం ఎందుకు ఉండకూడదు? పిల్లలు కూడా తల్లిదండ్రులను చూసి ఇరుగు పొరుగు పిల్లలతో స్నేహం చేయడం మానేస్తున్నారు. దీనివల్ల వారి మానసిక ఆరోగ్యం ఎలా ఉండబోతోందో ఆలోచించారా?

శ్రుతి మించి ప్రైవసీ

పల్లెల్లో అయినా పట్నాల్లో అయినా ప్రతి ఒక్కరూ శ్రుతి మించిన ప్రైవసీలోకి జారుకుంటున్నారు. మొదట ఉమ్మడి కుటుంబాలు వద్దనుకున్నారు. ఆ తర్వాత తల్లిదండ్రుల నుంచి పిల్లలు విడిపోవడం మొదలుపెట్టారు. ఆ తర్వాత ఇరుగు పొరుగు వారిని వద్దనుకుంటున్నారు. కేవలం ఎప్పుడూ ఇళ్లకు కూడా రాని కొందరు స్నేహితులు, పరిచయస్తులు చాలనుకునే స్థితికి చేరుకున్నారు. 'మన బతుకులో ఎవరి జోక్యం అక్కర్లేదు' అనే భావనలో ఉన్న సౌకర్యం ఎలా ఉన్నా 'ఎవరి సాయం, తోడు లేకుండా బతుకు ఎలా ఉంటుంది' అనే ప్రశ్నకు జవాబు దొరకడం లేదు. ప్రైవసీ పిచ్చి ఒంటరితనంలోకి, ఏకాంతంలోకి, మనకు ఎవరూ లేరని భావనలోకి నెట్టి అభద్రతకు, ఆందోళనకు గురి చేస్తుంది. 'ఎదుటివారి లోపాలు వెతకడం, జడ్జ్ చేయడం, మనకు హితవు చెప్పిన వారిని కూడా పగవారిని చేసుకోవడం, అనుబంధాలు ఆర్థికపరమైన సాయాలు కోరతాయనే మిషతో అందరినీ దూరం పెట్టడం' ఇవి నేడు ప్రతి మనిషిని కేవలం కుటుంబ జీవితానికి, కుటుంబ అనుబంధాలకి (అవి కూడా సరిగ్గా ఉంటే) పరిమితం చేస్తున్నాయి.

పక్కింటామె 'ఇడ్లీ తిందూరా' అని పిలవడమే వార్తగా మారి, అది చదివి ఆనంద బాష్పాలు వచ్చే స్థితికి మనం చేరుకుంటే ఆ తప్పు ఇడ్లీదో చట్నీదో కాదు. మనదే.

ప్లాగ్‌రాజ్

ఉదయాన్నే లేచి వ్యాయామం చేస్తే ఒంటికి మంచిదని తెలుసు. కానీ రకరకాల కారణాలతో వ్యాయామం చేయడానికి బద్దకించేస్తుంటాం. ''కనీసం నాలుగడుగులేయండి, కాస్త జాగింగ్ అయినా చేయండి''అని పెద్దలు చెబుతుంటారు. ''జాగింగ్‌తోపాటు ప్లాగింగ్ కూడా చేయండి మీరు ఫిట్‌గా ఉండడమేగాక మీ చుట్టూ ఉన్న పరిసరాలు కూడా క్లీన్ అవుతాయి'' అని చెబుతున్నాడు నాగరాజు. రోజూ చేసే జాగింగ్ కంటే ప్లాగింగ్‌లో మరిన్ని కేలరీలు ఖర్చవడంతోపాటు, అహం కూడా తగ్గుతుందని హామీ ఇస్తోన్న ప్లాగింగ్ నాగరాజు గురించి అతని మాటల్లోనే...

ఆంధ్రప్రదేశ్‌లోని గుంతకల్ మా స్వస్థలం. ఎమ్‌బీఏ చదివేందుకు పదిహేనేళ్ల క్రితం బెంగళూరు వచ్చాను. చదువు పూర్తయ్యాక ఉద్యోగం చేస్తూ ఇక్కడే స్థిరపడిపోయాను. 2012లో ఒకరోజు సైక్లింగ్ ఈవెంట్ పూర్తిచేసుకుని ఇంటికి తిరిగొస్తున్నాను. ఆ సమయంలో... కొంతమంది యువతీ యువకులు జాగింగ్ చేస్తూనే రోడ్డు మీద పడి ఉన్న చెత్తాచెదారాన్ని ఏరుతున్నారు. నాకు కొంచెం చిత్రంగా అనిపించి, ''ఏం చేస్తున్నారు?'' అని అడిగాను. ''మేము ఇక్కడ ఉన్న చెత్తనంతటిని తీసివేస్తే ఎవరూ ఇక్కడ చెత్తవేయరు. అంతా చెత్తడబ్బాలోనే వేస్తారు. దీంతో ఈ ప్రాంతం అంతా పరిశుభ్రంగా ఉంటుంది'' అని చెప్పారు. అది విన్న నాకు ఆశ్చర్యంగా అనిపించింది. ఐడియా చాలా బావుంది అనుకున్నాను. అప్పటి నుంచి నేను కూడా చెత్తను తగ్గించడానికి ప్రయత్నిస్తూ.. ఎక్కడైనా చెత్త కనిపిస్తే, దానిని తీసుకెళ్లి చెత్తడబ్బాలో వేసేవాణ్ణి.





నాగరాజు

స్వీడన్‌లో పుట్టింది

ప్లాగింగ్ పుట్టింది స్వీడన్‌లో. స్వీడిష్‌లో ప్లాగింగ్ అంటే 'టు పికప్' అని అర్థం. ఎరిక్ అల్స్ట్రమ్ రోజూ అనే అతను కార్డియో వర్క్‌వుట్స్ చేస్తూ తను వెళ్లే దారిలో కనపడిన చెత్తను ఏరివేస్తూ 2016లో ప్లాగింగ్‌ను ప్రారంభించాడు. టీవీలో అది చూసిన నేను.. ఇండియాలో ఎలా ప్లాగింగ్ చేయాలో నెట్‌లో శోధించి తెలుసుకున్నాను. అదే సంవత్సరం కబ్బన్ పార్క్‌లో 500 మందితో రన్నింగ్ ఈవెంట్ జరుగుతోంది. ఆ ఈవెంట్‌లో ప్లాగింగ్ ప్రారంభించాను. అక్కడ రన్నర్స్ పడేసే ప్లాస్టిక్ బాటిల్స్‌ను ఏరి చెత్తబుట్టలో వేయడం చూసి కొంతమంది నన్ను అభినందించారు. ఈ అభినందనలు నన్ను ప్లాగింగ్ దిశగా మరింతగా ప్రోత్సహించాయి. అప్పటి నుంచి నా ప్లాగింగ్ జర్నీ కొనసాగుతూనే ఉంది.

ఇండియన్ ప్లాగర్స్ ఆర్మీ

నేను ప్లాగింగ్ మొదలుపెట్టిన తొలినాళ్లలో ఎవరూ ఆసక్తి కనబరచలేదు. ఒక్కడ్నే ఇది చేయాలంటే కష్టంగా అనిపించింది. దాంతో అందరి ఇళ్లకు వెళ్లి ప్లాస్టిక్ వేస్ట్‌ను కలెక్ట్ చేసేవాడ్ని. రోడ్లమీద పడి ఉన్న చెత్తను ఏరేందుకు నా నాలుగేళ్ల కూతురు ఒక బ్యాగ్‌ను పట్టుకుని వచ్చి నాతోపాటు చెత్తను ఏరి బ్యాగ్‌లో వేసుకునేది. అలా నా ప్లాగింగ్ నిదానంగా సాగుతోండగా.. 2018లో కూర్గ్‌లో జరిగిన 'బేర్‌ఫూట్ మారథాన్' నా ప్లాగింగ్‌కు పాపులారిటీని తెచ్చింది. అతిపెద్ద మారథాన్‌లో ప్లాగింగ్ చేయడంతో అక్కడ పాల్గొన్న సెలబ్రిటీలు, ఔత్సాహికులకు దానిపై అవగాహన కల్పించాను. మిలింద్ సోనమ్ నన్ను మెచ్చుకుని, ప్లాగింగ్ గురించి అవగాహన కల్పించడానికి సాయం చేశారు. కొన్ని కార్పొరేట్ కంపెనీలు సాయం చేయడంతో..'ద ఇండియన్ ప్లాగర్స్ ఆర్మీ' ని ఏర్పాటు చేశాం. ఈ ఆర్మీతో కలిసి వీకెండ్స్‌లో కనీసం ఒక ప్లాగింగ్ ఈవెంట్‌ను అయినా ఏర్పాటు చేసేవాళ్లం. అలా ఆరేళ్లలో 550కు పైగా ఈవెంట్స్ చేశాం. ఏరిన చెత్తమొత్తాన్ని బెంగళూరు రీసైక్లింగ్ యూనిట్‌కు పంపి, పర్యావరణ కాలుష్యాన్ని తగ్గిస్తున్నాం.





నాగరాజుతో ప్లాగింగ్ ఆర్మీ

> **అహం కరుగుతుంది**
>
> ఎక్కడపడితే అక్కడ చెత్తవేయకూడదని, వీలైనంత వరకు ప్లాస్టిక్ వాడకూడదని అందరిలో అవగాహన కల్పించడమే ప్లాగింగ్ ముఖ్య ఉద్దేశ్యం. ఇది విజయవంతమైతే ఎవరూ చెత్తవేయరు. జాగింగ్ చేసినప్పుడు కేలరీలు కరుగుతాయి. అయితే అక్కడక్కడ పడి ఉన్న చెత్తను వంగి తీయడం వల్ల మరిన్ని కేలరీలు ఖర్చవుతాయి. వేరే ఎవరో పడేసిన చెత్తను పెద్ద మనసుతో మనం ఎత్తినప్పుడు మనలో పేరుకుపోయిన అహం భావం కూడా కరిగిపోతుంది.

> **అవగాహనతో...**
>
> రోజురోజుకీ పెరిగిపోతున్న ప్లాస్టిక్ కాలుష్యానికి ప్లాగింగ్ ఈవెంట్ చక్కని పరిష్కారం చూపుతోంది. ప్రతి ఒక్కరు జాగింగ్ చేస్తూ చెత్తను ఏరివేయడం ద్వారా ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలన్న అవగాహన పెరుగుతుంది. తద్వారా ప్లాస్టిక్ కాలుష్యం నియంత్రణలోకి వస్తుంది. ప్లాగింగ్ చేసే ముందు మేమంతా "కొంతమేరైనా ప్లాస్టిక్ వ్యర్థాలను తగ్గింస్తాం" అని ప్రతిజ్ఞ చేశాక వ్యర్థాలను ఏరతాం.
>
> – నాగరాజు

ఇంటిప్స్



మనం ఎంత తాజా కొత్తిమీర తీసుకున్నా, ఈ ఎండలకు అది వాడిపోతుంటుంది. అలాంటి కొత్తిమీరకట్టను తీసుకుని వేళ్లు ఉన్న భాగాన్ని కట్‌చేసి తీసేయాలి. ఒక గాజు గ్లాసులో నీళ్లుపోసి అందులో చిటికడు ఉప్పు వేసి కొత్తిమీర కాడలు ఆ నీటిలో మునిగేటట్టుగా పెట్టి అరగంట తరువాత చూస్తే వాడిపోయిన కొత్తిమీర ఆకులు తాజాగా కనిపిస్తాయి. కూరల్లో వేసుకోవడానికి బావుంటాయి.

- మిగిలిపోయిన అన్నాన్ని చూస్తూ చూస్తూ పారేయబుద్ధి కాదు. అలాగని బిగుసుకుపోయినట్లు ఉన్న అన్నాన్ని తినలేం. అలాంటప్పుడు ఆ అన్నాన్ని దానికి సరిపడినన్ని మరిగే నీటిలో వేసి ఐదారు నిమిషాలు తిప్పుతూ ఉంచి, తరువాత ఆ అదనపు నీటిని తీసివేస్తే అప్పుడే వండిన అన్నంలా వస్తుంది.
- గుడ్లు ఉడికించేటప్పుడు టీస్పూను నూనె వేయడం వల్ల గుడ్లు పగలకుండా చక్కగా ఉడుకుతాయి.



అర్చన... అనుకున్నది సాధించింది

ఫస్ట్ టైమ్

'నేర్చుకోవాలి' అనే తపన ఉంటే ఏ విద్య అయినా చేతికి చిక్కుతుంది. సైకిల్ తొక్కడం కూడా రాని అర్చనా ఆత్రమ్ పెద్ద బస్సును నైపుణ్యంగా నడుపుతూ 'భేష్' అనిపించుకోవడానికి ఆ తపనే కారణం....

మహారాష్ట్ర స్టేట్ రోడ్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ (ఎంఎస్‌ఆర్‌టీసీ) తొలి మహిళా డ్రైవర్‌గా వార్తల్లో నిలిచింది అర్చనా ఆత్రమ్. నాందేడ్ జిల్లాలోని కిన్వత్ తాలూకలోని సర్కానీ గ్రామానికి చెందిన అర్చన డ్రైవింగ్ ఫీల్డ్‌ను ఎంచుకోవడం తండ్రికి నచ్చలేదు. బంధువులు 'అది ఆడవాళ్లు చేసే ఉద్యోగం కాదు' అన్నారు. కొందరైతే...'నీకు సైకిల్ తొక్కడమే రాదు. బస్సు నడుపుతావా!' అని బిగ్గరగా నవ్వేవాళ్లు.

ఎన్నో ప్రతికూల మాటలను ఈ చెవిన విని ఆ చెవిన వదిలేసిందేగానీ ఒక్క అడుగు వెనక్కి వేయలేదు అర్చన.

'పట్టుదల ఉంటే ఏదైనా నేర్చుకోవచ్చు' అంటున్న అర్చన పుణెలో జరిగిన శిక్షణ తరగతులలో ఎన్నో విషయాలు నేర్చుకుంది. క్లచ్, గేర్ అంటే ఏమిటో తెలియని అర్చన జీరో నుంచి ప్రయాణం ప్రారంభించి హీరో అయ్యింది. డిపో మేనేజర్ నుంచి మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి వరకు ఎంతో మంది అర్చనా ఆత్రమ్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు.



అర్చనా ఆత్రమ్

బ్యూటిప్స్

ఫ్రూట్ ఫేషియల్, ఫేస్ ప్యాక్, ఎక్స్‌ఫోలియేషన్ వంటి ట్రీట్‌మెంట్‌లతో అందానికి మెరుగులు దిద్దుకోవడానికి బ్యూటీ పార్లర్‌కు వెళ్లాల్సిన పని లేదు. ఇంట్లోనే చేసుకోవచ్చు. అది కూడా మన ఇంట్లో ఉపయోగించే దినుసులతోనే.



- టీ స్పూన్ శనగపిండిలో టీ స్పూన్ పెరుగు, అర టీ స్పూన్ తేనె కలిపి ముఖానికి ప్యాక్ వేయాలి. ఆరిన తరవాత మునివేళ్లతో వలయాకారంగా మర్దన చేయాలి, ఆ తర్వాత చన్నీటితో కడగాలి. ఈ హెర్బల్ ఫేస్ ప్యాక్ వేయడం వల్ల చర్మం తగినంత తేమతో ఆరోగ్యంగా మెరుస్తుంది. నునుపుదనం సంతరించుకుంటుంది.
- చర్మం మీద మృత కణాలు తొలగిపోవాలంటే టేబుల్ బియ్యప్పిండిలో టేబుల్ స్పూన్ పెరుగు, టీ స్పూన్ తేనె కలపాలి. ఇది హోమ్‌మేడ్ స్క్రబ్. దీనిని చేతులు, పాదాలకు పట్టించి ఐదు నిమిషాల తర్వాత వేళ్లతో వలయాకారంగా మర్దన చేసి చన్నీటితో శుభ్రం చేయాలి. రెండువారాలకొకసారి ఇలా చేయడం వల్ల మృతకణాలు తొలగిపోయి చర్మం నిగారిస్తుంది.
- ముఖం మీద మచ్చలు పోవాలంటే... టీ స్పూన్ శనగపిండిలో టీ స్పూన్ తులసి ఆకుల రసం, టీ స్పూన్ తేనె కలిపి ఆ మిశ్రమాన్ని ముఖం, మెడ, చెవులకు పట్టించాలి. ఈ ప్యాక్ రోజూ వేయవచ్చు. తాజా తులసి ఆకులు లేకపోతే తులసి ఆకుల పొడి వాడుకోవచ్చు. అప్పుడు ఈ పొడులను కలపడానికి పెరుగు లేదా మజ్జిగ వాడాలి. పొడి చర్మం వాళ్లయితే పాలు కలుపుకోవాలి.
- టేబుల్ స్పూన్ మామిడి పండు గుజ్జులో నాలుగు చుక్కల తేనె కలిపి ముఖం, మెడ, చేతులకు పట్టించి ఆరిన తర్వాత చన్నీటితో శుభ్రం చేయాలి. మ్యాంగో ఫ్రూట్ ప్యాక్ రోజూ వేస్తుంటే చర్మం మెరుపును సంతరించుకుంటుంది. వారం పది రోజుల్లోనే ఫలితం స్పష్టంగా కనిపిస్తుంది.
- అరటి పండు తొక్కతో (తొక్క లోపలి వైపు) పాదాలకు మర్దన చేస్తే పాదాలు పగుళ్లు తగ్గిపోతాయి.పాదానికి రాయాలి.

రూట్స్

ఎన్నో తరాలు ఒకే తరమై...



సుమతి జలన్

ఉపాధి వెదుక్కుంటూ బిహార్‌వాసులు వేరే ప్రాంతాలకు వెళుతుంటారు. 'నేను బిహార్ నుంచి వచ్చాను' అని చెప్పుకోవడానికి చాలామంది జంకుతుంటారు. దీని కారణం రకరకాల అపోహలు. చదువు, ఉద్యోగం వల్ల చాలా కాలం సొంత రాష్ట్రానికి దూరంగా ఉన్న సుమతి జలన్ పట్నాను వెదుక్కుంటూ వచ్చింది. 'తడబడవద్దు. భయపడవద్దు. నేను బిహారిని అని గర్వంగా చెప్పుకోండి' అనే నినాదంతో బిహార్‌లోని ప్రసిద్ధ హస్తకళలకు ప్రపంచవ్యాప్త గుర్తింపు తీసుకురావడానికి 'బిహర్ట్' అనే జీరో వేస్ట్ క్లాతింగ్ బ్రాండ్‌కు శ్రీకారం చుట్టి విజయపథంలో దూసుకుపోతోంది....

'మీరు బిహారి అంటే నమ్మడం చాలా కష్టం' అని చాలామంది సుమతితో అన్నారు.

తన ఉన్నతవిద్య నేపథ్యం కావచ్చు, వేగంగా ఇంగ్లీష్ మాట్లాడే నేర్పు కావచ్చు... వారి నోటి నుంచి ఆ మాట వచ్చేలా చేశాయి. అయితే ఆ మాటను ఎప్పుడూ ప్రశంసగా తీసుకోలేదు సుమతి జలన్. పైగా బాధగా అనిపించేది.

చిన్నప్పుడు తల్లిదండ్రులు, తాత నోటి నుంచి బిహార్ ఘన సంస్కృతి గురించి కథలు, కథలుగా విన్నది. తాను విన్నదానికి, బిహార్ అవతల వినిపిస్తున్నదానికి అంతరం కనిపించింది. 'అపోహలు' అనే రాక్షసులపై యుద్ధం చేయాల్సిన అవసరం కనిపించింది. అందుకే సొంతభూమికి వెళ్లింది.


'నేను బిహార్‌వాసిని' అని ప్రతి ఒక్కరూ గర్వంగా చెప్పుకోవడానికి ఏదైనా చేయాలి అనుకుంది. అలా ఆలోచిస్తున్న సమయంలో తనకు అపురూపమైన బిహార్ సంప్రదాయ కళలు గుర్తుకు వచ్చాయి. కాలికి బలపం కట్టుకొని ఆ కళలను వెదుక్కుంటూ ఎన్నో ఊళ్లు తిరిగింది. అలా తిరిగే క్రమంలో...

'మన గురించి మనం చెప్పుకోవాల్సింది ఎంతో ఉంది' అనిపించింది.

ఆ ఆలోచనతోనే 'బిహర్ట్' పేరుతో ఫ్యాషన్ బ్రాండ్ మొదలుపెట్టింది. ఈ బ్రాండ్ ద్వారా బిహార్‌లోని హస్తకళలకు ప్రపంచవ్యాప్త ప్రాచుర్యం కల్పించాలని లక్ష్యంగా నిర్ణయించుకుంది.

మల్బరి సిల్క్ చీరెలు, కుర్తీలు, సుజని టాప్స్, దుప్పట్లు, హ్యాండ్‌మేడ్ బ్యాగులు, సుజని-షింగరీ బొమ్మలు... ఇలా ఎన్నెన్నో ఉత్పత్తులతో ప్రయాణం ప్రారంభించింది సుమతి.





ooo

తమ ప్రాడక్ట్స్ గురించి చెబుతూ 'ఎన్నో తరాల కళ ఒకే తరమై కనిపిస్తుంది' అంటుంది.

సుమతి తాత దివాన్ బహదూర్ రాధ క్రిష్ణ జలన్ ప్రపంచవ్యాప్తంగా ఉన్న కళాకృతులను సేకరించేవాడు. యూరప్, చైనా, టిబెట్, టర్కీ నుంచి ఎన్నో అద్భుతమైన కళాఖండలకు తీసుకు వచ్చాడు. వీటిని భద్రపరచడం కోసం మ్యూజియంలాంటి ఇంటిని ప్రత్యేకంగా నిర్మించాడు. ఆ మ్యూజియంలోకి వెళితే సుమతికి మరో లోకంలోకి వచ్చినట్లుగా అనిపించేది. అలా కళలపై ఆసక్తి మొదలైంది.

'కళ కళ కోసమే' అని నమ్మేవారితో పాటు 'సామాజిక ప్రయోజనం కోసం' అని నమ్మేవారు కూడా ఉంటారు. ఇందులో భాగంగానే కళను తమ ప్రాంత సాంస్కృతిక వైభవ వికాసం కోసం ఉపయోగించుకోవడానికి నడుం బిగించింది సుమతి.

విజయాల మాట ఎలా ఉన్నా ప్రతి వ్యాపారానికి సవాళ్లు ఎదురొస్తుంటాయి. కోవిడ్ రూపంలో అలా సవాలు ఎదురొచ్చింది. అయినా నిలదొక్కుకోగలిగింది తన బ్రాండ్. మరో సవాలు 'బిహర్ట్' కోసం ఎవరిని ఎంపిక చేసుకోవాలి అనేది. ఉపాధి కోసం యువతరంలో ఎంతో మంది బిహార్ దాటి ఎక్కడెక్కడికో వెళుతున్న విషయం గుర్తుకువచ్చింది. దీన్ని దృష్టిలో పెట్టుకొని ఫోటోగ్రఫీ, మార్కెటింగ్, డిజైన్, బ్లాగింగ్, మోడలింగ్‌లో ప్రతిభ ఉన్న యువతరానికి ఉపాధి అవకాశాలు కల్పించింది.

'బిహర్ట్' బ్రాండ్ అనే గొడుగు నీడలో ప్రొడక్షన్ మేనేజర్, ఫ్యాషన్ డిజైనర్, టైలర్స్‌గా ఎంతో మంది ఉపాధి పొందుతున్నారు.



ఇండోర్ సైక్లింగ్ ఎన్నో వ్యాయామాలకు సరిసాటి

వ్యాయామం చేయడం వల్ల ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు న్నాయనే విషయం అందరికీ తెలుసు. అయితే అందరికీ వ్యాయామం చేయడం కుదరకపోవచ్చు. కొందరికైతే కనీసం వాకింగ్ చేయడం కూడా కష్టమే అవుతుంటుంది వారున్న పరిస్థితులలో. అలాంటప్పుడు కనీసం ఇండోర్ సైక్లింగ్ లేదా స్టేషనరీ సైకిల్‌తో వ్యాయామం చేసినా ఎన్నో ప్రయోజనాలు కలుగుతాయంటున్నారు ఆరోగ్య నిపుణులు. ఇండోర్ సైక్లింగ్ వల్ల ఏయే ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయో చూద్దాం...

ఇండోర్ సైక్లింగ్ శరీరాన్ని ఫిట్ గా ఉంచడమే కాకుండా గుండె జబ్బుల ముప్పును కూడా తగ్గిస్తుంది.

ఇండోర్ సైక్లింగ్ శారీరక, మానసిక ఆరోగ్యానికి ప్రయోజనకరంగా ఉంటుంది. ఇండోర్ సైక్లింగ్ ఎన్నో రోగాల ముప్పు నుంచి కాపాడుతుంది. ఏరోబిక్ సామర్థ్యాన్ని కూడా పెంచుతుంది. అలాగే హృదయ స్పందన రేటును పెంచుతుంది. ఇది మీ గుండె కండరాలను బలోపేతం చేయడానికి, శరీరంలోకి రక్తాన్ని సమర్థవంతంగా పంప్ చేయడానికి సహాయపడుతుంది. ఈ వ్యాయామాన్ని స్థిరంగా చేయడం వల్ల రక్త ప్రసరణ, ఊపిరితిత్తుల సామర్థ్యం మెరుగుపడుతుంది. దీంతో అధిక రక్తపోటు పోటు సమస్యలు రావు. గుండె జబ్బుల ప్రమాదం కూడా తగ్గుతుంది.

మెటబాలిజాన్ని పెంచుతుంది

ఏ రకమైన కదలిక అయినా సరే శరీరానికి ఎంతో మంచి చేస్తుంది. సైక్లింగ్ ఎఫెక్టివ్ కేలరీల బర్నింగ్ వ్యాయామం. సైక్లింగ్ తో బెల్లీ ఫ్యాట్ ను తగ్గించుకోవచ్చు. హార్వర్డ్ మెడికల్ స్కూల్ ప్రకారం.. 70 కిలోల బరువున్న వ్యక్తి ఇండోర్ సైక్లింగ్ వల్ల 250 నిమిషాల్లో 30 కేలరీలను కరిగించగలడు. అందుకే మీరు బరువు తగ్గాలనుకుంటే జిమ్ముకు బదులుగా ఇంట్లో ఉండి ఇండోర్ సైక్లింగ్ చేస్తే సరి! అంతేకాదు ఈ సైకిల్‌ను తొక్కడం వల్ల మీ కాలి కదలికలు మెరుగుపడతాయి. ఫలితంగా కాళ్లలోని కండరాల సమూహాలు – క్వాడ్రిసెప్స్, గ్లూట్స్, తొడ కండరాలు కాలక్రమేణా బలంగా, టోన్ అయ్యేలా చేస్తాయి.

ఇండోర్ సైక్లింగ్ మీ కీళ్లకు మంచిది

ఇండోర్ సైక్లింగ్ ప్రభావవంతమైన తక్కువ–ప్రభావ వ్యాయామంగా పరిగణించబడుతుంది. ఇది వృద్ధులకు, మోకాలి, కీళ్ల నొప్పులు ఉన్నవారికి బాగా సహాయపడుతుంది. ఇది కీళ్లపై తక్కువ ఒత్తిడిని కలిగిస్తుంది. మోకాలి సమస్య లేదా వెన్నునొప్పి ఉన్నవారు ఇండోర్ సైక్లింగ్‌కు ముందు డాక్టర్‌తో మాట్లాడాలి. వైద్యుడి సలహా మేరకే ఈ సైకిల్‌ను తొక్కాలి.

ఒత్తిడిని తగ్గిస్తుంది


ఇండోర్ సైక్లింగ్ మానసిక ఆరోగ్య ప్రయోజనాలను కూడా కలిగిస్తుంది. ఏదో ఒక రూపంలో శారీరకంగా చురుకుగా ఉండటం వల్ల మీ శరీరం ఎండార్ఫిన్లు అని పిలువబడే ఫీల్–గుడ్ హార్మోన్లను విడుదల చేస్తుంది. కొన్ని అధ్యయనాల ప్రకారం.. సైక్లింగ్ డోపామైన్, సెరోటోనిన్ ను కూడా పెంచుతుంది. ఫలితంగా మీ మానసిక స్థితి మెరుగ్గా ఉంటుంది. ఒత్తిడి స్థాయిలు కూడా తగ్గుతాయి.

శక్తి సామర్థ్యాలను పెంచుతుంది

ఇండోర్ సైక్లింగ్ మీ స్టామినాను పెంచడానికి కూడా సహాయపడుతుంది. దీన్ని రెగ్యులర్ గా తొక్కుతుంటే క్రమంగా అలసట తగ్గి రోజువారీ కార్యకలాపాలను నిర్వహించడానికి, ఇతర వ్యాయామాలలో పాల్గొనడానికి ఎక్కువ శక్తి, సామర్థ్యాన్ని కలిగి ఉండటానికి సహాయపడుతుంది.

మీరు ఈ పరీక్షలు చేయించుకున్నారా?

కొలెస్ట్రాల్ నుంచి క్యాన్సర్ వరకు ఆరోగ్య సమస్యలను సకాలంలో కనుక్కుంటే చికిత్స సులువు అవుతుంది. ఇటీవలి కాలంలో చాలామంది రకరకాల వ్యాధులకు సంబంధించిన లక్షణాలు ముదిరే వరకు వాటిని గుర్తించడంలో ఆలస్యం చేస్తున్నారు. దీనివల్ల ప్రాణాలు పోయే పరిస్థితి కూడా వస్తుంది. అందుకే వయసుల వారీగా చేయించుకోవలసిన వైద్యపరీక్షల జాబితాను దగ్గర ఉంచుకుని తమ వయసుని బట్టి ఆయా ఆరోగ్య పరీక్షలు చేయించుకుని అవసరం అయితే సరైన సమయంలో చికిత్స తీసుకుంటే మంచిదని నిపుణులు సూచిస్తున్నారు. మనం పైన చెప్పుకున్న దానిని బట్టి ఏ వయసులో ఏ పరీక్ష చేయించుకోవడం అవసరమో చూద్దాం.



20 ఏళ్ల వయసులో...



సాధారణంగా ఈ వయసులో ఎక్కడ పడితే అక్కడ తినడం, టాటూలు వేయించుకోవడం, అబ్బాయిలయితే హెయిర్ కట్ లేదా షేవింగ్ చేయించుకోవడం లేదా ఎలా పడితే అలా ఉండటం జరుగుతుంటుంది. రకరకాల కారణాల వల్ల హెచ్.ఐ.వి. బారిన పడే ప్రమాదం ఉండే అవకాశం ఎక్కువ. అందువల్ల హెచ్.ఐ.వి. పరీక్ష చేయించుకోవడం మంచిది. అలాగే హెపటైటిస్ సి కోసం పరీక్షలు చేయించుకుంటే మంచిది. ఇక మహిళలు గర్భాశయ క్యాన్సర్ కోసం స్క్రీనింగ్ 21 సంవత్సరాల నుంచి 65 సంవత్సరాల వరకు పరీక్షలు చేయించుకోవాలి. అదేవిధంగా బీపీ, షుగర్ టెస్ట్ కూడా!

30 ల్లో...



30 నుంచి 65 సంవత్సరాల వయసు గల స్త్రీ పురుషులు మధుమేహం, కొలెస్ట్రాల్ పరీక్షలు చేయించుకోవాలి. అధిక బరువు లేదా ఊబకాయం ఉన్న వాళ్ళు ప్రీడయాబెటిస్, టైప్ 2 మధుమేహం స్క్రీనింగ్ తప్పనిసరి. అమెరికన్ డయాబెటిస్ అసోసియేషన్ ప్రకారం 35 ఏళ్ల పైబడిన వారందరూ టైప్ 2 డయాబెటిస్ పరీక్ష చేయించుకోవాలని సిఫార్సు చేస్తున్నారు. 35 ఏళ్ల వయసు మహిళలు కొలెస్ట్రాల్ స్థాయిలు తనిఖీ చేయించుకోవాలి. 30 నుంచి 65 సంవత్సరాల వయసు గల మహిళలకు ప్రతి మూడు సంవత్సరాలకు ఒకసారి పాప్ స్మియర్ టెస్ట్ కొనసాగించాలి. హెచ్ పీవీ వైరస్ గర్భాశయ, ఇతర క్యాన్సర్లకు కారణమవుతుంది.

40 ల్లో...



స్త్రీలు క్యాన్సర్ స్క్రీనింగ్ చేయించుకునేందుకు 45 ఏళ్ల వయసు సరైన సమయం. కోలన్ క్యాన్సర్ పరీక్షించేందుకు కోలోనోస్కోపీ లేదా మెయిల్ ఇన్ స్టూల్ టెస్ట్ ద్వారా పరీక్ష చేయించుకోవాలి. రొమ్ముక్యాన్సర్ స్క్రీనింగ్ కోసం 40 దాటిన మహిళలు ప్రతి రెండేళ్లకు ఒకసారి మామోగ్రామ్ చేయించుకోవడం అవసరం. అదేవిదంగా కంటి సంబంధిత పరీక్షలు కూడ ముఖ్యం. మధుమేహం ఉంటే అధిక రక్తపోటు, కంటివ్యాధుల పరీక్షలు తప్పనిసరి. ఈ వయసులో పురుషులు, స్త్రీలు ఇద్దరూ విటమిన్ డి, కాల్షియం టెస్ట్ చేయించుకోవడం అవసరం.

50 ల్లో...



మెనోపాజ్ దశలోకి వచ్చిన తర్వాత మహిళలు తప్పనిసరిగా ఆస్టియోపొరాసిస్ ఉందేమో పరీక్షించుకోవాలి. ఇందుకోసం బోన్ డెన్సిటీ టెస్ట్ అంటే ఎముక సాంద్రత ఎంత ఉందో తెలిపే పరీక్ష చేయించుకోవాలి. ఇక ధూమపానం చరిత్ర ఉన్న పెద్దలు ఊపిరితిత్తుల క్యాన్సర్ పరీక్షలు చేయించుకోవాలి. ప్రోస్టేట్ క్యాన్సర్ పరీక్షలు పురుషులు చేయించుకోవాలి.

60 ల్లో...



65 ఏళ్లు అంతకంటే పైబడిన వయసు ఉన్న మహిళల్లో ఎముకల అరుగుదల కనిపిస్తుంది. అందుకే బోలు ఎముకల వ్యాధి పరీక్షలు చేయించుకోవాలి. ఇందుకోసం కూడా బోన్ డెన్సిటీ టెస్ట్ అవసరం. ఇక 65 నుంచి 75 సంవత్సరాల మధ్య వాళ్ళకి బ్రెయిన్ అనూరిజం పరీక్షలు తప్పనిసరి.




ముఖ్యమైన విషయం... 35 సంవత్సరాలు దాటిన స్త్రీ పురుషులు తప్పనిసరిగా హృదయ సంబంధిత పరీక్షలు చేయించుకోవడం అవసరం. అదే వారి కుటుంబంలో ఎవరికైనా హృద్రోగం ఉంటే ప్రతి ఆరునెలలకు ఒకసారి గుండె సంబంధిత టెస్ట్‌లు చేయించుకోవడం తప్పనిసరి.

మీకు తెలుసా



స్నానపు నీటిలో కొన్ని చుక్కల లావెండర్ ఆయిల్‌ను కలపడం ద్వారా మరింత రిలాక్స్‌డ్‌గా, రిఫ్రెష్‌డ్‌గా ఉన్న అనుభూతిని పొందవచ్చు. లావెండర్ వాసన నిద్ర నాణ్యతను మెరుగుపరుస్తుంది. రక్తపోటును తగ్గిస్తుంది, కండరాల నొప్పి నుంచి ఉపశమనం కలిగించడంతోపాటు మీ ఒత్తిడిని తగ్గించి మానసిక స్థితిని కూడా మెరుగుపరుస్తుంది. అలాగే స్నానం చేసిన వెంటనే మీ చర్మానికి మాయిశ్చరైజర్ రాయండి. తద్వారా మీ జుట్టు, చర్మం కూడా ఆరోగ్యంగా ఉంటుంది.

హెల్త్ టిప్స్





తులసి ఆకుల రసంలో అంతే మొత్తంలో తేనె కలిపి తీసుకుంటే దగ్గు తగ్గుతుంది.

* * *

ఓ నాలుగైదు తమలపాకులను వెచ్చచేసి, వాటిని నూరి రసం తీసి, దానిలో అంతే మొత్తంలో తేనె కలిపి తీసుకుంటే దగ్గు తగ్గుతుంది.

* * *

ఓ రెండు చెంచాల నూనెను కాచి, ఒక పెద్ద చెంచాడు కర్పూరాన్ని పొడిచేసి నూనెలో కలిపి ఒక సీసాలో నిల్వ వుంచాలి. దీనిని ఛాతీకి, గొంతుకకూ రాస్తే దగ్గు, జలుబు తగ్గుతాయి.

* * *

గుప్పెడు జామాయిలు (యూకలిప్టస్) ఆకుల్ని రెండు గ్లాసుల నీళ్లల్లో పోసి అవి మరిగి ఒక గ్లాసు అయ్యేదాకా మరగబెట్టాలి. అనంతరం ఆ నీటిని వడగట్టి అందులో కొంచెం పంచదార కలిపి, రోజుకు మూడుసార్లు తాగితే దగ్గు, జలుబు తగ్గుతాయి.

సినిమా

కథ మళ్లీ కలిపింది

ఒక హీరో–ఒక డైరెక్టర్ ఒక హిట్ సినిమా ఇస్తే.. వారిది 'హిట్ కాంబో' అవుతుంది. అందుకే ఆ కాంబినేషన్‌లో రెండో సినిమా రావాలని ఫ్యాన్స్ కోరుకుంటారు. తమ కాంబో రిపీట్ అవ్వాలని హీరో–డైరెక్టర్‌కి కూడా ఉంటుంది. కానీ కథ కుదరాలి. అలా కొందరు హీరో–దర్శకులను మళ్లీ కథ కలిపింది. రెండోసారి రిపీట్ అవుతున్న ఆ కాంబినేషన్ గురించి తెలుసుకుందాం.


మణిరత్నం


కమల్


శంకర్





ఎన్టీఆర్
కొరటాల శివ

దశాబ్దాల తర్వాత

హీరోగా కమల్‌హాసన్, దర్శకుడిగా మణిరత్నంలది ఇండస్ట్రీలో సుదీర్ఘ ప్రయాణం. కానీ కమల్‌హాసన్, మణిరత్నంల కాంబినేషన్‌లో ఇప్పటి వరకూ వచ్చిన చిత్రం ఒక్కటే. అదే 'నాయకన్' (తెలుగులో 'నాయకుడు'–1987). అప్పట్లో బాక్సాఫీస్ వద్ద ఈ సినిమా సంచలన విజయాన్ని నమోదు చేసుకుంది. అయితే ఇంతటి బ్లాక్‌బస్టర్ సక్సెస్ అందుకున్నప్పటికీ కమల్, మణిరత్నంల కాంబినేషన్‌లో మరో సినిమా సెట్స్‌పైకి వెళ్లలేదు. ముప్పైఐదేళ్ల తర్వాత ఇప్పుడు కమల్, మణిరత్నంల కాంబో రిపీట్ కానుంది. మరోవైపు దర్శకుడు శంకర్‌తో ప్రస్తుతం 'ఇండియన్ 2' సినిమా చేస్తున్నారు కమల్‌హాసన్. శంకర్, కమల్ కాంబోలోనే 1996లో రిలీజైన బ్లాక్‌బస్టర్ హిట్ ఫిల్మ్ 'ఇండియన్' (తెలుగులో 'భారతీయుడు') సినిమాకు సీక్వెల్ ఇది. సో.. కమల్–శంకర్ కాంబో మళ్లీ సెట్ అవ్వడానికి పాతికేళ్లు పైనే పట్టింది అన్నమాట.

దేవర

ఎన్టీఆర్ కెరీర్‌లో ఉన్న సూపర్ హిట్ చిత్రాల్లో 'జనతా గ్యారేజ్' ఒకటి. క్లాస్ టచ్‌తో మాస్ ఎలిమెంట్స్‌ను జోడించి దర్శకుడు కొరటాల శివ ఈ సినిమాను తెరకెక్కించారు. కాగా ఆరేళ్ల తర్వాత ఎన్టీఆర్, కొరటాల శివ కాంబినేషన్‌లో 'దేవర' సినిమా సెట్స్‌పై ఉంది. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ హైదరాబాద్‌లో జరుగుతోంది. ఇందులో జాన్వీ కపూర్ హీరోయిన్. విస్మరణకు గురైన భారతదేశ తీర ప్రాంతవాసుల నేపథ్యంలో ఈ సినిమా కథనం ఉంటుంది. వచ్చే ఏడాది ఏప్రిల్ 5న 'దేవర' విడుదల కానుంది.




విజయ్, పరశురామ్

డబుల్ ఇస్మార్ట్


హీరో రామ్‌లోని పవర్‌ఫుల్ మాస్ యాంగిల్‌ని 'ఇస్మార్ట్ శంకర్' (2019)లో వెండితెరపైకి తెచ్చారు దర్శకుడు పూరి జగన్నాథ్. ఈ చిత్రం ఇటు రామ్, అటు పూరి జగన్నాథ్ కెరీర్‌లకు ఆ సమయంలో బాగా బూస్టప్ ఇచ్చింది. ఇప్పుడు 'ఇస్మార్ట్ శంకర్'కు సీక్వెల్‌గా 'డబుల్ ఇస్మార్ట్' చేయనున్నారు రామ్ అండ్ పూరి. వచ్చే ఏడాది మార్చి 8న ఈ చిత్రాన్ని రిలీజ్ చేయనున్నట్లు ప్రకటించారు.




నితిన్
వెంకీ

ఫ్యామిలీ స్టార్

'గీత గోవిందం' (2018)తో రూ. వంద కోట్ల క్లబ్‌లో చేరారు హీరో విజయ్ దేవరకొండ. ఈ సినిమాకు పరశురామ్ దర్శకుడు. ఐదేళ్ల తర్వాత విజయ్, పరశురామ్ కాంబోలో సెకండ్ ఫిల్మ్‌గా రూపొందనున్న సినిమా ప్రారంభోత్సవం ఇటీవల జరిగింది. ఇందులో మృణాల్ ఠాకూర్ హీరోయిన్. కాగా ఈ చిత్రానికి 'ఫ్యామిలీ స్టార్', 'కుటుంబరావు' అనే టైటిల్స్‌ని పరిశీలిస్తున్నారని సమాచారం.




రామ్
పూరి జగన్నాథ్

అడ్వెంచరస్ డ్రామా

రెండున్నరేళ్ల క్రితం కోవిడ్ సమయంలో విడుదలైన 'భీష్మ' చిత్రాన్ని ఆడియన్స్ ఆదరించారు. నితిన్ హీరోగా వెంకీ కుడుముల దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం ఇది. ఇప్పుడు నితిన్–వెంకీ కుడుమల రెండోసారి మరో ఫిల్మ్ చేస్తున్నారు. 'భీష్మ' చిత్రంలో హీరోయిన్‌గా నటించిన రష్మికా మందన్నా ఈ చిత్రంలో కూడా హీరోయిన్ పాత్ర చేస్తున్నారు. ఈ సినిమా మ్యూజిక్ సిట్టింగ్స్ ఇటీవల మొదలయ్యాయి. అడ్వెంచరస్ ఎంటర్‌టైనర్ డ్రామాగా ఈ సినిమా తెరకెక్కనున్నట్లు తెలుస్తోంది.

రాక్షస రాజు

'నేనే రాజు నేనే మంత్రి' (2017) చిత్రంలో జోగేంద్ర పాత్రలో హీరో రానా కాస్త నెగటివ్ షేడ్స్‌లో మెప్పించారు. అలాంటి కథతో ఈ సినిమాను తెరకెక్కించారు దర్శకుడు తేజ. అయితే రానా, తేజ కాంబోలో మరో సినిమా కన్ఫార్మ్ కావడానికి ఆరేళ్ల సమయం పట్టింది. రానా, తేజ కాంబినేషన్‌లోని సెకండ్ ఫిల్మ్ 'రాక్షస రాజు' (వర్కింగ్ టైటిల్) షూటింగ్ త్వరలోనే ప్రారంభం కానుంది.




రానా
తేజ

భైరవ కోనలో...

'టైగర్' (2015) చిత్రం కోసం తొలిసారి చేతులు కలిపారు హీరో సందీప్ కిషన్, దర్శకుడు వీఐ ఆనంద్. ప్రస్తుతం వీరి కాంబినేషన్‌లో రూపొందిన సినిమా 'ఊరిపేరు భైరవకోన'. సస్పెన్స్, థ్రిల్లర్‌గా రూపొందిన ఈ సినిమా త్వరలో విడుదల కానుంది.

వీరే కాదు.. మరికొందరు హీరోలు, దర్శకులు తమ కాంబోలో రెండో సినిమా ఇవ్వడానికి రెడీ అవుతున్నారని తెలుస్తోంది.




సందీప్
ఆనంద్


జపాన్ భాషలో ఆర్ఆర్ఆర్

ఎన్టీఆర్, రామ్‌చరణ్ హీరోలుగా రాజమౌళి దర్శకత్వంలో డీవీవీ దానయ్య నిర్మించిన చిత్రం 'ఆర్ఆర్ఆర్'. ఈ చిత్రం గత ఏడాది మార్చి 25న విడుదలైన విషయం తెలిసిందే. కాగా 'ఆర్ఆర్ఆర్' తెలుగు వెర్షన్‌ని జపనీస్ సబ్ టైటిల్స్‌తో 2022 అక్టోబరు 21న జపాన్‌లో విడుదల చేశారు. జపాన్ బాక్సాఫీస్ వద్ద రూ. 130 కోట్ల గ్రాస్ కలెక్షన్స్‌ను సాధించిందీ చిత్రం. ఇంకా అక్కడ ప్రదర్శితమవుతోంది. దీంతో ఈ చిత్రాన్ని జపాన్ భాషలో రిలీజ్ చేస్తున్నట్లుగా శుక్రవారం చిత్ర యూనిట్ ప్రకటించింది. ''జపాన్ సబ్‌టైటిల్స్‌తో కూడిన తెలుగు వెర్షన్ 'ఆర్ఆర్ఆర్' సక్సెస్‌ఫుల్‌గా ప్రదర్శితమవుతోంది. ఇప్పుడు జూలై 28న ఈ సినిమాను జపాన్ భాషలో రిలీజ్ చేసేందుకు రెడీ అవుతున్నాం'' అని చిత్ర యూనిట్ వెల్లడించింది.


రామ్‌చరణ్, ఎన్టీఆర్

మాస్ రత్నమాల

ఊర మాస్ రత్నమాలగా కనిపించనున్నారు అంజలి. శుక్రవారం (జూన్ 16) ఆమె పుట్టినరోజు సందర్భంగా 'వీఎస్ 11' (వర్కింగ్ టైటిల్) సినిమాలో ఆమె చేస్తున్న రత్నమాల పాత్రకు సంబంధించిన ఫస్ట్ లుక్‌ని విడుదల చేసింది చిత్ర యూనిట్. విశ్వక్ సేన్ హీరోగా కృష్ణ చైతన్య దర్శకత్వంలో ఈ సినిమా తెరకెక్కుతోంది. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. ''యాక్షన్ డ్రామాగా రూపొందుతోన్న చిత్రమిది. ఇందులో రత్నమాలగా అంజలి కనిపించనున్నారు. ఆమె పాత్ర మాస్ ప్రేక్షకులను అలరిస్తుంది. విశ్వక్ సేన్ తొలిసారి ఈ చిత్రంలో క్రూరమైన పాత్రను పోషిస్తున్నారు'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: యువన్ శంకర్ రాజా, కెమెరా: అనిత్ మధాది, సహనిర్మాతలు: వెంకట్ ఉప్పుటూరి, గోపీచంద్ ఇన్నమూరి.


అంజలి


కృత్రిమ మేధస్సుతో...


రియా, శ్రవణ్

శ్రవణ్ రెడ్డి, రియా కపూర్ జంటగా వాసుదేవ్ పిన్నమరాజు దర్శకత్వంలో కొత్త సినిమాకి శ్రీకారం చుట్టారు. దేవాస్ మీడియా అండ్ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై శ్యామ్ దేవభక్తుని నిర్మిస్తున్న ఈ చిత్రం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. ముహూర్తపు సన్నివేశానికి సుహాస్ కృష్ణ దేవభక్తుని కెమెరా స్విచ్చాన్ చేయగా, నటుడు అజయ్ ఘోష్ క్లాప్ ఇచ్చారు. నిర్మాత కిరణ్ స్క్రిప్ట్ అందించగా, వాసుదేవ్ పిన్నమరాజు దర్శకత్వం వహించారు. ''కృత్రిమ మేధస్సు నేపథ్యంలో భారతదేశపు మొట్టమొదటి సైన్స్ ఫిక్షన్ రొమాంటిక్ డ్రామాగా రూపొందుతోన్న చిత్రమిది. ఇందులోని ప్రధాన సన్నివేశాలను వర్చ్యువల్ ప్రొడక్షన్ టెక్నాలజీలో చిత్రీకరించనున్నాం'' అని మేకర్స్ పేర్కొన్నారు. ఈ చిత్రానికి సంగీతం: సాహిత్య సాగర్, కెమెరా: అఖిల్ దేవ్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: కిరణ్ కుమార్ గోపరాజు.

సస్పెన్స్.. థ్రిల్

వీరు, శ్రీహర్ష హీరోలుగా, కుషీచౌహాన్, నిషా సింగ్ హీరోయిన్లుగా తోట కృష్ణ దర్శకత్వంలో 'చండిక' సినిమా ఆరంభమైంది. కేవీ పాపారావు నిర్మాత. ముహూర్తపు సన్నివేశానికి తెలుగు ఫిలిం ఛాంబర్ అధ్యక్షుడు బసిరెడ్డి కెమెరా స్విచ్చాన్ చేయగా, నిర్మాతల మండలి అధ్యక్షుడు దామోదర్ ప్రసాద్ క్లాప్ కొట్టారు. ''హారర్, సస్పెన్స్ థ్రిల్లర్ చిత్రమిది'' అన్నారు తోట కృష్ణ. ''చండిక'కి నేనే కథ అందించాను'' అన్నారు కేవీ పాపారావు.


వీరు, శ్రీవిష్ణు

నాతో నేను


శాంతికుమార్, రాజ్ కందుకూరి

సాయికుమార్, శ్రీనివాస్ సాయి, ఆదిత్య ఓం, దీపాలి రాజపుత్, ఐశ్వర్య రాజీవ్ కనకాల కీలక పాత్రధారులుగా రూపొందిన చిత్రం 'నాతో నేను'. 'జబర్దస్త్' ఫేమ్ శాంతి కుమార్ తుర్లపాటి దర్శకత్వంలో ప్రశాంత్ టంగుటూరి నిర్మించారు. ఈ చిత్రం టీజర్‌ను నిర్మాత రాజ్ కందుకూరి విడుదల చేసి, మాట్లాడుతూ – ''ఈ సినిమా పాయింట్ కొత్తగా అనిపించింది. ఈ మధ్యకాలంలో కొత్త లైన్, కొత్త టీమ్ చేసే ప్రతి సినిమా సక్సెస్ అవుతోంది. ఈ టీమ్‌కు అభినందనలు'' అన్నారు. ''దర్శకత్వం వహించడంతో పాటు కథ, మాట, పాటలు నేనే రాసుకుని నిర్మాతల సహకారంతో ఈ సినిమా పూర్తి చేశా'' అన్నారు శాంతి కుమార్. ''త్వరలో సినిమా విడుదల తేదీని ప్రకటిస్తాం'' అని నిర్మాత తెలిపారు.

ఆట మొదలైంది


రాజేష్, ప్రీతి

సిరిపురం రాజేష్ హీరోగా నటించి, స్వీయ దర్శకత్వంలో నిర్మించిన చిత్రం 'కుట్ర'. (ద గేమ్ స్టార్ట్స్ నవ్) అన్నది ఉపశీర్షిక. ప్రీతి, గీతిక రతన్, ప్రియ దేశ్‌పాల్ హీరోయిన్లు. ఈ చిత్రం ఈ నెల 23న రిలీజవుతోంది. హైదరాబాద్‌లో నిర్వహించిన ఈ చిత్రం ప్రీ రిలీజ్ వేడుకకి తెలంగాణ స్టేట్ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ కోలేటి దామోదర్, టీఎస్ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎక్స్ చైర్మన్ ఉప్పాల శ్రీనివాస్ గుప్తా, టీఎస్ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎక్స్ చైర్మన్ అమరవాది లక్ష్మీనారాయణ అతిథులుగా హాజరయ్యారు. ''ఇద్దరు మిత్రుల మధ్య సాగే సస్పెన్స్ క్రైమ్ థ్రిల్లర్ చిత్రమిది'' అన్నారు సిరిపురం రాజేష్.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	467	63,385
నిఫ్టీ ▲	138	18,826

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (శుక్రవారం రాత్రి 11.00 గంటలకు)			
నాస్‌డాక్	13,769	▼	14
డోజోన్స్	34,476	▲	68
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,643	▲	14
డాక్స్	16,358	▲	68
షాంఘై	3,273	▲	20
నికాయ్	33,706	▲	221

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.ల్లో – ముంబై		
బంగారం (99.9 స్వచ్ఛత)	59,582 ▲	648
బంగారం (99.5 స్వచ్ఛత)	59,343 ▲	645
వెండి (కిలో)	72,420 ▲	1,358

తాజా గోల్డ్ బాండ్ @ రూ.5,926

సోమవారం నుంచి ఐదు రోజులు విక్రయం



న్యూఢిల్లీ: సావరిన్ గోల్డ్ బాండ్ స్కీమ్ 2023–24 తొలి విడత సోమవారం నుంచి అందుబాటులోకి రానుంది. బంగారం జారీ ధరను గ్రాముకు రూ.5,926గా ఆర్థికశాఖ ప్రకటించింది. ఐదు రోజుల పాటు (19–23) స్కీమ్ అందుబాటులో ఉంటుంది. ఆన్‌లైన్‌లో కొనుగోలు చేస్తే ప్రకటిత ధరలో గ్రాముకు రూ.50 రిబేట్ లభిస్తుంది. అంటే ఆన్‌లైన్ ధర గ్రాముకు రూ.5,876గా ఉంటుందన్నమాట. బంగారంలో పెట్టుబడి పెట్టాలనుకునేవారికి ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2023–24) మొదటి ఆరు నెలల్లో రెండుసార్లు– జూన్ 19తో పాటు సెప్టెంబర్ 11 నుంచి 15వ తేదీ వరకూ కూడా మరో సావరిన్ గోల్డ్ బాండ్ స్కీమ్ అందుబాటులో ఉండే సంగతి తెలిసిందే. గోల్డ్ బాండ్లు– షెడ్యూల్డ్ కమర్షియల్ బ్యాంకులు (స్మాల్ ఫైనాన్స్ బ్యాంకులు, పేమెంట్ బ్యాంకులు ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు మినహా), స్టాక్ హోల్డింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, క్లియరింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, నిర్దిష్ట పోస్టాఫీసులు, డీమ్యాట్ అకౌంట్‌తో గుర్తింపు పొందిన స్టాక్ ఎక్స్ఛేంజీల ద్వారా కొనుగోలు చేయొచ్చు. ఇండియా బులియన్ అండ్ జువెలర్స్ అసోసియేషన్ ప్రచురించిన 999 స్వచ్ఛత బంగారం సగటు ధర ఆధారంగా ఎస్‌జీబీ ధరను నిర్ణయిస్తారు.

బుల్.. కొత్త రికార్డ్!



- సూచీలు ఆల్‌టైమ్ గరిష్ట స్థాయిల వద్ద ముగింపు
- బ్యాంకింగ్, ఫైనాన్స్ షేర్లలో కొనుగోళ్లు
- ఐటీ, ఇంధన షేర్లలో లాభాల స్వీకరణ
- కలిసొచ్చిన జాతీయ, అంతర్జాతీయ పరిణామాలు

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్ శుక్రవారం సరికొత్త గరిష్టాల వద్ద ముగిసింది. ప్రపంచ ఈక్విటీ మార్కెట్లలోని సానుకూల సంకేతాలు, విదేశీ ఇన్వెస్టర్ల కొనుగోళ్లు కొనసాగడం, రూపాయి బలపడటం తదితర అంశాలు కలిసొచ్చాయి. అధిక వెయిటేజీ రిలయన్స్ ఇండస్ట్రీస్, హెచ్‌డీఎఫ్‌సీ ద్వయం షేర్లు రెండు శాతం రాణించి సూచీల రికార్డు ముగింపునకు దన్నుగా నిలిచాయి. ఉదయం సెన్సెక్స్ 43 పాయింట్లు పెరిగి 62,961 వద్ద, నిఫ్టీ 35 పాయింట్ల లాభంతో 18,723 వద్ద మొదలయ్యాయి. జాతీయ, అంతర్జాతీయంగా నెలకొన్న సానుకూల పరిణామాల ప్రభావంతో ఇన్వెస్టర్లు కొనుగోళ్లకే ప్రాధాన్యత ఇచ్చారు. ఫలితంగా సూచీలు రోజంతా లాభాల్లోనే కదలాడాయి. ఒక దశలో సెన్సెక్స్ 602 పాయింట్లు బలపడి 63,520 వద్ద, నిఫ్టీ 177 పాయింట్లు దూసుకెళ్లి 18,865 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని తాకాయి. అయితే వారాంతపు రోజు కావడంతో ఇన్వెస్టర్లు ఆఖర్లో గరిష్ట స్థాయిల వద్ద కొంత లాభాల స్వీకరణకు పాల్పడ్డారు. ఫలితంగా సెన్సెక్స్ 467 పాయింట్ల లాభంతో 63,385 వద్ద స్థిరపడింది. ఈ ముగింపు సూచీకి జీవితకాల గరిష్ట స్థాయి. అంతకు ముందు సెన్సెక్స్‌కు (గతేడాది డిసెంబర్ 1న) జీవితకాల గరిష్ట ముగింపు స్థాయి 63,284గా ఉంది. నిఫ్టీ 138 పాయింట్లు బలపడి 18,826 వద్ద ముగిసింది. ఈ సూచీకి అంతకు ముందు సరికొత్త గరిష్ట ముగింపు 18,812గా ఉంది. బ్యాంకింగ్, ఫైనాన్స్, క్యాపిటల్ గూడ్స్ షేర్లలో భారీ కొనుగోళ్లు జరిగాయి. ఐటీ, ఇంధన, రియల్టీ, టెక్ షేర్లలో లాభాల స్వీకరణ చోటు చేసుకుంది. విస్తృత స్థాయి మార్కెట్లో బీఎస్‌ఈ మిడ్, స్మాల్ క్యాప్ ఇండెక్స్‌లు 0.76%, 0.71 శాతం చొప్పున లాభపడ్డాయి. ఈ వారం మొత్తంగా సెన్సెక్స్ 759 పాయింట్లు, నిఫ్టీ 263 పాయింట్లు లాభపడ్డాయి. ఫెడ్ రిజర్వ్ వడ్డీరేట్ల పెంపు ఇప్పట్లో ఉండకపోవచ్చనే సంకేతాల నేపథ్యంలో ప్రపంచ ఈక్విటీ మార్కెట్లు లాభాల్లో ట్రేడవుతున్నాయి.

నెల గరిష్టానికి రూపాయి

రూపాయి విలువ నెల గరిష్ట స్థాయికి చేరుకుంది. డాలర్ మారకంలో 35 పైసలు బలపడి 81.97 వద్ద ముగిసింది. అంతర్జాతీయంగా ఆరు ప్రధాన కరెన్సీ విలువల్లో డాలర్ ఇండెక్స్ వారంలో అతిపెద్ద పతనాన్ని చవిచూసింది. క్రూడాయిల్ ధరలు దిగిరావడం, దేశీయ ఈక్విటీ మార్కెట్ల రికార్డు స్థాయి ముగింపు అంశాలు రూపాయి ర్యాలీకి సహకరించాయి. ఫారెక్స్ మార్కెట్లో రూపాయి ఇంట్రాడేలో 82.02 – 81.86 శ్రేణిలో ట్రేడైంది.

ఆల్‌టైం హై స్థాయికి ఇన్వెస్టర్ల సంపద

సూచీల రికార్డు ర్యాలీ నేపథ్యంలో ఇన్వెస్టర్ల సంపద సైతం ఇంట్రాడేలో సరికొత్త గరిష్టానికి చేరుకుంది. ట్రేడింగ్‌లో రూ.292.78 లక్షల కోట్లతో జీవితకాల గరిష్టాన్ని తాకింది. ఆఖర్లో లాభాల స్వీకరణ కారణంగా మార్కెట్ ముగిసేసరికి ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్‌ఈ కంపెనీల మొత్తం విలువ రూ.292.74 లక్షల కోట్లకు చేరింది. సెన్సెక్స్ దాదాపు ఒకశాతం ర్యాలీతో ఒక్కరోజే రూ.2.03 లక్షల కోట్ల సంపద సృష్టి జరిగింది.

మార్కెట్లో మరిన్ని సంగతులు

- ఎల్‌ఈడీ లైటింగ్ తయారీ సంస్థ ఐకియో లైటింగ్ లిస్టింగ్ మెప్పించింది. బీఎస్‌ఈలో ఇష్యూ ధర రూ.285తో పోలిస్తే 37.19% ప్రీమియంతో రూ.391 వద్ద లిస్టయ్యింది. ట్రేడింగ్‌లో 50% ర్యాలీ చేసి రూ.427 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని తాకింది. మార్కెట్ ముగిసేసరికి 41.66 శాతం బలపడి రూ.404 వద్ద స్థిరపడింది.
- అమెరికా ప్రైవేట్ ఈక్విటీ దిగ్గజం బైన్ క్యాపిటల్ యాక్సిస్ బ్యాంక్‌లో స్వల్పంగా వాటా తగ్గించుకుంది. ఓపెన్ మార్కెట్ ద్వారా 2.25 కోట్ల ఈక్విటీ షేర్లు(0.7% వాటాకు సమానం) విక్రయించింది. ఈ లావాదేవీ విలువ రూ.2,178 కోట్లుగా ఉంది. ఈ నేపథ్యంలో యాక్సిస్ బ్యాంక్ షేరు అరశాతం స్వల్ప లాభంతో రూ.981 వద్ద ముగిసింది.

భారత మార్కెట్లోకి జపాన్ 'ముసాషి'

- తొలి దశలో రూ. 70 కోట్ల పెట్టుబడి
- ఎలక్ట్రిక్ వాహనాల విడిభాగాల తయారీ



ముంబై: జపాన్‌కు చెందిన ఆటోమొబైల్ విడిభాగాల తయారీ సంస్థ ముసాషి తాజాగా భారత ఎలక్ట్రిక్ మొబిలిటీ మార్కెట్లోకి ప్రవేశించింది. భారత్ న్యూ ఎనర్జీ కంపెనీ (బీఎన్‌సీ) మోటార్స్‌తో జట్టు కట్టింది. మోటార్, పీసీయూ, గేర్ బాక్స్‌తో కూడిన కొత్త ఈవీ యూనిట్లను ఉత్పత్తి చేయనున్నట్లు ముసాషి ఇండియా తెలిపింది. బెంగళూరు ప్లాంటులో అక్టోబర్ నుంచి ఈ–యాక్సిల్‌ను తయారు చేయనున్నట్లు వెల్లడించింది. దీనికి సంబంధించిన అసెంబ్లీ లైన్ కోసం తొలి దశలో రూ. 70 కోట్లు ఇన్వెస్ట్ చేయనున్నట్లు వివరించింది. ముసాషి సైమిత్సు ఇండస్ట్రీస్‌కి ముసాషి ఇండియా అనుబంధ సంస్థగా ఉంది. తమ అనుభవం, అధునాతన సాంకేతికతను భారత ఎలక్ట్రిక్ మొబిలిటీ మార్కెట్లోకి తేనున్నట్లు ముసాషి సైమిత్సు సీఈవో (భారత విభాగం) తోషిహిసా ఒత్సుకా తెలిపారు. భారత్‌లో తయారు చేసిన ఈ–యాక్సిల్‌ను ఇతర దేశాలకు కూడా సరఫరా చేయాలని ముసాషి భావిస్తోంది. ఇందుకోసం థాయ్‌లాండ్‌కి చెందిన స్ట్రోమ్, వియత్నాం సంస్థ ఈవీ గో, కెన్యాకు చెందిన ఆర్క్ రైడ్‌తో ఒప్పందాలు కుదుర్చుకుంది.

ఇండ్‌ఇన్‌ఫ్రావిట్ చేతికి రోడ్ ప్రాజెక్టులు

- విక్రయించిన బ్రూక్‌ఫీల్డ్ అసెట్
- డీల్ విలువ రూ. 8,200 కోట్లు



ముంబై: బ్రూక్‌ఫీల్డ్ అసెట్ మేనేజ్‌మెంట్ నుంచి నిర్వహణలో ఉన్న నాలుగు రహదారి ప్రాజెక్టులను ఇండ్‌ఇన్‌ఫ్రావిట్ ట్రస్ట్ సొంతం చేసుకుంది. పూర్తి నగదు రూపేణా జరిగిన డీల్ విలువ బిలియన్ డాలర్లు(దాదాపు రూ. 8,200 కోట్లు)కాగా.. కొనుగోలును పూర్తి చేసినట్లు ఇండ్‌ఇన్‌ఫ్రావిట్ తాజాగా వెల్లడించింది. బ్రూక్‌ఫీల్డ్ నిర్వహణలోని బీఐఎఫ్ ఇండియా హోల్డింగ్స్, కై నెటిక్ హోల్డింగ్స్ నుంచి ఐదు ప్రాజెక్టులను చేజిక్కించుకునేందుకు ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్లు పేర్కొంది. అయితే నాలుగు ఆస్తులను మాత్రమే స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించింది. జాబితాలో సింహపురి ఎక్స్‌ప్రెస్‌వే, రాయలసీమ ఎక్స్‌ప్రెస్‌వే, ముంబై– నాసిక్ ఎక్స్‌ప్రెస్‌వే, కోసి బ్రిడ్జి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కంపెనీ చేరాయి. ఇక గోరఖ్‌పూర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కంపెనీ నియంత్రణ సంస్థల అనుమతులను పొందవలసి ఉండటంతోపాటు.. కొన్ని నిబంధనలు పాటించవలసి ఉన్నట్లు తెలియజేసింది. నిధులను రూపాయలలో కాలావధి రుణం, మార్పిడిరహిత డిబెంచర్లు, కెనడా పెన్షన్ ప్లాన్ ఇన్వెస్ట్‌మెంట్ బోర్డ్, ఓఎంఈఆర్‌ఎస్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌కు ప్రిఫరెన్షియల్ పద్ధతిలో యూనిట్ల జారీ ద్వారా ఏర్పాటు చేసింది. సొంతం చేసుకున్న ప్రాజెక్టులలో మూడు టోల్ రోడ్ ఆస్తులుకాగా.. ఒక యాన్యుటీ రహదారిగా కంపెనీ తెలియజేసింది. ఇండ్‌ఇన్‌ఫ్రావిట్ ట్రస్ట్‌ను ఎల్‌అండ్‌టీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్స్ ఏర్పాటు చేసింది.

ఐదేళ్లలో రూ. లక్ష కోట్ల ఆదాయం

- రూ. 50,000 కోట్లపై రుచీ సోయా గురి
- పతంజలి గ్రూప్ భారీ లక్ష్యాలు
- పలు కొత్త ప్రొడక్టుల విడుదలకు రెడీ

న్యూఢిల్లీ: ఎఫ్‌ఎంసీజీ దిగ్గజం పతంజలి గ్రూప్ భారీ లక్ష్యాలపై దృష్టి పెట్టింది. రానున్న ఐదేళ్లలో రూ. లక్ష కోట్ల ఆదాయం సాధించాలని చూస్తోంది. విభిన్న ఉత్పత్తులతో అన్ని రకాల వినియోగదారులకూ చేరువకావడం ద్వారా రూ. లక్ష కోట్ల టర్నోవర్ మైలురాయిని చేరుకోవాలని భావిస్తున్నట్లు పతంజలి గ్రూప్ చీఫ్ రామ్‌దేవ్ తాజాగా పేర్కొన్నారు. ఈ బాటలో లిస్టెడ్ కంపెనీ పతంజలి ఫుడ్స్(రుచీ సోయా ఇండస్ట్రీస్) రూ. 45,000–50,000 కోట్ల టర్నోవర్‌ను అందుకునేందుకు ప్రణాళికలు వేసినట్లు వెల్లడించారు. వెరసి గ్రూప్ లక్ష్య సాధనలో పతంజలి ఫుడ్స్ కీలకపాత్ర పోషించనున్నట్లు తెలియజేశారు. పోర్ట్‌ఫోలియోలో ప్రీమియం ఉత్పత్తులను జతచేసే వ్యూహంలో భాగంగా పౌష్టికాహారం(న్యూట్రాస్యూటికల్స్), హెల్త్ బిస్కట్స్, చిరు ధాన్య ఆధార ఉత్పత్తులు, డ్రై ఫ్రూట్స్ తదితరాలను ప్రవేశపెడుతున్నట్లు పేర్కొన్నారు.

దేశీయంగా దృష్టి

దేశీ మార్కెట్‌పైనే విశ్వాసముంచిన కంపెనీ ఇక్కడ మల్టీనేషనల్ కంపెనీ (విదేశీ దిగ్గజాలు)తో పోటీ పడనున్నట్లు రామ్‌దేవ్ తెలియజేశారు. ప్రస్తుతం యూనిలీవర్ మినహా.. మిగిలిన అన్ని ఎంఎన్‌సీలనూ అధిగమించినట్లు పేర్కొన్నారు. రెండు దశాబ్దాల క్రితం పతంజలి గ్రూప్ రూ. 10,000 కోట్ల టర్నోవర్‌ను అందుకుంటుందని చెప్పినప్పుడు తాము అతిగా అంచనా వేస్తున్నట్లు పలువురు భావించారని ప్రస్తావించారు. ప్రస్తుతం పతంజలి గ్రూప్ టర్నోవర్ రూ. 45,000 కోట్లను తాకినందుకు గర్వంగా ఉన్నట్లు చెప్పారు.

అందుబాటు ధరల్లో...

పతంజలి ఆయుర్వేద్ ద్వారా అందుబాటు ధరల్లో విభిన్న ప్రొడక్టులను అందిస్తూ వచ్చినట్లు రామ్‌దేవ్ పేర్కొన్నారు. ఇకపై ఎగువ మధ్యతరగతిని లక్ష్యంగా పెట్టుకుని పతంజలి ఫుడ్స్ ద్వారా ప్రీమియం ఉత్పత్తులకు తెరతీస్తున్నట్లు వెల్లడించారు. ప్రపంచస్థాయిలోనూ పతంజలి గ్రూప్ ఎఫ్‌ఎంసీజీ విభాగంలో విస్తరిస్తున్నట్లు చెప్పారు. 200 దేశాలలో 200 కోట్లమందికి చేరువైనట్లు తెలియజేశారు. దేశీయంగా 70 కోట్లమందిని చేరుకున్న కంపెనీ 100 కోట్లపై దృష్టిపెట్టినట్లు చెప్పారు. ప్రస్తుతం కంపెనీ టర్నోవర్ రూ. 31,000 కోట్లకు చేరినట్లు ఈ సందర్భంగా పతంజలి ఫుడ్స్ సీఈవో సంజీవ్ ఆస్తానా వెల్లడించారు. ఐదేళ్లలో రూ. 50,000 కోట్ల ఆదాయాన్ని అందుకోగలమని అంచనా వేశారు. ప్రీమియం ప్రొడక్టుల నుంచి 10% టర్నోవర్‌ను సాధించనున్నట్లు తెలియజేశారు.



ఎన్‌ఎస్‌ఈలో పతంజలి ఫుడ్స్ షేరు దాదాపు 2 శాతం బలపడి రూ. 1,140 వద్ద ముగిసింది.

సాక్షి స్పోర్ట్స్



సెమీస్‌లో హుమేరా

అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య (ఐటీఎఫ్) మహిళల టోర్నీలో హైదరాబాద్ అమ్మాయి హుమేరా బహార్మస్ సెమీఫైనల్లోకి ప్రవేశించింది. థాయ్‌లాండ్‌లో జరుగుతున్న ఈ టోర్నీలో క్వార్టర్ ఫైనల్లో హుమేరా టాప్ సీడ్ ప్రపంచ 447వ ర్యాంకర్ హరునా అరకావా (జపాన్)పై గెలిచింది. తొలి సెట్‌ను టైబ్రేక్‌లో 7–6 (7/5)తో నెగ్గిన హుమేరా రెండో సెట్‌లో 3–1తో ఆధిక్యంలో ఉన్న దశలో ఆమె ప్రత్యర్థి గాయం కారణంగా వైదొలిగింది.

సాకేత్ ద్వయం పరాజయం

రోత్సె ఓపెన్ ఏటీపీ చాలెంజర్ టెన్నిస్ టోర్నమెంట్‌లో రెండో సీడ్ సాకేత్ మైనేని–యూకీ బాంబ్రీ (భారత్)... అనిరుధ్ చంద్రశేఖర్–విజయ్ సుందర్ ప్రశాంత్ (భారత్) జోడీల పోరాటం ముగిసింది. నాటింగ్‌హామ్‌లో జరిగిన పురుషుల డబుల్స్ క్వార్టర్ ఫైనల్స్‌లో సాకేత్–యూకీ 1–6, 4–6తో బ్రాడీ–జానీ ఒమారా (బ్రిటన్) చేతిలో... అనిరుధ్–ప్రశాంత్ 6–7 (4/7), 3–6తో ఫియరెన్లీ–జొనాస్ మండే (బ్రిటన్) చేతిలో ఓడిపోయారు.

సాత్విక్–చిరాగ్ సంచలనం

- ప్రపంచ నంబర్‌వన్ ర్యాంక్ జోడీపై విజయం
- ప్రపంచ నాలుగో ర్యాంకర్‌ను ఓడించిన ప్రణయ్
- ఇండోనేసియా ఓపెన్ టోర్నీ



చిరాగ్ శెట్టి, సాత్విక్ సాయిరాజ్



ప్రణయ్

జకార్తా: ఈ ఏడాది నిలకడగా రాణిస్తున్న భారత పురుషుల డబుల్స్ బ్యాడ్మింటన్ జోడీ సాత్విక్ సాయిరాజ్–చిరాగ్ శెట్టి మరో సంచలన ప్రదర్శన చేసింది. ప్రతిష్టాత్మక ఇండోనేసియా ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్–1000 టోర్నీలో సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. శుక్రవారం జరిగిన పురుషుల డబుల్స్ క్వార్టర్ ఫైనల్లో ఏడో సీడ్ సాత్విక్–చిరాగ్ శెట్టి ద్వయం 21–13, 21–13తో ప్రపంచ నంబర్ వన్ ర్యాంక్ జోడీ, టాప్ సీడ్ ఫజర్ అల్ఫియాన్–మొహమ్మద్ రియాన్ అర్డియాంతో (ఇండోనేసియా)లను బోల్తా కొట్టించింది. 41 నిమిషాల్లో ముగిసిన ఈ మ్యాచ్‌లో రెండు గేముల్లోనూ ఆరంభ దశలో రెండు జోడీలు పాయింట్ల కోసం హోరాహోరీగా పోరాడాయి. అయితే మ్యాచ్ కొనసాగుతున్నకొద్దీ సాత్విక్–చిరాగ్ జోడీ పైచేయి సాధించింది. చివరిసారి 2019లో ఫజర్–అర్డియాంతోలతో తలపడిన సాత్విక్–చిరాగ్ నాడు వరుస గేముల్లో నెగ్గగా...ఈసారీ రెండు గేముల్లోనే గెలిచారు. నేడు జరిగే సెమీఫైనల్లో కాంగ్ మిన్ హిక్–సియో సెంగ్ జె (దక్షిణ కొరియా)లతో సాత్విక్–చిరాగ్ తలపడతారు. ఈ సీజన్‌లో సాత్విక్–చిరాగ్ స్విస్ ఓపెన్, ఆసియా చాంపియన్‌షిప్‌లో విజేతగా నిలిచి స్వర్ణ పతకాలు సాధించగా... మలేసియా ఓపెన్‌లో సెమీఫైనల్ చేరారు.

వరుసగా రెండో ఏడాది...

పురుషుల సింగిల్స్ విభాగంలో భారత స్టార్ షట్లర్లకు మిశ్రమ ఫలితాలు ఎదురయ్యాయి. భారత నంబర్‌వన్ హెచ్‌ఎస్ ప్రణయ్ వరుసగా రెండో ఏడాది ఈ టోర్నీలో సెమీఫైనల్ చేరుకోగా... కిదాంబి శ్రీకాంత్ పోరాటం ముగిసింది. క్వార్టర్ ఫైనల్లో ప్రపంచ తొమ్మిదో ర్యాంకర్ ప్రణయ్ 21–18, 21–16తో ప్రపంచ నాలుగో ర్యాంకర్ కొడాయ్ నరోకా (జపాన్)పై గెలుపొందాడు. గతంలో నరోకాతో ఆడిన నాలుగుసార్లూ ఓడిపోయిన ప్రణయ్ ఐదో ప్రయత్నంలో ఈ జపాన్ ప్లేయర్‌పై నెగ్గడం విశేషం. నేడు జరిగే సెమీఫైనల్లో ప్రపంచ నంబర్‌వన్ విక్టర్ అక్సెల్‌సన్ (డెన్మార్క్)తో ప్రణయ్ తలపడతాడు. ముఖాముఖి రికార్డులో ప్రణయ్ 2–5తో వెనుకంజలో ఉన్నాడు. మరో క్వార్టర్ ఫైనల్లో ప్రపంచ 22వ ర్యాంకర్ శ్రీకాంత్ 69 నిమిషాల్లో 14–21, 21–14, 12–21తో ప్రపంచ పదో ర్యాంకర్ లీ షి ఫెంగ్ (చైనా) చేతిలో ఓడిపోయాడు.

స్వర్ణం నెగ్గిన జ్యోతి

జాతీయ అంతర్ రాష్ట్ర అథ్లెటిక్స్ టోర్నీ



భువనేశ్వర్: జాతీయ సీనియర్ అంతర్‌రాష్ట్ర అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో శుక్రవారం ఆంధ్రప్రదేశ్‌కు ఒక స్వర్ణ పతకం, ఒక కాంస్య పతకం లభించాయి. మహిళల 100 మీటర్ల విభాగంలో ఆంధ్రప్రదేశ్ అమ్మాయి జ్యోతి యర్రాజీ విజేతగా నిలువగా... ట్రిపుల్ జంప్‌లో మల్లాల అనూష గౌడ్ (13.24 మీటర్లు) మూడో స్థానంలో నిలిచి కాంస్య పతకాన్ని సాధించింది. విశాఖపట్నం జిల్లాకు చెందిన జ్యోతి 100 మీటర్ల రేసును అందరికంటే వేగంగా 11.46 సెకన్లలో ముగించి అగ్రస్థానాన్ని దక్కించుకుంది. శ్రాబణి నందా (ఒడిశా; 11.59 సెకన్లు) రజతం, హిమశ్రీ రాయ్ (హరియాణా; 11.71 సెకన్లు) కాంస్య పతకం సాధించారు. తెలంగాణ అమ్మాయి నిత్య గాంధె (11.79 సెకన్లు) నాలుగో స్థానంలో నిలిచింది. మహిళల హెప్టాథ్లాన్ ఈవెంట్‌లో నాలుగు ఈవెంట్లు (100 మీటర్ల హర్డిల్స్, హైజంప్, షాట్‌పుట్, 200 మీటర్లు) ముగిశాక తెలంగాణకు చెందిన అగసార నందిని 3450 పాయింట్లతో టాప్ ర్యాంక్‌లో ఉంది. నేడు మిగిలిన మూడు ఈవెంట్లు (లాంగ్‌జంప్, జావెలిన్ త్రో, 800 మీటర్లు) పూర్తయ్యాక అత్యధిక పాయింట్లు సాధించిన అథ్లెట్ విజేతగా నిలుస్తుంది.



జోష్నా

భారత జట్టుకు నిరాశ

చెన్నై: ప్రపంచకప్ స్క్వాష్ టీమ్ టోర్నమెంట్‌లో భారత జట్టు కథ ముగిసింది. మలేసియా జట్టుతో శుక్రవారం జరిగిన సెమీఫైనల్లో భారత్ 0–3తో ఓడిపోయింది. తొలి మ్యాచ్‌లో అభయ్ సింగ్ 4–7, 7–5, 7–1, 1–7, 6–7తో సయ్ హుంగ్ ఓంగ్ చేతిలో ఓటమి పాలయ్యాడు. రెండో మ్యాచ్‌లో జోష్నా చినప్ప 3–7, 3–7, 7–5, 4–7తో ఐరా అజ్మన్ చేతిలో పరాజయం చవిచూసింది. మూడో మ్యాచ్‌లో సౌరవ్ ఘోషాల్ 5–7, 7–2, 6–7, 5–7తో డారెన్ ప్రాగసమ్ చేతిలో ఓడిపోయాడు. మరో సెమీఫైనల్లో డిఫెండింగ్ చాంపియన్ ఈజిప్ట్ 4–0తో జపాన్‌ను ఓడించి మలేసియాతో టైటిల్ పోరుకు సిద్ధమైంది.

ఇంగ్లండ్ చాలెంజ్!

- మొదటి రోజే ఇన్నింగ్స్ డిక్లేర్
- తొలి ఇన్నింగ్స్‌లో 393/8
- రూట్ అజేయ సెంచరీ
- యాషెస్ సిరీస్ తొలి టెస్టు

బర్మింగ్‌హామ్: టెస్టు క్రికెట్‌ను కొత్త పుంతలు తొక్కిస్తున్న ఇంగ్లండ్ జట్టు మరో కొత్త సాహసాన్ని ప్రదర్శించింది. 'బాజ్‌బాల్' అంటూ దూకుడైన ఆటను ప్రదర్శిస్తూ వచ్చిన ఆ జట్టు యాషెస్ సిరీస్‌లోనూ తమ శైలిని చూపించింది. బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉన్న పిచ్, టాప్ బ్యాటర్ ఒకరు అజేయ సెంచరీతో ఇంకా క్రీజ్‌లోనే ఉన్నా మొదటి రోజే ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసి ఆశ్చర్యపర్చింది. ఆస్ట్రేలియాతో శుక్రవారం ప్రారంభమైన మొదటి టెస్టులో తొలి ఇన్నింగ్స్‌ను ఇంగ్లండ్ 8 వికెట్ల నష్టానికి 393 పరుగుల వద్ద డిక్లేర్ చేసింది. జో రూట్ (152 బంతుల్లో 118 నాటౌట్; 7 ఫోర్లు, 4 సిక్స్‌లు) కెరీర్‌లో 30వ సెంచరీతో చెలరేగాడు. జానీ బెయిర్‌స్టో (78 బంతుల్లో 78; 5 ఫోర్లు), జాక్ క్రాలీ (73 బంతుల్లో 61; 7 ఫోర్లు) కీలక అర్ధ సెంచరీలు సాధించారు. 'యాషెస్'లో రూట్‌కు ఇది నాలుగో సెంచరీ కాగా... 2015 తర్వాత మొదటిది. రూట్, బెయిర్‌స్టో ఆరో వికెట్‌కు 121 పరుగులు జోడించారు. 78 ఓవర్లే ఆడిన ఇంగ్లండ్ ఓవర్‌కు 5.03 రన్‌రేట్‌తో పరుగులు సాధించడం విశేషం. ఆసీస్ బౌలర్లలో లయన్‌కు 4 వికెట్లు దక్కాయి. అయితే ఇంగ్లండ్ ఆశించినట్లుగా వికెట్ మాత్రం దక్కలేదు. 4 ఓవర్లే ఆడిన ఆస్ట్రేలియా ఆట ముగిసే సమయానికి వికెట్ కోల్పోకుండా 14 పరుగులు చేసింది. ఇంగ్లండ్ డిక్లరేషన్ ఎత్తుగడ ఎలాంటి ఫలితాన్నిస్తుందనేది ఇప్పుడే చెప్పలేకపోయినా... ఆస్ట్రేలియా పట్టుదలగా రెండు రోజులు బ్యాటింగ్ చేసి భారీ స్కోరు సాధిస్తే మాత్రం ఇంగ్లండ్‌కు ఇబ్బందులు తప్పవు.

బ్రూక్ అలా అవుటై...

తొలి రోజు ఆటలో హ్యారీ బ్రూక్ ఆశ్చర్యకర రీతిలో అవుటయ్యాడు. లయన్ బౌలింగ్‌లో డిఫెన్స్ ఆడేందుకు ప్రయత్నించగా బంతి అతని ప్యాడ్‌లను తాకి అనూహ్యంగా పైకి లేచింది. ఫీల్డర్లకు కూడా బంతి ఎటు వెళ్లిందో అర్థం కాలేదు. చేతులు పైకి లేపి క్రీజ్‌లోనే నిలబడిన బ్రూక్ కూడా సరిగా గమనించలేదు. అయితే కిందకు వచ్చిన బంతి అతని కాలికి తగిలి ఆపై స్టంప్స్‌ను ఎగరగొట్టింది. దాంతో అతను నిరాశగా వెనుదిరిగాడు. బంతిపై దృష్టి పెట్టకపోవడంతో చివరి క్షణంలో దానిని బ్యాట్‌తో లేదా కాలితో తన్ని స్టంప్స్‌కు తగలకుండా జాగ్రత్త పడే అవకాశం లేకపోయింది.



రూట్



నజ్ముల్ హుస్సేన్

నజ్ముల్ రెండో సెంచరీ

విజయం దిశగా బంగ్లాదేశ్

మిర్పూర్: అఫ్గానిస్తాన్‌తో జరుగుతున్న ఏకైక టెస్టు మ్యాచ్‌లో బంగ్లాదేశ్ విజయం దిశగా సాగుతోంది. 662 పరుగుల లక్ష్యాన్ని ఛేదించడానికి బరిలోకి దిగిన అఫ్గానిస్తాన్ మూడో రోజు ఆట ముగిసే సమయానికి 11 ఓవర్లలో 2 వికెట్లు నష్టపోయి 45 పరుగులు సాధించింది. అఫ్గానిస్తాన్ విజయానికి మరో 617 పరుగులు అవసరంకాగా, బంగ్లాదేశ్ మరో ఎనిమిది వికెట్లు పడగొడితే గెలుస్తుంది. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 134/1తో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన బంగ్లాదేశ్ 80 ఓవర్లలో 4 వికెట్లకు 425 పరుగులవద్ద డిక్లేర్ చేసింది. తొలి ఇన్నింగ్స్‌లో సెంచరీ చేసిన నజ్ముల్ హుస్సేన్ షాంతో (124; 15 ఫోర్లు) రెండో ఇన్నింగ్స్‌లోనూ శతకం సాధించాడు. తద్వారా ఒకే టెస్టులోని రెండు ఇన్నింగ్స్‌లలో సెంచరీలు చేసిన రెండో బంగ్లాదేశ్ క్రికెటర్‌గా నజ్ముల్ గుర్తింపు పొందాడు. గతంలో మోమినుల్ హక్ (2018లో శ్రీలంకపై) ఈ ఘనత సాధించాడు. నజ్ముల్‌కు జతగా మరో బ్యాటర్ మోమినుల్ హక్ (121 నాటౌట్; 12 ఫోర్లు, 1 సిక్స్) కూడా సెంచరీ చేశాడు. కెప్టెన్ లిటన్ దాస్ (66 నాటౌట్; 8 ఫోర్లు) అర్ధ సెంచరీ సాధించాడు.

ఏపీ లాసెట్ ఫలితాలు విడుదల


ఫలితాలను విడుదల చేస్తున్న వీసీ రాజశేఖర్ తదితరులు

ఏఎస్‌యూ: రాష్ట్రవ్యాప్తంగా లా కళాశాలల్లోని మూడు, ఐదేళ్ల ఎల్ఎల్‌బీ కోర్సులు, రెండేళ్ల ఎల్ఎల్ఎం కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించిన ఏపీ లాసెట్ ఫలితాలను శుక్రవారం ఏపీ లాసెట్ చైర్మన్, ఏఎస్‌యూ వీసీ ఆచార్య రాజశేఖర్ విడుదల చేశారు. ఫలితాలను https://cets.apsche.ap.gov.inలో పొందుపరిచారు. మూడేళ్ల లా కోర్సు ప్రవేశ పరీక్షకు 11,951 మంది హాజరుకాగా 9,926 మంది అర్హత సాధించారు. ఐదేళ్ల లా కోర్సులో ప్రవేశానికి 2,985 మంది పరీక్ష రాయగా 2,222 మంది అర్హత సాధించారు. ఎల్ఎల్ఎం కోర్సులో ప్రవేశానికి 1,267 మంది పరీక్ష రాయగా 1,254 మంది అర్హత సాధించారు. త్వరలో లాసెట్ కమిటీ సమావేశమై కౌన్సెలింగ్ ప్రక్రియను ఖరారు చేస్తుందని రాజశేఖర్ తెలిపారు. ఏపీ లాసెట్ కన్వీనర్ ఆచార్య సత్యన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

అమ్మఒడి అమలుకు మార్గదర్శకాలు

28న విద్యార్థుల తల్లుల ఖాతాల్లో నగదు జమ

సాక్షి, అమరావతి: జగనన్న అమ్మఒడి 2022–23 పథకం అమలుకు ప్రభుత్వం శుక్రవారం మార్గదర్శకాలు జారీ చేసింది. తమ పిల్లలను పాఠశాలలు, జూనియర్ కళాశాలలకు పంపుతున్న తల్లుల ఖాతాల్లో ఈ నెల 28న అమ్మఒడి నగదును జమ చేయనుంది. కుటుంబంలో చదువుకుంటున్న పిల్లల సంఖ్యతో సంబంధం లేకుండా తల్లి/సంరక్షకుడు ఏటా రూ.15 వేలు చొప్పున పొందచ్చని పేర్కొంది.

- ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల ప్రకారం.. దారిద్ర్యరేఖకు దిగువనున్న కుటుంబానికి చెందిన విద్యార్థులు తల్లులు పథకానికి అర్హులు.
- పేదరికంలో ఉన్న కుటుంబాల ఆదాయం గ్రామాల్లో నెలకు రూ.10 వేలు, పట్టణాల్లో రూ.12 వేలుకు మించకూడదు.
- ఆదాయపన్ను చెల్లించేవారు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వోద్యోగులు, ప్రభుత్వ పెన్షనర్లు అమ్మఒడికి అర్హులు కాదని ప్రభుత్వం స్పష్టం చేసింది.
- వ్యవసాయ భూమిలో మెట్ట అయితే 10 ఎకరాల్లోపు, మాగాణి భూమి 3 ఎకరాల్లోపు, రెండూ కలిపి ఉంటే 10 ఎకరాల్లోపు ఉండాలి.
- విద్యుత్ గరిష్ఠ వినియోగం నెలకు 300 యూనిట్లు మించనివారు కూడా అర్హులే.
- నాలుగు చక్రాల వాహన యజమానులకు సంబంధించి డ్రైవర్లు సొంతంగా నడుపుకునే ట్యాక్సీలతో పాటు ట్రాక్టర్లు, ఆటోలకు కూడా మినహాయింపునిచ్చింది. వీరు అమ్మఒడి పథకానికి అర్హులే.
- పట్టణాల్లో స్థిరాస్తికి సంబంధించి ఇంటి విస్తీర్ణం 1,000 చదరపు అడుగులు మించకుండా ఉంటే అమ్మఒడిని వర్తింపజేస్తారు.
- పదో తరగతి తర్వాత ఇంటర్మీడియెట్ కాకుండా పాలిటెక్నిక్, ట్రిపుల్ ఐటీ వంటి కోర్సుల్లో చేరేవారికి జగనన్న విద్యాదీవెన, వసతి దీవెన పథకాలను అమలు చేస్తారు.

'20లోపు ఇంటర్ సర్టిఫికెట్లు అప్‌లోడ్ చేయాలి'

ఏపీ ఈఏపీసెట్–2023 చైర్మన్, కన్వీనర్

అనంతపురం: ఏపీ ఈఏపీసెట్–2023 పరీక్ష రాసినవారు ఈ నెల 20లోపు తమ ఇంటర్ సర్టిఫికెట్లను ఏపీ ఈఏపీసెట్ స్టూడెంట్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని సెట్ రాష్ట్ర చైర్మన్ ప్రొఫెసర్ జింకా రంగజనార్దన, కన్వీనర్ ప్రొఫెసర్ సి.శోభాబిందు శుక్రవారం తెలిపారు. ఏపీ ఈఏపీసెట్–2023లో ఇంటర్ మార్కులకు 25 శాతం వెయిటేజీ ఇచ్చిన సంగతి తెలిసిందే. ఏపీ ఈఏపీసెట్‌లో మొత్తం 2,52,717 మంది అర్హత సాధించారు. వీరిలో ఇంకా 42వేల మంది విద్యార్థులకు ఇంటర్ వెయిటేజీ ప్రకారం ర్యాంకులు ప్రకటించాల్సి ఉంది. ఈ నేపథ్యంలో ఇంటర్ మార్కుల జాబితాలను పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలి. సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ, తదితర బోర్డుల పరీక్షలు రాసినవారు సర్టిఫికెట్లను అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది.



హరగోపాల్‌పై దేశద్రోహం కేసును
ఉపసంహరించుకోవాలి

- పది వామపక్ష పార్టీల డిమాండ్

సాక్షి, అమరావతి: పౌరహక్కుల నేత, ప్రొఫెసర్ హరగోపాల్‌తోపాటు 150 మందిపై తెలంగాణలో పెట్టిన దేశద్రోహం (ఉపా) కేసును ఉపసంహరించుకోవాలని పది వామపక్ష పార్టీలు డిమాండ్ చేశాయి. ఈ విషయమై వామపక్ష పార్టీల రాష్ట్ర నేతలు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశాయి. నిరంతరం ప్రజా సమస్యలపై స్పందిస్తూ, ప్రభుత్వానికి సరైన సూచనలు చేస్తూ, అభ్యుదయ భావాలతో హరగోపాల్ దేశ అభివృద్ధికి కృషి చేస్తున్నారని తెలిపారు. అటువంటి వ్యక్తికి మావోయిస్టులతో సంబంధాలున్నాయనే నెపంతో తెలంగాణ ప్రభుత్వం దేశద్రోహం కేసును బనాయించడాన్ని ఖండిస్తున్నామని పేర్కొన్నారు. ప్రకటన విడుదల చేసిన వారిలో వి.శ్రీనివాసరావు(సీపీఎం), కె.రామకృష్ణ (సీపీఐ), వై.సాంబశివరావు (సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ), జాస్తి కిషోర్‌బాబు (సీపీఐఎంఎల్), కాటం నాగభూషణం (ఎంసీపీఐయు), ఎన్.మూర్తి(సీపీఐఎంఎల్ లిబరేషన్), చిట్టిపాటి వెంకటేశ్వర్లు (సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ), అమర్‌నాథ్ (ఎస్‌యుసీఐసీ), పీవీ సుందరరామరాజు (ఫార్వర్డ్‌బ్లాక్), జానకి రాములు (రివల్యూషనరీ సోషలిస్టు పార్టీ) ఉన్నారు.

20న ఏపీ ఈసెట్-2023



బాలాజీచెరువు (కాకినాడ సిటీ): పాలిటెక్నిక్ ఉత్తీర్ణులు నేరుగా ఇంజనీరింగ్ ద్వితీయ సంవత్సరంలో ప్రవేశాలకు నిర్వహించే ఏపీ ఈసెట్–2023 ఆన్‌లైన్ పరీక్ష ఈ నెల 20న నిర్వహించనున్నారు. పరీక్షకు రాష్ట్ర వ్యాప్తంగా 38,255 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో 28,640 మంది బాలురు, 9,615 మంది బాలికలు ఉన్నారు. పరీక్ష రెండు సెషన్లలో ఆన్‌లైన్ ద్వారా ఉదయం తొమ్మిది గంటల నుంచి 12 గంటల వరకూ, మధ్యాహ్నం మూడు గంటల నుంచి ఆరు గంటల వరకూ నిర్వహిస్తారు. ఇందు కోసం రాష్ట్ర వ్యాప్తంగా 103 కేంద్రాలు ఏర్పాటు చేశారు. హైదరాబాద్‌లో రెండు కేంద్రాలు సిద్ధం చేశారు. పరీక్ష అనంతరం 23న ప్రాథమిక కీ విడుదల చేస్తారు. ఈ నెల 25 వరకూ అభ్యంతరాలు స్వీకరిస్తామని ఏపీ ఈసెట్ చైర్మన్ డాక్టర్ జీవీఆర్ ప్రసాదరాజు తెలిపారు. జూలై మొదటి వారంలో ఫలితాలు విడుదల చేస్తామన్నారు. అభ్యర్థులు పరీక్ష కేంద్రానికి గంట ముందుగా చేరుకోవాలని తెలిపారు. నిమిషం ఆలస్యమైనా పరీక్షలకు అనుమతి లేదని స్పష్టం చేశారు.





Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22 Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708. Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943